అప్పారావు



విమర్శ
విశేష
సంచిక

BLANK PAGE

'అంధకారయుగంలో సూర్యోదయం'

'మా దృష్టి యెప్పుడూ లక్ష్యాల పైన; వాని నాధారంగా పెట్టుకొని సూత్రీకరణ సాగుతుంది. మా తరువాత వచ్చేవారు మేమేర్పరచిన లక్షణాలను బట్టి కొత్త కొత్త లక్ష్యాలను నిర్మించుకోవాలి.'

పై మాటలు మహా భాష్యకారుని వాక్యాలకు తాత్పర్యం. అంటే లక్ష్యాలు లక్షణాలకంటే ముందే వుంటాయన్న మాట! అవి యెక్కడినుంచి వస్తాయి? ఆకాశంనుండి వూడిపడవుగదా! సామాన్య జనులు వారి అవసరాలను బట్టి సంకేతాలేర్పరచుకుంటారు. అవసరాలతోపాటు- సంకేతాలూ పెరుగుతాయి. తర్వాత లక్షణకారులు రంగంలోకి దిగుతారు. ప్రకృతి ప్రత్యయ విభాగమో, మరి యితర పద్ధతిలోనో నియమనం చేస్తారు. ఈ నియమనం వుపకారము, అపకారము కూడా. ఒక నియమనం లేకుంటే-యెవని సంకేతం వానిదై పోతుంది. నియమ కల్పనలోనే 'Sence of Superiority' వుంది. దాన్ని యెరుగనివాళ్ళూ- అనుసరించలేని వాళ్ళూ వ్రాత్యులౌతున్నారు. 'గానీ, గోణీ, గోతా'- అని కొందరు వారిని వెక్కిరిస్తారు. ఇంతకూ చెప్పవచ్చిందేమిటంటే - ప్రతి దానికీ మూల సామాన్యుని మేధస్సేనని. ఒక భాషే కాదు. కళలు కూడా అంతే. ఆది మానవుడు కదలే ఆకులు చూచాడు. అనుకరణాసక్తి మానవ స్వభావం 'తానలా చేతులాడిస్తే'- కర చరణా లాడించాడు. 'ఎంత బాగా ఆడిస్తున్నాన'న్న భావం - కండ్లలో తొంగి చూచింది. క్రమంగా స్థానం విశేషాలూ-ముద్రలూ - ఆవిష్కరించు న్నాడు. 'నేత్రాభ్యాం దర్శయేద్భావం'- తయారయ్యింది. పక్షుల పాటలు విన్నాడు. అన్నీ ఒకే శ్రుతిలో పలకడంలేదు. దరీ ఝరీ నినాదాలు విన్నాడు వాటినీ వీటినీ కలిపితే స్వరాలు. అనుస్వరాలు - లక్షణకారుల వూహలో! ఆ సెలయేటి ధ్వని - ఎంత బాగుంది! తన ప్రియురాలు ప్రణయ దీర్ఘంగా పిలిచినట్లు- వుపమానం మొదలయ్యింది. భాషతోపాటే - కళలతోపాటే దాని విమర్శ కూడా ఆరంభమవుతుంది. 'ఊహావూహావూ' అంటూ హృదయ స్పందనంతో ఆనంద తాండవ మారంభిస్తాడు. హృదయాన్ని తాకితే చాలు. 'ఆహా!' అంటాడు. కానీ హృదయ స్పందనం దేనితో యెట్లా యేర్పడుతుంది? ఆదిమానవుడంతగా వింగడించలేకపోవచ్చు. వాడు నాగరికుడవుతున్న కొద్దీ - కళల్లో నాజూకుతనం పెరుగుతూ వచ్చింది. అలాగే వాటిని అంచనా వేసే విమర్శల్లోకూడా తీక్ష్ణదృష్టి, గాంభీర్యం, లాలిత్యం మొదలైన భావాలు వృద్ధి

డా॥ పుట్టపర్తి నారాయణాచార్య

చెందుతూ వచ్చాయి. కనుక ప్రాచీన కాలంనుండీ సాహిత్యంతోపాటువిమర్శన కూడా యెన్నో వేషాలు వేసింది. అలంకారికులూ — అంతకు ముందున్న శాస్త్రకారులూ-వీరంతా గొప్ప విమర్శకులే. స్వభావోక్తి నుంచీనే అన్ని అలంకారాలూ వచ్చాయని 'దండి' నిర్ధారణ చేశాడు. ఇతర మతాలనన్నింటినీ ఖండించకపోతే ఆ సిద్ధాంతమెలా సాధ్యపడుతుంది? అలాగే భామహుడు 'ఉపమైకా శైలూషీ'- రుయ్యకుని దనుకుంటాను వుపమాలంకారం నుంచే తక్కిన అలంకారాలన్నీ పుడతాయంటాడు. క్షేమేంద్రుడు ఔచిత్యమే కావ్యానికి జీవమంటాడు. వక్రోక్తి యెన్నెన్నో వేషాలు వేస్తుందని మరో అలంకారికుని సంప్రదాయం. ఈ విమర్శకులందరిలోనూ ధ్వనికారుడు మణిపూసవంటి వాడు. అంతకుముందున్న సిద్ధాంతాలనన్నింటినీ అతడుయెత్తియెత్తి ఖండిసాడు. ఆనంద వర్ధనునిదీ - ధ్వని వాదం. కావ్యం ఆలోచనా మృతమనే వాదం యితనితోనే ఆరంభమైనట్లు కనబడుతుంది. అతడు హృదయాన్ని కొంచెం వెనక్కుతన్ని మెదడుకు ఆధిపత్యం కట్టినాడు. తరువాత యీ ధ్వని వాదం అనేక వికారాలకు ఆలవాలమైంది. ధ్వనికారుణ్ని మహిమ భట్టు పాండిత్య బలంతో ఖండించాడు. కేవలం అలంకారాలలోనేకాదు. ఇతరశాస్త్రాలలోకూడా ప్రాచీన కాలం నుండీ- విమర్శలూ ప్రతి విమర్శలూ జరుగుతూనే వచ్చినాయి. ఇంతలో కొంతమంది వావదూకులు నవీన తర్కానికి పట్టాభిషేకం చేశారు. దానితో విమర్శ అతి కృత్రిమంగా తయారై పోయింది. హృదయం పూర్తిగా విడాకు లిచ్చుకుంది. పదులకున్న అలంకారాలు నూటికి పైగా పెరిగినాయి. తర్కం ప్రవేశించడంతో ప్రాచీనుల విమర్శ ఆకాశ ఖడ్గ చాలనంగా అర్థంలేని జల్పనంగా తయారై పోయింది. కానీ యీ కోలాహలంలో కూడా కొంతమంది సహృదయులైన విమర్శకు లున్నారు. కోలాచల మల్లినాథుడు సర్వంకషమైన ప్రజ్ఞతోపాటు సరసమైన మన సత్వం కూడా కలవాడు. ఆయనదీ క్రింది శ్లోకమున్నది.

'ఉపమా కాళిదాసస్య
భారవేరర్థ గౌరవం
దండినః పద లాలిత్యం
మాఘేసంతి త్రయో గుణాః'

కాళిదాసులో వుపమాలంకార రమ్యత చూడాలి. భారవిలో అర్థగౌరవం గొప్పగా వుంటుంది. దండికి పదలాలిత్యం యెక్కువ. మాఘునిలో యీ మూడు గుణాలూ వున్నాయి. ఇదే పై శ్లోకాని కర్థం.

ఆలంకారికుల్లో ఆనందవర్ధనుని తర్వాత - రాజశేఖరుడు గొప్ప మనస్వి. అతని భార్య అవంతి సుందరి కూడా - పెనిమిటి వలెనే పండితురాలు, సహృదయురాలున్నూ. రాజశేఖరుడు చాలా Progressive మనిషి. 'స్త్రియోఽపి కవీ భవేయ సంస్కారో హ్యాత్మని సమవైతి - నస్త్రైణం పౌరుషం వా విభాగ మపేక్షతే' — స్త్రీ లెందుకు రచనలు చేయరాదు? సంస్కారం హృదయ ధర్మం. దానికి స్త్రీ పురుష విభాగమేమిటి? అంటాడు.

అనడమే కాదు. తన 'సాహిత్య మీమాంస'లో ఆమె అభిప్రాయాల నెన్నింటినో ఖండన మండనాలు చేశాడు.

కావ్యాలను వ్యాఖ్యానించిన ప్రాచీనుల్లో ఒక పద్ధతి స్పష్టంగా కనిపిస్తుంది. ఏ శ్లోకాని కా శ్లోకం వేరు వేరుగా వ్యాఖ్యానించి దానిలోని గుణ దోష చర్చ చేస్తారు. కావ్యాన్నంతా సముదితంగా చూచి – విమర్శించే పద్ధతి – వాళ్ళలో అల్ప ప్రచారంలో వున్నట్లు అనిపిస్తుంది. ఈ దృష్టి – యెవ్వరికీ కోపం రాకుంటే – పాశ్చాత్యుల వల్లే మనకు అబ్బిందని ఒప్పుకోవాలి. కానీ మల్లినాథుడు ఒకచోట 'మాఘే మేఘే గతం వయః' – అంటాడు. మేఘ సందేశము, మాఘము ఈ రెంటినీ ఆస్వాదించటంలోనే వయస్సు చెల్లి పోయిందని భావం. మరి ఆయన యీ రెండు కావ్యాలూ సముదితంగా చూసి చర్వణం చేశాడో – యే శ్లోకాని కా శ్లోకంగానే చూశాడో చెప్పలేం.

గత శతాబ్దంలో మొత్తంపైన కావ్యాన్ని చదివి – గుణదోష చర్చచేసే పద్ధతి తెలుగులో వచ్చింది. కానీ ఆనాడు ముఖ్యంగా విమర్శకు లనిపించుకున్నవాళ్లు, మనస్సును పక్కకునెట్టి బుద్ధిని అమితంగా పెంచుకున్న పండితులు. వారికి కనబడేవి – లక్షణ గ్రంథాలేగానీ – లోకం కాదు. శుష్క భాషా వివాదాలే విమర్శ లనిపించుకునేవి. 'చీకఁటి'లో అర సున్న వుందా లేదా! 'వేకఁటి'లో అర సున్న లేకుంటే యెట్లా? శకటరేఫకూ రేఫకూ యతి చెల్లుతుందా లేదా! యివే వారి విమర్శలు. ఛందస్సు, భాష, వాళ్ళ సులోచనాలకు బాగా కనిపిస్తే, భావ సౌందర్యం యే యేట్లో పడిపోయినా వాళ్ళకు కాబట్టదు. ఇంతలో మరికొందరు ప్రవేశించినారు. 'మను చరిత్ర'లో రసమా? రసాభాసమా? రసాభాసమని తేలిస్తే యిక వాళ్లు తమ పాండిత్యానికి బ్రహ్మరథం పట్టుకున్నట్లే! కొందరి విమర్శలకు మతాభినివేశం వెన్నెముక. నడుకుదుటి వీర్రాజు వంటివారు, వీరశైవ కవులకు పట్టాభిషేకం చేశారు. వారు తమ జాతివారు కనుక, యెట్లయినా వారు సర్వోత్తము లని చాటించవలెనని వారి దురాశ. పైగా వారికి విమర్శలంటే తిట్లే.

తమ ప్రత్యర్థులను యెంత బాహాటంగా, సంస్కృత సమాస జటిలంగా తిడితే – అంత గొప్ప విమర్శ. పెగా, సంస్కృత శ్లోకాలు మాట మాటకూ ప్రాకుతుండే రోకటి బండల్లా కనబడాలి. ఇంతలో – చారిత్రకులు – చరిత్రలో కృషిచేసిన పండితమ్మన్యులు మేమున్నామని ముందుకు దూకారు. పెద్దన్నగారి దేవూరు? పోతన్న యెక్కడివాడు? తిక్కన్న యెన్నో యేట భారతం వ్రాశాడు? ఇవీ వారి విమర్శలు. ఇవి ముఖ్యంగా ప్రాంతీయాభిమానాల్ని రెచ్చగొట్టేవి. పోతన్న ఒంటిమిట్టలోనే మా పొలంలో ఒకనాడు భోంచేశాడని ఒకడు యెద గుద్దుకుంటే – ఇంకోడు 'లండీ! పోతన్న మా బమ్మెరవాడు! కాదన్నావా! దిమ్మదిరిగేటట్టుకొడతా'నని తొడ తట్టేవాడు. ఇదే యెక్కడ చూచినా ఆనాటికోలాహలం. కట్టమంచి రామలింగా రెడ్డిగారు సాహిత్యంలో ప్రవేశించడంతో

ఈ అంధకార యుగంలో సూర్యోదయం అయింది. ప్రాచ్య, పాశ్చాత్య భాషా పాండిత్యం, వాటిని మించిన రసికతైన మన సత్త్వం ఆయన స్వరూపం. ఆయనతో– అంతకు ముందు పద్యానికీ పద్యానికీ నడుమ లంకెగా మాత్రమే వున్న గద్యం, తన వ్యక్తిత్వాన్ని ఋజువు చేసుకుంది. సర్వాంగ సుందరంగా సాక్షాత్కరించింది. లలితమై, చురుకైన హాస్యం ఆయన రచనకు వెన్నెముక. ఆయన శిక్షణే అనంతకృష్ణ శర్మగారికి వజ్రాంగి. అప్పుడు రెడ్డిగారు మైసూరులో వుండేవారు. శర్మగారు, రెడ్డిగారు కలిసి సంపూర్తిగా ఒకసారి భారతం చదివినారని శర్మగారే ఒకసారి నాతో అన్నారు. అనంతకృష్ణశర్మ భారతం చాలా సొంపుగా చదివేవాడు. ఇద్దరూ తిక్కనకు కట్టాభక్తులు. ఔచిత్య వాదులు. ఈ ఔచిత్య వాదం రెడ్డిగారిలో 'పింగళిసూరన కళాపూర్ణోదయం' గొప్ప కావ్యమనే వరకూ వచ్చింది. రెడ్డిగారితో పరిచయానికి ముందే శర్మకు, ఆంధ్ర సంస్కృతాలలో మంచి పాండిత్య మబ్బింది. వారి సంస్కృత గురువు కృష్ణ బ్రహ్మ తంత్రులు. ఆయన పరకాల మతాధిపతి. వారి వీర విహారమంతా శాస్త్రాలలో. కానీ– ఆయన శాస్త్రాలలో యెంత సర్వతంత్ర స్వతంత్రుడో కళల్లో అంత మనస్వి. శర్మగారే ఒక కథ చెబుతుండేవారు. అనంతకృష్ణశర్మ బిడారం కృష్ణప్పగారి దగ్గర సంగీత సాధన చేసేవాడు. బిడారం కృష్ణప్పగారు సంగీతానికి సరస్వతి. ఆయన చెప్పిన పాఠం శర్మగారు మఠంలోనే తన గదిలోనే సాధన చేసుకునేది వాడుక. ఆ విషయం యెవ్వరో శుష్క హృదయులు స్వామి కంటించినారు. 'నట విటగాయకులు' పంక్తి బాహ్యులు గదా! కానీ కృష్ణ బ్రహ్మ పరతంత్రులు ఆ మాటను వినీవిననట్టున్నారు. అనంతకృష్ణశర్మగారు కృష్ణప్ప శిష్యరికంతో గొప్ప సంగీత పాండిత్యం సంపాదించుకున్నారు ఆయన సంగీతంలో గొప్ప లక్షణకారుడు. ఒక రాగ స్వరూపాన్ని అతివ్యాప్తి, అవ్యాప్తి దోషాలు లేకుండా సమగ్రంగా నిర్వచించడం– ఆయన సొత్తు. ఆయన పైయెందరో దాక్షిణాత్య గాయకులకు నాటికీ నేటికీ గొప్ప గౌరవం. అన్నమయ్య కృతులకు చక్కని ఆకారమిచ్చిన శిల్పి ఆయన ఈ సంగీత పాండిత్యం ఆయన సాహిత్యానికి గొప్పగా మెరుగులు దిద్దింది. చక్కని శ్రావ్య సంగీతంతో శర్మగారు భారతం చదువుతూంటే– రెడ్డి తదేకంగా వినేవాడు. మహా మనస్వి అయిన కట్ట మంచివారు శర్మగారికి మైసూర్ కాలేజీలో వుద్యోగమిచ్చినారు జీవితం నిలుకడగా సాగింది. సంగీత సాహిత్యాల పరిశ్రమ నిరాటంకంగా వృద్ధి పొందింది. ఆయన పాతదంతా గొప్పదని పట్టుకొని వ్రేలాడే వాడుకాదు. కొత్త దనాన్నంతా విచక్షణా రహితంగా– ఒంటికి పూసుకునేవాడూ కాదు. చాలా శాంతమైన స్వభావ మాతనిది. వుద్రేకాలను రెచ్చగొట్టడం, ఆవేశాన్ని పెంచి తమాషా చూడడం ఆయన మనస్సుకు విరుద్ధమైన పని. అందుకే ఆయన కవిగా రాణించలేక పోయాడు. ఈ గుణం తోటే ఆయన సంగీత సభలుకూడా బహుజన మనో

రంజకంగా వుండేవికావు. కానీ యీ మన సత్వం విమర్శకుడుగా ఆయనకు గొప్ప ఖ్యాతినిచ్చింది. రెడ్డిగారి శిష్యత్వం ఆయన విమర్శ కెన్నో కొత్త కొత్త కళలు దిద్దింది. శర్మగారి ప్రతివిమర్శకూ ఒక స్వతంత్ర కావ్య ప్రతిపత్తి యేర్ప డింది. ఆయన భాష రెడ్డిగారి నుంచి యెరవు తెచ్చుకున్నదే కానీ దానికి తన సొమ్ములెన్నో పెట్టుకున్నాడు. సాధారణంగా పండిత ప్రకాండులకు గద్య రచన రాదు. రాదని చెప్పకుండా- గద్యమేమిటని చప్పరిస్తారు. శర్మగారు గద్యరచనతోనే వాసికెక్కినవారు రెడ్డి గారికి వలెనే శర్మకును లలిత హాస్యమే పలుకుతోడు. చాలా మంది హాస్యం వ్రాసేవాళ్ళున్నారు. కొందరు ఇతరులను వెక్కిరిస్తారు. నొప్పిస్తారు. ఒక మాటకు పది మాటలు జోడిస్తారు కానీ శర్మగారి హాస్యం- పెద్దన్న వ్యక్తిత్వం లాంటిది. 'సెలవిహార' నన్వించడమే- వారి అలవాటు. వారి అభిప్రాయములతో మనం యేకీభవించినా _ యేకీభవించక పోయినా- ఆ వ్యాసమంతా పూర్తిగా చదువవలసినదే. ఆ శైలి అట్టిది. నడుమ నడుమ వజ్రపు తునకలవంటి లలిత హాస్యము. తన అభిప్రాయాలను నిర్భ యంగా చాటి చెప్పడం ఆయన వంతు. యెంత నిర్భయంగా చెప్పుతున్నా- అందులో నాజూకుతనం- వినయము- ఆయన నిర్భయత్వాన్ని రక్షిస్తూ వుండేవి. మనకు జీర్ణముకాని యెన్నో పిచ్చి భావాలు ఆయన కున్నాయి. ఆధునిక నాటకాల్లో గూడా- పూర్వపు బయలు నాటకాల్లో వలెనే పాత్రలకు నాట్యముండాలని వాదించేవాడు. స్త్రీ పాత్రలను పురుషులు ధరింపవచ్చునని- నైతిక దృష్టితో స్త్రీలకు రంగప్రవేశం పనికిరాదని ఆయన అభిప్రాయం. మరి శర్మ కాళిదాసుని 'మాళవికాగ్ని మిత్రం' చదువు కున్నవాడే. నాటకాలలో పద్యా లుండాలనీ, నటులకు సంగీత జ్ఞానం ఆవశ్యకమని ఆయన వాదన. ఈ వాదాల కన్నిటికీ బళ్ళారి రాఘవయ్య నేరుగా చుక్కెదురు. రాఘవయ్య నటనా కౌశలా నికి అవతార మెత్తినవాడు. రంగనాథ రామాయణ చర్చా విషయంలో శర్మ, గురువు గారయిన రెడ్డికే యెదురు తిరిగి నాడు. కానీ యీ విమర్శ వారి పరస్పర ప్రేమలకు అడ్డు రాలేదు. ప్రాచీన గ్రంథాల పాఠ భేదాలను సవరించటంలో అనంత కృష్ణశర్మగారిది గొప్ప ప్రతిభ. ఆయన సవరించిన పాఠాన్ని యే పండి తుడున్నూ కాదనడానికి సాధ్యం కాదు. తెనాలి రామకృష్ణుని పాండురంగ మహాత్మ్యం, ఆయన చేతిలో పడడం తెలుగు వారి అదృష్టమనే చెప్పాలి. అంతకు ముందున్న పండితులు తెనాలి వాని కవిత్వానికి యెన్నో వాతలు వేసి నారు. ఇతని పరిష్కారం రామకృష్ణుని పాలికి సంజీవిని యైనది. తిక్కన్న శిష్యుడు కావడంతో సంస్కృతం పైకంటె ఆయనకు తెలుగుపై మక్కువయెక్కువ. రచనలో విధిలేకపోతే తప్ప, సంస్కృ తం వాడడు. నేనూ ఆయనా యిద్దరూ ఒకసారి ప్రాకృతంలోని 'సేతు బంధం' తెనిగించడానికి పూనుకున్నాం. కానీ ఆయన తెలుగు మమకారానికి నేను

తట్టుకోలేక పోయినాను. మా రచన సాగ లేదు. ఆయన తెనిగించిన 'గాథా సప్తశతి' చూస్తే సమర్థుడైన తెనుగువాడు సర్వాంగ సుందరంగా సంస్కృత సౌందర్యాన్ని తెనుగులోకి యెలా పట్టుకుని రాగలడో అర్థం అవుతుంది. ఆయన ప్రతి విమర్శా ఒక కావ్యమన్నాను.

నాచన సోముని నవీన గుణములూ, గౌరనమూ రాయల నాటి రసికతా-యెన్నో ఆయన విమర్శలు-పలు మారు చదవ వలెనని అనిపిస్తాయి. వేమన పై అతని రచన చాల గొప్పది. కడపటి నాళ్ళల్లో అతని గ్రాంథిక అభిమానం కూడా కొంత సడలిపోయినట్లు అనిపిస్తుంది. 'తిక్కన తీర్చిన సీతమ్మ' మరికొన్ని వ్యాసాలు వ్యావహారికం లోనే వ్రాసినాడు. ఆ మనిషి శరత్కాల సరిత్తు వంటి వాడు. చల్లని స్వచ్ఛమైన నీరు తంపరలుగా అల్లుకొని తామరలు అతడు తన వ్యక్తిత్వానికి తగినంత గొప్ప పనులు చేయలేదనే వారున్నారు. కానీ, అట్టి మన సత్వాలు విస్తారముగా రచన చేయలేవు. చేసిన రచన పున్నమ చంద్రుని వలె సర్వ కళలతో ప్రకాశిస్తుంది. అభ్యుదయ రచయితలు శర్మగారి పేరిట యొక వేదిక నిర్మించి వారిని స్మరించుట యెంతో సముచితమైన పని. అందుకు నా హృదయపూర్వక అభివందనములు.

కట్టమంచి రామలింగారెడ్డిగారి రచనలు

మహాకవి, నిశిత విమర్శకుడు ఐనకట్టమంచి రామలింగారెడ్డిగారి కలంనుండి ముసలమ్మ మరణం, నవయామిని అనే పద్యకావ్యాలూ కవిత్వతత్త్వ విచారం, పంచమి, వ్యాసమంజరి, అర్థ శాస్త్రం మొదలైన విమర్శనాత్మక గద్యరచనలూ వెలువడ్డాయి. పదిమంది శ్రమను సంపదను దోచుకొనే పెట్టుబడిదారీసమాజంలో పదిమంది కోసం ఒక వ్యక్తి త్యాగం చేయడం అవసరమని ప్రబోధించే అభ్యుదయ కావ్యం ముసలమ్మ మరణం. విద్యార్థి దశనుండే రెడ్డిగారి భావాలెలాంటివో యీ కావ్యం సాక్ష్యమిస్తుంది. అనంతపురానికి సమీపంలో బుక్కరాయ సముద్రమనే చెరువుంది. ఆ చెరువు కట్ట తెగితే దాని క్రిందనున్న పల్లెవాసులు ప్రమాదంలో చిక్కుకొంటారు. వారిని రక్షించడానికి ఆ గ్రామంలోని బసిరెడ్డి కోడలు ముసలమ్మ చెరువులో మునిగి ఆత్మత్యాగంచేసి పల్లె ప్రజల్ని కాపాడుతుంది. ఆత్మార్పణంతో తెగిపోనున్న చెరువుకట్ట నిలిచిందనడం హేతువాదానికి నిలబడే విషయం కాకపోయినా సమష్టి కోసం వ్యష్టిత్యాగం చేయడం సముచితమని ఈ కథ ద్వారా ఇవ్వబడ్డ సందేశం మాత్రం సర్వజన శిరోధార్యం. పురాణకథో, చారిత్రకగాథో కాకుండా సాంఘికేతి వృత్తాన్ని స్వీకరించి నూతన ప్రయోగం చేయడం, కావ్యం మోదాంతంగా వుండాలనే భారతీయాలంకారికుల నియమాన్ని త్రోసి రాజని విషాదాంతంగా దీన్ని ముగించడం కట్టమంచి వారి స్వతంత్రాలోచనా విధానానికి తిరుగులేని సాక్ష్యం. ఈ కావ్య రచనతో ప్రభావితులైన దువ్వూరి రామిరెడ్డి, నరజారమ్మ, ముదివర్తి కొండమాచార్యులు నారాయణమ్మ అనేకావ్యాల్ని రచించడం జరిగింది.

వర్ణనల్లో, ఛందంలో, పద ప్రయోగంలో సంప్రదాయ మార్గాన్నే రెడ్డిగారనుసరించినప్పటికీ నాయికా వరణంలో, ముగింపులో ఇది నవ్యతను సంతరించుకొనింది అనే డాక్టర్ సి. నారాయణరెడ్డిగారి భావమూ, "ఇరువదియవ శతాబ్దియుదయింపనున్న వేగుబోకలో నక్షత్రము వలె మన సారస్వతాకాశమున నవ్యకాంతులతో ఆవిర్భవించిన నూత్న ఆంధ్ర కావ్యము ముసలమ్మ మరణము" అన్న పింగళి లక్ష్మీకాంతంగారి మాటా "ఈ కావ్యము ....అంతవఱకు వచ్చిన కవితా సంప్రదాయములను, వర్ణనా విధానములను.కవిసమయములను. పూర్తిగా మార్చి ఒక విప్లవమునకు అంకురార్పణ చేసినది" –

డి. నాగసిద్ధారెడ్డి, తిరుపతి.

అన్న శ్రీ వాత్సవగారి అభిప్రాయమూ, ముసలమ్మ మరణ కావ్య విషయంలో యదార్థాలు. ప్రాచీన నవీన కవులెందరో తమ కావ్య రచనారంభంలో కవిత ఎలా వుండాలో నిర్దేశిస్తూ విఫలులయ్యారు. అలా కాకుండా రెడ్డిగారు మాత్రం కావ్యంలో సజీవ పాత్ర నిర్మాణం జరగాలనీ, రసపోషణా విధానం గుండెల్ని కదిలించాలనీ. సందర్భాను గుణంగా సంస్కృతాంధ్ర పదరచన సాగాలనీ నిర్ణయించి దానిని ముసలమ్మ మరణ కావ్యంలో అక్షరాలా అమలు పరచారు.

కట్టమంచి వారి "నవయామినీ" ఖండ కావ్యం కూడ అభ్యుదయ దృక్పథంతో కూడిన రచనయే. సంస్కృతంలో సుప్రసిద్ధకవి బిల్హణుడు అతని భార్య యామినీ పూర్ణతిలక. వీరి చరిత్రలోని అంశాలు సత్యానికీ సహజత్వానికీ విరుద్ధాలుగా వుండడంతో రెడ్డిగారీ కథను సంపూర్ణంగా మార్చి వ్రాశారు. ఆయన దృష్టిలో బిల్హణుడు మహాకవి. ఇంద్రియ నిగ్రహ సంపన్నుడు. ధర్మ సూక్ష్మము లెరిగిన విజ్ఞాని. యామినీ పూర్ణతిలక సౌశీల్యవతి. సుకుమార హృదయ. ఈ కావ్యం ముప్పది పద్యాల్లోనే ముగిసినా చిక్కని పదగుంఫనంతో సాగిన చక్కని రచన. మచ్చునకొక పద్యం.

"మెత్తని, తియ్యని, చల్లని
చిత్తము చిరునవుల రుచులు, సిగ్గు
మొగము, క
న్నెత్తని రూపము, హృదయో
న్మత్తతకలిగింపనిట్టి మాటలు ప్రీతిన్

మెత్తంమీద పై రెండు కావ్యాలు 'రాశికన్న గుణం మిన్న' అనే వాక్యాన్ని సార్థకం చేస్తూ రెడ్డిగారిని కవి శ్రేష్ఠుడుగా స్థిరీకరించాయి.

ఆంధ్ర సాహిత్యంలో గుణాన్ని గుణంగానూ దోషాన్ని దోషంగానూ నిష్పక్షపాతంగా ఎత్తి చూపిన సాహిత్య విమర్శకుల్లో ప్రథమాచార్యుడు రామలింగారెడ్డిగారు. అలంకార శాస్త్ర నియమాల్ని అనుసరించి వ్రాసిందే కావ్యమనే ప్రాచీనాలంకారికుల నిర్ణయాన్ని వెనక్కు నెట్టి కావ్యంలో కావ్యాత్మకూ, జీవకళకూ ప్రాధాన్యముండాలని ఉద్ఘోషించిన రెడ్డిగారి కవిత్వతత్త్వవిచారం సాహిత్య విమర్శనా మార్గంలో దుమారం లేపింది. పింగళి లక్ష్మీకాంతంగారు తన వ్యాస సంగ్రహంలోఅన్న ఈ మాటల్ని తిలకిస్తే కవిత్వతత్త్వ విచార స్వరూప స్వభావాలు అవగత మవుతాయి. "యదార్థమైన ఆంధ్ర కావ్య విమర్శ ప్రారంభము కవుల చరిత్ర పుట్టుకకు తర్వాత జరిగినది. అమహారంభమునకు ప్రథమాచార్యుడుగ పేర్కొనబడతగినవారు శ్రీకట్టమంచి రామలింగారెడ్డిగారు. శబ్ద సాధుత్వ నిర్ణయమే గ్రంథ విమర్శనమనెడి భ్రమతో పండితులొకరితో నొకరు వాగ్యుద్ధములు చేయు దినములలో భావుకుల దృష్టిని శాబ్దిక చర్చనుండి తాత్త్వక మీమాంసకు మరల్చిన రసికుడు శ్రీ రెడ్డిగారు. కావ్యమునకు శబ్దము ఆధిభౌతికాంశము మాత్రమే. అది బాహిరము. దాని ఆధ్యాత్మికాంశము తద్గత కళా సౌందర్యము. విమర్శ మార్గమును బాహిర జగత్తునుండి అంతర జగత్తుకు కొనిపోయిన ప్రథమాంధ్ర విమర్శ గ్రంథము కవిత్వతత్త్వ విచారము॥"

ఆంధ్ర కవిలోకంలో రెడ్డిగారు మెప్పునందినవారు తిక్కన, వేమన, పింగళి సూరన మాత్రమే. ముసలమ్మ మరణంలోని

"కవికుల బ్రహ్మతిక్కన గణనచేసి
సూరనార్యుని భావంబు సొంపు పొగడి
వేమన మహాత్మ సమాజ విద్యాను యాత్మ
మ్రొక్కి. కవనమొనర్పంగ పూని నాడ (10 వ పద్యము)

అనే కవిసుతి ఈ విషయాన్ని ఋజువు చేస్తూవుంది కవిత్వతత్త్వ విచార రచన మొదట సూరన కళా పూర్ణోదయ విమర్శతో ప్రారంభమైంది. తరువాత ఆంధ్ర కవితా స్వరూపం, భావనా శక్తి పాత్ర చిత్రణము, అలంకారముల అవసరము, జీవకళ యననేమి వగైరా విషయ చర్చతోపాటు భారత కవుల ప్రతిభ, విశేషించి తిక్కనార్యుని గొప్పతనము, ఆంధ్ర ప్రబంధ విమర్శ, కళాపూర్ణోదయ, ప్రభావతీ ప్రద్యుమ్నముల పరామర్శమున్నగు విషయాలెన్నో యిందు చోటుచేసుకొన్నాయి. ఒకప్రక్క సాహిత్య విమర్శ చేస్తూ మరొక ప్రక్క భారత దేశ స్త్రీల బానిస మనః ప్రవృత్తినీ, భారతీయ సాంఘికాచార వ్యవహారాల్నీ, మొగమాటం లేకుండా నిరంకుశంగా, నిర్భయంగా, నిష్పక్షపాతంగా విమర్శించిన రెడ్డిగారి సామాజిక స్పృహ బహుధా ప్రశంసనీయం. మచ్చుకు "హిందువులలో స్త్రీలకుండుస్థితిని నేనేల వివరింపవలె? వంటిల్లు, పడకటిల్లు ఈ రెంటికి వెలియైన నెందుకు పనికిరాదు. పురుషులకు వారికిని దేహ సాంగత్యమే గాని మనస్సాంగత్య మెక్కడిది? పతివ్రతలన్న నొక్క పతి చింత తప్ప నింకేదియు లేని మూఢురాండ్రని భ్రమించుట ఎంతటి అజ్ఞానము? ఒకానొక పతివ్రత పురుషుడెవతెనో యొక స్త్రీని గోరినదానిని వలపించితేబోయెనట. అందుచే నామెకు పంచభూతములను వశపరచుకొనునంత మాహాత్మ్యము చేకూరెనట. భార్యను దూతికగా చేయువాడెంత మాత్రపు మగవాడో భర్తకై అన్యస్త్రీల చెరుపజూచునదియు ఆ మాత్రపుటాడుదియే (13 వ పేజీ). మాతృస్వామ్య వ్యవస్థనుండి ఏనాడు స్త్రీ దిగజారి పోయిందో ఆనాటినుండే స్త్రీ సంఘంలో పురుషునికి బానిసయై పోయింది. ఈనాడు స్త్రీ పురుషులతోపాటు అన్ని రంగాలోనూ ముందుకు వస్తున్నారని మనం సంతృప్తిపడినా పురుషుణ్ణి ధిక్కరించి స్వతంత్రంగా, నిర్భయంగా, నిశ్చింతగా గౌరవంగా జీవించడం మన దేశంలో స్త్రీ జాతికి అసాధ్యం. కవిత్వతత్త్వ విచారంలో రెడ్డిగారీ విషయాన్ని కుండ బ్రద్దలు కొట్టినట్లు విమర్శించాడు.

అంతేగాదు. మన సారస్వతంలో సాంఘిక స్పృహ మందుకు సైతం కన్పడదు. ఎంతసేపూ రాజులు-రాణులు వారి అంగాంగ వర్ణనలు, వారి శృంగారం ఇవే చోటుచేసుకొన్నాయి. యీ విషయాన్ని రెడ్డిగారెంత తీవ్రంగా విమర్శించారో గమనించండి "హిందూదేశంలో మనుస్మృతి దెబ్బతగిలిన నాటినుండి ప్రజ ఈనాటి వరకును లేవలేక పడియున్నది. దానిది పరాశ్రయమైన బ్రతుకు. మన

వారిలో సంఘచరితమను భావమే యున్నదో లేదో? మన గ్రంథములను మాత్రము చదివి ఈ పుణ్యక్షేత్రమైన కురుక్షేత్రము యొక్క స్థితిగతుల నరయ జూచువారికి ఈ దేశములోని బీదసాదలపై ఆదరముగల కవియెవడైననున్నాడా? తుదకు బీదసాదలైన నున్నారా? యను సంశయము పుట్టును జనసామాన్యము యొక్క ప్రతిదిన వృత్తములలో నెంత భావము, రసము, గుణము, ఉపగతములై యున్నవో మన కవులకు తెలియవు కదా! రాజపుత్రులను, రాజకన్యకలను చాలనందుకు బ్రాహ్మణులను, వేశ్యలను బట్టి ఝుంఝూట మాడుటతప్ప కవితకు మేలైన అన్య కర్మములు లేవా?"

ఈ విధమైన విమర్శనా పటిమతో కూడుకొన్న కవిత్వతత్త్వ విచారం రెడ్డిగారికి సాహితీ విమర్శక లోకంలో మొదటి స్థానాన్ని సంపాదించి పెట్టింది. విషయ విమర్శలో ఇంతటి నిర్మొగమాటాన్నీ, తీవ్రతనూ పాటించిన కట్టమంచిగారు భాష విషయంలో గ్రాంథికాన్నే ఆదరించారు. అయినా భాషా విషయంలో గిడుగు రామమూర్తి పంతులుగారూ; కవిత్వంలో గురజాడ అప్పారావుగారూ, సాంఘికంగా కందుకూరి వీరేశలింగంగారూ విప్లవం తెచ్చినట్లుగానే రామలింగారెడ్డిగారు కూడా సాంస్వత విమర్శనా పద్ధతిలో విప్లవాన్ని తెచ్చారనడంలో సందేహం లేదు. పాశ్చాత్య వాసనా ప్రాబల్యంతో ఈ విమర్శ సాగిందని ఛాందస పండితులెంతగా గొంతు చించుకొన్నా ఇంతవరకూ ఇలాంటి పక్షపాత రహిత సాహితీ విమర్శక గ్రంథం తెలుగులో రాలేదని చెప్పడానికి సాహసిస్తున్నాను.

కవిత్వతత్త్వ విచార రచనా పద్ధతిస చెందిన మరొక విమర్శనాత్మక వ్యాకి సంపుటి రెడ్డిగారి 'పంచమి'. ఇందులోని రంగనాధ రామాయణ కర్తృత్వవిచారము, ప్రాచీనములు- వికృతులు, ద్రౌపతి, సీత, అవాల్మీకములు- భాసుడు అనే ఐదు వ్యాసాలూ ఐదు రత్నాలు. రంగనాధ రామాయణ కర్త గోన బుద్ధారెడ్డి. ఆ రామాయణ కావ్యావతారికను పరిశీలిస్తే కర్తృత్వ విషయంలో సందేహానికి స్థానం లేదు. ఐనా దానిమీద పేరును పట్టుకొని రంగనాధుడనే ఒక కల్పిత కవికి ఈ గ్రంథ కర్తృత్వాన్ని అంటగట్టడానికి కొందరు విమర్శకులు ప్రయత్నించారు. వారి ప్రయత్నాన్ని విమర్శిస్తూ సంఘములోని జాతిమతాది వైషమ్య జనిత భావములచే బ్రాహ్మణేతర కవులకు అన్యాయము కల్పింపబడెనని సత్యాన్ని వెల్లడించారు. అంతేగాక హైందవుల అంధ విశ్వాసాల్ని కూడ ఈసందర్భంలోనే ఇలా తూర్పార పట్టారు. "మన వారిలో పుక్కిటి పురాణములు పుట్టుట సర్వకాలములయందును సర్వసాధారణమైన సృష్టి. చెప్పువారికి వివేకము తక్కువ. వినువారికంతకంటె తక్కువ. కావుననే కదా యిప్పటికిని నానా పురాణము లుప్పతిల్లుచున్నవి. వదంతులను సత్యములని నమ్మట మన వారి సనాతన ధర్మములలో నొకటి. లేకున్న పరస్పర విరుద్ధములును నానా స్థలములకు చెందినవియు నానా మత బోధకములునగు పదునెనిమిది పురాణము

లను, భారతముతోసహ ఒక్కడే రచించె నని సిద్ధాంతముగా పారంపర్యముగా ఇంకే దేశసులెనను విశ్వసింపగలరా?" (21వ పేజీ) రెండో వ్యాసంలో ప్రాచీనమైన భారత హరి వంశాల్లోని అనేక విషయాలు తరువాతి భాగవతంలో ఎలా వికృతి పొందాయో సదృష్టాంతంగా నిరూపించడం జరిగింది.

సీతా ద్రౌపదులనే వ్యాసంలో రెడ్డి గారు వారి తారతమ్యాన్ని బేరీజువేస్తూ- సీతయు ద్రౌపది వలె లోక హృదయ హారిణి అయినను ఇంటి దీపము జగ జ్జ్యోతి కాదు. శుద్ధ పేలపిండి. బెల్లపు ముద్ద. అల్లముకాదు. ఆమె నిర్మాణములో మిరియములంతకు మున్నె లేవు. ఇక ద్రౌపది యన్ననో స్వతంత్రు రాలు. ఆమె యొక్క ధర్మా ధర్మజ్ఞత, వివేకము, రాజనీతి నైపుణ్యము జ్ఞానసంపద, ధీరత్వము, మహోన్నత శీలము, సర్వజన హృదయా కర్షకములు" అని ద్రౌపది విషయంలో మొగ్గు చూపినారు. రెడ్డిగారికి, భారతం మీదా, అందునా కవిత్రయం మీదా అచంచల భక్తి గౌరవాలుండడం చేత నేమో సీతకన్నా ద్రౌపది కట్టమంచి వారికి ప్రీతిపాత్రమైంది.

ఇక్కడ రెడ్డిగారి విమర్శ నిష్పక్ష పాతంగా సాగలేదు. సీతాద్రౌపదుల స్వభావాల్లోనే భేదముంది. సీత సాత్త్విక గుణపూరిత. ద్రౌపది రాజస గుణశోభిత. అవసరమైనప్పుడూ, ఇక తప్పదను కొన్నప్పుడూ మాత్రమే సీత నోరెత్తును. అపుడామె మాట తీవ్రమై దారుణాఖండల శస్త్రతుల్యంగా మారిపోతుంది. అడవికి తన్ను రావదని రాముడన్నప్పుడు నేనూ నీతో రాక తప్పదని ఎంతగానో బ్రతి మాలింది. కాని రాముడు వినలేదు. అపుడామె—

"కింత్వా మన్యత వైదేహః పితామే మిథిలాధిపః రామ ! జామాతరం ప్రాప్య స్త్రియం పురుష విగ్రహమ్. (అయోధ్య-30-3) (నా తండ్రియైన జనకుడు పురుషాకృతి గల స్త్రీ నా కల్లుడెనాడని తలంపకుండునా?) అని రాముణ్ణి నిష్ఠుర మాడింది. "కత్రి విక్రమంటు కాల్పనే" అన్న ద్రౌపదికీ; ఇక్కడి సీతకూ తేడా యేముంది? ఇట్లే సూతీక్ష్ణాశ్రమంలో వుండిన రాముడు దండక కేగి రాక్షసుల్ని సంహరిస్తానని ప్రతిజ్ఞ చేస్తూ వుండగా "నిష్కారణంగా రాక్షసులతో వైరం అనర్థహేతు"వని రాముని కి హిత ముప దేశించింది. ఈ ఘట్టం సీతకు గల రాజ నీతిజ్ఞతకూ, బుద్ధి కుశలతకూ నిదర్శనం. ఇలా రామాయణంలో సీత పాత్ర యెంత ఉదాత్తంగా గంభీరంగా పోషించబడిందో రెడ్డిగారు గుర్తింపక పోవడం విచార కరం. ద్రౌపదిలోని ఏయే ఉన్నత గుణాల్ని రెడ్డిగారు దర్శించారో వాటి నన్నిటినీ సీతలో సైతం చూడవచ్చు.

తమిళంలో కంబని రామాయణం, తెలుగులో బుద్ధారెడ్డి రామాయణం సుప్రసిద్ధాలు. వీటికి మూలం వాల్మీకి సంస్కృత రామాయణం. సహజ సుందరమైన వాల్మీకి రామాయణగాథపై తమిళ తెలుగు కవుల చేతుల్లోపడి అనేక వికృతులకు లోనైంది. వాటిలోని ఔచిత్యానౌచిత్యాల్ని అవాల్మీకము లనే శీర్షిక క్రింద చక్కగా ప్రదర్శించడం

జరిగింది. ఇట్లే ప్రాచీన సంస్కృత నాటకకర్త భాసుని విశిష్టత చివరి వ్యాసంలో వెల్లడించడమైంది. మొత్తం మీద ఈ వ్యాసాలన్నిటిలోనూ రెడ్డిగారి విమర్శనా పటిమా, రచనా సౌష్టవం విషయ నివేదనా నైపుణ్యం కొట్టవచ్చినట్లు కన్పడతాయి.

పూర్వ కవిఖండము, అభిజన ఖండము, భాషా ఖండము, ఆధునిక కవితా ఖండము, సాంఘిక ఖండము అని ఐదు భాగాలుగా విభజింపబడిన కట్టమంచిగారి వ్యాసమంజరిలో అధ్యక్షుని వచనము, ఆంధ్ర భాషానుశాసన విమర్శ వగైరా విజ్ఞానదాయకాలైన అనేక విషయాలున్నాయి. రెడ్డిగారి అర్థశాస్త్ర రచన ఆర్థిక రంగంలో ఆయనకు గల ప్రజ్ఞా పాటవాల్ని చాటుతూ వుంది.

రెడ్డిగారి రచనలన్నీ గ్రాంథిక భాషలోనే సాగినా విషయ నివేదనం సూటిగా, స్పష్టంగా, సరళంగా, హాస్య రస స్ఫోరకంగా దృశ్యమాన మవుతుంది. గద్య రచనలో ఆయనదొక ప్రత్యేక మైన శైలి. అది అనితర సాధ్యం. "గ్రంథాలకు పీఠికలు వ్రాసినా, పత్రికలకు వ్యాసాలు వ్రాసినా, తాత్త్వికంగా విషయచాలన మొనర్చి పటుత్వంగల భాషలో సోపపత్తికమైన సిద్ధాంతం చేయగల నేర్పు వీరికి సహజగుణం. వీరి వ్యాసాల్లో అర్థమెంత గంభీరమో శైలి అంత సురుచిరము" పింగళివారి ఈ మాట రెడ్డిగారి రచన లన్నిటికీ అన్వయింపవచ్చు.

అఖండ ప్రజ్ఞాదురంధరుడైన కట్టమంచి రామలింగారెడ్డిగారి జీవితాన్నీ రచనల్నీ మహాపర్వతాన్ని అద్దంలో చూపినట్లుగా మాత్రమే ఈ వ్యాసంలో చూపడానికి వీలయింది.

తెలుగు పరిశోధనల తీరుతెన్నులు

డా॥ వెల్చేరు నారాయణరావు

విస్కాన్సిన్ విశ్వవిద్యాలయం, మాడిసన్

అనువాదం : శ్రీ ఆర్. వి. రామారావు

[ఉస్మానియా విశ్వవిద్యాలయ భాషా శాస్త్ర విభాగం నిర్వహించిన సెమినార్‌కు సమర్పించిన ప్రధాన పత్రంలో ముఖ్య భాగాలు]

1. సాంప్రదాయక విమర్శ వ్యాఖ్యాన రూపంలోగాని, ఖండన రూపంలోగాని ఉండేది. ఈ విమర్శ కూడా అంతకు ముందున్న ప్రసిద్ధ గ్రంథం మీది వ్యాఖ్యానం, ఖండనలపై మళ్ళీ వ్యాఖ్యానంగానో, ఖండనగానో ఉండేది. అంతే కాక సంప్రదాయ విద్వాంసుల దృష్టిలో రచన అంటే కవిత్వం చెప్పడమే. ఆధునిక విశ్వవిద్యాలయాల్లో పరిశోధకులు కొత్త రచనా పద్ధతిని అనుసరించాల్సి వచ్చింది. ఈ పద్ధతి రూపంలోను, శైలిలోను సాంప్రదాయక వ్యాఖ్యాన పద్ధతికి భిన్నమైంది. ఈ దిశలో మొట్టమొదటి ప్రయత్నం పి హెచ్.డి.ల కోసం రాసే సిద్ధాంత వ్యాసాల్లో జరిగింది. పందొమ్మిదవ శతాబ్దంనుంచి 20వ శతాబ్దం తొలిదశ దాకా కందుకూరి వీరేశలింగం దగ్గరనుంచి కట్టమంచి రామలింగా రెడ్డి దాకా చెప్పుకోదగ్గ పరిశోధన జరిగినప్పటికీ యూనివర్సిటీల పరిశోధనా పత్రాలు నిర్దిష్ట ప్రమాణాలు నెలకొల్పలేక పోయాయి. సిద్ధాంత వ్యాసాల రచనా పద్ధతి, రీతిని నిర్ణయించడానికి జరిగిన ప్రయత్నాలన్నీ ప్రయోగాల వరకే పరిమితంఅయినాయి. పాతతో సంబంధం తెంచుకోవడం సాధ్యం అయింది కాని భవిష్యత్తుకు బీజాలు వేయడం ఇంకా పూర్తి కాలేదు.

2. గతాన్ని చూస్తే ఈ సమస్యను మరింత జటిలం చేసిన ధోరణులు కనిపిస్తాయి. సంస్కృతం, ఇంగ్లీషు సంప్రదాయాలతో తెలుగుకు సంబంధం ఉండడం ఒక రకంగా అదృష్టమే. ఈ రెండింటితో సంబంధం మరో రకంగా దురదృష్టం కూడా. మన విద్వాంసుల పాండితీ చరిత్రను పరిశీలిస్తే మనం ఈ రెండు భాషా సాంప్రదాయాల్ని జీర్ణం చేసుకోలేదని, కేవలం వాటిపై పై అంశాలను అనుకరించామని తెలుస్తుంది. తొలి దశలో వచ్చిన సంస్కృత విమర్శద్వారా భరతుడి నాట్యశాస్త్రం, దండి కావ్యాదర్శం, భామహుడి కావ్యాలంకారసంగ్రహంవంటి ఉత్తమ రచనలు వచ్చాయి. ఈ గ్రంథ రచయితల దృష్టి అంతా

మౌలికంగా స్వానుభవ పూర్వకమైంది. ఈ రచయిత అందరూ సమాచారాన్ని సేకరించి, విశ్లేషించి సంగ్రహ రూపంలో పొందు పరిచారు. ఆ తర్వాత అనేక మంది సిద్ధాంతవేత్తలు కవిత్వానికి వ్యాఖ్యానం చెప్పడంకోసం చాలా గ్రంథాలు రాశారు. వీరిలో ఆనంద వర్ధనుడు ఒకడు. కాని చాలా త్వరలోనే బుద్ధి కుశలతతో కూడిన ఈ సంప్రదాయాన్ని దుర్వినియోగం చేసి కువ్యాఖ్యలు చెప్పారు మన పండితులు. రచనలో మంచి చెడ్డల్ని ప్రశ్నించి, పరీక్షించి, చర్చించి గ్రంథ పరిశీలనను విస్తృత పరచడానికి బదులు పరిశోధన సంప్రదాయం ఆరాధన ధోరణిలో పడిపోయింది. రచనల్లోని మంచిచెడ్డల్ని హేతుబద్ధంగా పరిశీలించకుండా వాటిని బట్టీ పట్టడం మొదలెట్టారు. సిద్ధాంతాల ఉపయోగితను పరీక్షించడం మానేసి వాటిపై వ్యామోహాన్ని పెంచుకున్నారు. ఆ తర్వాత పరిశోధకులు స్వానుభవ పరిశీలన స్థానంలో ప్రయోజన రహితమైన సూక్ష్మవర్గీకరణలకు పూనుకున్నారు, ఫలితంలో పరిశోధనలు అటు సైద్ధాంతికంగానూ ఇటు ప్రయోగాత్మకతలోనూ ఆధికారిక ధోరణిలోకి, పాండిత్య ప్రదర్శన స్థాయికి దిగజారాయి.

3. మన సాహిత్య విమర్శపై పశ్చిమ సమాజాల ప్రభావంపడే నాటికి మన విమర్శన దయనీయమైన స్థితిలో ఉంది. గొప్ప పుస్తకాల ప్రయోజనాలను బేరీజు వేయకుండా వాటిని విపరీతంగా కీర్తించే దశలో ఉన్నాం. అంతేకాక తెలుగులో రాసిందేదైనా మేధాపూర్వకం కాజాలదన్న ఆత్మ న్యూనతాభావం పెంచుకున్నాం. సంస్కృతంలో ఉన్నదంతా మంచిదేనని గుడ్డిగా విశ్వసించాం. ఇంగ్లీషు ప్రభావం పడడంవల్ల కొత్త సమాచారం అందడం ప్రారంభం అయింది కాని మన దృక్పథం మాత్రం మారలేదు. సాహిత్యవిమర్శలో ఇంగ్లీషు పండితులను కూడా మనం సంస్కృత సాహితీవేత్తలను చూసిన అనాలోచిత దృష్టితోనే చూశాం. పశ్చిమ దేశాల సాహిత్య విమర్శ అభివృద్ధిక్రమాన్ని అర్థంచేసుకొని ఆ సంప్రదాయాలను జీర్ణించుకోవడానికి బదులుగా ఆ ప్రభావంలో తలమునకలై పోయాం. పాశ్చాత్య సంప్రదాయం చాలాగొప్పదని స్వీకరించనైనా స్వీకరించాం. లేదా ఇదంతా విదేశీసరుకని తిరస్కరించనైనా తిరస్కరించాం. మనది ఉద్వేగ ప్రధాన ధోరణి. సంస్కృత ముద్ర ఉన్నదంతా మన సొత్తేనని మనకో అస్పష్ట విశ్వాసం ఉండేది. కాలక్రమంలో పాశ్చాత్య సాహిత్యాల్లో ఉన్నదంతా కూడా మన సొత్తేనన్న భ్రమలో పడిపోయి మనల్ని మనం మోసగించుకున్నాం. ఫలితంగా ఇప్పుడు తెలుగు పరిశోధకులు సందర్భంతో గాని, సంప్రదాయంతో గాని నిమిత్తం లేకుండా అభినవగుప్తుడు చెప్పిన ఒక విషయాన్ని చెప్పి వెంటనే ఐ.ఎ. రిచర్డ్స్ ఏం చెప్పాడో ఉటంకిస్తున్నాడు.

4. తెలుగు విమర్శన పద్ధతిని, సైద్ధాంతిక దృక్పథాన్ని పరిశీలించేముందు ఒక వాస్తవాన్ని అంగీకరించాలి. కొంత మంది గొప్ప పరిశోధకులతోసహా అనేక

మంది పరిశోధకులకు రచనా పద్ధతిలో ప్రాథమిక శిక్షణ కూడా లేదు. చాలా మందికి స్పష్టమైన, సరళమైన వచనం రాయడం అలవాటులేదు. చాలాకాలం నుంచి కాలేజీలు, యూనివర్శిటీలు విద్యార్థులకు విధి నిషేధాత్మక వ్యాకరణాలే బోధించి వాటిని అనుసరించమన్నాయి. మన ఆలోచనంతా ఒక పద స్వరూపానికీ అక్షర క్రమానికి బానిసత్వం చేసింది. ఈ పద్ధతివల్ల వాక్య రచనా పద్ధతి, వాక్య సంబంధాలు అనేవి మన దృష్టి పరిధిలోకే రాలేదు. చెప్పదలుచుకున్నదాన్ని సమన్వితంగా, స్పష్టంగా ఉండేట్లు రాసే శిక్షణ మన విద్యార్థులకు లేదు. ఈ అసామర్థ్యం ఎంతగా పాకిపోయిందంటే గొప్ప గొప్ప పరిశోధకులకు కూడా ఇది వ్యాపించింది. వీళ్ళు ఆలంకారిక భాష రాస్తారు. ప్రయోజన రహితంగా విసరించి రాస్తారు. అంతూ పొంతూ లేని శబ్దాడంబరం చూపిస్తారు. మన సిద్ధాంత వ్యాసాల్లో చాలా వాటికి గుణాత్మకంగా నష్టం కలగకుండా మూడో వంతుకు కుదించవచ్చు. ప్రతి పేజి రాసిన తర్వాత "ఈ పేజీలో ఏమేమి రాశాం? ఇవి ఈ గ్రంథంలో తప్పనిసరా?" అనే ప్రశ్న వేసుకునే అలవాటు మన పరిశోధకులకు లేదు.

5 మనకు ఇంకో సమస్య కూడా ఉంది. తెలిసిన సమాచారాన్నించి మూలంగా కొన్ని నిర్ణయాలకు వచ్చే సామాన్య బౌద్ధికావసరం కూడా మనకు లేదు. సేకరించిన సమాచారాన్ని వ్యాఖ్యానించాలని, సాధారణీకరించాలని అనుకున్న వ్యక్తికి ఆ సమాచారాన్నించి స్థూలంగా కొన్ని నిర్ధారణలకు రాగల సామర్థ్యం అవసరం. గ్రంథాలకు గ్రంథాలు బట్టీపట్టడంలో చాలా కాలం గడిపిన సంప్రదాయిక పరిశోధకులకు ఈ విషయంలో శిక్షణ అసలే లేదు. ఇలాంటి పరిశోధకుల కింద శిక్షణ పొందిన వారికి కూడా ఈ శక్తి లేదు. ఫలితంగా అనుభవజ్ఞులైన పరిశోధకులే అస్పష్టంగా పైపైన కనిపించే పోలికల మీద ఆధారపడి కేవలం అసంబద్ధాలయిన భావాలను అంగీకరించటమనే దుర్భర దోషానికి లోనవుతున్నారు. పదశక్తికి భంగపరటంలోను, భావాలను తప్పుగా అర్థంచేసుకోవటంలోనూ మనకున్న సామర్థ్యం ఆశ్చర్యకరమయింది. ఈ సమస్య ఎంత తీవ్ర స్థాయిలో ఉందో వివరించడానికి ఒక్క ఉదాహరణ చాలు. సంస్కృత సాహిత్య విమర్శలో "రసం" అనే మాటను నాట్యశాస్త్రం రోజుల్నించి నేటిదాకా ఉపయోగిస్తూనే ఉన్నారు. ఈ పదానికి అర్థాలు మారినా మనం మన విలక్షణ సంస్కృతివల్ల వచ్చిన అలవాటు కారణంగా ఇంకా ఇదే పదాన్ని వాడుతున్నాం. 'రసం' అనే మాటని సంస్కృత సాహిత్య విమర్శలో పరస్పర విరుద్ధమైన భిన్నభావాలను చెప్పడానికి వాడారన్న విషయం స్పష్టమైన అవగాహన ఉన్నవారి కెవరికైనా తెలుస్తుంది. భావాలను స్పష్టంగా వివరించాలనుకున్న మంచి పరిశోధకుడు చాలాకాలంగా వాడుతున్న పదాలకు మారుతున్న అర్థాన్ని వివేచించగలుగుతాడు. మనం ఇదెప్పుడూ చేయలేదు. అంతేకాక సంప్రదాయిక పండితులు

సైతం ఈ పదాన్ని వాడడానికి సంకోచించే సందర్భాల్లో కూడా మనం ఈ పదాన్ని జంకుగొంకు లేకుండా వాడి మరికొంత గందరగోళం సృష్టిస్తున్నాం. అందువల్ల జానపద గీతాలకు కూడా 'రస' సిద్ధాంతాన్ని అన్వయించే జానపద వాఙ్మయ పరిశోధకులు మనకు కనిపిస్తారు.

6. మన సిద్ధాంత వ్యాసాల్లో ఉన్న మరో పెద్ద లోపం ఏమిటంటే ప్రమాణాలు చూపకపోవడం, పాండిత్యం అంతా మౌఖికంగా ఉండి, అందుబాటులో ఉన్న గ్రంథాలన్నీ అందరికీ తెలిసిన పూర్వకాలంలో ఫలానా విషయం ఏ పుస్తకంలో ఎన్నో పేజీలో ఉందో చెప్పాల్సిన అవసరం ఉండేదికాదు రామాయణంలాంటి ప్రసిద్ధ కావ్యం నుంచి అభినవ గుప్తుడు ఏదైనా శ్లోకాన్ని ఉట్టంకిస్తే అది ఎక్కడిదో చెప్పాల్సిన అవసరం ఉండేదికాదు. అసంఖ్యాకంగా పాండిత్య స్ఫోరక గ్రంథాలు, ప్రచురణావకాశాలు పెరిగిన ఈ రోజుల్లో మనం ఉట్టంకిస్తున్న విషయాలు ఎక్కడివో, ఆధార గ్రంథాలేవో ప్రమాణికంగా చూపాల్సిన బాధ్యత ఉంది. "మహాభారతం చూడుడు", "మన ప్రాచీనులు ఇలా అన్నారు", "ఆలంకారికులు ఇలా చెప్పారు" అని అసంపూర్ణాధారాలు రాసినంత మాత్రాన సరిపోదు. ఎవరు ఎప్పుడు ఎక్కడ చెప్పారో కూడా స్పష్టంగా రాయాలి.

7. తెలుగు సిద్ధాంత వ్యాసాల్లో సర్వసామాన్యంగా కనిపించే మరో ఘోరమైన పొరపాటేమిటంటే నిరాధార సాధారణీకరణ. కేవలం సాధారణమైన తెలివితేటల్ని ప్రోత్సహిస్తున్నాం. మన విద్యాప్రమాణాలు అంతుదొరకని అథః పాతాళానికి దిగజారి పోతున్నాయి.

8 అయినప్పటికీ ఈ సిద్ధాంత వ్యాసాలు ఇప్పటికీ విలువైనవేనవి చెప్పక పోవడం సమంజసం కాదు. మన పరిశోధకులందరికీ ఒక సమాన లక్షణముంది అది సమాచారం దండిగా సేకరించటం. శైలిలో - నిర్మాణంలో పరిశోధన పద్ధతిలో లోపాలున్నప్పటికీ ప్రతి సిద్ధాంత వ్యాసంలోను అపారమైన సమాచారం ఉంటున్నది. "పరిశోధన" అన్న పదాన్ని మనం కేవలం శోధించడం అని మాత్రమే అర్థం చేసుకున్నామనిపిస్తుంది. ఇంతకు ముందు తెలియని అంశాలకు సంబంధించిన విషయ సేకరణే పరిశోధన అని చాలా మంది అనుకుంటారు. వారి ఆలోచన నిజంకూడా. కాని అంతమాత్రం చాలదు.

9. ఏ గ్రంథం ఎవరు రాశారు, వారు ఏ కాలంలో జీవించారు, కాలానుక్రమణిక ఏమిటి అన్న విషయాలే కాక సాహిత్యానికి సంబంధించిన ఇతర చారిత్రక సమాచారం సేకరించటానికి ఇరవయ్యో శతాబ్దం ప్రథమార్థ భాగంలో అనేకమంది పరిశోధకులు కృషిచేశారు. వీరు తాళపత్రాలు, తామ్రపత్ర శాసనాలు, ఇతర పురాతత్వ సమాచారం పోగుచేయడానికి చెప్పుకోదగ్గ కృషి చేశారు. ఆ సమయంలో పరిశోధనను కేవలం వాచ్యార్థంలో మాత్రమే స్వీకరించినా వారి కృషికి గుణాత్మకంగా నష్టం లేదు. వాస్తవాలు కనుక్కోవడానికి, కాలానుక్రమణికలను నిర్ణయించ

డంలో కందుకూరి వీరేశలింగం, వేటూరి ప్రభాకరశాస్త్రి, మల్లంపల్లి సోమశేఖర శర్మ లాంటివారు తమ జీవితాలను అంకితం చేశారు.

10. ప్రాథమికమైన ఈ పని పూర్తయింది కాబట్టి మన తరం పరిశోధకులు ఈ సమాచారాన్ని వ్యాఖ్యానించాలి. అందువల్ల పరిశోధనకు వాళ్ళ నిర్వచనం మనకు ఉపకరించదు. మనకు 'పరిశోధన' అంటే విశ్లేషణ, వ్యాఖ్యానం. సిద్ధాంతీకరణ అనే బౌద్ధిక వ్యాపారం.

11. పింగళి లక్ష్మీకాంతానికి ఆయన సమకాలికులతో పోలిస్తే పాండిత్యం కొంత తక్కువ కావచ్చు. కాని 50 ఏళ్ళ క్రితం ఆయన తెలుగు పరిశోధనలో కొన్ని పద్ధతులు అభివృద్ధి చేశారు. సాహిత్య చరిత్ర రచన, ప్రక్రియల నిర్వచనం, అనువాద పద్ధతుల విశ్లేషణ మొదలైన విషయాల్లో ఆయన మార్గదర్శకుడయ్యాడు. ఆయన స్పష్టంగాను, ధారాళంగాను తెలుగు రాసేవారు. ఆయన శిష్యులెవరూ ఆయన రచనా విధానాన్ని ఆలోచనా పద్ధతిని అనుసరించక పోవడం విచారకరం. ఆయన శిష్యులు ఆయనను ఆదర్శంగా పెట్టుకోకుండా ఆయన రచనలను, వ్యాసాలను దేవుడి వాక్యాలుగా భావించి ఆరాధించారు. సాహిత్యం మీద ఆయన అభిప్రాయాలను అవిమర్శకంగానే స్వీకరించారు. ఆయన అభిప్రాయాల్ని సందర్భశుద్ధి లేకుండా ఉపయోగించిన వారు వాటిని వక్రీకరించారు, దుర్వినియోగం చేశారు.

12. కట్టమంచి రామలింగారెడ్డి కవిత్వ తత్వ విచారం, తదితర వ్యాసాల ద్వారా ఆలోచనా ధోరణిలో కొత్త భావాల్ని వ్యాపింప చేశారు. ఆయన ఆంగ్ల సాహిత్య విమర్శకుల అభిప్రాయాలను స్వీకరించడం. సంప్రదాయక భావాలను మొరటుగా ప్రశ్నించడం మొదలు పెట్టిన తర్వాత తీవ్రమైన భావాలు చోటు చేసుకున్నాయి. సాహిత్యంవిమర్శపై ఇంగ్లీషు వారికున్న తీవ్రాభిప్రాయాలకు మూగుడైనందువల్ల ఆంధ్ర సంస్కృతిలో వాటి ప్రయోజనం ఎంతో చాలాసార్లు ఆయన అంచనా వేసుకో లేకపోయాడు. కాని సాహిత్యం పట్ల ఆయన వైఖరి, కవితా స్వభావాన్ని చర్చించే ఆయన పద్ధతి ఇప్పటికీ మౌలికంగానే ఉన్నాయి. అయితే ఆయన రచనల ప్రభావంతర్వాతి విమర్శకుల మీద చాలా తక్కువ. ఆయన గ్రంథం సాహితీ పెత్తందార్ల తక్షణ ఖండనకు గురయినావారే తర్వాత ఆయనమీద కురిపించిన పొగడ్తల వరంలో గ్రంథ ప్రభావం తుడిచిపెట్టుకపోయింది బహుశా మన విమర్శకులందరిలోనూ సంయమనశీలియైన ఉత్తమ విమర్శకుడు రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ ఆయనకు అపారమైన పాండిత్యముండేది. సొంత అభిప్రాయా లున్నాయి. సౌకుమార్యముంది ఆయన రాసిన వచన విమర్శనలు తెలుగులో వచ్చిన కొద్దిపాటి ఉత్తమ రచనల్లోచేరతాయి. కాని చివరికి ఆయన అభిప్రాయాలు పద్ధతులు కూడా విశ్వవిద్యాలయ పరిశోధకులకు ఆదర్శం కాలేదు. ఆయన జీవితకాలంలో చాలా భాగం యూనివర్శిటీలకు దూరంగా ఉండడం వల్లనేమో బహుశా ఆయన

ప్రభావం చెప్పుకో తగినంతగా వారిమీద పడలేదు

13. కవులు — విమర్శకులు ఒకరే అయినవారు కూడా మనకు చాలామందే ఉన్నారు. భావకవిత్వ కాలంలో కవులు ప్రామాణిక గ్రంథాలను వ్యాఖ్యానించ డమేకాక తమ కవిత్వానికి తామే వ్యాఖ్యానం చెప్పే బాధ్యత కూడా తీసుకున్నారు. కవిత్వాస్వాదన విషయంలో కొత్త రుచులకూ సరికొత్త దృక్పథాలకూ వారు చాలావరకు కారకులు. అయితే వారి పద్ధతి, అభిరుచి ప్రధానం (impressionistic) మాత్రమే. తమకు నచ్చిందే చదివారు, రాశారు. విశ్వనాథ సత్యనారాయణ, శ్రీశ్రీ, ఆ తర్వాత వచ్చిన ఇతర కాల్పనిక కవులు అనేకమంది అద్భుతమైన అంతర్దృష్టి ప్రదర్శించారు.

14. మేధాశక్తిని, భావనాబలాన్ని, మనసును, హృదయాన్ని వేరుచేసి చూడడం మన సంస్కృతిలో ఎన్నడూ లేదు. దీనివల్ల కవి పాత్ర, విమర్శకుడి పాత్రల మధ్య మనకు భేదం కాని, వైరుధ్యం కాని కనిపించలేదు. ఒకే వ్యక్తి ఈ రెండు పనులనూ సమాన సామర్థ్యంతో చేయగలడని ఊహించడం మనకు సాధ్యం అయింది. కవులను యూనివర్శిటీ ప్రొఫెసర్లుగా చేయడాన్ని ఏ యూనివర్శిటీ వ్యతిరేకించలేదు. అమెరికాలో ఒక పెద్ద యూనివర్శిటీ ఆంగ్లభాషా విభాగానికి వ్లాదిమిర్ నొబొకొవ్‌ను అధిపతిని చేయాలన్న సూచన వచ్చింది. అప్పుడు "నొబొకొవ్‌ను ఇంగ్లీషు విభాగం అధ్యక్షునిగా చేయడం కన్నా జంతు ప్రదర్శనశాలకు ఏనుగును అధిపతిగా చేయడం నాకు ఇష్టమే" అని ఛాన్సలర్ అన్నట్టు చెబుతారు. మన వైఖరి ఇందుకు భిన్నం. దానివల్లే సాహిత్య విమర్శన పరిధిలోకి అనేక మంది కవులు ప్రవేశించారు. వీళ్ళు విమర్శ అంటే కవిత్వంలోని అందాలను వెదకడం, కవులను అంచనా వేయడం కిందికి మార్చేశారు. యూనివర్శిటీల్లో ఉన్న మనం దీన్నే ఆదర్శంగా పెట్టుకున్నాం.

15. ఇప్పటివరకూ మనం చేసిన పని గురించి, సాహిత్యం అంటే మన కున్న దృక్పథాన్ని గురించి, మన సాహిత్య విమర్శ సిద్ధాంతాలను గురించి ఒక్క మాటలో చెప్పాలంటే అవి అభిరుచి ప్రధానాలు (impressionistic) అనవచ్చు. మన దృష్టిలో కవిత పాఠకుని వ్యక్తిగత అనుభూతి. అందువల్ల సాహిత్యంపై మన సిద్ధాంత వ్యాసాలు వ్యక్తినిష్ఠమైనఅభిప్రాయాల కూడాచిగా, మన అభిప్రాయాలు భిన్నాభిరుచులతో నిమిత్తం లేనివిగా తయారైనాయి. ఈ అభిరుచి ప్రధానత వల్లనే గట్టి పునాదుల్లేని సిద్ధాంతాల ఊబిలో కూరుకుపోతున్నాం. అంతే కాక మన కవులు చాలా గొప్పవాళ్ళని నమ్మే పాఠకులు కూడా మనకున్నారు. ఒక కవిని గురించి పరిశోధన చేసేవారు ఆ కవి గొప్పతనాన్ని గురించి పాఠకులకు నమ్మచెప్పడం కోసం (పాఠకులు అంతకుముందే అలాంటి నమ్మకంలో ఉన్నారు) ఆ కవులను పొగుడుతూ తమ

సిద్ధాంత వ్యాసాల్లో పేజీలకు పేజీలు రాస్తున్నారు.

16. మనం తరచుగా పరిశోధించే రెండో అంశం అనువాద సాహిత్యం. సాంప్రదాయక తెలుగు సాహిత్యంలో ఎక్కువ భాగం అనుకరణమో, పునః కథనమో, పునః సృష్టో. సంస్కృతం నుంచి నేరుగా అనువాదం చేసుకొన్నదో. ఈ కారణంగా మన పరిశోధకులు అనువాదాల్ని పరిశీలించడం అనివార్యం. ఈ అనువాదాలను గురించిన పరిశోధనా వ్యాసాలు చాలా చిత్రంగా ఉంటాయి. మూల గ్రంథంలోని కొంత భాగాన్ని తీసుకొని తెలుగు రచయిత సంస్కృత మూల గ్రంథకర్త కన్నా ఎంత గొప్పవాడో నిరూపిస్తారు. తెలుగులోకి అనువదించిన కవి మూలానికి మెరుగులు దిద్దాడనీ, కొత్త కల్పనలు చేశాడనీ అందువల్ల మూల గ్రంథకర్త కన్నా అనువాదకుడు గొప్పవాడని చెబుతారు. అంతేకాని సరియైన అనువాద సిద్ధాంతాన్ని అభివృద్ధి చేయాలనిగాని ఒక ప్రక్రియను మరో ప్రక్రియలోకి అనువదించేటప్పుడు వచ్చే సమస్యలను పరిశీలించాలనిగాని మనం అంతగా ఆలోచించలేదు. ఒక మూల గ్రంథానికి అనుసరణ అయినప్పుడు ఆ మూల గ్రంథం పాఠ పరిష్కరణకు సంబంధించిన ప్రశ్నలను ఎన్నడూ తీవ్రంగా చర్చించలేదు. సైద్ధాంతిక నైపుణ్యం (theoretical sophistication) గాని బుద్ధి సారళ్యం (intellectual honesty) గాని లేవు. కాబట్టి రెండు భాషల్లోనూ ఉన్న పదాల పదబంధాల పట్టిక రాసి మూల గ్రంథకర్త కన్నా అనువాదకుని గొప్పతనాన్ని నొక్కి చెప్పాం.

17. కాల్పనిక సిద్ధాంతాల ప్రభావం వల్ల మనం గ్రంథకర్త వ్యక్తిత్వాన్ని, అతని వ్యక్తిగత అనుభవాలను, ఆయనపై ఇతరుల 'ప్రభావాలు' మొదలైన వాటిని కూడా అంగీకరించాం. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన పశ్చిమ దేశాలకు వర్తించే 'వ్యక్తిత్వం' 'వ్యక్తి' అనే భావాలకు ప్రత్యేకమైన గుర్తింపులేని మన సాహిత్య సంప్రదాయంలో ఈ అభిప్రాయాలను అనువర్తించడం సరియైంది అవునా కాదా అనే ప్రశ్న కూడా మనకు రాలేదు. శైలి, ప్రక్రియ, రచయిత, విషయం, మౌలికత లాంటి భావాలను అవిమర్శకంగా మనకు అనువర్తించని అన్య సంప్రదాయం నుంచి తెచ్చుకున్నాం.

18. యూరపియన్ సాహిత్యం కోసం రూపొందించిన పద్ధతులు గాని, సంస్కృత ఆలంకారికుల సూత్రాలు గాని తెలుగు సాహిత్యానికి యథాతథంగా వర్తింప చేయడానికి వీలులేదు. సంబంధి భావాలను పద్ధతులను అరువు తెచ్చుకున్నప్పటికీ తెలుగు సాహిత్యానికి సంబంధించినంతవరకు దాని సంప్రదాయాలను, కొలబద్దలనే పాటించాల్సి ఉంటుంది.

19. ఆధారం, కృతి, దాని నేపథ్యం, శ్రోత-పాఠకుడు నాలుగూ సాహిత్యానికి ముఖ్యమైన అంగాలు. (వీటి నిరచయిత, రచన, సమాజం, పాఠకుడు అని సాధారణంగా వ్యవహరిస్తాం. అయితే ఇవి మన పరిస్థితులకు భిన్నమైనవి కాబట్టి

ఈ పదజాలాన్ని, వర్గీకరణను యథాతథంగా స్వీకరించలేం). మన తక్షణావసరం పాఠ విమర్శ (textual criticism). తెలుగు సాహిత్యానికి సంబంధించినంతవరకు గ్రంథ పాఠం (text) అంటే ఏమిటో, దీనికి నిర్వచనమేమిటో సంతృప్తికరమైన నిర్ధారణకు రావడం అవసరం. మనకు మౌఖిక సాహిత్యం, లిఖిత సాహిత్యం ఉన్నాయి. వీటి మధ్య మధ్యంతర స్థాయిలు, పాఠ భేదాలూ ఉన్నాయి. రకరకాల పాఠ భేదాలను విశ్లేషించడానికి అనువైన ఒక అనువర్తన సిద్ధాంతం (methodology) పెంపొందించుకోవాల్సిన అవసరముంది.

20. దీనికి సంబంధించిన సమస్యే సాహిత్యంలోని వివిధ రూపాలను గురించి చెప్పడం. ఈ రూపాలను మామూలుగా ప్రక్రియలు అంటాం. ఈ విషయంలో సంస్కృత ఆలంకారికుల కృషి అంతగా ఉపయోగ పడుతుందని నేను అనుకోను. తెలుగు సాహిత్యాన్ని విశ్లేషించడానికి ఫ్రెంచి నిర్మాణ(క్రమ) వాదుల (Structuralists), రష్యన్ రూపవాదుల (Formalists) పద్ధతులు ఉపయోగ పడతాయేమో పరిశీలించాలి. నిర్మాణ (క్రమ)ం అనేది భాషకు సంబంధించిన అభిప్రాయం. సాహితీ నిర్మాణాలు భాషా నిర్మాణం ఆధారంగా రూపొందిన గౌణ నిర్మాణాలు (Secondary structures) అనేది ప్రాథమిక భావం. వ్యాసకర్త భాషా నిర్మాణక్రమం వర్ణిస్తాడు. అతని లాగానే సాహిత్య విమర్శకుడు కూడా సాహితీ రూపాల, ప్రక్రియల నిర్మాణాన్ని అల్పాక్షరాల్లో అసందిగ్ధంగా, విశ్వతోముఖంగా సూత్రీకరించటమే ధ్యేయంగా పెట్టుకొని నిర్వహించగలగాలి.

21. సాహిత్యాన్ని చర్చించేటప్పుడు మనం చేసిన ఘోరమైన పొరపాటు ఏమిటంటే ఏక వ్యక్తి కృతికర్తగా, (సామాజిక) వ్యక్తిగా వ్యవహరిస్తున్నందువల్ల వారిద్దరి వ్యక్తిత్వమూ ఒకటేనని భావించటం. ఈ పొరపాటు వల్ల అనేక సమస్యలు వచ్చాయి. ఈ పొరపాటే సాహిత్య విమర్శకు, కాఫీ హోటల్లో పిచ్చాపాటీకి భేదం కనిపెట్టలేని స్థాయికి మనల్ని లాక్కెళ్ళింది. ఈ గందరగోళం నుంచి బయట పడడానికి నిర్మాణ (క్రమ) వాదుల సిద్ధాంతాలూ, అనువర్తన విధానాలూ మనల్ని గందరగోళం నుంచి తప్పించగల ఏకైక సాధన మనిపిస్తుంది. ఎట్టి పరిస్థితిలోనూ పాఠ విమర్శ అనేది భావస్పష్టత (conceptual pricision) అనువర్తనసూక్ష్మత (methodological rigor) లేకుండా సాగదు. ఈ మార్గం ద్వారా మాత్రమే సమకాలిక సాహిత్య విమర్శకుల ఆత్మాశ్రయ విమర్శా ధోరణుల నుంచి బయట పడగలం. అర్థాన్ని కేవలం వాచ్యంగానే వ్యాఖ్యానించడానికి ప్రయత్నిస్తున్నంత కాలం విమర్శ పేరుతో కవిత్వం రాస్తూనే ఉంటాం.

22. అయితే నిర్మాణ క్రమాల అధ్యయనంలోని లోపాలు బయటపడే వరకే అది మనకు ఉపయోగకరం. భాషా నిర్మాణానికి సంబంధించిన జ్ఞానం సమాజంలో భాషకున్న ప్రయోజనాన్ని తెలియజేయనట్లే సాహిత్యంలో నిర్మాణవాద

పద్ధతుల్లో సాహిత్యాన్ని అధ్యయనం చేయటం దాని ప్రయోజనాన్ని వివరించలేదు. విమర్శ సాహిత్య ప్రయోజనాన్ని గురించి కూడా చెప్పాలి. సాహిత్య ప్రక్రియలకు సమాజానికి గల సంబంధాన్ని గురించి అధ్యయనం చేసేటప్పుడు మానవ సమాజం మొత్తానికి వర్తించే మార్క్సిజం లాంటి సిద్ధాంతాలు చాలా ఉపయోగపడతాయి. అయితే ఈ సిద్ధాంతాల శక్తి అన్నదే ఒక పెద్ద సమస్య. మార్క్సిజం లాంటివి అటు ఆదర్శాలుగానూ ఇటు అనువర్తన పద్ధతులుగానూ ఉంటాయి. ఈ కారణంవల్లనే చాలా మంది సాహిత్య విమర్శకులు మార్క్సిజాన్ని చాలాసంకుచితంగా ఉపయోగిస్తూ, విమర్శనదృష్టితో గానిసాహిత్యాన్నిఅంత దృష్టితో చూడటానికిగాని వినియోగించక రాజకీయమైనమార్పులను సాధించటానికి ప్రధాన ఉపకరణంగా భావిస్తున్నారు. ఈ దృష్టి అటు సాహిత్యానికీ, ఇటు మార్క్సిజానికీ అపచారంగా పరిణమించింది. వివేకంతో అర్థం చేసుకొని, సృజనాత్మకంగా అనువర్తిస్తే మార్క్సిస్టు పద్ధతులు సాహిత్యాన్ని విమర్శించటంలో సత్ఫలితాలిస్తాయి.

23. మార్క్సిజం, నిర్మాణ (క్రమ) వాదంలాంటి సిద్ధాంతాలను అంగీకరించని సాహిత్య చరిత్రకారుల దృష్టిలో సాహిత్య చరిత్రకు, చారిత్రక సాహిత్య సంఘటనలకు భేదం కనిపించదు. అందువల్ల ఆధికారిక సాహిత్య చరిత్రకు సంబంధించిన అనువర్తన విధానం సాహిత్య ప్రయోజనాన్ని కూడా పరిశీలిస్తుంది. పాశ్చాత్య సాహిత్య విమర్శకులు సాహిత్య చరిత్రను సంప్రదాయక, (Classical), మధ్యకాలిక (medie-val), ఆలంకారిక (boroque), కాల్పనిక, (romantic), ఆధునిక (Modern), అత్యాధునిక (Post-modern) యుగాలుగాక్రమ పరిణామం వివరించారు. తెలుగులోకూడా దాదాపుగా ఇదే 'యుగ విభజన' ఏకకాలంలో కనిపిస్తుంది. ఆ విధంగా తెలుగు సాహిత్యంలో భిన్నకాలిక సంఘటనలు ఏకకాలిక సంఘటనల్లాగా కనిపిస్తాయి. మార్క్సిస్టు విమర్శకులు, నిర్మాణ (క్రమ) వాదులూ ప్రతిపాదించిన సాహితీ విమర్శన సిద్ధాంతాలు తెలుగు సాహిత్యం అందించే విషయాలకు సందర్భించి ఉపకరిస్తాయా లేదా? వాటికి మెరుగు దిద్దాల్సిన అవసరం ఉందా లేదా? పరిశీలించవలసి వుంది.

సాహిత్య విమర్శ – శాస్త్రస్థాయి

సాహిత్యం జీవితానికి శబ్ద చిత్రణం. విమర్శ సాహిత్యానికీ, జీవితానికీ సంవిధానం.

జీవితం నుంచి స్పందన పొందిన రచయిత, నామరూప దేశాది ప్రతీకల సృష్టితో ఆ జీవితాన్నే తన శబ్దాల్లో చిత్రిస్తాడు. స్పందనకు–ఔచిత్యం, వివేకం ప్రతిభ తోడైతే ఇంకొక పది జీవితాలకు ప్రేరణ ఇచ్చేటంత ప్రభావవంతంగా రచన తయారౌతుంది. ఔచిత్యంతో ప్రసక్తిలేని స్పందన- జీవితవాస్తవికతతో నిమిత్తంలేని స్పందన-వెలువరించే రచనలు బతాణీ పొట్లాలకు పనికివస్తాయి. కాదంటే అందుతోపాటు కాస్త ప్రతిభా, తార్కిక పటుత్వానికి సంబంధించిన కాపట్యం కలిసి వుంటే ప్రజలను ఊబి గుంటలవైపు ఈడుస్తాయి. కాలక్షేపం రచనలు, రియాక్షనరీ రచనలు వచ్చినంత ఎక్కువగా జీవితానికి అవసరమయ్యే రచనలు ఎన్నటికీ రావు. వ్యాపార మనస్తత్వం పులుముకుపోయి, దోపిడీకి మాత్రమే వత్తాసునిచ్చే రచనా పరిశ్రమ యుగంలో, రచనలంటూ గుర్తించదగ్గ రచనలు రావడమే అపురూపం. రచయితను కావాలనుకొనే చాపల్యంతో కొందరూ, రచయితను అయ్యాననే చాపల్యంతో కొందరూ, రచయితగా కళకళలాడాలి అనే దగుల్బాజీ చాపల్యంతో మరి కొందరూ, ఈ రోజు ఉధృతంగా రచనా పరిశ్రమను సాగిస్తున్నారు. మిగిలిన పెట్టుబడిదారీ విధానాలకు ఏమాత్రం తగ్గిపోని లాభసాటి రంగంగా దీన్ని నిర్వహిస్తున్నారు.

ఇవ్వాళ సగటు రచయితల చాపల్యానికి పై పెట్టుబడిదారీ వ్యాపార వ్యవస్థ ఆసరా ఇస్తోంది. పూర్వకాలంలో మత వ్యవస్థ, రాజవ్యవస్థ వంటివి ఉండేవి. అవి రచనా రంగంలో కొన్ని విశిష్టమైన విలువల్నయినా కల్పించాయి. నేటి వ్యవస్థ విలువలతో నిమిత్తంలేని శుష్కమైన ఆసరానే ఇస్తోంది. ఈ ఆసరాల మాట అటుండనిచ్చి, తన రచనా కార్యంలో తానేమాత్రం విజయం సాధిస్తున్నాడు? ఏమాత్రం సాఫల్యం పొందుతున్నాడు? ఏమాత్రం న్యాయం చేకూరుస్తున్నాడు? వాటిని నిర్ధారించడానికి ప్రమాణాలు ఏమిటి? అన్న ప్రశ్నల జోలికి రచయిత ఆట్టే పోవడంలేదు. ఆ ఆత్మ విమర్శ లేని మూలంగా రచయిత నష్టపోవడమే కాకుండా, జనతకూడా నష్టపోతోంది.

సగటు స్థాయిలోని రచయితకు ఎలాటి చాపల్యం వుందో, సగటు స్థాయిలోని జనతకు కూడా అంతే చాపల్యం వుంది. తమ కెలాటి రచనలు కావాలి? ఎందుకు

గంగిశెట్టి లక్ష్మీనారాయణ

డిప్యూటీ డైరెక్టర్ – ప్రపంచ తెలుగు సంస్థ

ఈ రచనలు చదవాలి? ఈ రచనాపఠనం వల్ల పొందాల్సిన ప్రేరణ ఏమిటి? అనే స్పృహ వున్న పాఠకలోకం చాలా తక్కువ. కాస్త తీరిక వున్నప్పుడు, కాసంత మంచిపనిలో మనస్సును నిమగ్నం చేస్తామనుకొనే పాఠకుడు చేతి కందిన సృజనాత్మక రచనను తీసుకొని పేజీలు తిరగేస్తాడు. ఆ పేజీల్లో వున్న వస్తుతత్వం గురించి విశ్లేషణకు దిగడు. చెత్త అని తెలిసినా చర్విత చర్వణం చేయక మానడు. అయితే ఏ మాట కామాటే చెప్పుకోవాలి. కాస్త కొత్త పంథాలో కనిపించి, హృదయాన్ని ఆకట్టుకొనేలాగ నడిపించి, ఆలోచనను రేకెత్తించే రచన వద్దకు వస్తే తనలో తానో, తమలో తామో, దాన్ని గురించి తర్జన భర్జనలు చేయకుండా ఉండటం లేదు. కాని ఫలితం ఏమిటి? కాలువ గట్టిన నీటి మోస్తరు. పాఠకుడు పొందే స్పందన ఒక సమ్యగ్రూపం పొందడం లేదు. ఆ స్పందనకు కారకుడైన రచయితకు స్పష్టంగా చేరడంలేదు. మిగిలిన రచయితలను మేలుకొల్పడమూలేదు. ఈ ప్రతి స్పందన తంత్రం ఎందుకు ఒక పటిష్టరూపాన్ని పొందడంలేదు? రచయితకు తన బాధ్యతను గురించి గుర్తు చేయడంలేదు? అంటే సమాధానంగా మళ్ళీ జనతలోని చాపల్యాన్నే చెప్పాలి. సీరియస్‌గా ఒక రచనను తీసికొని సీరియస్‌గా తన ప్రతిస్పందనను తెలియ చెప్పగలిగే నిబద్ధత చాలా మందికి వుండదు. వాళ్ళవాళ్ళ తాపత్రయాలు వాళ్ళకుంటాయి. చదవడమే చాపల్యమని కొట్టిపారసేవాళ్ళు కొందరుంటే, చెప్పడం మరో చాపల్యం అని తేల్చిపారేసే వాళ్ళు మరికొందరు. ఇరు పక్షాల్లోనూ సీరియస్‌నెస్ తక్కువైపోయి ఇలాటి చాపల్యాల ఊగిసలాట పెరిగిపోయిన సన్నివేశంలోనే సాహిత్య విమర్శ ఒక చారిత్రక అవసరంగా తయారై ఉద్భవిస్తుంది.

ఇంచుమించు "సాహిత్యం ఎప్పుడు పుట్టిందో, సాహిత్య విమర్శ కూడా అప్పుడే పుట్టింది" అనే మాట అర్థం లేంది. విమర్శ అంటే ఆహా ఓహో అంటూ తలలూపడమూ కాదు. మురిసిపోయి మెచ్చుకోవడమూ కాదు. మొదలంటా తెగ నరకడమూ కాదు. అది కేవలం ప్రతిస్పందన మాత్రమే. ఆ ప్రతిస్పందన నైజాన్ని అన్వేషించి, దానికొక తాత్త్వక పరిపుష్టినీ, శాస్త్రీయ భూమికనూ సమకూర్చేది విమర్శ. సాహిత్య స్పందన పొందుతూన్న బహురూప చైతన్యాన్ని గమనించాక, దానికొక స్పష్టమైన గమ్యం, పద్ధతి ఏర్పడాలన్న అవగాహన పెరిగాక సాహిత్యతంత్రానికి జవాబ్దారీ వుండాలన్న సంకల్పం ఉదయించాక సాహిత్య విమర్శ రూపురేఖలు దిద్దుకొంది సాహిత్యం జీవితానికి శబ్ద చిత్రణమైతే, ఆ చిత్రణాన్ని విశ్లేషించి జీవిత మౌల్యాలను మథించి, జీవిత్పథాన్ని ఉభయులకూ నిర్దేశించడం తన లక్ష్యంగా స్వీకరించింది విమర్శ. రచన-సంకేత చిత్రణమైతే, అన్వయ సాంకేతికం-విమర్శ.

ఈ లక్ష్యం వల్లనే రచయితకు లేని అదనపు బాధ్యత, గురుతర బాధ్యత విమర్శకునికి ఏర్పడుతోంది. రచయిత-

అనుభవాన్ని అభివ్యక్తి దశలోకి తెస్తే, విమర్శకుడు అభివ్యక్తిని ఆచరణలోనికి తెస్తున్నాడు. వాస్తవాన్ని సంకేతంలోకి ఒకరు మారుస్తూంటే, సంకేతాన్ని వాస్తవంలోనికి మరొకరు మారుస్తున్నారు. ఒకరికొకరు పూరకంగా నిలుస్తున్నారు. అయితే రచయిత బాధ్యతంతా తన రచన వరకే నంటే, ఆ రచనను, దాని అంతస్సత్వాన్ని జనత వద్దకు తీసుకువెళ్ళి, జనత ప్రతిస్పందననూ, ఆశలనూ, సమస్యలనూ రచయిత వద్దకు తెచ్చి, ఉభయుల సాహిత్య బాధ్యతనూ ఇనుమడింప చేస్తున్నాడు విమర్శకుడు. రచయితకూ - జనతకూ మధ్య వారధిగా నిలుస్తున్నాడు విమర్శకుడు. ఇది అదనపు బాధ్యత; ఇరువురికీ అంతరాత్మ పరిశీలకునిగా వ్యవహరిస్తున్నాడు ఉత్తమ విమర్శకుడు. ఇది గురుతర బాధ్యత.

రచయిత కెలాటి సృజనాత్మక ప్రతిభ కావాలో, విమర్శకునికి కూడా అలాటి సృజనాత్మక ప్రతిభ కావాలి. భావతీవ్రత కావాలి. నైపుణ్యం కావాలి. అంతకు మించిన పాండిత్యం, వివేచనా పటిమ కావాలి. పండితుడు కానివాడు కవి అవుతున్నాడు, కవి కానివాడు విమర్శకు డౌతున్నాడంటూ హాస్యానికి కొందరంటారు కానీ, కవీ, పండితుడూ అయిన వాడే విమర్శకుడౌతున్నాడు. ప్రపంచంలోని ఏ మూలలో ప్రసిద్ధికి వచ్చిన విమర్శకులను చూసినా, వాళ్ళ రచనలను పరిశీలించినా, ఈ విషయం విదితం కాక పోదు. కవిగా నిలద్రొక్కుకోలేనంత మాత్రాన, వాళ్ళ కావ్య ప్రజ్ఞనూ, రచనా నైపుణ్యాన్ని తక్కువ అంచనా వేయలేము. కొత్త రచనా ప్రయోగాలకు సంబంధించి అర్రులు జాచినవారే, కొత్త విమర్శనా సంప్రదాయాలను నెలకొల్పడం చరిత్రలో సర్వత్ర అగుపించే విషయం. అందుకే బహుకాలం విమర్శ, సృజనాత్మక సాహిత్యంతోనే అణగి మణగి వుంది. విధిగా ఒక శాఖగా రూపుదిద్దు కొనే రోజుల్లో కూడా, రూపభద్రతకు సంబంధించే తన చర్చను నడిపింది కానీ, వస్తుతత్వం పట్ల ప్రపంచింప లేదు. వస్తుపరంగా అభేదాన్ని పాటించడమూ, రూప పరంగా చాపల్యం, అవనతులకు స్థానంలేని భద్రత నివ్వాలని సంకల్పించడమూ అందుకు కారణం. ప్రాచీన కాలంలో విమర్శన శాస్త్రానికి మన వాళ్ళిచ్చిన పేరే దాన్ని నిరూపిస్తుంది. సాహిత్య మీమాంసను ప్రాచీన భారతీయులు 'క్రియాకల్ప' అని వ్యవహరించే వారంటూ ఆచార్య వి. రాఘవన్ పేర్కొంటున్నారు వాత్స్యాయనుడిచ్చిన చతుష్షష్టి కళలలో కావ్యక్రియా, అభిధానకోశ ఛందో జ్ఞానములతో పాటు 'క్రియాకల్ప' వుంది. ఇదే నేటి కావ్య మీమాంసగా రూపు ధరించిందని రాఘవన్ గారి అభిప్రాయం. కావ్యక్రియలో శబ్ద, సంవిధాన వైఖరికి సంబంధించిన రూపభద్రత వివేచనాన్ని ఈ మాట ఉద్దేశిస్తున్నది. వస్తుభద్రతకు సంబంధించిన వాటికి తత్త్వశాస్త్రాన్నే ఆశ్రయించమని గౌణం చేస్తున్నది. దాన్ని మొదటి మారుగా ప్రస్ఫుటంచేసి, తత్త్వశాస్త్రానికీ, కావ్య మీమాంసకూ మధ్య కొత్త సమన్వయాన్ని రూపొందించేటందుకూ, ఒక పరిధిని ఏర్పరచేటందుకూ కృషి

చేసినవాడు అభినవగుప్తుడు. కావ్య మీమాంసలో రూపభద్రతకూ, వస్తు భద్రతకూ మధ్య వున్న లంకెను భరతుని వద్దనుంచీ అందరూ ప్రస్తావన స్థాయిలో మాత్రం పరామర్శించి విడిపోతే, దాన్ని ప్రస్ఫుటపరచి ఒక పరిధిలోకి కుదిర్చేటందుకు అభినవగుప్తుడు తొలిసారిగా కృషి చేశాడు. దురదృష్ట వశాత్తు ఆ తర్వాత అది సుసంపన్నంగా కొనసాగలేదు పైపెచ్చు కావ్య మీమాంస యావత్తూ కేవలం రూపాశ్రితమై, వెంట్రుకను శతకోటి ఖండాలుగా చీల్చే నిరర్థక పరిశ్రమగా వక్రీకరించింది. అదే విమర్శన శాస్త్రమనే భ్రమకు అవకాశం ఇచ్చింది.

ఆధునిక యుగం అందించిన భిన్న జాగృతుల మూలంగా, మానవ అధ్యయన పరిధికి లోబడిన నవ చేతనల కారణంగా, విమర్శనం ఒక విడి శాస్త్రంగా సమన్వయ భూమికతో అవతరించడం మొదలైంది. విడి శాఖగా రూపొందేటప్పుడు కూడా లారెన్స్‌వంటి వాళ్ళు ఇది సగం కళా, సగం శాస్త్రం అంటూ అభిప్రాయపడ్డారు. అంటే విమర్శకునికి అవసరమైన సృజనాత్మక ప్రతిభ వారి వివక్షలో మెదలి, ఆ మాట అనిపించింది. శాస్త్రజ్ఞుడికి ప్రతిభతో నిమిత్తం లేదనుకోవడం, ప్రతిభాపేక్షకం కావడంవల్ల విమర్శ—కళ స్థాయిలో నిలుస్తోందని భావించడం, రొమాంటిక్ యుగ చేతన కలిగించిన విపరీతం ఈ భావచేతనే విమర్శనా రంగంలో కూడా అనుభూతికి పట్టాభిషేకం చేసింది. రచయిత ఎలా తన లోకానుభూతిని—వైయక్తిక పరిమితికి లోబడి మాత్రమే—అభివ్యక్త పరుస్తున్నాడో, విమర్శకుడు సైతం తన కావ్యానుభూతిని అలా వివరిస్తుంటాడనే అభిప్రాయం ప్రబలింది. పైపెచ్చు, కవిత్వంలో గమనించాల్సింది రచయిత వైయక్తిక అనుభూతిని మాత్రమేనన్న మార్గదర్శి సూత్రం వారిని మరింత బంధించింది. ఈ సూత్రానికి కావలసినపరిపుష్టిని ప్రైమరీ ఇమాజినేషన్, సెకండరీ ఇమాజినేషన్ ఫ్యాన్సీవంటి కాల్పనిక కవి—విమర్శకుల పరిభాష చేకూర్చింది. అందులోంచి వేరుపడి విస్తారమైన జీవితాన్నంతటినీ అనుశీలనలోకి తీసుకొని, జీవన నైతిక తను పోషించాల్సిన అవసరాన్ని గుర్తు చేసి, 'కవితా విమర్శనమంటే జీవిత విమర్శనమే' నంటూ ఆర్నాల్డ్ వంటి విమర్శకులు కొత్త సంప్రదాయం నెలకొల్పినా, అనుభూతివాదం వివక్షలోంచి తొలగిపోని మూలంగా చాలా కాలం విమర్శ సగం కళా, సగం శాస్త్రం అంటూ కొట్టుమిట్టాడింది. అంతే కాదు. వాస్తవ జీవితంతో ఏ మాత్రం నిమిత్తం లేని, శుద్ధ కాల్పనిక ప్రక్రియంగా మాత్రమే కావ్య రచననూ, తన్మూలంగా విమర్శనూ పర్యవసింప చేయటానికి కూడా ప్రయత్నాలు జరిగాయి ఆ ప్రయత్నాల్లో భాగంగానే కళకోసంకళ, కావ్యం కోసం కావ్యమంటూ ఆస్కార్ వైల్డ్, ఎడ్గర్ ఆలెన్‌పో ప్రభృతుల సంప్రదాయం మొదలైంది. 'కావ్యం అనేది సాంగోపాంగమైన సంపూర్ణ నిర్మాణం కాబట్టి, దాని పరిశీలనమే విమర్శకుని పరమావధి; తదతీతంగా రచయిత జీవి

తాన్ని కానీ, జాతి జీవితాన్నికానీ, చరిత్రను కానీ, యుగ నేపథ్యాన్ని కానీ చూడటం కేవలం అనవసరం" అంటూ భావించిన నియో క్రిటిసిజం సంప్రదాయం ప్రచారంలోకి వస్తూ పిల్లి మొగ్గలు వేసింది. కావ్యశైలినిగురించిన అధ్యయనాలు విమర్శకుల సర్కసుల్లా మారిపోయాయి కూడాను. అనుభూతి అనే మాట నుంచి మరికొంత ముందుకు వెళ్ళి మన సత్వ దృక్పథ విమర్శ, కట్టకడకు కావ్య రచననే ఒక "మానసికచికిత్స"గా అభివర్ణించి, హాస్యాస్పదమైన వ్యాఖ్యానాలకు దారి తీసింది. వైయక్తిక పరిమితుల మూలంగా పెల్లుబికిన ఈ దుర్లక్షణాల నుంచి విమర్శను బయట పడవేసి దానికి ఆధునికమైన శాస్త్రీయ భూమికను నెలకొల్పాలని ప్రయత్నం చేసింది- ఒక చెంప ఐ. ఏ. రిఛర్డ్స్, మరో చెంప అడాల్ఫ్ టేన్. రూప విషయంగా అన్వయకార్యాన్ని ప్రాయోగిక విధానానికి అనువుగా మలిచేటందుకు రిఛర్డ్స్ మార్గం వేస్తే, వస్తుపరంగా విస్తారమైన అన్వయ క్షేత్రాన్ని నెలకొల్పేటందుకు అడాల్ఫ్ టేన్ మార్గదర్శకత్వం వహించాడు. ఆయన ప్రతిపాదించిన 'The race. the moment and the milen' అనేవి మూడూ ఆధునిక శాస్త్రీయ విమర్శకు మూడు మూల స్తంభాలుగా నిలిచాయి. race అంటే ఒక దేశ ప్రజ విశిష్ట స్వభావం. ఆ జాతి వ్యక్తిత్వమన్న మాట. moment అంటే ఆ రచయిత జీవించిన చారిత్రక యుగం, దాని స్వభావం, స్వరూపం అన్నమాట. milen అంటే పరిసర క్షేత్రం ఆ చారిత్రక యుగానికి, రచయిత ప్రాంతానికీ చుట్టూ ఆవరించివున్న పరిసరాల్లోని చైతన్యం, సంఘర్షణలూ, సమస్యలూ. ఈ మూడు దృక్కోణాలనుంచీ చూస్తే కాని, ఒక రచన సమస్వరూపం, విశిష్ట వ్యక్తిత్వం, దాని ప్రయోజనం, ఆవశ్యకతా అవగాహనలోనికిరావు. ఈమూడింటిలో ఏదీ ఒక వైయక్తిక బిందువునాశ్రయించి, అభినందనల వర్షంలో ముంచెత్తి, అశాస్త్రీయమైన ఖండన మండనల పరిధిలోనికి విమర్శను కుదించివేసే అవకాశాన్ని ఇవ్వవు. భిన్నరీతుల ఆధునిక శాస్త్రాల పరిశీలనలనుఅన్వయించుకోనిదే సరైన ఫలితాన్ని ఇవ్వవు విమర్శకుడు రచయితకూ- జనతకూ మధ్య వారధిలా తన స్థానాన్ని సమర్థంగా-సశాస్త్రీయంగా నిర్వహించాలంటే ఈ మూడు దృక్కోణాలు తప్పనిసరిగా అవసరం. ఈ దృక్కోణత్రయం మీద ఆధారపడి చారిత్రక విమర్శ అనే పంథా బయల్దేరింది. ఈ యుగంలో అత్యంత గౌరవాన్ని పొందిన ఆర్కిటైపల్-మూల రూపాత్మక- విమర్శ మనోవైజ్ఞానిక విమర్శలోని కొన్ని ఉత్తమ సిద్ధాంతాలను తీసుకొని, పై మూడు దృక్కోణాలలో మొదటిదైన జాతి చేతన అనే అంశంమీద ఆధారపడుతూ అనుభూతివాదం కొత్త రూపంగా ముందుకు పోవడం విచారకరం. ఏకపక్షంగా కాక, సమన్వయపూర్వకంగా పై మూడింటిని అనుష్ఠించిన చారిత్రక విమర్శలో ఒకే ఒక చిన్న బలహీనత-ఆ విమర్శఅందించే సందేశం ఏమిటి? ప్రస్తుత జీవితానికి కలిగించే

ఏమిటి? అనేది సందేశం విమర్శసాఫల్యతకు గురుతు ఆ సాఫల్యతను దృష్టిలో పెట్టుకొని, చారిత్రక విమర్శనా రీతిలోని మూల సూత్రాలనూ– సమాజ వాస్తవికతను విశ్లేషించి, సామాన్య మానవ జీవితానికి అర్థం, గమ్యం తెలియచెప్పిన ఆర్థిక–సామాజికవేత్తల దృక్పథాలనూ– వైయక్తిక భావపరిణామాల మీద మాత్రమే కాకుండా, మొత్తం సమాజం అంతటా ప్రసరించే నైతిక దృష్టినీ సమన్వయపరచి సశాస్త్రీయ పంథాలో పురోగమిస్తున్నది, సామాజిక విమర్శ అనే కొత్త సంప్రదాయం. సాహిత్యం పట్ల రచయిత–జనత ఉభయుల బాధ్యతనూ ఇనుమడింపచేసి, ఉభయుల అంతరాత్మ పరిశీలకునిగా వ్యవహరించే ఉత్తమ విమర్శకునికి, పరమోపాదేయంగా వెలసిన ఆధునిక మార్గం – సామాజిక విమర్శ. ముద్రణ సౌకర్యాలు పెరిగి, అధికాధికంగా, ఒక మోస్తరు కుటీర పరిశ్రమగా రచనా పరిశ్రమ రూపొందిన ఆధునిక కాలంలో విమర్శకునిమీద వున్న గురుతర బాధ్యత మరింత పెరిగింది. ఆ బాధ్యతను న్యాయంగా నిర్వర్తించాలంటే లక్షణశాస్త్ర పరిజ్ఞానం కాదు కావలసింది, సమాజ శాస్త్ర పరిజ్ఞానం.

చిత్రమేమిటంటే విమర్శ అనేది ఒక స్వయం సంపుష్ట శాస్త్రదశకు ఎదిగినా దీనికింకా ఒక మెథడాలజీ ఏర్పడక పోవడం. అందువల్లనే ఇప్పటికీ పెద్ద పెద్ద విమర్శకుల రచనల్లోనే ఇంకా పెడత్రోవలు సాక్షాత్కరిస్తుంటాయి. ఏకదేశాన్వయత లోపించడం, శాస్త్రీయ ప్రాయోగిక విధానం అవలంబించక పోవడం, ఒక్కొక్కచోట రూప ప్రాధాన్యతను కేవలం అత్యల్పంగా భావించడం, మరోచోట అనల్పం చేసి పట్టం గట్టడం, స్వీకృత వస్తువునుంచి పూర్తిగా దూరమై సిద్ధాంత చర్చచేయడం మొదలైన దుర్లక్షణాలు అగుపడుతుంటాయి. తెలుగులో సగటున వెలసే విమర్శల మాట ఇక చెప్పక్కరే లేదు. సగటు రచయితలో కనిపించే డొల్లుకంటె, సగటు విమర్శకునిలో కనిపించే డొల్లు మరింత జుగుప్సాకరంగా వుంది. శాస్త్రీయ పరిశోధనా విమర్శలూ, శాస్త్రీయ విమర్శల పేరిట జరిగే గడబిడ సామాన్య పాఠకుని త్రోసిరాజని ఏకాంత స్వప్న దుర్గాలను నిర్మించుకొంటోంది. యూనివర్సిటీ రంగంనుంచి సాక్షాత్కరించే అధికశాతం తెలుగు విమర్శకులకు ఇంకా పింగళిగారి సాహిత్యశిల్ప సమీక్ష పేరిటి నోట్సూ, కాదంటే దాని సోపాన, దర్శనాలూ ఉపాదేయంగా ఉంటున్నాయి. సాహిత్య విమర్శను స్వయం సంపూర్ణశాస్త్ర స్థాయిలో సమన్వయం చేసి చెప్పడం మాట అటుంచి, కనీసం ఆ వికాసానికి దోహదమిచ్చిన ఓన్న ఆధునిక సంప్రదాయాలూ, దృక్పథాల పరిచయాన్నైనా అధ్యాపకులు విద్యార్థులకు ప్రసాదించడం లేదు పరిశోధనారంగం విస్తృతమౌతున్న కొద్దీ, పరిశోధనా డిగ్రీలకు జీవిక సముపార్జనలో ప్రాధాన్యం పెరుగుతున్న కొద్దీ, విధిలేక విమర్శలను వెలయించాల్సిన అవసరం విద్యార్థులకు విపరీతంగా వస్తోంది. అలాటి చారిత్రక స్థితిలో విమర్శన యొక్క స్వయం సంపూర్ణ శాస్త్ర స్థితిని, ఆవశ్యకతనూ,

బోధపరచకపోవడం, ప్రాయోగిక విధానాల్లో తగిన అభ్యాసాన్నీ, అన్వయ పుష్టినీ కలిగించకపోవడం చాలా శోచనీయమైన విషయం. ఇది విమర్శల- విమర్శకుల సంఖ్యా పుష్టికి దోహదం చేసుందేమోకానీ, శాస్త్ర పుష్టికీ, గుణపుష్టికీ దోహదం చేయదు. ఈ పరిస్థితి తొలగాలంటే మొదట విమర్శనా శాస్త్రం మెథడాలజీని- ఆధునిక అవసర, పరిసరాల దృష్ట్యా- రూపొందించడానికి కృషిజరగాలి. తెలుగులో భిన్న ప్రాచీన ఆధునిక సంప్రదాయాలను పరిచయంచేసే గ్రంథాలు విరివిగారావాలి. అందుకు ఈ సదస్సు బీజాలు వేస్తుందని ఆశిద్దాము.

*

1970 దశకంలో తెలుగు నవల

పరిణామం - స్వరూపం - స్వభావాల్ని చర్చించిన

అభ్యుదయం

ఈ దశాబ్ది నవల విశేష సంచిక చదవండి !

ప్రఖ్యాత విమర్శకులు, నవలా రచయితల, రచయిత్రుల వ్యాసాలతో వెలువడింది !

వెల : ఆరు రూపాయలు మాత్రమే

ప్రతులకు :

విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్

చంద్రం బిల్డింగ్స్, విజయవాడ-4

విశాలాంధ్ర బుక్‌హౌస్

విజయవాడ, హైదరాబాద్, వరంగల్, అనంతపురం, తిరుపతి, గుంటూరు

ఆధునిక సాహిత్య విమర్శ

తెలుగులో సాహిత్య విమర్శ ఆధునిక యుగంలో అవతరించిన స్వతంత్ర ప్రక్రియ. 19వ శతాబ్దంలో ముద్రణా యంత్ర సౌకర్యంవల్ల కలిగిన పత్రికల ప్రాదుర్భావం, ఆంగ్ల విద్యా విధానం వల్ల ఏర్పడిన పాశ్చాత్య సాహిత్య పరిచయం విమర్శనా సాహిత్యం వెలువడటానికి ముఖ్యంగా దోహదం చేశాయి. మూలపడివున్న తాళపత్ర గ్రంథాలు వెలుగులోకి వచ్చి సాహిత్య పఠనం విస్తృతమై పఠితల్లో అనుశీలనకు దారితీసింది. సి. పి. బ్రౌన్, కావలి రామస్వామి ప్రభృతులు శాస్త్రీయమైన పరిశోధనా పద్ధతులకు పునాది వేశారు. ఈ పరిస్థితుల సామూహిక ప్రభావంతో నాటకం, నవల, వ్యాసం మొ॥ ప్రక్రియలకు పైదోడుగా విమర్శ అవతరించింది.

ఆంధ్ర వాఙ్మయ రంగంలో కందుకూరి వీరేశలింగం రాకతో విమర్శ రచనకు శ్రీకారం చుట్టబడింది. అంతవరకూ అస్పష్టమైన రూపరేఖలతో వున్న సాహిత్య విమర్శకు స్వస్వరూపం ఏర్పడి ప్రత్యేక ప్రతిపత్తి లభించింది. వీరేశలింగంగారు 1876 లో వివేకవర్ధని పత్రికలో 'విగ్రహతంత్ర విమర్శనం' ప్రకటించారు. ఒక సంపూర్ణ గ్రంథాన్ని విమర్శనీయాంశంగా గైకొని దానిపై ప్రత్యేకమైన విమర్శనా గ్రంథం వెలువడటానికి ఇదే నాంది. కొక్కొండ వెంకటరత్నం పంతులు రచించిన 'విగ్రహ తంత్రం'లోని భాషాదోషాలను, అనువాద లోపాలను మాత్రమే ఈ గ్రంథం ఎత్తి చూపింది. "పండిత వృక్షమున కేరాతి దెబ్బలన్నట్టుపుస్తకములు వ్రాయువారికే విమర్శనము లనురాళ్ళు తా. ను. అయిన నవి మొదల కొంత నొప్పి కలిగించి గ్రంథకర్తను కాలక్రమమున గట్టివానిం గావించుటయేకాక యాతని మహోన్నతునింజేసి విమర్శనముల గుఱికందని వానిగా జేయును." అని విమర్శ ప్రయోజనాన్ని వివరించిన కందుకూరి మాటలు గమనింపదగినవి.

వీరేశలింగంగారి సమకాలికులైన కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రి, వేదం వేంకటరాయశాస్త్రి గురజాడ అప్పారావు మున్నగువారు తమ రచనలతో నాటి విమర్శనా రంగాన్ని ఉత్తేజపరచారు. ప్రాచీనాంధ్ర కావ్యాలు ముద్రితమై అందుబాటులోకి రావటంతో విమర్శకుల దృష్టి క్రమంగా వానిపై ప్రసరించసాగింది. సుజనరంజని, ఆంధ్ర భాషా సంజీవని, వివేకవర్ధని, అముద్రిత గ్రంథ చింతామణి, చింతామణి మున్నగు పత్రికలు గత శతాబ్దిలో విమర్శకు వేదికలుగా ఉపకరించాయి. కాని నాటి విమర్శలు శబ్ద చర్చలు, వ్యాకరణ ఛందో పరామర్శలకు మాత్రమే పరిమితమైనాయి కావ్య బాహ్య స్వరూప విచారణమేకాని,

డా॥ ఎస్. వి. రామారావు

(రీడర్, ఉస్మానియా విశ్వవిద్యాలయం)

అంతర్య పరిశీలనం జరుగలేదు.

కావ్యాత్మ విచారణకు ప్రాముఖ్యం ఈ శతాబ్ది ప్రారంభంతో గోచరమౌతుంది. కట్టమంచి రామలింగారెడ్డి 'కవిత్వ తత్త్వ విచారం' తెలుగు విమర్శా పథాన్ని కొత్త మలుపు తిప్పింది 1899లో విరచితమైన రెడ్డిగారి వ్యాసం 1914 లో విస్తృత రూపాన్ని ధరించి 'కవిత్వ తత్త్వ విచారం'గా వెలువడింది.

"విమర్శనము జేయుటలో కథ, పాత్రములు, ప్రకృతి విశేషములు, వర్ణనములు— ఇవన్నియు పరస్పర మైత్రి కలిగి విరుపులు లేని ఏకాకృతిగా నున్నవా యను విచారణ ప్రధాన తమము" అని గుర్తించిన ప్రథమాంధ్రవిమర్శకుడు కట్టమంచి దేశ చరిత్రకు, సాహిత్యానికి గల పరస్పర సంబంధాన్ని విశదీకరించి, ఆధునికమైన సాంఘిక విమర్శనా పద్ధతికి (Socialogical Criticism) ఆయన మార్గదర్శకుడైనాడు

రామలింగారెడ్డిగారు పాశ్చాత్య సులోచనాలతో ప్రాచ్య సారస్వతాన్ని విలోకించగా భారతీయసంస్కారబలంతో కావ్యాత్మ వివేచన సల్పిన విమర్శకాగ్రేసరులు విశ్వనాథ సత్యనారాయణగారు. నన్నయ ప్రసన్న కథాకలితార్థ యుక్తిని, అల్లసాని అల్లిక జిగిబిగిని, నాచన సంవిధాన శిల్పమును, శాకుంతలము యొక్క అభిజ్ఞానతను అనితర సాధ్యమైన ప్రతిభతో ప్రదర్శించారు. కావ్యానికి ఆయువు పట్టయిన ఏక వాక్యతను ఆయన వలె దర్శించిన విమర్శకులు చాలా అరుదు. ప్రాచ్య పాశ్చాత్య లక్షణ సమన్వయతో రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, పింగళి లక్ష్మీకాంతం ప్రభృతులు విశిష్టమైన విమర్శన పంథాకు దారితీశారు. శ్రీశ్రీ, రమణారెడ్డి, ఆర్. ఎస్. సుదర్శనం మున్నగువారు విమర్శరంగంలో ఆధునిక ధోరణులకు ప్రాతిపదిక వేశారు సృజనరంగంలో వాసికెక్కిన కవులు విమర్శను కూడా కవితామయం చేయగలరనటానికి బుచ్చిబాబు, కృష్ణశాస్త్రి మొ॥వారి విమర్శ వ్యాసాలు సాక్ష్యంగా ఉన్నాయి.

అద్యతన యుగంలో విమర్శ వివిధ శాఖలుగా విస్తరిల్లింది. వ్యాసాలు, పీఠికలు, వ్యాఖ్యానాలు, కవి చరిత్రలు, సాహిత్య చరిత్రలు, సిద్ధాంతం గ్రంథాలు విజ్ఞాన సర్వస్వాలు, ప్రత్యేక సంచికలు మొ॥ స్వరూపాలను ధరించింది. ఈ విస్తృతికి ముఖ్య సాధనంగా తోడ్పడినవి పత్రికలు. ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక, భారతి, కళ, జయంతి, ప్రతిభ, ఉదయిని, అభ్యుదయ, కిన్నెర, పరిశోధన, సుజాత, శోభ, స్రవంతి సాహితి, సృజన, సంవేదన మొ॥ పత్రికల్లో వెలువడిన విమర్శలే చాలావరకు గ్రంథరూపంలో వెలువడి విమర్శ వాఙ్మయంలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నాయి.

కాని— తెలుగు విమర్శ పుట్టి నూరేళ్ళు పైబడినా, అది చేరవలసిన గమ్యం ఇంకా అందుకోలేదనే అనిపిస్తుంది. ప్రాచీనాంధ్ర సాహిత్యంపై విమర్శ విరివిగా కొనసాగినా, అర్వాచీన సాహిత్యాన్ని సమగ్రంగా పరామర్శించిన విమర్శలు ఇంతవరకూ వెలువడలేదు. ఆధునికాంధ్ర సాహితీ ప్రక్రియల్లో ప్రముఖమైన నవల, కథానిక, నాటకం

కవితలపై ప్రామాణిక విమర్శలు రావలసిన అవసరం ఎంతైనా ఉంది.

తెలుగులో తొలి నవలా విమర్శను వెలయించిన కీర్తిమూర్తి కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రిగారు వారి 'వివేక చంద్రికా విమర్శనం' (1896) ప్రథమాంధ్ర నవలగా ప్రసిద్ధి గడించిన కందుకూరి 'రాజశేఖర చరిత్ర' పై పరామర్శనం. రాజశేఖర చరిత్రకు వివేక చంద్రిక అని నామాంతరం ఉంది. నాటికీ నేటికీ ఒక నవలను విమృశ్యాంశంగా తీసుకొని వెలువడ్డ ఏకైక విమర్శనా గ్రంథం ఇదే కావటం గమనించవలసిన విషయం. నవలా సాహిత్యాన్ని సామూహికంగా సమీక్షించిన గ్రంథాలే కాని ఒక నవలపై ప్రత్యేక విమర్శనా గ్రంథాలేవీ లేకపోవటం మన విమర్శ స్థితికి నిదర్శనం. నవలా సాహిత్యాన్ని సామూహికంగా పరామర్శించిన గ్రంథాలు కూడా సమగ్రమైనవి కావు.

బి. వి. కుటుంబరావుగారి పరిశోధనా గ్రంథం "ఆంధ్ర నవలా పరిణామము" (1974) ప్రథమ భాగం మాత్రమే ప్రచురితమైంది. 'తెలుగు నవలా వికాసం' (1971) లో మొదలి నాగభూషణశర్మ ప్రసిద్ధమైన 12 నవలలను మాత్రమే స్వీకరించారు. పుల్లాభొట్ల వెంకటేశ్వర్లుగారు మాత్రం 1970 వరకూ వెలువడ్డ నవలలను విహంగావలోకనం చేశారు. కొందరు ఆధునిక నవలాకర్తల దృక్పథాన్ని ఆర్. ఎస్. సుదర్శనంగారు తమ వ్యాస సంపుటిలో విశదీకరించారు. కోడూరి శ్రీరామమూర్తిగారు తెలుగు నవలల్లో మన సత్వ విశ్లేషణను వివరించారు. తెలుగు నవల – నూరు సంవత్సరాలు (సాహిత్య అకాడమీ) మన నవల పరిశీలన (చైతన్య సాహితి), ఈ దశాబ్ది నవల సమీక్ష - (అభ్యుదయ రచయితల సంఘం) వివిధ రచయితల వ్యాస సంకలనాలు. ప్రసిద్ధ నవలా రచయితలైన విశ్వనాథ, బాపిరాజు, ఉన్నవ, గోపీచంద్, బుచ్చిబాబు, కొడవటిగంటి మున్నగువారి నవలలపై ప్రత్యేక విమర్శ గ్రంథాలేవీ ఇంత వరకూ వెలువడలేదు. ఎం. ఫిల్. పట్టం పొందిన వెన్నవరం ఈదారెడ్డి తమ సిద్ధాంత గ్రంథాన్ని "చలం నవలలు – సామాజిక చైతన్యం" పేరుతో ఇటీవలనే (1980 మే) ప్రకటించారు.

కథానికా విమర్శను వెతకటానికి భూతద్దం పట్టుకొని రావటం ఎంతైనా అవసరం. తెలుగు కథానిక స్థానం ఎంత గొప్పదో, దానిపై విమర్శ అంత చిన్నది. ఎప్పుడో కాసింఖాన్ రచించిన లఘు విమర్శ ఇప్పటికే కనుమరుగై పోయింది. ఆ తర్వాత గొర్రెపాటి వెంకటసుబ్బయ్యగారు కొందరు కథకుల రచనలు స్థూలంగా పరామర్శిస్తూ 'అక్షరాభిషేకం' చేశారు. తెలుగు కథానికపై, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, కొడవటిగంటి మొ॥ వారి కథలపై మన విశ్వవిద్యాలయాల్లో ఇటీవల కొన్ని సిద్ధాంత గ్రంథాలు వెలువడ్డాయి కాని, అవి ముద్రితం కానంతవరకూ పఠనయోగ్యం కావు.

కథతో పోలిస్తే నాటక విమర్శ పరిస్థితి కొంత మెరుగనే చెప్పాలి. తెలుగు రూపక వాఙ్మయాన్ని, నాటక

రంగాన్ని పి. ఎస్. ఆర్. అప్పారావు గారి "తెలుగు నాటక వికాసము" [1967], మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి "ఆంధ్రనాటకరంగ చరిత్ర" (1969) సమగ్రంగా సమాలోచించాయి. డివాకర్ల వెంకటావధాని, ముటిగొండ వీరభద్ర శాస్త్రి ధర్మవరం, పానుగంటి రూప కాలపై ప్రామాణిక విమర్శలు వెలువరించారు. శివభారత తత్వదర్శ నంతో వెలుగులోనికి వచ్చిన సరేశాయి తిరుమలరావు "కన్యాశుల్క నాటకకళ" (1974) ప్రకటించారు. సంగీత నాటక అకాడమివారు కొందరు నాటకకర్తల జీవిత, సాహిత్య పరామర్శలు వెలువ రించటం ముదావహం.

ఇక ఆధునిక సాహిత్యంలో ప్రముఖ మైన కవితా ప్రక్రియ అనుశీలనకు వస్తే కురుంగటి సీతారామయ్య పేరు మొదట పేర్కొనాలి. వారి 'నవ్యాంధ్ర సాహిత్య వీధులు'లో నవ్య కవిత్వ పరామర్శ విపులంగానే జరిగింది. అక్కిరాజు ఉమా కాన్తంగారు 'నేటి కాలపు కవిత్వం' పేరుతో భావ కవిత్వంపై విరుచుకు పడ్డారు అయితే ఆధునిక కవితావిమర్శకు మార్గదర్శకంగా నిలచిన ప్రామాణిక గ్రంథం డా॥ సి. నారాయణరెడ్డిగారి సిద్ధాంత గ్రంథం "ఆధునికాంధ్రకవిత్వం సంప్రదాయము, ప్రయోగములు" (1967) భావ, అభ్యుదయ కవితా ధోర ణులు సవిస్తరంగా, ప్రాచ్య పాశ్చాత్య లక్షణ సమన్వయ పూర్వకంగా ఇందులో సమాలోచింప బడ్డాయి. "స్వాతంత్ర్యో త్తర కాలానతెలుగు కవిత"పై జనధర్మ పత్రికవారు, 'వచన కవిత'పై ఫ్రీవర్స్ ఫ్రంట్‌వారు వ్యాస సంకలనాలు వెలువ రించారు.

ప్రత్యేక కవి విమర్శలలో నవకవితా వైతాళికుడైన గురజాడపై విమర్శకు అభ్యుదయ కవితాయుగకర్త శ్రీశ్రీ దారి చూపారు. గురజాడ, దువ్వూరి వ్యక్తిత్వ సాహిత్యాలను సమ్యగ్వివేచనతో సమన్వయిస్తూ కె. వి. రమణారెడ్డిగారు శాస్త్రీయమైన ఆధునిక దృక్పథంతో విమర్శలు వెలువరించారు. శ్రీశ్రీ పై అద్దేపల్లి రామమోహనరావు (శ్రీశ్రీ కవితా ప్రస్థానం), కుందుర్తి కృతులపై శ్రీనివాస సహితీ సమితివారు (అడుగు జాడలు), నారాయణరెడ్డి కవితలపై నవోదయమువారు (చైతన్య శిఖరం)విమర్శ వ్యాసాలు ప్రకటించారు.

ప్రతిభావంతమైన నవ్యకవితా ప్రకా శాన్ని ప్రసరించటానికి ఈ విమర్శలు చాలవు. రాయప్రోలు, కృష్ణశాస్త్రి, నాయని, నండూరి మొ॥ భావకవులపై తిలక్, కుందుర్తి, ఆరుద్ర, దాశరథి మొ॥ నవ కవులపై ప్రత్యేక పరిశీలనం వరుగనంతవరకు వారి కవితా హృదయం అవగతం కాదు.

ఈ విధంగా ఆధునిక సాహితీ విమ ర్శను పరామర్శించినపుడు ఆ సాహితీ ప్రవర్తకులైన వారిపైకానీ, వారి రచ నలపై కానీ శాస్త్రీయమైన ప్రామాణిక విమర్శలు లేని కొరత కొట్టవచ్చినట్లు అగుపిస్తుంది. ఇది విమర్శ రంగానికి ఆరోగ్యకరమైన లక్షణం కాదు. అభ్యు దయ రచయితల సంఘం వారు విమర్శ ప్రక్రియపై నిర్వహిస్తున్న సదస్సు ఈ వెలితిని పూరించటానికి ప్రయత్నిస్తుం దని ఆశిస్తాను.

సాహిత్య విమర్శ–మార్క్సిస్టు దృక్పథం

ఆధునిక తెలుగు సాహిత్యంలో వచ్చిన విమర్శ సాహిత్యాన్ని గురించి ముందుగ రెండు మాటలు చెప్పుకోవలసి వుంది. ఈ విమర్శ ప్రక్రియ ఎక్కువగ అభివృద్ధి చెందలేదు: ప్రమాణాల్లోగాని పరిమాణంలోగాని గొప్పగ చెప్పుకోవలసిన విమర్శ చాల తక్కువ వచ్చిందన్న విమర్శే ఎక్కువగా వినిపిస్తూంది. మన ఆధునిక సాహిత్యంలో వివిధ ప్రక్రియలు విస్తరిల్లి అభివృద్ధి చెందినంతగ ఈ విమర్శ ప్రక్రియ వృద్ధి చెందలేదన్నది వాస్తవం. ఆ సాహిత్యం మీద రావలసినంత, ఆశించినంత విమర్శ రాలేదు.

మన సాహిత్యం వున్నతమైన ప్రమాణాల్ని అందుకోవటానికి శాస్త్రీయమైన, నిర్మాణాత్మకమైన విమర్శనా ధోరణి అభివృద్ధి చెందవలసి వుంది. రచనల స్థాయిని పెంచేదేకాదు, పాఠకుల అవగాహనా స్థాయిని పెంచి ఆరోగ్యకరమైన అభిరుచుల్ని కలుగజేసి ఒక దృక్పథాన్ని ఇవ్వగలిగేది విమర్శ. కాని ఈనాడు విమర్శ లక్షణాలు లేని విమర్శే ఎక్కువ వస్తూందన్న విమర్శ వుంది. కేవలం పొగడటానికో తెగడటానికో చేసే ప్రయత్నంకూడ విమర్శ పేరుతో చలామణి అవుతూంది. మరీ పుస్తక సమీక్షల వంటివి బొత్తిగ విమర్శ లక్షణాలు లేకుండ వెలువడుతున్నాయి. ఈ పరిస్థితి మారాల్సి వుంది.

సాహిత్య పత్రికలు, రచయితల సంఘాలు అకాడెమీల వంటి సంస్థలు పుస్తక ప్రచురణ సంస్థలు మొదలైనవి సృజనాత్మక సాహిత్యానికి, దాని ప్రచురణకు యిచ్చినంత ప్రాధాన్యం విమర్శ సాహిత్యానికి యివ్వడంలేదు, ప్రోత్సహించడం లేదు. వ్యాపార పత్రికలు సంస్థలు దానికి ప్రాధాన్యం యివ్వకపోయినా కనీసం అకాడెమీలు రచయితల సంఘాలు అయినా తమ బాధ్యతగ విమర్శ సాహిత్యాన్ని ప్రోత్సహించాల్సి వుంది. అయితే అకాడెమీల్లాంటి సంస్థలు ప్రగతిశీల సాహిత్యాన్ని ఆ విమర్శను ప్రోత్సహించే ధోరణిలో కనిపించవు. బాబాల, పీఠాధిపతుల 'మహిమల్ని' డాంబికాల్ని మంత్ర తంత్రాల్ని నూరు సంవత్సరాల క్రితమే వీరేశలింగం పంతులుగారు చీల్చి చెండాడితే, మరల ఈనాడు మేధావులనబడుతూన్న రచయితలు ఆ మహిమల్ని సరిక్రొత్తగ సమర్థించి స్థాపించటానికి ప్రయత్నంచేసిన రచనలకు అకాడెమీలు బహుమతులు ఇస్తూ ప్రోత్సహించటం చూస్తే మనం వెనక్కు వెడుతున్నామా ఏమి అన్న సందేహం రాకమానదు.

ఇక ఈనాటి విమర్శనా ధోరణుల్ని గురించి ఆలోచిస్తే మనకు ప్రధానంగ

సంజీవమ్మ

కనిపించేవి మూడు పద్ధతులున్నాయి. ఒకటి- సంప్రదాయ విమర్శనా పద్ధతి- దాన్నే ఆలంకారిక విమర్శనా ధోరణి అంటాము. ప్రాచీన సాహిత్యాన్ని విమర్శించటంలో అనుసరించిన ఈ ఆలంకారిక విమర్శనా పద్ధతి ఆధునిక సాహిత్యాన్ని- నూతన ప్రక్రియల్ని విమర్శించటానికి యథాతథంగ అనువైన పద్ధతి కాదు. సమకాలీన సామాజిక జీవితాన్ని- నమస్యల్ని వస్తువుగ గ్రహిస్తున్న ఆధునిక సాహిత్యం సామాజిక దృక్పథంతోనే ప్రధానంగ విమర్శింపబడాలి. ప్రాచీన సాహిత్యం కూడ ఈ దృక్పథంతో విమర్శింపబడ వలసిన అవసరం వుంది.

రెండవది పాశ్చాత్యుల శిల్పవిమర్శనా ధోరణి. మన ఆధునిక సాహిత్యం పాశ్చాత్య సాహిత్యంచేత ప్రభావితమైనట్టిది. అందులోని వివిధ ప్రక్రియలు మన సాహిత్యంలోనూ ప్రవేశించి విస్తరిల్లినాయి. శిల్ప పరిణతికూడ సాధించుకున్నాయి. కాని వాటికి సంబంధించిన విమర్శ మాత్రం అంతగ అభివృద్ధి చెందలేదు. పాశ్చాత్య సాహిత్యంనుండి సంక్రమించిన ఆ ప్రక్రియల్ని విమర్శించటానికి పాశ్చాత్య విమర్శనా ధోరణి అనుసరించారు మన విమర్శకులు. ఇది సహజమే. రచనాశిల్పాన్ని ప్రధానంగ విమర్శించే ధోరణి పాశ్చాత్య విమర్శకులది. రచనకు ప్రాణభూతమైన వస్తువును గురించి దాని తత్వాన్ని గురించి సామాజిక దృక్పథంతో ఆలోచించటం, పరిశీలించటం ఈ శిల్ప విమర్శనా పద్ధతిలో వుండదు. రచనను రచనాదృష్టితోనే [కళా ప్రమాణాలతోనే కొలవటం] పరిశీలించటం. అంటే కళాత్మకవిలువలకు ఎక్కువ ప్రాధాన్యం యివ్వటం జరుగుతుంది. శిల్ప విమర్శనా ధోరణిలో. [అయితే ఈ శతాబ్ది— ముఖ్యంగా ద్వితీయార్థం-లో పాశ్చాత్య విమర్శకూడ సామాజిక దృష్టితో, వస్తువును గురించిన ఆలోచనతో సాగటం గమనించవచ్చు].

ఇక మూడవది మార్క్సిస్టు విమర్శనా పద్ధతి. 'మార్క్సిస్టు విమర్శ' అన్నది పై రెండు పద్ధతుల్లాగ ఒక ప్రత్యేకమైన విమర్శనా పద్ధతికాదు అన్నది ముందుగా గమనించాల్సిన విషయం. 'మార్క్సిస్టు విమర్శ' అన్న పదం మనం సృష్టించు (coined) కున్నట్టిదే. కళలు, సాహిత్యం పట్ల మార్క్సిజమ్ దృష్టి ఏమిటి ? ఒక మార్క్సిస్టు సాహిత్యాన్ని ఏ విధంగ, ఏ దృక్పథంతో పరిశీలించి విమర్శించి విలువ కడతాడు అన్న విషయం ఆధారంగ ఈ పదం, ఈ విమర్శనా పద్ధతి రూపొందినాయి అని చెప్పవచ్చు. కాబట్టి 'మార్క్సిస్టు విమర్శ' అన్నప్పుడు 'మార్క్సిస్టు దృక్పథంతో విమర్శ' అన్నది గుర్తుంచుకోవాలి.

మార్క్సిస్టు దృక్పథంతో ఒక రచనను పరిశీలించేటప్పుడు ప్రధానంగ గమనించవలసిన అంశాలు – ఆ రచనకు సామాజిక స్వభావం (గుణం) వున్నదా? వుంటే అది యాదృచ్ఛికమా ? లేక ఒక దృక్పథం వున్నటువంటిదా ? వుంటే ఆ దృక్పథం సమాజాన్ని ముందుకు నడిపించేందుకు దోహదం చేసేదా కాదా

అన్నటువంటివి. తరువాత రచనలో కళాత్మకత లేక శిల్ప సౌందర్యం అన్న మౌలికమైన గుణం గురించి పరిశీలించాలి. కళాత్మక ప్రమాణాలు వున్నతంగా లేని రచనలు అసలు వుద్దిష్ట ప్రయోజనాన్ని సాధించటం కష్టం. కాని రచన యొక్క ఔన్నత్యాన్ని నిర్ణయించటంలో గీటురాయి దాని కళాత్మకత మాత్రమే కాదు; వస్తువు పాత్రలు, వాతావరణం-ఒక్క మాటలో చెప్పాలంటే 'Canvas' అనేది ఆ రచనా కాలంనాటి సామాజిక పరిస్థితుల్లో ప్రగతిశీలమా కాదా అన్న అంశం గీటురాయి అవుతుంది. ఈ దృక్పథంతో సాహిత్య విమర్శ ఎక్కువ జరగలేదు. సాహిత్యానికి సామాజిక ప్రయోజనం వుండాలన్నది నిర్వివాదమైన విషయం. అలాంటప్పుడు పై ధోరణిలో సాహిత్య విమర్శ పెరగవలసిన అవసరం చాల వుంది. సాహిత్యంలో సామాజిక చైతన్యం, వాస్తవికత అన్న వాటిని గూర్చి పరిశీలించటం ప్రధానంగ మార్క్సిస్టు విమర్శనా ధోరణి నుండి నేర్చుకున్నారు మన విమర్శకులు. సాహిత్య విమర్శకు క్రొత్త దృక్పథం-అభ్యుదయ దృక్పథం యిచ్చినట్టిది మార్క్సిస్టు ఆలోచనా విధానం. రచనలోని శిల్ప సౌందర్యానికి తగిన ప్రాధాన్యం యిస్తూనే రచనాతత్వాన్ని-రచనలోని వస్తుతత్వాన్ని గురించి పరిశీలించేది, విలువ కట్టేది ఈ విమర్శనా ధోరణి.

ఆధునిక సాహిత్య ప్రక్రియలు పాశ్చాత్య సాహిత్య ప్రభావం వల్ల మన సాహిత్యంలో పెంపొందినప్పటికీ, తరువాత వాటిలో అభ్యుదయ భావాలు, ఒక స్పష్టమైన దృక్పథం చోటు చేసుకుంటూ వచ్చాయి. సోషలిస్టు భావాల వ్యాప్తి, సోషలిస్టు దేశాల సాహిత్యంతో మనకు పరిచయం కలగటం వల్ల ఆధునిక సాహిత్య యుగం తొలినాళ్ళలో మన సాహిత్యం మీద సంస్కరణోద్యమ, జాతీయోద్యమ చైతన్య ప్రభావం దండిగ వుండటం గమనించవచ్చు. ప్రపంచ వ్యాపితంగా అక్టోబరు విప్లవ ప్రభావం, సోషలిస్టు భావాల ప్రభావం రాజకీయాలమీదనే కాదు కళలు, సాహిత్యం మీద కూడా గణనీయంగా ప్రసరించింది. ఫలితంగా భారతీయ సాహిత్యంలో అభ్యుదయ సాహిత్యం-ఆ ఉద్యమం విస్తరించాయి. మార్క్సిస్టు దృక్పథం కలిగిన సాహిత్య సృజనకు ఈ ఉద్యమం దోహదం చేసింది.

మార్క్సిస్టు విమర్శనా విధానాన్ని గురించి తెలుసుకోటానికి ముందు కళలూ సాహిత్యం-సమాజం వీటికి వున్న సంబంధాన్ని గురించి మార్క్స్, ఎంగెల్స్ ఏం చెప్పారన్నది కొంచెం గమనించాలి. సమాజ చరిత్రనూ సమాజ జీవితాన్ని శాస్త్రీయంగ పరిశీలించటానికి, విపులంగ, లోతుగ అర్థం చేసుకోటానికి గతితార్కిక - చారిత్రక భౌతికవాద దృక్పథాన్ని యిచ్చింది మార్క్సిజం. కళలకూ-సమాజానికీ వున్న ప్రగాఢమైన సంబంధాన్ని మార్క్స్, ఎంగెల్స్ వాళ సందర్భాల్లో వివరించారు. వాటి సంబంధాన్ని సహజంగా భౌతికవాద దృక్పథంతో వివేచించారు. కళా స్వభావాన్ని,

అది వికసించే వివిధ రీతుల్ని దాని సామాజిక కర్తవ్యాల్ని, లక్ష్యాల్ని విశదీకరించారు. సౌందర్యశాస్త్ర దృష్టితో ప్రపంచ పరిశీలన చేయటం, సౌందర్య అవగాహన, కళాకృతుల సృజన అనేవి మానవుని కళాత్మక శక్తులు. ఇవి దీర్ఘ కాలిక మానవ సమాజ వికాస ఫలితాలనీ మానవ శ్రమ జనితాలనీ వీరు స్పష్ట పరిచారు. భౌతిక ప్రపంచ వికాసమూ, మానవ సమాజ వికాసమూ వలెనే కళా వస్తువు కళా రూపాలూ కూడ కొన్ని నిర్దిష్ట సూత్రాలకు అనుగుణంగ తప్పని సరిగ పరివర్తన అభివృద్ధి చెందుతూ వుంటాయని వీరు పేర్కొన్నారు. వికాస క్రమంలో కళ యొక్క విలక్షణ విశేషాల్లో సాపేక్ష స్వాతంత్ర్యం ఒకటి. చారిత్ర కంగ ఒక ప్రత్యేక సామాజిక వ్యవస్థతో కళ సంబద్ధమై వుంటుంది. అంటే దీని అర్థం ఆ సామాజిక వ్యవస్థ మారిన వెంటనే కళ ఆనాటి తన విశిష్టతను పోగొట్టుకుంటుంది అని మాత్రం కాదు. కళాకృతులు సమకాలీన సామాజిక స్థితి గతుల్ని, సామాజికసంబంధాల ప్రత్యేకతల్ని మౌలికంగ ప్రతిబింబించేవిగ వుంటాయి. తమకు రూప మిచ్చిన సామాజిక వాస్తవాన్ని కళలు క్రియాశీలంగా ప్రభావితం చేస్తాయని నొక్కి చెప్పినారు వీరు. ప్రపంచాన్ని మార్చుతూ మనిషి తనను తాను మార్చుకుంటాడు. అన్న ద్వంద్వాత్మక (dialectical) లక్షణాన్ని వుత్తమ రచనలూ వెల్లడిస్తాయి. [B.Krilov's Preface to Marx Engls on Literature and Art"] మార్క్సిస్టు దృక్పథంతో రచనల్ని విమర్శించేప్పుడు ఈ వాస్తవాల్ని గుర్తుంచుకుంటాడు విమర్శకుడు.

సాహిత్యం ఒక సామాజిక చర్య. సమాజం కోసం వుపయోగ పడటం దానికి ఒక ధర్మం. సాహిత్యం ఒక సామాజికశక్తిగ పని చేయగలదన్న సత్యం ఎన్నో చారిత్రక సందర్భాల్లో స్పష్టమైనట్టిది. సామాజిక చైతన్యాన్ని ప్రతిబింబించేది మాత్రమే కాదు, అది జాగృతంఅయేందుకుపురోగమించేందుకూ దోహదం చేయగలిగేది సాహిత్యం. ప్రగతిశీలమైన సామాజిక మార్పులకు దోహదం చేసే సముచిత శక్తి సాధనంగ సాహిత్యం వుండాలన్నది మార్క్సిస్టు దృక్పథం కలిగిన రచయితల విమర్శకుల వుద్దేశం

ఇక మార్క్సిస్టు ఆలోచనా విధానంతో కళలనూ, సాహిత్యాన్ని పరిశీలించటంలో పరిగణనలోనికి తీసుకోవాల్సిన ప్రధానమైన అంశం వాస్తవికతా వాదం. ఎందుకంటే భౌతిక వాస్తవికత ప్రాతిపదికగ కలిగింది, భావ వాదాన్ని తిరస్కరించేది ఈ వాస్తవికతా వాదం. ఆధునిక యుగంలో — ప్రపంచ సాహిత్యంలో కళల్లో విభిన్న ప్రయోగవాద ధోరణులు ఎన్ని వచ్చినప్పటికి వాస్తవికతా వాదమే ప్రధానమైన ధోరణిగ నిర్ణయాత్మక రూపం పొందింది. ఈ ధోరణి సాహిత్యాన్ని సమాజానికి పూర్తిగా సన్నిహితం చేసినట్టిది. సాహిత్యంలో సామాజిక వాస్తవికతను అభివ్యక్తం చేయటానికి అనువైన ధోరణి. మార్క్స్ ఎంగెల్స్ వాస్తవికతా వాదాన్ని కళల్లో

సాహిత్యంలో మెచ్చుకొనేవారు. దాన్ని వున్నత స్థాయిలో ఒక సిద్ధాంతంగా వారు నిరూపించారు. ఒక దశలో వుండే సామాజిక పరిస్థితుల సారాన్ని లోతుగ తరచి చూచి ప్రాతినిధ్యం వహించే లక్షణాలను సృజనాత్మకంగ సాధరణీకరించి సాహిత్యంలో వ్యక్తంచేసే ధోరణి వాస్తవికతా వాదం అని వారి భావం.

తెలుగుసాహిత్యంలోవిమర్శలోఇంకా పలువురు రచయితలు విమర్శకులు వాస్తవాన్నే వాస్తవికతావాదంగా భ్రమపడటం జరుగుతూంది. అంటే అనుభవం లేని యువ రచయితలు సంఘంలో వున్నదున్నట్లు, జరిగింది జరిగినట్లు సాహిత్యంలో చిత్రించటమే వాస్తవికతా వాదం అనుకుంటారు. కొందరు అభ్యుదయ భావాలున్నవారూ, సామాజిక సమస్యల్ని వస్తువుగ ఎన్నుకొన్నవారూ అయికూడా వాటిని వాస్తవికతా ధోరణిలో కళారూపాలుగ మలచటంలో ఓటమి పాలవుతూ వుంటారు. సాహిత్యంలో వాస్తవికతా వాదం అంటే సమాజంలోని వాస్తవాని నకలు కాదు. లేక వాస్తవాన్ని గురించి ఆత్మాశ్రయ భావ ధోరణిలో విశృంఖలత ప్రదర్శించటమూ కాదు. మనిషిని సామాజిక సన్నివేశంనుండి వేరుచేసి అన్నిటికీ మనిషే వ్యక్తిగతంగా బాధ్యుడని తీర్మానించటం కాదు. ఈ సామాజిక వ్యవస్థను— దాని పరిస్థితుల్ని గురించిన (సిద్ధాంతపరమైన) అవగాహనతో కూడిన విమర్శనాత్మక విశ్లేషణ వాస్తవికతా వాద రచనలో కీలకమైన అంశం. జీవితంలోని వాస్తవ విషయాల సారతత్వాన్ని అన్వేషించి వాటి తాత్విక అంతరం గ్రహించే శక్తి వాటిని సజీవంగసృజనాత్మకంగ రచనలో రూపొందించే శక్తి రచయితకు వున్నప్పుడే వాస్తవికతా వాదం రచనలో సార్థకం అవుతుంది.

"వాస్తవికతావాది అయిన రచయిత తన రచనలో జీవితానికి ఛాయచిత్రప్రాతినిధ్యం కాకుండ, జీవితపు అత్యంత వైవిధ్య పూరితమైన సంపూర్ణమైన, వాస్తవికత కంటె కూడ సత్యమని భాసించే అంతర దృష్టి యివ్వటానికి ప్రయత్నిస్తాడు. జీవితం నుండి రచనా విషయాన్ని ఎన్నుకున్న తరువాత అందులోని యథాలాప విషయాల్ని క్షుద్ర ఘటనల్ని తొలగిస్తాడు" అన్నది మొపాసా అభిప్రాయం. ["Novelist on the novel" By Miriam Allott] అంతేకాదు "వర్తమాన జీవితాన్ని అందులోని వాస్తవాన్ని చిత్రించేటప్పుడు వాస్తవికతావాది అయిన రచయిత గతాన్ని వుపేక్షించడు. సహజమూ అనివార్యమూ అయిన భవిష్యత్పరిణామాల్ని అవలోకించకుండ వదలడు" అని షెడ్రిన్ అభిప్రాయం. ["Lenin and problems of Literature" By vladimir Scherbina] "ప్రతిభ శిల్పం సజీవ భాషా ప్రయోగం సృజనాత్మక కల్పన అంతర్దృష్టి ప్రేమ ఆర్ద్రిత సంవేదన శీలత వంటి గుణాలకు నిలయమైందే వాస్తవికతా వాదం, కాని వాటికి దూరమైంది కాదు" అంటాడు హోవర్డ్‌ఫాస్ట్ ("Literature and Reality" By Howard fast) వాస్తవికతా వాది

అయిన రచయిత జీవితాన్ని క్షణి కానుభవవాది (empiricist) దృష్టితో చూడడు. సమాజం గతశీలమైంది అనే సిద్ధాంత అవగాహన కలిగి వుంటాడు. చారిత్రక దృక్పథం కలిగి వుంటాడు. వాస్తవికతావాద దృష్టితో రచనల్ని పరిశీలించేప్పుడు ఈ విషయాల్ని దృష్టిలో వుంచుకుంటాడు మార్క్సిస్టు విమర్శకుడు

తరువాత రచయిత సృజన కార్యంలో చాల కష్టమూ ప్రధానమూ అయినభాగం పాత్ర సృష్టి. వాస్తవికతా వాది అయిన రచయిత జీవితాన్ని, వ్యక్తుల్ని లోతుగ పరిశీలించి సామాన్యీకరించటం ద్వారా యుగ ప్రతినిధులు అనిపించే నమూనా [Type] పాత్రల్ని సృజిస్తాడు. 'స్వతంత్ర జీవితంతో పాత్రలనూ మానవ సంబంధాలనూ సంపన్నం చేసే ఒక సమగ్రత వాస్తవికతా వాదం' అన్నది జార్జ్ లుకాస్ అభిప్రాయం. సంపూర్ణ మానవ వ్యక్తిత్వాన్ని అభివ్యక్తం చేయటం వాస్తవికతా వాదంలో ప్రధాన అంశం. రచయిత యొక్క సామాజిక చైతన్య వికాసంతో పాటు అతని ప్రతిభ సంస్కారం మనస్తత్వం అనుభవం, ప్రజలతో సంబంధాలు సాహితీ సంప్రదాయాల వారసత్వ ప్రభావం- ఈ అన్నింటినీ బట్టి పాత్ర చిత్రణ రూపం వహిస్తుంది. అలాంటి పాత్ర చిత్రణ ద్వార సామాజిక చైతన్యపు వివిధ కోణాల్ని వికాసాన్ని సన్నిహితంగ అవగాహన చేసుకోవటానికి సాధ్యం అవుతుంది. పాత్ర చిత్రణను ఈ దృష్టితో పరిశీలించటం జరుగుతుంది మార్క్సిస్టు విమర్శనా పద్ధతిలో.

ఈనాటి సాహిత్యంలో పాత్రల మనస్తత్వ చిత్రణకు ప్రాధాన్యం వుంటూన్నది కాబట్టి దాన్ని గురించిన మార్క్సిస్టు దృక్పథం కూడ గమనించవలసి వుంది. వాస్తవికతావాది అయిన రచయిత వివిధ సన్నివేశాల్లో పాత్రల మనోభావాల్ని చిత్రించవలసి వస్తే మనస్తత్వ చిత్రణకే అత్యంత ప్రాధాన్యం యిచ్చి అందులో కొట్టుకుపోడు. అంతమాత్రంచేత పాత్ర మనస్తత్వాన్ని న్యూనపరచి చూస్తాడని అర్థంకాదు. అయితే ప్రతి మనోభావానికి హేతువాద దృష్టితో యాంత్రిక రీతిలో భౌతిక పరిస్థితులే కారణాలుగ చిత్రిస్తూ మానవ ప్రవర్తనను గణిత సూత్రాల క్రింద తేల్చడు. అలా చేస్తే పాత్రలు సజీవతను కోల్పోయి కేవలం ప్రతిమలుగ నిలచి పోయే ప్రమాదం వుంది. సామాజిక సమస్యల్ని చిత్రించేందుకు, తన ఆలోచనల్ని దృక్పథాన్ని వ్యక్తం చేసేందుకు వాడుకున్న సాధనాలుగ పాత్రల్ని తయారుచేయ కూడదు రచయిత.

రచనలో సామాజిక వైరుధ్యాలతో పాటు పాత్రల మానసిక వైరుధ్యాలను సమన్విత దృష్టితో చిత్రించే శక్తి వాస్తవికతావాది అయిన రచయితకుండాలి. ఎన్నో విధాల సంక్లిష్టమై పోయిన నేటి సమాజ జీవితంలో వ్యక్తుల అంతరంగాలు జటిలమై పోయినాయి. సమాజ జీవితంతో వ్యక్తి జీవితం మునుపటికంటె ఈనాడు మరింత ముడి పడి వుంది. ఇలాంటి పరిస్థితుల్లో పాత్ర చిత్రణలో సహజత్వాన్ని సాధించ

టానికి అంతరంగ చిత్రణ చేస్తున్నారు రచయితలు. ఫ్రాయిడ్ మనో విశ్లేషణ వాదులు వ్యక్తుల జటిల మనస్తత్వానికి కారణాలు వారి అంతర చేతనలో వెదకుతారు. వాస్తవికతా వాదులు సంక్లిష్ట సామాజిక జీవిత పరిస్థితుల్లో కూడ కారణాలు అన్వేషిస్తారు.

మనో వైజ్ఞానిక పరిశోధనలు ఆధునిక సాహిత్యం మీద ఎంతో ప్రభావాన్ని ప్రసరించాయి. ఫ్రాయిడ్, ఆడ్లర్ మొదలైన మనస్తత్వ శాస్త్రవేత్తల సిద్ధాంతాలు సామాజిక చైతన్యానికి ఒక నూతన పార్శ్వం యిచ్చాయి. ఈ సిద్ధాంతాల ప్రభావం వల్ల సాహిత్యంలో సృజింపబడిన పాత్రలు ప్రధానంగ సామాజిక వికృతరూపాన్ని ప్రతిబింబించాయి. సామాజిక పరిస్థితులకు సాపేక్షకంగా ఏర్పడిన మానసిక గ్రంథులు (mental complexes) కలిగిన పాత్రలు – అంటే న్యూనతా భావం ఆధిక్యతా భావం మొదలైనవి కలిగిన పాత్రలు సామాజిక వాస్తవికతకు ప్రతిబింబాలే సాహిత్యంలో. ఎందుకంటే ఇలాటి మనో వికారాలకు మూలం వ్యక్తి యొక్క సామాజిక అస్తిత్వంలో వుంది. ఇది వికృత సామాజిక చైతన్యంగ పరిగణింపబడుతుంది. అలాంటి పాత్రల్ని సాహిత్యంలో చిత్రించటంవల్ల ఈ సమాజానికి పట్టిన రోగాల్ని అర్థం చేసుకోటానికి వీలవుతుంది.

పాత్ర మనస్తత్వాన్ని చిత్రించటంలో విశ్లేషించటంలో పరిశీలించటంలో మనోవైజ్ఞానిక పరిశీలనకు తగిన ప్రాధాన్యం యిస్తుంది మార్క్సిస్టు విమర్శ. భౌతిక వాస్తవికతను నిరాకరించి కేవలము వ్యక్తుల అంతర చేతనలోనే వారి మనస్తత్వానికి, ప్రవర్తనకు కారణాలు వెతికే మనస్తత్వ శాస్త్రాన్ని అంగీకరించదు మార్క్సిజమ్. ఆ శాస్త్రానికి సామాజిక పార్శ్వం కూడ అన్వయించి వ్యక్తుల మనోవృత్తుల్ని పరిశీలిస్తుంది. వ్యక్తుల వివిధ మానసిక ప్రవృత్తులు రూపొందటానికి సమాజంలోని భౌతిక పరిస్థితుల పాత్ర కూడ చాల వుందన్న విషయమూ, మానవ ప్రవర్తనను ప్రేరేపించేవి సామాజిక శక్తులు అన్న విషయమూ గుర్తిస్తుంది మార్క్సిస్టు విమర్శ.

వాస్తవం ఏమిటంటే మనోవిజ్ఞాన శాస్త్రం ఫ్రాయిడ్‌తోనే ఆగలేదు. అతని తరువాత యూంగ్, ఆడ్లర్ మాత్రమే కాదు, ఎరిక్ ఫ్రోమ్, హార్నీవంటి నవ్య ఫ్రాయిడ్ వాదులు (Neo-freudians) ప్రవర్తన వాదులు (Behaviourists), సోవియట్ మనస్తత్వ శాస్త్రవేత్తలు మరెందరో మనోవైజ్ఞానిక పరిశోధనల్ని కొనసాగించారు. ఆ శాస్త్రాన్ని చాల అభివృద్ధి చేశారు. ఈ విషయం గమనించకుండ ముఖ్యంగా మన తెలుగు సాహిత్యంలో చాలమంది రచయితలు, విమర్శకులు ఫ్రాయిడ్ సిద్ధాంతంతోనో ఆడ్లర్ సిద్ధాంతంతోనో మనస్తత్వ శాస్త్రానికి హద్దులు సరిపెట్టుకుంటారు ఆ ప్రకారం పాత్రల మనస్తత్వాన్ని తయారుచేస్తూ వుంటారు తమ రచనల్లో. ఫ్రాయిడ్ వాదులే ఫ్రాయిడ్ చెప్పిన చాల విషయాల్ని నిరాకరించారు. ఫ్రాయిడ్ మనోవిశ్లేషణ సార్థకం

కావాలంటే దానికి సమాజ శాస్త్రీయ రూపం యివ్వాలని భావించారు హార్నీ, ఫ్రోమ్ మొదలైన శాస్త్రవేత్తలు. ఫ్రోమ్ ప్రకారం ఒక వ్యక్తియొక్క సామాజిక స్వభావం అనేది ఆ సామాజిక - ఆర్థిక నిర్మాణం, ఆ సమాజ భావాలు-ఆదర్శాలు ఆధారంగా రూపం వహిస్తుంది. ["Neo-freudians in search of truth" By V. I. Dobrenkov] ఇది గమనించాలి మన రచయితలు.

మార్క్సిస్టు విమర్శలో మరొక్క విషయం రచనలో భావ చిత్రాల ప్రాధాన్యం గురించి చెప్పకపోతే అది అసంపూర్ణం అవుతుంది. భావ చిత్రాల భాష రచనకు కళాత్మకత సంతరించి పెట్టడమే కాకుండ సామాజిక చైతన్యాన్ని ప్రతిబింబించేందుకు, సమాజ స్వరూపాన్ని విశ్లేషించేందుకూ పనికి వస్తుంది. రచయిత చైతన్యమూ, రచయిత అనుభూతి ప్రేరిత ఆలోచనలూ భావచిత్రాలకు రూపం యిస్తాయి రచనలో. ఇవి పాఠకుని చైతన్యాన్ని, కదిలించి భావాల్ని స్పందనశీలం చేసేందుకు, సామాజిక సంవేదనను ప్రేరేపించేందుకు దోహదం చేస్తాయి.

అభ్యుదయ సాహిత్యం మనకు దండిగానే వుంది. కాని ఆ సాహిత్యం మీద విమర్శే పెద్దగ రానిది. ఏవో అప్పుడప్పుడు సమీక్షలు, వ్యాసాల సంకలనాలు తప్ప వివిధ ప్రక్రియల మీదా, ఒక్కొక్క రచనమీదా రచయిత మీదా సమగ్రమైన, స్థాయి కలిగిన విమర్శలు పరిశోధనలు వెలువడలేదు. శ్రీ శ్రీ సాహిత్యం మీదే ఈనాటికీ సమగ్రమైన విమర్శలేదు. అభ్యుదయ సాహిత్య రంగంలో మేధావులైన విమర్శకులున్నారు. కాని వారినుండి ఆశించినంత విమర్శ సాహిత్యాన్ని అందుకోలేక పోతున్నాం. యువ రచయితలకు విమర్శకులకు మార్గం చూపవలసిన బాధ్యత వీరిమీద వుంది. మార్క్సిస్టు ఆలోచనా విధానంతో సాహిత్య విమర్శ పెంపొందవలసివుంది. దాన్ని ఒక వుద్యమంగాతీసుకొని రావాల్సిన అవసరం వుంది. ఈ బాధ్యత అరసం వంటి సంస్థలు స్వీకరించాల్సి వుందన్న విషయం కూడ ఈ సందర్భములో గుర్తుచేసుకోవాలి. అభ్యుదయ సాహిత్య ప్రమాణాలు పెరగటానికి ఈ విమర్శ దోహదం చేస్తుంది.

ఇటీవల సాహిత్య విమర్శలో సరిక్రొత్త రూపంలో తలెత్తుతున్న క్షీణ వాదాల్ని ఎదుర్కొని ఖండించవలసిన బాధ్యత కూడ మార్క్సిస్టు విమర్శకుల మీద వుంది. 'అనుభూతివాదం' పేరుతో సాహిత్యం యొక్క సామాజిక ప్రయోజనాన్ని కించపరచడానికి కొందరు విమర్శకులు చూస్తున్నారు. 'అనుభూతి' అనేది ప్రత్యేకంగా ఒక సాహిత్య సిద్ధాంతం ఏమీ కానేరదు. సిద్ధాంత స్థాయికి తీసుకొనిపోయి దాన్ని గొప్ప చేయవలసిన అవసరమూ లేదు. అలా చేయటం సాహిత్యంలోని వస్తువుకు దాని తత్వానికి ప్రాధాన్యం యివ్వకపోవటమేఅవుతుంది. సాహిత్యప్రయోజనాన్ని దాని మళ్ళించటం అవుతుంది. అనుభూతి స్థాయిలో పాఠకున్ని కదిలించలేని రచనలు కళాత్మకతకను కోల్పోయినట్టివి అవుతాయి.

అయితే అనుభూతి అనేదే రచనకు పరమార్థం కాదు. ఆ అనుభూతి పాఠకుని సామాజిక సంవేదనను, చైతన్యాన్ని ప్రేరేపించేదిగ, ముందుకు కొనిపోయేదిగ వుండాలి. చైతన్యం క్రియాశీలం అయేందుకు దోహదము చేయగలిగితే ఆ అనుభూతికి సార్థకత. అనుభూతిద్వారా కళాప్రయోజనం ఆ విధంగా సాధింప బడుతుంది.

వ్యాపారమయమైన ఈ వ్యవస్థ సాహిత్యాన్ని కూడ వ్యాపార సాధనంగా మార్చుకుంది ఈనాడు. ముఖ్యంగా కథా సాహిత్యం ద్వారా వ్యాపారం చేసోంది. అందులో నవల పేరుతో మరీను. అయితే యీ నవలా ప్రక్రియ ద్వారా అభ్యుదయ రచయితలు ఈ వ్యవస్థ యొక్క వికృత స్వరూపాన్ని పాఠకులకు స్పష్టం చేసి, దాన్ని మార్చుకోవాల్సిన అవసరం వుందన్న చైతన్యాన్ని ఇవ్వటానికి ఆ ప్రక్రియను సద్వినియోగం చేసున్నారు. కాని సంఖ్యలో వినోద కాలక్షేప రచనలే ఎక్కువ వుత్పత్తి అవుతూ సాహిత్యం పట్ల పాఠకుల అభిరుచిని కాలక్షేపానికి దిగజార్చి వేసున్నారు. అంతే జరిగినా నష్టం ఎక్కువ లేకపోవచ్చు కాని, యువతీ యువకుల ఆవేశాల్ని బలహీనతల్ని ఆధారం చేసుకొని ఈ రకమైన సాహిత్యం వారిని పెడమార్గంలో పుత్తేజితుల్ని చేయటానికి, వాస్తవ జీవితం నుండి వేరుచేసి జీవిత వాస్తవికత పట్ల గ్రుడ్డివారిని చేయటానికి వుపయోగపడుతూంది. ఇది తీరని నష్టం. సామాజిక పరిజ్ఞానం కాని, చైతన్యంకాని, కళా దృష్టికాని లేని రచయితలు, సాహిత్యానికి వున్న సామాజిక బాధ్యతను ఎరుగని వాళ్ళు ఈ రకం సాహిత్యాన్ని సృష్టిసున్నారు. ఎన్నో వైరుధ్యాలతో సంఘర్షణలతో సంశ్లిష్టమైన నేటి సమాజ వాస్తవ స్వరూపం సామాన్య రచయితలకు అర్థమయేదీ కాదు.

ప్రస్తుత సామాజిక దశలో రచయితకూ విమర్శకునికీ సమగ్రమైన సామాజిక అవగాహన వుండటం చాల అవసరం. ఈ దోపిడీ వ్యవస్థలో సామాజిక విలువలన్నీ తారుమారైవున్న పరిస్థితి వుంది. వాటి అసలు స్వరూపాన్ని పట్టివేసి సరియైన దృక్పథంతో విలువల్ని నిరూపించటం, తప్పుడు చైతన్యాన్ని న్యూన పరచడం రచయిత యొక్క విమర్శకుని యొక్క బాధ్యత.

అనంతంగ పెరిగిపోతున్న ఈనాటి వ్యాపార సాహిత్యమే సాహిత్యం కాదని ఉత్తమ సాహిత్యం వేరేవుందనీ, దాని స్వభావం సామాజిక బాధ్యత కల్గి వుండటం అనీ నిరూపించటం మేధావులైన, విమర్శకుల రచయితల బాధ్యత. "రచయితలు ప్రజల గురించి ప్రజల కోసం రాస్తారు" అన్న ఇల్యా ఎహ్రెన్‌బర్గ్ మాటలు ["రచయితా-శిల్పమూ"] ప్రతి రచయితా విమర్శకుడూ గుర్తుంచుకోవలసిన మాటలు.

ఆధునిక సాహిత్య పరిశోధన - విద్యార్థుల సమస్యలు

పరిశోధనలో చేరే చాల మంది విద్యార్థులు మధ్య తరగతిలోని వాళ్ళు. ఉద్యోగాలు లభించక, ఖాళీగా ఇంట్లో కూర్చుంటే ఇంటిలోని వాళ్ళ ఎత్తిపొడుపు మాటలు భరించలేక, డాక్టరేట్ సంపాదిస్తే ఇంకేదో మంచి ఉద్యోగం దొరుకుతుందనే వెర్రి ఆశతో, ఆర్థిక సహాయం (Scholarships) లేక, అప్పులు చేస్తూ పరిశోధక విద్యార్థులుగా 'తెలుగు శాఖ'లో ఉంటున్నవాళ్ళు నూటికి తొంభై ఐదు శాతం పైగా ఉన్నారు. ఇలాంటి పరిస్థితి ఒక పక్క మనసులో తొలుస్తూ ఉన్నా "ఆధునిక సాహిత్యాన్ని" ఆకాంక్షించి అందులో 'సీరియస్'గా పరిశోధన చేయాలని సంకల్పించే విద్యార్థులకు విషయ నిర్ణయంలోనూ (selection of topic), పర్యవేక్షనికి ఉండే సంబంధంలోనూ, విషయ సేకరణలోనూ (Material-collection), పరిశోధక పద్ధతులను గురించిన అధ్యయనంలోనూ కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయి. కాని వాటికి పరిష్కార మార్గాలు కనుచూపు మేరలో లేవు.

ఎమ్.ఎ వరకు యూనివర్శిటీలో ప్రాచీన సాహిత్యం గురించి, ప్రాచీన విమర్శన పద్ధతుల్ని గురించి మాత్రమే బోధిస్తారు. ఆధునిక సాహిత్యం గురించి ఉండే కొద్దిపాట 'సిలబస్'ని ఒకటి, రెండు క్లాసుల్లో సంవత్సరాంతంలో అయిందనిపించేసి 'శెనగలు తిని చేతులు కడుక్కొనేవారు' లేకపోలేదు. ఇలాంటి పరిస్థితుల్లో కూడా ఆధునిక సాహిత్యం గురించి, ఆధునిక విమర్శన పద్ధతుల్ని గురించి బయటవ్యక్తుల పరిచయంతోనూ పాఠ్యేతర పుస్తకాల్ని చదవటంద్వారానూ ఊహించిన విద్యార్థులు దానిలో అభిరుచిని పొందుతున్నారు. జీవితాన్ని గురించి విమర్శించే స్థాయిలో వారు ఉన్నా లేకపోయినా జీవితానికి ఇది మంచి చేస్తుంది అని నమ్మి ఆధునిక సాహిత్యములో పరిశోధన చేస్తున్నారు. ('ఇక్కడ ఆధునిక సాహిత్యం అంటే 'సమకాలీన సాహిత్యం' అని అర్థంకాదు). ఇలాంటి వారికి ఈ రకం సాహిత్యం గురించిన 'ఆకర్షణ' ఉన్నంతగా 'అవగాహన' ఉండే అవకాశం చాల తక్కువ. కాబట్టి 'విషయ నిర్ణయం'లోనే తమ స్థాయికి

శ్రీ టి. జి. ఆర్. ప్రసాద్
(వెంకటేశ్వర విశ్వ విద్యాలయం)

మించిన అంశాన్ని ఎన్నుకొని అభాసు పాలు అవుతున్నారు.

చాలా మంది పర్యవేక్షకులకు ప్రాచీన సాహిత్యంలో ఉండే పరిచయం ఆధునిక సాహిత్యంలో లేకపోవటం వల్ల వారి సహకారం పరిశోధక విద్యార్థికి మృగ్యం. భాషా పరిశోధనలో నిష్ణాతులైన వారు పర్యవేక్షకులుగా ఉంటున్నా, ఇదే సమస్య ఉత్పన్నమౌతున్నది.

అకాడమీలుగాని, యూనివర్సిటీలుగాని అభ్యుదయ సాహిత్యానికి సంబంధించి ప్రచురించిన పుస్తకాలు ఎన్ని ఉన్నాయో ఎవరైనా గణాంక వివరాలు సంపాదిస్తే వాటి అసలు స్వరూపం బయట పడిపోతుంది. ఈ విషయంలో వామపక్ష ఉద్యమ సంస్థలు చేసిన కృషి కూడా చాలా శోచనీయ స్థితిలో ఉంది. కందుకూరి, గురజాడ తర్వాత యుగకర్త అన్పించుకోదగిన కొడవటిగంటి కుటుంబరావుగారి అభ్యుదయం సాహిత్యం మీద వచ్చిన విమర్శలు ఎన్ని? పట్టుమని పది లేవు. అభ్యుదయ సాహిత్యంమీద వచ్చిన వ్యాసాలు సంకలన రూపాలుగా లభిస్తున్నాయా? 'తెలుగు నవల'ను గురించి అ.ర.సం ఖమ్మంలో సదస్సు నిర్వహించక ముందు ఐదారు సీరియస్ వ్యాసాలు ఏవి?

యూనివర్సిటీలో 'Methodology' పేరుతో టైటిల్ పేజి ఎలా రాయాలి? కృతజ్ఞతలు ఎలా? ఎవరికి? వ్యక్త పరచాలి? విషయ విభజన, అధోజ్ఞాపికలు, ఉటంకింపులు, సింహావలోకనం, ఉపయుక్త వ్యాస, గ్రంథసూచిక మొదలైన విషయాలు బోధిస్తున్నారు మంచిదే. సిద్ధాంత రచనా ప్రణాళిక, వ్యాసరూప నిర్మాణానికి ఈ బోధన ఉపకరిస్తుంది. వ్యాసరచనలో పాటించవలసిన మెలకువలు, ఉండవలసిన చిత్తశుద్ధిని పరిశోధక విద్యార్థి గ్రహించే అవకాశం లేకపోలేదు అయితే పరిశోధక వ్యాసాన్ని ఒక తాత్త్విక దృక్పథం నుంచి ఎలా పరిశీలించాలి అనే బోధన లేకపోవటంవల్ల తెలుగు పరిశోధనలో 'దృక్పథ రాహిత్యం' కొట్టవచ్చినట్లు కన్పిస్తోంది. అంతే కాదు పులుముడుతో నిండిన చర్వితచర్వణాలు కన్పించి పరిశోధనఅంటే 'హంబగ్'అనేపరిస్థితిని కల్పిస్తున్నాయి. సిద్ధాంత వ్యాసాలలో ఆధునిక తాత్త్విక పునాది లేకపోవటమే దీనికి కారణం.

మార్కుల కోసం, డిగ్రీ కోసం రాసే విద్యార్థి తన సిద్ధాంత వ్యాసాన్ని పర్యవేక్షించే పర్యవేక్షకుణ్ని, పరీక్షించే పరీక్షకుల్ని దృష్టిలో ఉంచుకోక తప్పదు.

ఇలాంటి పరిమితులు ఇన్ని ఉన్నప్పుడు ఒక్క విద్యార్థియే 'థీసిస్'అంటే 'తీసితీసి రాయటం' అనే నిందకు ఎలా బాధ్యుడవుతాడు?

విమర్శ కావ్యాలు

1. 'విమర్శ' అనేమాట భిన్నార్థాల్లో వాడుకలో ఉన్నా, సాహితీ లోకంలో మాత్రం 'నింద, దూషణ, తిట్టు' మొదలైన అర్థ న్యూనతలతోనే వ్యవహృతమవుతున్నది. 'నేనది విమర్శగా చూడలేదు, కొంత విమర్శగా ఆలోచించి చెప్పు' మొదలైన వాక్యాల్లో విమర్శ అంటే 'సమ్యగ్దృష్టి, పూర్తి పరిశీలన, గుణదోష విచారం', అనే అర్థం. అయితే సాహితీ ప్రక్రియల్లో 'సమీక్ష' 'పరిశీలన' '(గ్రంథ)పరిచయం'వంటివి చాలావరకు పొగడ్తలతోనూ 'విమర్శ, వివేచన, పరామర్శ'వంటివి తెగడ్తలతోనూ నిండివున్నాయి. నిజానికి 'ఆలోచనాపూర్వకమైన చర్చ'కే విమర్శన అని పేరు. అందులో వ్యక్తి భూషణ దూషణలకన్నా, అభిరుచి ప్రస్తావన కన్నా, విషయనిష్ఠమైన గుణదోషపరీక్షకే స్థానము డాలి పూర్వం కాళిదాసును కూడా సందర్భాన్ని పురస్కరించుకొని తీవ్రభాషలో నిందించినవారున్నారు. కాని, వారిది తప్పు మార్గమని అన్నవారు లేరు. మమ్మటుకు కుమారసంభవంలో మితిమీరి పార్వతీ పరమేశ్వరుల సంభోగాది వర్ణన చేసినందుకు ధ్వన్యాలోకం క్షమించకపోగా అసహ్యించుకుంది, "పిత్రోః స్సంభోగ వర్ణన మివ సుతరాం అసహ్యమ్" అనే మాటల్లో. ఈ మాటల వల్ల కాళిదాసు క్షుద్రకవి అని ధ్వన్యాలోకం భావించిందని ఎవరూ అనలేదు—అనుకోలేదు. కాళిదాస భక్తశ్రేష్ఠులు కూడా కోపించలేదు; విషయం, సందర్భం అలా ఉన్నాయి కాబట్టి. కానీ ఈనాడు కవి, రచయిత 'పొరబడ్డారు' అంటేనే అన్నవాడికి సహృదయత్వం లేదని. ఈర్ష్యాసూయలతో కుతకుతలాడుతున్నాడని, కావ్య శాస్త్ర రసాస్వాదన శక్తిశూన్యుడని విరుచుకపడుతున్నారు. మరోవైపు అభిరుచిప్రధానంగా నచ్చిన రచయితనూ రచననూ ఆకాశాని కెత్తుతున్నారు. విషయనిష్ఠం కావలసిన విమర్శ వ్యక్తినిష్ఠమైన, నచ్చినవారు మహనీయులై, నచ్చనివారు పరమ దుర్మార్గులై హేళనా పాత్రులవుతున్న ధోరణి ప్రబలుతున్నది. కవి, రచయిత కాలం, స్వభావం, ఆ వ్యక్తి జీవించిన సమాజం, దాని లక్షణాలు, ఆ వ్యక్తి నమ్మిన సిద్ధాంతాలు, వాటిని ఆచరించిన, ప్రతిబింబించిన పద్ధతి, ఇతర కవులతో, రచయితలతో పోల్చినప్పుడు ఆ వ్యక్తి ప్రత్యేకత, ఆ కావ్యం, రచన స్థాయి, సాహిత్యంలో కవి కావ్యాలకున్న స్థానం వంటివి పరిశీలించ దలచినవారు తమదంటూ ఒక నియత విశ్వాసం, దృక్పథం లేకుండా, నియమిత పద్ధతి లేకుండా చర్చించటం ఒక ధోరణిగా ఉంటే, తమ దృష్టికి, విశ్వాసానికీ అనుగుణంగా అనుకూలంగా ఉందో లేదో పరీక్షించి తమ 'నిబద్ధత'కు సరిపోని

బూదరాజు రాధాకృష్ణ

రచయితను, రచనను క్షుద్ర వస్తువులుగా పరిగణించే దృక్పథం వరొకటి ఉంది ఈ చర్చల్లో సంయమం తక్కువ. అది మంచిది కాదు.

2. తెలుగులో గాని, మొత్తంమీద ఇతర భాషల్లోగాని విమర్శ ఎక్కువగా వచనంలోనే జరిగింది, జరుగుతున్నది. విమర్శ సాంఘిక రాజకీయ తత్వశాస్త్రాదులైన అనేక విషయాలకు సంబంధించింది కావచ్చు. ఈ వ్యాసంలో సాహితీ విమర్శ (కవికావ్యాది విమర్శ) చర్చనీయంకాదు. సాహిత్యంలో విమర్శ ప్రధాన కావ్యా లున్నాయి. ఆ విమర్శ మానవ సమాజానికి సంబంధించిన ఏ వి ష యా ని కి సందర్భించినా, ఆ విమర్శ ఉన్న గ్రంథం 'కావ్య' మైతేనే ఇక్కడ దాన్ని చర్చనీయంగా పరిగణిస్తాం. రచనా శిల్పం, పదసంఘటన, మొదలైన లక్షణాలను బట్టి ఒక గ్రంథం కావ్యమో కాదో తేల్చుకోవటం సులభం. ఎక్కడైనా ఒక రచన అది కావ్యమా శుద్ధతార్కిక రచనా అనే సంశయం కలిగించవచ్చు. అటువంటి వాటిని ఈ వ్యాసంలో వివేచించటంలేదు. విమర్శ కావ్యం పద్యాత్మకమా, గేయాత్మకమా కేవల వచనంలో ఉందా అనేది ప్రధానంకాదు. అది కేవలం రూపానికి (Form) సంబంధించిన ప్రశ్న. విషయానికి [Content] సంబంధించి విమర్శ కావ్య మనదగిన ఏరచనైనా ఇక్కడ పరిశీలించదగ్గదే. కావ్య రూపంలోగాని, కావ్య గుణాలతో, లక్షణాలతో గానిఉన్న ఏరచనైనా విమర్శ కావ్యమని పరిగణిద్దాం. అప్పుడుగూడా వాటిలో ద్వైవిధ్యం [Dichotomy] కనిపిస్తుంది. అనేకాంధ్ర కావ్యాల్లో కవి సాహిత్య విషయాల్లో తన దృక్పథమేమో వివరించాడు. నన్నె చోడాదులు ఈ కోవకు చెందినవాళ్ళు కొందరు ఇలా కావ్యపీఠికల్లోగాకకావ్యంలోనే సందర్భపడ్డప్పుడు కవితాలక్షణాదులను చర్చించారు. పింగళి సూరన కళా పూర్ణోదయంలో ఈ మార్గం అవలంబించాడు. కవి తన గురించి, కావ్య లక్షణాలను గురించి ఆయా కవులూ రచయితలూ చేసినవిమర్శలను కూడా ఇక్కడ పరీక్షించటం లేదు. కొందరు కవులు ఆయా సందర్భాల్లో కొన్ని కొన్ని సాహిత్యేతర విషయాల మీద తాముగానో తమ పాత్రల ద్వారానో విమర్శలు చొప్పించారు. ఉదాహరణకు పోతన భోగినీ దండకంలో 'రాజుల్ బహువ్యాజులే భోజులే చంచలచ్చిత్తులే మత్తులే' ఇత్యాదిగా రాజదూషణ వేశ్యామాత ద్వారా చేయించాడు. అలాగే పెద్దన మను చరిత్రలో 'గోవధము చేసిన తురకల దైవంబవు' అని చంద్రదూషణ చేయించాడు. ఈ సందర్భాలన్నీ ప్రాస్తావికాలు; వాటిలో విమర్శ ప్రధానం కాదు. పాత్రోచితమైనా కాకపోయినా కేవలం ప్రాస్తావికంగా ఔపచారికంగా కవి తన మనోభావాలను విమర్శనాత్మకంగా ప్రదర్శించాడు. ఇటువంటి గ్రంథాలను విమర్శ కావ్యాలని పరిగణించటం తగదు విమర్శా దృష్టితో అదే ప్రధాన విషయంగా రాసిన, కావ్యగుణాలున్న రచనలు మాత్రమే ఈ వ్యాసంలో చర్చకు వస్తాయి.

3. విమర్శకావ్యాలను స్థూలంగాసామాజిక రాజకీయ విమర్శలని విభజించవచ్చు. కులమత వ్యవస్థలనూ వాటి లోపాలనూ విమర్శించినవి మొదటి రకానివి. ఒక్క తెలుగు సాహిత్యంలోనే గాక ప్రపంచ సాహిత్యం మొత్తంలోనే ఇటువంటి విమర్శ కావ్యాలు ప్రాచీనాలు. అనేక రాజకీయ సిద్ధాంతాలు వ్యాప్తిలోకివచ్చిన తరవాతనే రాజకీయ విమర్శ కావ్యాలు ఎక్కడైనా బయలుదేరాయి. ఇవి అర్వాచీనాలు. మొదటిరకం రచనల్లో అక్కడక్కడ సమాజ 'పరిపాలన'కు, రాజ్య వ్యవస్థకూ సంబంధించిన విమర్శలు లేకపోలేదు. అయితే అవి 'రాజకీయ దృష్టి' తో చేసిన విమర్శలు కావు: సామాజిక పరిస్థితుల్లో భాగంగా విమర్శనీయమైన విషయాలకే అవి పరిమితం. ఇప్పుడు 'రాజకీయాలు' అని మనం భావిస్తున్న విషయాలకు అప్పటి కవుల దృష్టిలో అస్తిత్వం లేదు. ఆధునిక మానవ సమాజంలో పారిశ్రామిక విప్లవం తరవాత అనేక రంగాల్లో వచ్చిన 'రాజకీయదృష్టి' అంతకు పూర్వమున్న వాళ్ళకు ఉందనటం అంత సమంజసం కాదు. వాళ్ళకు 'రాజనీతి' దృష్టి ఉంది. 'రాజకీయ' దృష్టి లేదు. ఇప్పటి విమర్శ కావ్యాల్లో 'సంఘ నీతి'ని కూడా విమర్శిస్తున్నారు. కాని అప్పటి సామాజిక విమర్శనల్లో ఇప్పటి రాజకీయ దృక్పథాలూ లేవు. విమర్శలూ లేవు. ఈ రెండు రకాల రచనలూ విమర్శ కావ్యాలే. వీటిలో కొన్ని వైయక్తికాలు, వ్యక్తిగతాలు. కవికి వ్యక్తిగతంగా కలిగిన కోపతాపాలను పురస్కరించుకొని మరో వ్యక్తిని దూషిస్తూ రాసిన నిందా కావ్యాలవి. ఉదాహరణకు కూచిమంచి జగ్గకవి చంద్ర రేఖా విలాపం అటువంటిది. వాటి ప్రయోజనం పరిమితం. అవి ఇక్కడ పరిగణనీయాలు కావు. రచనా "పద్ధతి" లో కందుకూరి వీరేశలింగం రాసిన అభాగ్యోపాఖ్యానానికి దీనితోచాలాపోలికలున్నవి — భాషలో తప్ప. కానీ రచనా "ప్రయోజనం"లో కందుకూరి వారి పుస్తకం గణనీయం, దృష్టి భేదం వల్ల, మొదటి వ్యక్తి వ్యక్తిగతంగా తాను సాధించ దలచింది, తనను మోసగించిన రాజును దూషించటం. అందుకు ఆయన చేపట్టిన సాహితీ ప్రక్రియ 'ప్రబంధం' —అప్పట్లో ఆ ప్రక్రియకు గౌరవం ఉండేది. ఆ కవి 'బహువిఘ్నంబులు సంఘటిల్లిన, మదిన్ భాషాభిమానంబు దుస్సహరీతిన్ పురికొల్పెగావున, ప్రతిజ్ఞాపూర్తి యయ్యెన్' అని చెప్పుకున్నా అతని కావ్యప్రయోజనం ప్రభు[వ్యక్తి] దూషణమేగాని భాషా సంరక్షణ కాదు. వీరేశలింగం ప్రబంధ ధోరణికి ప్రబల విరోధి ఆలోచనాధోరణిని అధిక్షేపించటానికే ఆయన ఈ గ్రంథం రాశా . ఆయన విరోధం 'వ్యక్తి'తో కాదు: 'వ్యష్టి' తోనూ కాదు. 'సమష్టి'తో. ఆయన రచనా ప్రయోజనంభాషా'సంస్కరణ', సాహితీ 'సంస్కరణ'. అందువల్ల ఆ రెండు గ్రంథాలనూ ఒకే స్థాయికి, వర్గానికి చెందిన వనటం భావ్యంకాదు. ఈ విమర్శ కావ్యాల్లో కొన్ని కాకువక్రోక్తుల ద్వారా, అన్యోక్తి పరిహాసాల ద్వారా కవి 'వ్యంగ్యం'గా విమర్శన చేసిన వున్నాయి. కొన్నిటిలో 'వాచ్యం'గానే

విమర్శన సాగింది. మొత్తంమీద చూస్తే 'వ్యంగ్య' విమర్శ కావ్యాల్లో చాలా వరకు సామాజిక విమర్శలు. 'వాచ్య' విమర్శలు చాలా వరకు రాజకీయ విమర్శలు. సామాజిక పరిణామంలో వచ్చిన పెద్ద మార్పుకు, ఆధునిక ప్రపంచంలో వ్యక్తి భద్రతకు దారితీసిన రాజకీయ పరిస్థితులకు ఈ పద్ధతులు ప్రతికలనవచ్చు. భూస్వామ్య వ్యవస్థ బలవత్తరంగా ఉన్నప్పటి కవి పరిస్థితికీ,అది బలహీనపడిన తరవాతి కవి పరిస్థితికీ ఈ ధోరణులే ప్రత్యక్ష నిదర్శనాలు.

4. విమర్శ కావ్యాలు అనేక ప్రక్రియల్లో కనిపిస్తాయి. అంటే వాటిని నిరూపించటానికి 'రూపం' ప్రధాన లక్షణం కాదు. ఒక్క తెలుగు సాహిత్యంలోనే రూపక భేదమైన 'వీధి' నాటకం క్రీడాభిరామం, ఆధునికకాలంలో కన్యాశుల్కం ప్రథమోదాహరణలు. శతకం, ప్రబంధం, ముక్తకం /చాటు పద్యం, గేయం, ఖండ కావ్యం, నవల [చిలకమర్తివారిగణపతి] పురాణం[ఉదాహరణకు 'సూత పురాణం'], పేరడీ మహాకావ్యం [మచ్చుకు తిరుపతి వేంకట కవుల 'గిరతం'], వచన కవిత, ప్రహసనం వంటి అనేక ప్రక్రియా భేదాల్లో విమర్శ కావ్యా లున్నాయి. ఇంగ్లీషులో లాగా 'nonsense poetry, sonnets, limericks' తెలుగులో చెప్పుకోదగిన సంఖ్యలో నేటికీ వెలువడలేదు. Jonathan swift రాసిన 'Laputa, Houyhnmland,' Thomas More రాసిన 'Utopia Aldous Huxley రాసిన 'Brave New World' లాగా తత్కాల శాస్త్రజ్ఞులను వెక్కిరించే మహా గ్రంథాలు తెలుగులో అసలే వెలువడలేదు. సంస్కృతంలోని 'అన్యోక్తి తరంగిణి' వంటి అన్యాపదేశ కావ్యాలు కూడా తెలుగులో పెద్ద సంఖ్యలో, ఉన్నత ప్రమాణాలతో రాసిన వాళ్ళు లేరు. తెలుగులో ఉన్న విమర్శ కావ్యాలన్నిటిని గురించి స్థూలంగా పరిశీలించదలచినా ఇటీవలి కాలంలో వచ్చిన కొన్ని విచిత్ర ధోరణులను చర్చించిగాని వ్యాసోద్దేశంలోకి పోవటం వీలుకాదు. కొందరి దృక్పథం ప్రకారం ఇరవయ్యో శతాబ్దంలో - అందులోనూ చివరిరోజుల్లో - రచనా వ్యాసంగంగాని విమర్శనోద్దేశం గాని ఎవరికైనా వృత్తిగానో అభిరుచిగానో ఉంటే ఈ శతాబ్దానికిపూర్వమున్న సాహిత్యాన్ని తలచుకోవలసిన పనికూడా లేదు. అభ్యుదయ రచయితల సంఘాన్ని పునర్వ్యవస్థీకరించ దలచినప్పుడు రెండేళ్ళ కిందట కీ. శే. అని పెట్టి ప్రభృతులు వీరేశలింగంగారికి ముందున్న తెలుగు సాహిత్యంతో మనకు ప్రమేయం వద్దన్నారు. నాలుగైదు సంవత్సరాల క్రితం పూర్వ సాహిత్యమంతా ఫ్యూడల్ సాహిత్యం కాబట్టి పనికిరాదని వరంగల్ నడివీధుల్లో పోతన భాగవతం కూడా కొందరు తగల బెట్టారు. కవిసేన వంటివారు పూర్వ సాహిత్యమంతా మేమే పుక్కిట బట్టాం కాబట్టి దాని విషయం ప్రస్తావించే యోగ్యత మరెవ్వరికీ లేదన్నారు. పై అభిప్రాయాలతో ఈ వ్యాసకర్త ఏకీభవించలేదు. గతంలో మనకు సాహిత్య ముంది. దాని గుణదోషాలు దాని కున్నాయి. వర్తమాన

సాహిత్యం అంతా గుణవంతమనిమటుకు చెప్పగలమా? దోషాలు వర్జించి దాని లోని గుణాలను గ్రహించటంలో తప్పు లేదు సరిగదా ఎంతో మేలు కూడా జరుగుతుంది. కనీసం చేసిన తప్పులను మరోసారి చేయకుండానైనా ఉండవచ్చు. గతంలేని వర్తమానం, వర్తమానంలేని భవిష్యత్తూ అనూహ్యాలు. సాహిత్య దహనం ఎవరు చేసినా అది ఫాసిస్టు చర్యే. ఇది కూడా మనకు కొత్తకాదు. జైన బౌద్ధ సాహిత్యాలు హిందువులు దగ్ధం చేశారు. ఆనాటి ఆ దుశ్చర్య ఫలితమే 'అటు నుంచి నరుక్కురా' మన్నట్లు స్థితి. శైవ వైష్ణవ విద్వేషాలు మరి కొంత విధ్వంసం సాధించాయి. నాత్సీలు అనేక సాహిత్యాలు దగ్ధం చేశారు. వారు చేస్తే నేరమైనది మనం చేస్తే న్యాయ మవుతుందా? ఈ దహనకాండవల్ల ఎంతో సాహిత్యం అంతరించినందు వల్లనే తెలుగువారి సాంఘిక చరిత్ర రాయాలంటే ముడిసరుకు దొరకటం లేదని సురవరం ప్రతాపరెడ్డి క్షోభించ వలసి వచ్చింది. మనకు నచ్చని వాటిని మరిచిపోవచ్చు గాని మంటబెట్టటం ధర్మంకాదు. అందువల్ల ప్రాచ్యపాశ్చాత్య విభేదంతోగాని, ప్రాచీనార్వాచీన విచక్షణతోగాని నిమిత్తం లేకుండా తెలుగు విమర్శ కావ్యాలను మన సామాజిక రాజకీయాది పరిస్థితుల దృష్ట్యాను, ప్రపంచ సాహిత్యంతో పోల్చి చూడటం ద్వారాను పరిశీలించటం మంచిది.

5. విమర్శ సుకుమారంగా చేసిన కావ్యాలన్నీ హాస్యరస ప్రధానాలు. చమత్కారం, పరిహాసం, హేళన, అవహేళన, ఆక్షేపం, అధిక్షేపం, వక్రోక్తి, కాకువు, వెక్కిరింత, వేళాకోళం వంటి రకరకాల పేర్లతో ఈ కావ్యాల్లోని రచనలను వర్ణించవచ్చు. ప్రాచీన భారతీయులు శృంగారాని కిచ్చిన ప్రాముఖ్యం ఇతర రసాల కివ్వలేదు. కొద్దిమంది తద్భిన్న రసపోషణ ప్రధానంగా చేయలేదని కాదు. అటువంటివి అల్పసంఖ్యాక కావ్యాలని ఉద్దేశం అందువల్లనే సంస్కృతరూపకాల్లో శృంగారాత్మక పరిహాసమైన 'నర్మ'కు ప్రాముఖ్యం కనిపిస్తుంది. విమర్శక స్థానంలో ఉండదగిన విదూషక పాత్రకు న్యాయం చేసిన కవుల సంఖ్య అల్పాల్పం. 'కడంగరీయ స్బ్రహ్మచారి, భోజన ప్రియుడు, (నాయికా నాయకుల మధ్య) దూత'వంటి అల్పిష్టత మాత్రమే ఆ పాత్రకు లభ్యమయింది. ఈ వ్యాసకర్త ఎరుకలో భాసుడి 'అవిమారకం'లో మాత్రమే విదూషక లక్షణం మరో విధంగా కనిపిస్తుంది. అవిమారకుడు విదూషకుణ్ని స్మరించి 'గోష్ఠీషు హాస్యః, సమరేషు యోధః, శోకే గురుః, సాహసికః పరేషు, మహోత్సవే మే హృది కిం ప్రలాపైః ద్విధావిభక్తం ఖలు మే శరీరమ్' అంటాడు. విదూషకుడు వీరుడని, విజ్ఞానవంతుడని, సాహసవంతుడని అన్న కవి మరొకడు కన్పించడు. జగ్గకవి వంటివారు సృష్టించిన సంకరశర్మ వంటి విదూషకులు అసభ్యతకు, అశ్లీలానికి ప్రతీకలే గాని ఉదారపాత్రలు కాదు. ఆనాటి సామాజిక జీవనంలో కూడా విమర్శకుడికీ, విదూషకుడికీ పెద్ద గౌరవ మున్నట్లు కని

పించదు. పాశ్చాత్య సాహిత్యంలోనూ అంతే చాలావరకు. ప్రాచీన రోమన్లు 'festival of Saturnalia' అనే ఉత్సవం జరుపుకొనేవాళ్ళు. మధ్య యుగాల యూరపియన్లు 'Feast of Fools' జరిపేవాళ్ళు. ఆస్ట్రియాలో బహిరంగ విమర్శల కోసం 'Fasching' వంటి వేడుకలు జరిగేవి. వీటన్నిటికీ తలమానికం ఆఫ్రికాలోని 'అషాంతి' దేశ ప్రజలు ప్రతి శుక్రవారమూ ఈనాటికీ జరుపుతున్న అధిక్షేపోత్సవం. ఆ రోజున ప్రజలందరూ వాళ్ళ 'రాజు'నూ, అతని దుష్కార్యాలనూ శిక్షా భయం లేకుండా విమర్శించవచ్చు. ఇటు వంటి ఏర్పాటు మన సమాజంలో ఉన్నట్లు ఈ వ్యాసకర్తకు తెలియదు. నైట్ క్లబ్బుల్లో రహస్యంగా రాజకీయ విమర్శలు జరపటం నేటికీ పాశ్చాత్య దేశాల్లో ఆచారం. ప్రాచీన రోమన్ సాహిత్యంలో ఇద్దరు మహాకవులు భిన్న పద్ధతుల్లో విమర్శ కావ్యాలు రాశారు. Horace రచనలు హాస్యమయంగా ఉండేవని (Comical), Juvenal రచనలు విషాదమయంగా (Tragical) ఉండేవని Dryden వివరిస్తాడు అధిక్షేప రచయితలను 'Satyricus' అనే పేరుతో క్రీస్తుశకం నాలుగో శతాబ్ది నుంచీ పిలుస్తుండేవారు. నిర్మాణదృష్టితో చూస్తే విమర్శ కావ్యాల్లో ప్రధానంగా రెండు భాగాలున్నాయి. మొదటిది 'thesis' భాగం. విమర్శించవలసిన వస్తువు ఈభాగం. రెండోది 'anti-thesis'. విమర్శిత వస్తువుకు వ్యతిరేక లక్షణం కలది. రచయిత దీన్ని గౌరవిస్తాడు. ఈ పద్ధతి మంచిదని సూచిస్తాడు. అయితే ఈ భాగాలు రెంటికీ అన్ని రచనల్లోనూ సమప్రాధాన్యం లేకపోవచ్చు. పద్య రూపంలో ఉన్న అనేక విమర్శకావ్యాల్లో ఒక నిర్మాణ క్రమం/పద్ధతి (frame) కనిపిస్తుంది. భిన్నధర్మాల / లక్షణాల సంఘర్షణలో రచయిత / రచనలోని ప్రముఖపాత్ర ఒక పక్షం వహిస్తే ప్రతి నాయకపాత్ర మరో పక్షం. ఈ ప్రతి నాయకుడు వ్యక్తే కానక్కరలేదు. ఒక అభిప్రాయానికి ప్రతినిధిగా ఒక లక్షణాన్నో వస్తువునో ఆ స్థానంలో ఉంచ వచ్చు. విమర్శకావ్య ప్రయోజనం దుర్మార్గాన్ని, దురంతాలను, దుష్కార్యాలను, దుర్జనత్వాన్ని ప్రతిఘటించటం. ఆ ప్రతిఘటన వెక్కిరింత కావచ్చు, దూషణ కావచ్చు. 'వెకిలి'గా చేసిన వారున్నారు; 'ఉదాత్తం'గా చేసిన వారున్నారు. కొందరు 'వాచ్య' కవులు, కొందరు 'వ్యంగ్య' కవులు ఆయా విషయాల్లోని అసంగతత్వం (incongruity), అసంపూర్ణత (imperfection), గ్రామ్యత (Vulgarity), అ ధః క ర ణ [degradation], దౌర్బల్యం [weakness] వంటి వాటిని అ ను క ర ణ ద్వా రా [mimesis], రూపాంతరీకరణ ద్వారా [transposition or transformation], హఠాత్సంభవత్వం ద్వారా [instantaniety], ఇ త ర మార్గాలద్వారా ఆక్షేపించవచ్చు, అధిక్షేపించ వచ్చు. విమర్శ ఏ రూపంలోనైనా ఏ పద్ధతిలోనైనా సాగవచ్చు.

6. విమర్శ కావ్యాలు బయలుదేర

టానికి ప్రధాన కారణం సామాజిక [రాజకీయ] పరిస్థితులు. కొన్ని సమయాల్లో వ్యక్తిగత కారణాలుండవచ్చు. సమాజంలోని వ్యష్టిని గాని సమష్టిని గాని బాధించే సంఘటనలు సంభవించినప్పుడు అనుకూల వాతావరణంలో ఆ సంఘటనలకు కారకులైనవారి మీద కొందరు [బహిరంగంగా] ఎదురు తిరిగితే మరికొందరు అన్యాపదేశంగా పరోక్షంగా మాటలు విసిరి సరిపెట్టుకోవచ్చు. ఒక సంఘటననుగాని, సమాజం మీద దానికున్న ప్రభావాన్ని గాని, దానికి ప్రతికూల వైఖరి సృష్టించటానికి/కల్పించుకోటానికి గాని ఆయా వ్యక్తులు తమతమ శక్తియుక్తుల మీద, అవగాహన మీద, తమ చుట్టూ ఉన్న పరిస్థితుల మీద ఆధారపడి తమతమ మార్గాలు నిర్ణయించుకుంటారు. మాట వరసకు మధ్యయుగాల్లో మత వైరుధ్యం కారణంగా దేవాలయ విధ్వంసం జరిగింది. కొందరు శారీరకంగా ఎదురుతిరిగి ఎదుర్కొంటే, మరికొందరు 'అంతా మన ఖర్మ' అని సరిపెట్టుకొంటే, కొంతమంది ఆ సంఘటన జరిగిన ప్రాంతం నుంచి పారిపోతే, మరి కొంత మంది విధ్వంసకులకే తోడ్పడి లాభాలు పొందితే, కొందరు వెక్కిరిస్తే, కొందరు దూషిస్తే, కొందరు విచారిస్తే రకరకాల పరిణామాలు జరిగాయి. భాషారూపంలో విమర్శించినవారు కూడా ఒకే తీరున ప్రవర్తించలేరు. పలాయనవాదులూ, భావవాదులూ, కర్మవాదులూ, మరికొన్ని వాదాలవారూ ఉంటారు-ఉన్నారు. కొందరు సమస్యలకు పరిష్కారం ఆలోచిస్తుంటే, మరి కొందరు వాటిని మరచిపోయే ప్రయత్నం చేస్తారు. ఇటువంటి భిన్న ధోరణులన్నీ విమర్శకావ్యాల్లోనూ కనిపిస్తాయి. భిన్న వ్యక్తుల దృష్టి వైవిధ్యం రచనా వైవిధ్యానికి దారి తీస్తుంది. తెలుగులో గాని, ఇతర భాషల్లో గాని విమర్శ కావ్యాల అవతరణ ఆయా సమయాల్లో జరిగిన సామాజిక సంక్షోభాల ఫలితంగానే. ఒక్కొక్క కావ్యాన్నే సూక్ష్మంగా పరిశీలించినప్పుడు గత చరిత్రలో ఎప్పుడే విధమైన సంక్షోభం ఎక్కడ ఎంత తీవ్రంగా పర్యాప్తంగా జరిగిందో గుర్తించవచ్చు. అందువల్ల ఇతర సాహితీ రూపాలతో పోల్చినప్పుడు విమర్శ కావ్యాలు సమాజ చరిత్రను, సంక్షోభ చరిత్రను పునర్నిర్మించటానికి ఎంతో తోడ్పడతాయని గుర్తించాలి. అది పెద్ద ప్రయోజనం. అలనాటి విమర్శ కావ్య రచయితలకు చారిత్రక దృష్టిగాని, చరిత్ర దృష్టిగానీ, లేకపోయినా ఈనాడు మనం ప్రయత్నపూర్వకంగా అప్పటి చారిత్రక పరిస్థితులను గుర్తించవచ్చు, గ్రహించవచ్చు.

7. విమర్శకావ్యం రచించాలనే అభిప్రాయం కవికి లేకపోయినా కావలసినంత సంఘ విమర్శ క్రీడాభిరామంలోనే తొలిసారిగా కనిపిస్తుంది. అయితే అశ్లీలం, అసభ్యం అని మన ప్రస్తుత సమాజం ఏవగించుకొనే భాషాప్రయోగం కూడా అందులో కావలసినంత ఉంది. వాటి 'అక్కలవాడ'లకూ పూటకూటిళ్ళకూ నేటి లాడ్జీలకూ, వాటిలో దిగే "పాసెంజర్ల"కూ చాలా పోలికలున్నాయని ఆ గ్రంథమే సాక్ష్యమిస్తుంది. ఇలా అనేకం. శ్రీనాథ చాటు

వుల్లో అప్పటి గ్రామాధికారుల దౌర్జన్యాదుల మీద విమర్శ లేకపోలేదు. 'ఊరు వ్యాఘ్రనగర మురగంబు కరణంబు, కాపు కపివరుండు కసవు నేడు, గుంపు గాగ నిచట గుర్రజాల సీమలో, నోగు లెల్లగూడి రొక్కచోట' అని పులిపాడు కరణం శేషయ్యను, కాపు హనుమయ్యను, రెడ్డి పుల్లయ్యను శ్రీనాథు డాక్షేపించాడు. ఇలాంటివి చాలా ఉన్నాయి. తరవాతి కాలంలోని అనేక చాటువు లిదేవిధంగా అప్పటప్పటి వ్యక్తులను మొఖానే తిట్టి, (పది పైసలిస్తే చివరిభాగం మార్చి పొగిడి) చెప్పినవి దొరుకుతున్నాయి. మచ్చుకు తిమ్మరసు బండారం బయటపెట్టా 'గుత్తిన్ పుల్లెలు మోసి, చంద్రగిరిలో కూడెత్తి, పెన్గొండలో హత్తిన్ సత్రము నందువేడి, బలు దుర్గాధీశు తాంబూలపుం దితుల్ మోసి పదస్థులైన ఘనులన్ దీవింప' నంటూనే, 'దీవించెదన్ మతారాతి యయాతి నాగమసుతున్ మంత్రీశ్వరున్ తిమ్మరున్' అని పొగిడి పదవులు సంపాదించిన పెద్దల అసలు రహస్యం చెప్పాడు బట్టు కవి. ఇప్పుడు మాత్రం ఈలాటివాళ్ళు లేరా? వేమన నీతుల వంటివి విమర్శకావ్యం కాదనవచ్చు కొందరు — విమర్శైక దృష్టి లేదని వాదించి ఆచార వ్యవహారాల్లో, కులమత పద్ధతుల్లో, తాత్విక చింతనల్లో ఉన్న లోపాలను విమర్శిస్తూ వాటిలో నుంచే శాశ్వత సత్యాలు ప్రతిపాదించిన వేమన విమర్శకవి శిఖామణి.—'పాల సాగరమున పవ్వళించిన హరి, గొల్లపల్లె పాలు కోరనేల? ఎదుటివారి సొమ్ము లెల్ల వారికి తీపి' అని ఆయన తీర్మానం. ఈ రకంగా ఎన్నో చాటు పద్యాలు ఉట్టంకించవచ్చు. కానీ నాటికీ నేటికీ (ముఖ్యంగా ఇప్పటి పరస్పర భూషణ ప్రధానులకు) అన్వయించదగింది పుల్ల కవి చెప్పిన పద్యరూపక విమర్శ: 'కోణంగి నాట్యముల్ కోతులాడించగా ఊరబందులు తల లూపినట్లు, గూబ కూతలు విని గువ్వలు తలలూచిపోయి కాకులవద్ద పొగడినట్లు, కాలువ దరినుండి కప్ప లంకించగా ఎండ్రకాయలు తల లెత్తినట్లు, ఎనుబోతు బిరుదులు మనుబోతు పొగడంగ మేలుమేలని గొర్రె మెచ్చినట్లు, ఓగుధగిడీలు తమలోన నౌకరి నౌకరు మెచ్చుకొనుచుండు రెటువంటి పిచ్చితనము....' అని కవి విచారించాడు. వేణుగోపాల శతకం, ఆంధ్ర నాయక శతకం, సింహాద్రి నారసింహ శతకం వంటివి సమకాలిక సమాజ లోపాలను విమర్శించిన కావ్యాలే. మొత్తంమీద ప్రాచీన సాహిత్యంలో విమర్శ కావ్యాల సంఖ్య చాలా తక్కువ.

8. నిజానికి వీరేశలింగం కాలం నుంచే విమర్శ కావ్యాలు సంఖ్యాధికంగా వచ్చాయి. అందుకు ప్రత్యేక కారణాలు లేకపోలేదు. మొట్టమొదటిది సమాజ పరిస్థితిలో మార్పు. ఆంగ్ల విద్య, ఆంగ్లేయపరిపాలనలద్వారాసంక్రమించిన స్వేచ్ఛ, భారతీయ సమాజంలోని లోపాలను విమర్శించే వ్యక్తికి అప్పటి ప్రభుత్వం పరోక్షంగానైనా ఇచ్చిన సహాయ సహకారాలు, నూతన విద్యా విధానంవల్ల పెరిగిన అక్షరాస్యత

ప్రాచీన సాహితీ ధోరణులంటే కాలక్రమాన కవి జనానికి కలుగుతున్న వైముఖ్యం మొదలైనవన్నీ విమర్శకు తోడ్పడ్డాయి. ప్రహసన ప్రక్రియను ఆయన ప్రధానంగా విమర్శకు వాడుకున్నాడు. అంతకు రెండు వందల సంవత్సరాలక్రితమే 'తంజావూరు అన్నదాన ప్రహసనం' లాంటి విమర్శ కావ్యాలు లేకపోలేదు. 'అభాగ్యోపాఖ్యానం, సత్యరాజా పూర్వ దేశ యాత్రలు, తిర్యగ్విద్వన్మహాసభ' వంటి భిన్న ప్రక్రియలు కూడా విమర్శ కావ్యాలనదగ్గవే. కందుకూరి సంస్కరణవాదాని కివి ఉపకరణాలు. ఆయన వ్యతిరేకులు కూడా ఈ పద్ధతినే అవలంబించారు. అయితే కందుకూరివారి రచనల్లో గాంభీర్యం లేదు; శిల్పదృష్టి తక్కువ. సమాజ విమర్శను కళాత్మకంగా సమర్థంగా నిర్వహించిన సర్వోత్తమకావ్యం గురజాడ అప్పారావు 'కన్యాశుల్కం'మే. వీరేశలింగం, ఆయన ప్రతిస్పర్ధులూ తిట్టు కవితను విమర్శగా భావించారేమో నన్నంత తీవ్ర భాష ప్రయోగించారు. వారి రచనల్లో సౌకుమార్యం తక్కువ. వ్యక్తిగత విమర్శలెక్కువ. కన్యాశుల్కంలోనే తొలిసారిగా 'రాజకీయ విమర్శ' కూడా కనిపిస్తుంది. ఆధునిక యుగంలో కూడా వ్యష్టి విమర్శ ప్రధానమైన కావ్యాలు వెలువడ్డాయి. తిరుపతి వేంకటకవుల 'నానారాజ సందర్శనం, జాతకచర్య, చాటువులు, గీరతం' మొదలైనవి ఈ కోవకు చెందినవి; వీటిలో చివరిది పూర్తిగా వ్యక్తి విమర్శతో నిండింది. వ్యక్తి విమర్శలున్నా చమత్కారవంతంగా నడిచిన రాజకీయ విమర్శలు దుగ్గిరాల గోపాల కృష్ణయ్య చాటువులు; 'ఆంధ్రపత్రికతోడ అమృతాంజనం బిచ్చి తలనొప్పి బాపెడు ధన్యుడెవడు' మొదలైనవి. తిట్లు తిన్నవారు కూడా సంతోషించగల రచన ఆదర్శవిమర్శకావ్యం. భావకవితా ధోరణికి ప్రతీకగా నిలిచిన దేవులపల్లి కృష్ణశాస్త్రి కృష్ణపక్షాన్ని వెక్కిరిస్తూ అనంతపంతుల రామలింగస్వామి రాసిన "శుక్లపక్షం" మరో విమర్శ కావ్యం. విమర్శైక దృష్టితో తెలుగులో వచ్చిన సుప్రసిద్ధ వచన రచన పానుగంటి లక్ష్మీనరసింహారావు 'సాక్షి' వ్యాసాలు. 'వదరుబోతు' పేరులోనేగాని విషయంలో పసలేదు. 'సాక్షి'నుంచి ఇది మంచి ఉదాహరణ అని చెప్పదగినవి అనేకం దొరుకుతాయి. కాని పానుగంటి వారి హాస్యం, విమర్శ కొన్నిసార్లు మోటుగా మొరటుగా సభ్యతా దూరంగా కూడా ఉంటాయి. ఆయనకు నిబ్బరం తక్కువ. నొప్పించీ నొప్పించకుండా విమర్శకావ్యాలు చిన్నవీ పెద్దవీ రాసిన వాళ్ళు ఇద్దరే. ఒకరు జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి (ఉరఫ్ జరుక్-శాస్త్రి, రుక్కుటేశ్వర్, మిణీశాస్త్రి, వగైరా). సమకాలంలోని సుప్రసిద్ధ కవులందర్నీ ఆయన విమర్శించాడు-పేరడీలు రాశాడు. 'లలాటాన కుంకుమాగ్ని, బుజంమీద మబ్బుదుబ్బు, కాళ్ళ కింద కిర్రు చెప్పు, అంగోస్త్రం పొడుంకాయ, వ్యవధిలేని అవధానం, వెళిపోయిం దెళిపోయింది' అని చెళ్ళపిళ్ళ వారింకా బతికుండగానే విమర్శించినా ఆయన్నెవరూ దూషించ

లేదు. 'పాషాణ పాకప్రభూ' అని విశ్వనాథ సత్యనారాయణగారి ముఖానే చదివి 'సేబాస్' అనిపించుకున్నాడు. ప్రధాన కారణం జరుక్‌శాస్త్రికి ఎవరి మీదా విద్వేషంలేదని అందరూవిశ్వసించ టమే. మాదిరాజు దేవీప్రసాద్ శ్రీశ్రీకి పేరడీగా 'రహదార్ల చరిత్ర' రాసినా, 'తాతవిరహం, భక్ష్యేశ్వరీ శతకం' వంటి వెన్ని రాసినా విన్నవారు కూడా సంతో షించారు. ప్రభుత్వోద్యోగిగా ఉండి (అందులోనూ పోలీస్‌శాఖలో) తీవ్ర వ్యంగ్యంలో పరిపాలన పద్ధతులను, రెడ్ టేపును, ఇతర బలహీనతలను విమర్శిస్తూ అతడు ఉత్తరాలు, పద్యాలు- ఏవి రాసినా ఫలితంలో అతడు అనేక విధాల బాధపడవలసి వచ్చిందేగాని విమర్శితులు (ప్రభుత్వేతరులు) కోప గించుకోలేదు. ఛాందసుడైన విశ్వనాథ ఎదటనే "అచ్చొత్తించు శ్రీ ప్రెస్సులో, శ్రీ అచ్చుల్ సరిపోయి ఏడ్చినవిటోయ్ శ్రీ విశ్వనాథేశ్వరా" అని భేషనిపించు కున్నాడు. ఈ ఇద్దరూ సుకుమార విమర్శ కులు. విమర్శలో పదునేగాని విమర్శితుల మీద ద్వేషంలేని వాళ్లు. అసలు వారిద్దరికీ విమర్శే వినోదం. వారికి ప్రత్యేక రాజ కీయాది సిద్ధాంతాలు లేవు. వారికి 'నిబద్ధత' లేదు.

9. తమవంటూ కొన్ని రాజకీయ సిద్ధాంతాలూ వాటిమీద విశ్వాసం ఉండి విమర్శకావ్యాలూ, కావ్యాల్లో విమర్శలూ రాసినవారు లేకపోలేదు. గుర్రం జాషువా గాంధేయుడై కూడా ప్రభుత్వం చేస్తున్న స్వపక్షీయులనే విమర్శించాడు, కరుణైక దృష్టితో. 'రాజ్యపీఠమెక్కి రాజదండము పట్టి, మూడు వత్సరాలు మునిగిపోయె, దొరల రాచరికమె మెరుగయ్యెననిపించె. మారు పల్కవేల మంతిరన్న?' అని సూటిగా ప్రశ్నించాడు. 'రేయి బవలు భారతీయ సంస్కృతి పేర, గండశిలలు చూపి కథలు చెప్పి కటిక పేదవాని కడుపులోగల చిచ్చు, గదపగలవె నీవు గగనవాణి?' అని నిలదీసి అడిగాడు. 'కలకల నవ్వెడు తాతయ, శిలయై కలయై అనంత శిల్పంబునకున్, బలమిచ్చి మాయమయ్యెన్, కులమత తత్త్వములు పుంజుకొని తలయెత్తెన్' అని రామ రాజ్యంలోని సామాజిక యాథార్థ్యాన్ని చాటిచెప్పాడు. 'శాసన సభలలో సభ్యతా పదవికై వింత సంస్థలను స్థాపించువారు, కాలానుసరణంబుగా తొండలనుబోలి మాటిమాటికి రంగు మార్చువారు, ఉద్యోగమూండగా ఉక్కురోషము తోడ నట్టింటిలో చిచ్చు పెట్టువారు, నిమ్న జాతుల మీద నిప్పులు చెరగుచు విధిలేక కన్నీరు విడచువారు, చిరుత విధవల కన్నీటి వరద లందు, హాయిగా కుమాళ్లకు పెండ్లిచేయు వారు....'నేటి మన రాజకీయ నాయకులని విమర్శించాడు. తన రాజకీయ తాత్విక సిద్ధాంతాలకు దూరులైనా వ్యతిరేకు లయినా ద్వేషించకుండానే వారిలోని మంచి చూస్తూ సమాజలోపాలు చెప్పాడు 'నా సిరుల సామ్యవాదుల మస్తిష్కము లందు పతిత మానవతతికిన్, కాస్త జగా కలదేమో, నా సిసుమీ కరుణకీ దినాలం కృతులన్' అనే పద్యంలో. ఇదొక తీరు నిబద్ధ పద్ధతి. శ్రామికజన పక్షపాతంతో విమర్శ కావ్యాలు వెలయించినవారికి ఆద్యుడు శ్రీ శ్రీ. ఎన్నికల సమయాల్లో

రాసినవికాక 'సిరిసిరిమువ్వ శతకం, రుక్కుటేశ్వర శతకం' వంటి శ్రీ శ్రీ రచనలు, ఆరుద్ర 'కూనలమ్మ పదాలు' విమర్శకావ్యాలేగాని పూర్తిగా రాజకీయ విమర్శలతోనే నిండినవి కావు. 'పిల్లలు పిల్లలు బెట్లును, నల్లను ద్రావెడి కతాన నల్లి యనబడెన్, అల్లురు దశమోగ్రహములు, వెల్లుల్లికి తీపిలేదు విశ్వమున జరూ' వంటి పద్యాల్లో నీతిపద్య రచనా ధోరణులను, పండితుల వ్యుత్పత్తి వ్యామోహాన్నీ శ్రీ శ్రీ విమర్శిస్తాడు. అలాగే ఆరుద్ర కూనలమ్మ పదాల్లోనూ అనేక విషయాలున్నాయి. 'ఏకపత్నీ వ్రతము, ఎలుగెత్తు మనమతము, వేల్పు భార్యలు శతము, ఓ కూనలమ్మా: కాలవశమున మారి, చాల ముడుపులు కోరి, దేవుడే వ్యాపారి....' మొదలైన చోట్ల మతసంప్రదాయ విమర్శలున్నాయి. అలాగే గజ్జల మల్లారెడ్డి 'శంఖారావం'లో 'అడగని వరమిచ్చు వేల్పులంటూ వున్నారురా? ఎలెక్షన్లలో నిలిచిన అభ్యర్థులె గురువరా' అన్న రాజకీయ విమర్శతోబాటు, 'ఇద్దరు పండితుల మధ్య ఒదిక లెట్లుండురా? అగ్గిమీద గుగ్గిలమ్ము నిగ్గుదేలినట్లు గురూ!' అనే ఇతర విషయ విమర్శకూడా ఉంది. రాంభట్ల కృష్ణమూర్తి 'శశవిషాణం' వంటి విమర్శ కావ్యాల్లో ఏ విషయమూ రాజకీయవాసన లేకుండా ఉండదు. చివరికి దసరా పద్యాలకు పేరడీ రాసినా అదికూడా రాజకీయ సామాజిక రహస్యాలతోనే ముడిపడి వుంటుంది: 'అయ్యవార్లకు చాలు అర్థ జీతాలు, పిల్లవాళ్ళకుచాలు పూట పాతాలు' మొదలైనవాటిలో లాగా ఈ విధమైన విమర్శ కావ్యాలు అనంతంగా వస్తున్నాయి. తెలుగు సాహిత్యం పుట్టినప్పటి నుంచి ఇప్పటిదాకా వచ్చిన విమర్శకావ్యాలన్నింటినీ పరిశీలించటం సాధ్యంకాదు ఈ వ్యాస పరిధిలో. ఎన్ని విమర్శలు వచ్చినా ఎంత తీవ్రంగా ఉన్నా పరిస్థితుల్లో పెద్ద మార్పు రావటం లేదన్న నిస్పృహ పెరిగి దిగంబరకవులు జగ్గకవినీ, కవి చౌడప్పనూ ఆవాహనం చేసి పచ్చి పచ్చిగా విమర్శిస్తున్నారు. సాహిత్య దృష్టితో చూస్తే ఆ ధోరణి సభ్యత వదిలి పెట్టిందని విచారించినా రాజకీయ దృష్టిలో ఆ దోసుకూడా చాలలేదనిపిస్తుంది అప్పుడప్పుడు. అయితే తాత్కాలికంగా నయినా రాజకీయ దౌర్భాగ్యం దుర్భాషలతోగాక రాజకీయ విధానాలమీద, చర్యలమీద ఆధారపడి మాత్రమే మారుతుందని గుర్తిస్తే విమర్శలో నాజూకుదనం, సౌకుమార్యం, వ్యంగ్యం వదులుకోవటం సాహిత్యానికి శాశ్వతత్వం పోగొట్టుకోవటంతో సమానమనిపిస్తుంది.

10. సాధారణంగా కావ్య విమర్శ అభిరుచి ప్రధానంగా జరుగుతున్న దీనాడుఆత్మస్తుతి పరనిందాపరాయణత్వం గాని, తద్విరుద్ధ పద్ధతిగాని అవలంబించకుండా విషయ ప్రధానంగా విమర్శించటానికి అనేక నిర్మోహపద్ధతులు వచ్చాయి. కావ్యాలను ఆత్మాశ్రయత్వం (Subjectivity) విడిచిపెట్టి పరిశీలించే పద్ధతిలోనే విమర్శకావ్యాలను గూడా విమర్శించవచ్చు. భాషాశాస్త్రంలో విభాగంగా శైలీశాస్త్రం (stylistics) వంటివి ఇటీవల వచ్చాయి. కావ్య నిర్మాణాన్ని విమర్శకుడి ఇష్టానిష్టాలతో

నిమిత్తం లేకుండా పరిశీలించే పద్ధతులు వచ్చాయి. వాటిలో కొన్నిటిని వెల్చేరు నారాయణరావు తన 'తెలుగు సాహిత్యములో కవితా విప్లవాలు' అనే గ్రంథంలో ప్రదర్శించారు. భిన్న తాత్విక దృక్పథాలున్న పాశ్చాత్య విమర్శకుల విమర్శన పద్ధతులు సమన్వయరహితంగా అందులో వున్నా తెలుగులో మొదటిసారిగా ఆయన వాటిని దిక్ప్రదర్శనంగా చూపారు. అనేక విమర్శన పద్ధతుల్లో మార్క్సిస్టు పద్ధతి విమర్శే ఈనాటికి స్వయం వ్యక్తమూ సంపూర్ణమూ అయిన విధానం. అదీ వస్తునిష్ఠమేగాని వ్యక్తి నిష్ఠం కాదు. ఈ పద్ధతిలో తెలుగు సాహిత్యం మొత్తాన్ని విడివిడిగా భిన్న కావ్యాలనూ పరిశీలించే విమర్శ గ్రంథాలు వస్తాయనీ, రావాలనీ ఆకాంక్షించాలి. ఆ దృష్టితో చూచినప్పుడు విమర్శ కావ్యాలు గతచరిత్ర పునర్నిర్మాణానికి ఎంతో ఉపకరిస్తాయని అందరూ గుర్తించగలరు. ఇది చాలా స్థూల చర్చ.

With the

Best

Compliments

F
R
O
M

A. V. SATYANARAYANA RAJU

RAILWAY CONTRACTOR

SURYARAOPET : : VIJAYAWADA-2

సహృదయ తత్త్వం

"The test of a serious student of Art is what ever his own sense of beauty, he is willing to admit into the realm of Art the genuine manifestation that sense in other people at other periods. For him primitive, classical and gothic are of equal Interest.''
The Meaning of Art.

వీడు సాహిత్యాధికారి. వీడి దృష్ట్యా సాహిత్య సూత్ర వివేచన చేయబడుతుంది. ఇది నిత్య సత్యం. సర్వత్రా ఇంతే. వీడి లక్షణం చర్చనీయం. వాడి మన సత్త్వం, అభిరుచి, భావగ్రహణ, తద్వ్యాఖ్యాన పటుత్వాదులు - అతని పాండిత్యం - శాస్త్రీయాలోచనా వైఖరి - ఒకటేమిటి ఈ సర్వం వాని సంస్కార బీజాలు. ఈ సంస్కారం కృతకమూ - సహజమూ, రెండూ. అంటే నేర్చుకొనేది సహజంగా జన్మతో సిద్ధించేది. సహజ సంస్కారమే వాసనా విశేషమంటే అది లేనివాడికి కృతకమూ లేదు- అభిరుచి ఆస్వాదనాదులూ లేవు.

"To teach a person how to create a genuine work of Art is impossible if he does not have the definite inclinations and talent to be an Artist". (Marxist, Leninist, Aesthetics & Life P-34)

ఇది కవిని గురించి చెప్పినా విమర్శకునికీ అన్వయిస్తుంది. ఎలా? ఇద్దరి నుండి జన్మించే శబ్ద విన్యాసం అనుభవ జన్యమే కనుక - అనుభవదశలో ఇద్దరూ వకటే కనుక. ఇందుకే ఇలియట్ అన్నాడు. కవీ - విమర్శకుడూ ఒకే వ్యక్తని. లోచన మంగళ శ్లోకమూ ఇదే చెప్పింది. భట్టతౌతుడూ అన్నాడు. "కవికీ - నాయకుడికీ, శ్రోతకీ సమానానుభవమే కల్గుతుం"దని. ఒకడికి సహజంగా కళానుభవం పట్టదు. వ్యావహారిక-ఆర్థిక వ్యామోహాత్మక చిత్తవృత్తిలో ఆస్వాదన వుండదు. రెండింటికీ చుక్కెదురు. వీరునాట్యశాలలో స్తంభ కుడ్యాదుల వంటివారు. వాడికి కళాసౌందర్యాస్వాదన లేదు.

కవి కెలా వ్యుత్పత్తి - అభ్యాసాదులవసరమో విమర్శకుడికీ అంతే.

[1]The process of creating works of Art is impossible without a certain quantity of information the Artist must posses certain theoritical knowledge and practical habits'' (ibid-37)

1. చూ. వామన కావ్యాలంకార సూత్రవృత్తి.

డా॥ తుమ్మపూడి కోటేశ్వరరావు

పి. జి. సెంటరు : అనంతపురం

ఇదే విషయాన్ని భారతీయాలంకారికులూ చెప్పారు. ఉదా: దండి శ్రుతంచ బహు నిర్మలం — అంటాడు. నిర్మలమైన పాండిత్యముండాలట! "ప్రాక్టికల్ హాబిట్స్' అంటే అభ్యాసమే. దీతో వ్యక్తి మనస్సు సుంకు దేరుతున్నది. చూచీ చూడటంతోటే ఒక సామూహిక సర్వసమన్వయాత్మక దర్శనం కలుగుతుంది. అది కావ్యం కాని మరే కళైనా కాని ఆ దర్శనం అవ్యక్త తార్కికం. అంటే అందులో తర్కం బాహ్యంగా వుండదు. కావ్య రచనా — విమర్శనా — ఆ దర్శనం నుండే కలుగుతున్నాయి. ఇదే విషయం ప్లహనోవ్ చెప్పాడని పై గ్రంథం ఇలా అంటున్నది.

[1]"Taste can — be reduced to an ability to contemplate however Plekhanov's idea lies in the fact that the direct perception of an aesthetic object taken in its totality and completeness, the perceptions of its content through its form and the some of its perfection (or imperfection) are the bases of taste. (P-233)

ఈ సహృదయత్వానికి కారణాలు సౌందర్య దర్శనాభిముఖీనత, ఆర్ద్రిత — సుకుమారత్వం — ఇది ప్రకృతి గతంగానూ, అంటే భౌతికంగానూ-కళాగతంగానూ వుంది. ఆ సౌందర్య భావన — రసికత — కళాస్వాదనకు ముఖ్యం. దీన్ని చంపటానికి సమర్థకంగా భౌతిక ప్రయోజనాలు ఆర్థిక సూత్రాలు — వణిజ బుద్ధీ — ఇలాంటి స్వార్థదృష్టి వుంటే, పెంచడానికి సాధనంగా నిస్వార్థ ధర్మ దృష్టి వుంది. ఇందుకే పై గ్రంథంలోనే

2. "ప్రపంచం మానవుడూ — వీళ్ళ మీదున్న నైతిక దృష్టి. సానుభూతి, కలిగివుండటం సహృదయతకు ఆధార భూమి. ఇలాంటి వాటిమీద ఆధారపడి ఈ 'అభిరుచి' పెరుగుతుంది" [234]

("Beauty is moral goodness" I. A Richards.)

ఇది అచ్చంగా రామాయణాన్ని తాకుతున్న మాట. రామకథను కుశలవులు వినిపిస్తే విన్న మునులు — బాగుందని మెచ్చుకున్నారట. ఈ సందర్భంలో ఆ శ్రోతలైన ఋషులకు మహాకవి వాడిన విశేషణం 'ధర్మవత్సలాః' చచ్చిపోయిన పక్షిని చూచిన మహర్షి 'ధర్మాత్ముడైన మహర్షి సకరుణుడైనాడని' వ్రాయటం, ధర్మవీర్యేణ — కథనంతా దర్శించాడనటం. అలాగే వ్యాసుణ్ణి గురించి తిక్కన్నగారు 'లోకహిత నిష్ఠ'తో ధర్మాద్వైత దృష్ట్యా భారతాన్ని వ్రాసినాడనటం ఇవన్నీ కవికీ, సహృదయునికీ ధర్మదృష్టి వుండాలనటాన్ని నిరూపిస్తుంది. ఈ లక్షణం సత్వగుణ స్వరూపం. అంటే రసాత్మకతలోనే ధర్మం ఇమిడి వుంది. అదీ ఇదీ వేరుకాదు. అంటే బోధ [understanding] రసం [Experience] రెండూ వేరుకావు ఒకటే.

---

1 Here (in India) the only right way is to get at once though a total intitutive or revelatory impressions or by some meditative dwelling on the whole 'dhyana'—in the technical Indian term, to the spiritual meaning and atmosphere, make our selves one with that........"

Foundations of Indian Culture. (P-212)

ఆర్ద్రిత దీని స్వభావం. ఇదే వాల్మీకి మునులు పొందారనిబాలకాండ. మార్క్స్ కూడ అన్నాడు. "కవులు కరుణా మూర్తులు" కావాలని. లేకపోతే ధర్మ ప్రబోధకత వుండదు. ఈ అభిరుచి సహృదయునిలో పెరిగిన కొలది ఉత్తమ కళావిర్భూతి జరుగుతుంది. లేదా దీనితో అది ఏర్పడుతుంది.

"An object dar't creates a public that his aesthetic taste and is able to enjoy beauty — and the same can be or any other product". (A contribution of Political Economy-Marx. P-198)

ఈ మాటల ద్వారా మార్క్స్ స్పష్టంగా సౌందర్యనుమ్మఖీనత ప్రతి మానవకర్మలోనూ అవసరమనీ, మనిషి నిర్మించుకొనే ప్రతివస్తువూ దానినుండే పుడుతుంది, దాన్నే అభివృద్ధి చేస్తుందని కళాకారుని చేతిలో ఇదేవరాకాష్ఠ దశలో వుంటుంది. ఉత్తమ కళావిర్భూతికీ - ఆస్వాదనకూ ఆరసాభిజ్ఞత అత్యవసరం.

కవీ, విమర్శకుడు భావానుదృష్ట్యా ఒకటే కనుక - ఇద్దరూ చక్కని అభిరుచి కలవారే కనుక వారి దృషి ఒకటే. అదే కళా సౌందర్యం - రసానుభవం [ఇది బోధ - ధర్మాంశభిన్నం కాదని గుర్తుంచుకోవాలి].

ఈ అభిరుచి వ్యక్తి పుట్టి పెరిగిన వాతావరణం-సాంఘిక, దేశీయ, జాతీయ కుటుంబ, సంప్రదాయాలనుండి నిష్పన్న మౌతుంది. [పై గ్రంథము - 1-241] ఇది నూత్న సృష్టికీ, దృష్టికీ ఆధార మౌతున్నది. ఆదేశతత్త్వాన్ని, రహస్యాలన్నీ గుర్తించి గ్రహించినవానికి నూత్నత సాధ్యమైనంతగా తదితరులకు సాధ్యం కాలేదు; కాదు. వానిచూపు నిశితమైనది. బాహ్యాంతరాలకు చొచ్చుకు పోతుంది, వివేచిస్తుంది. బాహ్యాభ్యంతర సమన్వయాత్మకంగా వుంటుంది. కాబట్టి అది అనుభవాత్మకతర్కరూపమనాలి. అంటే వాడొక కావ్యాన్ని, పద్యాన్ని చూడగానే వినగానే దాని బాహ్యరూపంతోబాటు అంతరసత్యమూ [ఫార్మ్ అండ్ కంటెంట్] ఒకేసారి దర్శనమౌతాయి. తర్వాత ఆలోచన, అనుభవ విశ్లేషణ, తర్వాత వ్యాఖ్యానం చెప్పటం ఇది విమర్శకుని వరస. ఈ తర్కం అఖండ దృష్టి కలది. దానినుండి ఖండదృష్టి ఏర్పడుతుంది. అంటే విశ్లేషణ ఖండ దృష్టి అనుభవం [చూ. పై గ్రంథం పుట 240-41] ఈ మాటనే అరవిందులన్నది 'దానికి హేతువు అనుభవరూపమైన రసం నుండి సహృదయుడు, కవిలాగానే బాహ్య పరిధి శతాబ్దానికి వస్తున్నాడు. బయటనుండి లోపలికి పోవటంకాదు. ఇవి పాశ్చాత్యమని -

[1] The orthodox style of western criticism seems to be to dwell scrutinisingly on the Technique, on form — and then pass to some appreciation of beautiful or impressive emotion and idea." (Foundations of Indian Culture.)

[2]ఈ దృష్టి లేకపోవటంచేతనే పాశ్చాత్యులు పెడబుద్ధులై (భారతీయ) కళాదికాన్ని దుర్విదగ్ధంగా విమర్శించారు. కేవలం దీనికిసమాధానాలే ఆనందకుమారస్వామిగారి 'డాన్స్ ఆఫ్ శివా, ట్రాన్స్

ఫర్‌మేషన్ ఆఫ్ నేచర్' లాంటివి. కాబట్టి సహృదయత్వంలో ప్రధానలక్షణం లోతు చూపు. లోచూపు సమన్వయాత్మక దృష్టి. ఇది నేర్పు. అభిరుచి లేనివానికి నేర్పులేదు. కాబట్టే లూనాచరస్కీ అన్నాడు : "మార్క్సిస్టు విమర్శకుడికి చాలా నేర్పుండాలి. సౌకుమార్య ముండాలి. మార్క్సిస్టు శిక్షణతో పాటు అభిరుచి వుండాలి ఇది లేకుండా సాహిత్య విమర్శకు దరటం అసంభవం."

(అని లెనిన్ చేత సుతింపబడ్డవాడు. అతని స్నేహితుడు. ప్రాచీన ఆధునిక, రష్యా సంప్రదాయాలకు కాలికపూసగా నిలచి-సమన్వయించిన పండితుడు.)

ఈ రోజుల్లో ప్రతి వ్యక్తికీ కళాభిజ్ఞత అవసరం. ఇవి ప్రాచీనుడికంటె కూడా అవసరమైనది. సాంఘిక దృష్ట్యా నేడున్న ఈ అవసరం నాడు లేదు. అందు కని కళాస్వాదనా స్వభావం, కళా స్వరూపం తెలుసుకోవడం, తెలియకపోతే పండితుల దగ్గరకు వెళ్ళి నేర్చుకోవటం విధి-ఇదే విషయాన్ని లుక్సనోవ్ కూడా నొక్కి చెబుతున్నాడు.

---

1. కేవల భౌతిక-అనుభూతి రహితమైన తర్కం [ర్లేషనలిజమ్] ద్వారా సంస్కృత నాటకాన్ని చూచిన 'కీత్' ప్రభృతులకి తత్త్వం బోధపడలేదని హెచ్. డబ్ల్యు. వెల్స్ అన్నాడు.

[చూ. సంస్కృత నాటకమన్న అతని గ్రంథం]

2 ఈ దృష్టికి వ్యతిరేకంగానే వాదం వచ్చింది. నాకు తెలిసినంత వరకు ఈ వాదం పాశ్చాత్య, కేవలం భావవాదానికి కేవల రూపవాదానికీ వ్యతిరేకంగా వచ్చింది. భారతీయ ఆలంకారికవాదానికి దీనికే భేదం లేదు.

'కళాతత్త్వ వేత్తృతకు విజ్ఞానం ఆత్యావశ్యకమని ఇదే ఆలంకారికులన్న 'కావ్యజ్ఞ శిక్ష' [మమ్మటాచార్యులు] ఇలా తెలుసుకోవటం తప్పు లేదు తప్ప తెలుసుకోకపోవటం తప్పు.

కవుల్ని నిందించరాదంటూ ఆనంద వర్ధనులన్న మాట కూడా ఇదే [చూ. ధ్వన్యాలోకం] అంటే జాగ్రత్తగా చూచుకోవాలి, నేర్పుతో అని తాత్పర్యం. సహృదయత్వంలో అభిరుచి ప్రధానం. దీంతో అనుభవసిద్ధి. దీంతో వ్యాఖ్యాన నైపుణ్యం. వీడిక ప్రక్రియాభేద దృష్ట్యా విమర్శనకి అలవడుతుంది. అంటే ఒకే సూత్రాన్ని అన్ని కళాప్రక్రియలకూ అన్వయించడు. ఇతిహాసం, నాటకం పురాణం, శతకం, కావ్యం - వీటన్నిటికీ ఒకే కొలబద్ద వుండరాదు. దేన్ని అదిగా చూస్తూ-అన్నిటికీ ఆధారంగా వున్న సత్యాన్ని చూడటం విమర్శకుని లక్షణం ఇందుకే వెచింటర్ సన్ అనే అమెరికా విమర్శకుడు ఈ కావ్య ప్రక్రియలన్నిటికీన్నీ ఒకే సూత్రంతో కొలవరాదన్నాడు. అదే మాట కవికీ అన్వయిస్తుంది. ఒకే కథ భిన్న ప్రక్రియల్లో చెబితే ప్రక్రియా లక్షణాన్ని బట్టి వస్తు నిర్వహణ మారుతుంది. ఇతిహాస, పురాణకథలు నాటకాలుగా, కావ్యాలుగా మారినపుడు వీటి లక్షణ దృష్ట్యా వస్తువులో మార్పులూ చేర్పులు జరగటం మనకు తెలిసిందే. ఇదేమాట ఈ సహృదయగత వివేచన

'Marble, bronze and wood will possess unique descriptive potential peculiar to them alone. It is impossible to imagine Konenkov's sculptures illustra-

ting peasant life and Slavonic mythology in any other material but wood. (Foundations of Marxist Aesthetics. P-141)

శక్తి లేకపోవటం ప్రాచీన ప్రబంధాది సాహిత్యాన్ని నిందించటానికి హేతువు. చారిత్రకదృష్టి రాహిత్యం మరొక కారణం. ఏ మాత్రం కష్టపడకుండా కళానుభవం లబ్ధం కావాలనుకోవటం వ్యావహారికతా విలసనం [1] కవి తలపగిలిపోయేంతగా ఆలోచించి వ్రాస్తున్నాడు. కనుక సహృదయుడూ అలాగే వుండాలి. సాహిత్యం [కళ] సృష్టి తప్ప విందు భోజనం కాదు. ఇదే విషయాన్ని ప్రతిధ్వనిస్తున్నాడు రష్యా చిత్రకళా విమర్శకుడు జిమెంకో.

[2]"Artistic creation, it must be stressed is *not bed of Roses*, it is not a walk along a well known path, but an adventure into undiscovered country, however simple the task set by the Artist in each case might appear at first sight. (The Humanism of Art 38).

ఇదే విషయం అభినవులు తన రససూత్ర వ్యాఖ్యానప్రారంభంలో అన్నారు. కాబట్టి కవి పడ్డంత శ్రమ సహృదయుడూ పడాలి. పడితేనే విమర్శకుడు. "ప్రతిభాజన్యమైన కావ్యం నూత్న గణితశాస్త్రం లాంటిది కాబట్టి మనస్సుకు సానబెట్టుకొని చదవాలి. దీనికి కాలం పడుతుందని. అని ఐ. ఎ. రిచర్డ్స్ — ఇలియట్ కవిత్వాన్ని గూర్చి చెప్పాడు. ఈ విషయాన్ని మార్క్సిస్టు-లెనినిస్టు విమర్శకులూ యథాతథంగా అంగీకరించినట్లు ఈ వాక్యాలు చెబుతాయి.

Marxist Leninist Philosophy have always regarded art as an artistic value and brought to light the ideological and aesthetical valuation of the phenomena portrayed in Artistic works through analysing the latter.

ఒక కావ్యమో శిల్పమో చిత్రమో ఏదైనా అది ఆ పరిధిలో ఇమిడిపోయిన తర్వాత అది కళ అవుతున్నది. కాబట్టి దాన్ని అదిగానే చూడాలి తప్ప మరొక విధంగా చూడకూడదు. చూస్తే తల క్రిందులౌతుంది. అర్థం తోచదు. అప్పుడు నిందించడం తప్ప గత్యంతరం లేదు. వస్తువు కళాబద్ధం కావటం "[3]కళా సూత్రానుసారమే, కళా సూత్ర బద్ధ వస్తువు వేరు. భౌతికవస్తువు వేరు. అందులో దీన్ని వెతుక్కొనేవాడు సహృదయుడు కాడు. వాడు కళాస్వాదనకు పనికి రాడు. లెనిన్ చెబుతున్నాడు—

Art does not remain the recognition of its works as reality. (Collected works Vol. 8 P-73)

మార్క్స్ మాట లిదివరకే ఉదహరింపబడ్డాయి.

(1) The Artist at work may have sweat on his brow but not on his canvas."
(Pavel Koutin)

(2) The Artist expends a great deal of physical and spiritual spirit during the creative process.
(The Humanism of Art Zimenco. P-17)

కళలో ఉన్న కళా ధర్మాన్ని పురస్కరించుకొనే మార్క్సు షేక్సుపియర్ని, బోదిలెయిర్‌ని ప్రేమించేవాడని, షేక్సుపియర్ మీద ఒక విమర్శ వ్రాద్దామనుకున్నట్లుగా తన అల్లుడికి వ్రాసిన లేఖల్లో సాక్ష్యం కన్పిస్తుందని హెర్బర్ట్ రీడ్ వ్రాశాడు. అలాగే గోర్కీ (మార్క్సు సిద్ధాంతం కళాబద్ధం చేసిన ప్రథమ మహాకవి) కూడా కళాస్వాదనానురక్తిని వెల్లడిస్తున్నట్లు రోమన్ రోలండ్‌కి, హెచ్. జి. వెల్స్‌కి వ్రాసిన లేఖలు సాక్ష్యం చెబుతున్నాయి.

---

3. ఇందుకే పికాసో అన్నది" ఏ సూత్రానికీ కళ కట్టుపడదన్న అధి వాస్తవికతా వాద శాస్త్రం కూడ చాలాసార్లు దిద్దుకోబడింది" అది

ఇంకా సశాస్త్రీయంగా రోజర్ ఫ్రై అన్నాడు.—

Or it may be, Art really calls up, as it were, the residual traces left on the spirit by the different emotions of life without however recalling the actual experiences so that we can get an echo of the emotions without the limitation and particular direction which it had in experience.

దీనికింకా సశాస్త్రీయ ప్రతిధ్వని కాళిదాసు----

"రమ్యాణివీక్ష్య --- తచ్చేతసాస్మరతి
నూనవు బోధ పూర్వం,
భావస్థిరాణి జననాంతర సౌహృదాని"

అన్న శ్లోకం దీని వ్యాఖ్యానం రససూత్రం దగ్గర వుంది. ఈ విషయాలు వేరే చర్చించ దగ్గవి. వాటికివి సూచికలు మాత్రమే.

ఇది సహృదయతత్వం — సహృదయత్వం. ఈ దృష్టిమీద సాహిత్య విమర్శ ఆధారపడి వుంటుంది. ఇది లేక విమర్శ లేదని సారాంశం.

దీని కుదాహరణగా ఒక 'చిత్రం' చూడవచ్చు.

1918 రష్యా విప్లవం రోజుల్లో 'సమ్మె' అన్న బొమ్మ పుట్టింది. దాన్ని గూర్చి విమర్శిస్తూ జిమెంకో అంటాడు:

"They (The Artists) placed emphasis on the elements of the spontaneous and the *sentimental* in presenting the image of the revolutionary people. On the other hand, the *images of the Red Army* men are *Expressively rigid*.... The *Dramatic Power* of the work is increased by the active back ground the Kremlin's towers........" (The Humanism of Art. P-210)

సమ్మె, నాటి సమకాలీన రాజకీయ విషయం. దాన్ని బొమ్మ గీయాలి. ఈ ప్రశ్న కళాకారునిది. ఆ బొమ్మ ద్వారా అతడు చెప్పదలచుకొన్న భావం సహృదయున కందాలి. ఈ అనుభవ మార్గం.... సూత్రం ఏమిటి? నాకా సమ్మె కన్పించదు. నేను చూస్తున్నది బొమ్మ తప్ప సమ్మె కాదు. కవితా వస్తువైన సమ్మె బొమ్మగా కన్పించాలి. బొమ్మ.... సమ్మె రెండున్నవి. బొమ్మ కవిచేత భావింపబడి మనస్సులో కన్పించిన సమ్మె. భౌతికంగా వున్న సమ్మె వేరు. మనస్సులో కన్పించిన సమ్మె వేరు. ఇది ప్రతికని a Imge అంటే కవి భావనా శక్తి ద్వారా లోక

వస్తువైన సమ్మోహభావింపబడి చిత్రంగా బహిర్గతమైనది. ఇదిశాస్త్రీయం విషయం తప్పవ్యావహారికంకాదు. లౌకికవస్తువాధార మన్న మాట సత్యమే. అది రసభావా కృతినెలా పొందుతున్నది? అంటే లోకం కళగా ఎలా ఆవిష్కృత మౌతున్నది?

ఇది సహృదయ దృష్టి. ఇది సృష్టి పడనంతకాలం కళకు ముక్తి లేదు. ముక్తి అంటే లోకం కళగా మారటం. లేక పోవడమంటే కళ లోకం కావటం.

ఈ ఆలంకారిక సమస్య పరిష్క రించేవాడుసహృదయుడు. ఇదిసాంకేతిక శాస్త్రీయ శబ్దం. కళ శాస్త్రీయమే

*

కడప సదస్సు ఆమోదించిన ప్రకటన

ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం కడపలో 1980 ఆగస్టు 15, 16 తేదీల్లో సాహిత్య విమర్శన గురించి రాష్ట్రస్థాయిలో జరిపిన సదస్సులో చర్చోపచర్చలు జరిగిన తరవాత ఈ విధంగా ప్రకటిస్తున్నది :

1. సాహిత్య విమర్శలో శాస్త్రీయ మార్క్సిస్టు దృక్పథం ఉత్తమ సాహితీ సృష్టికి దారితీస్తుందని విశ్వసిస్తున్నాం.

2. సాహిత్య విమర్శలో వ్యక్తిగత దూషణ భూషణలకు స్థానం లేదనీ, మార్క్సిజం పేరిట చెలామణీ అవుతున్న గతితార్కిక సాహిత్య భౌతిక వాదంవంటి విపరీత ధోరణులను గర్హిస్తున్నాం.

3. సాహిత్య విమర్శలో భావవాద, పలాయనవాద, ఫ్రాయిడ్ వాద, వ్యష్టి వాద ధోరణులను నిరసిస్తున్నాం.

4. తెలుగు సాహిత్య విమర్శన గ్రంథాలు ప్రచురించమని సాహిత్య అకాడమిని, విశ్వ విద్యాలయాలనూ అర్థిస్తున్నాం.

5. భారతీయ విశ్వవిద్యాలయాల్లో తెలుగు మహాకవుల, రచయితల మీద పరిశోధనలు జరిపిన సిద్ధాంత వ్యాసాలను గాని, కనీసం వాటి సారాంశాలుగాని క్రోడీకరించి ప్రచురించటానికి ఆర్థికాది సహాయం అందిమ్మని యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ వారిని అభ్యర్థిస్తున్నాం.

★

విమర్శ సాహితీ సౌందర్యం : మార్క్సిస్టు విమర్శనా పద్ధతి !

అరవటం ప్రతిఘటన కాదు. మౌనం అంగీకారం కాదు. ఎదరిని నిందించటం విమర్శకాదు - తన వాడిని విమర్శించి నట్లు నటించి పొగడటం విమర్శకు ప్రమాణికంగాదు. ఇలాంటి విలక్షణ స్థితిగల ఆంధ్ర సాహిత్య రంగంలో ముఠాతత్వం ప్రబలి మార్క్స్-ఏంగెల్స్-లెనిన్‌లను సందర్భ శుద్ధితో ప్రమేయం లేకుండా సంకుచిత ప్రయోజనాలకోసమో ఫోజుకోసమో యధేచ్ఛగా కోడ్ చేస్తున్న తరుణంలో ఆరోగ్యకరమైన లక్షణాలు ప్రవేశ పెట్టాలని ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం తన కృషిని ప్రారంభించింది. ఆ కృషికి వేదికయింది కడప. శాస్త్రీయమైన మార్క్స్ దృక్పథం ఉత్తమ సాహిత్య సృష్టికి మార్గం వేస్తుందని ప్రకటించింది అరసం.

1 కీ॥ శే॥ కట్టమంచి రామలింగారెడ్డి శత జయంతి సందర్భంగా కట్టమంచి రామలింగారెడ్డి నగరుగా, కీ॥ శే॥ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ పేర సభావేదిక ఏర్పరచి 1980 ఆగస్టు 15, 16 తేదీలలో కడప - ప్రతాపలాడ్డి భవనంలో ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యాన కడపజిల్లా అరసం ఈ సదస్సు నిర్వహించింది.

ప్రఖ్యాత సాహితీ విమర్శకులు శ్రీ రాచమల్లు రామచంద్రారెడ్డి అధ్యక్షత వహించి విమర్శనా సదస్సు ఏర్పాటు వుద్దేశాలు వివరించారు.

కట్టమంచి రామలింగారెడ్డి, రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మపై ప్రముఖ అభ్యుదయ కవి శ్రీ వై. సి. వి. రెడ్డి రచించిన గేయాలు శ్రీవి.రమాపతిరాజు శ్రావ్యంగా వినిపించారు.

ప్రముఖసాహితీవేత్త డాక్టరు బూదరాజు రాధాకృష్ణ విమర్శ సదస్సును ప్రారంభించారు.

పరస్పర విరుద్ధమైన విమర్శలు–పొగిడిపొగిడించుకునే విమర్శలు–పొగడ్త తెగడ్త అనే పదాలు మన తెలుగు సాహిత్యంలో చోటు చేసుకున్నాయని, మార్క్స్,ఏంగెల్స్,లెనిన్ పేర్లను–సందేశాలను వక్రీకరించే వర్గం ఒకటి తలెత్తిందని తన ప్రారంభోపన్యాసంలో డాక్టరు బూదరాజు రాధాకృష్ణకు విమర్శకుల కుయుక్తులను గర్హించారు. ఈ సందర్భంగా కవిసేన ప్రచార పద్ధతిని పేర్కొన్నారు.

మైత్రేయ

సదస్సులో సభా వేదికనలంకరించిన చిత్రాలు కీ॥ శే॥ కట్టమంచి రామలింగా రెడ్డి, కీ॥ శే॥ రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మల తైల వర్ణ చిత్రాలు శ్రీ పి. డి. బాలసుందరం జీవకళ ఉట్టి పడేలా తీర్చి దిద్దారు. వీరిని శ్రీ వై. సి. వి. రెడ్డి కడప జిలా అరసం అధ్యక్షులు శాలువ కప్పి సత్కరించారు.

సదస్సుకు వివిధ జిల్లాల నుండి ప్రతి నిధులు వచ్చారు. స్థానిక సాహితీ ప్రముఖులు సభను అలంకరించారు సాహితీ ప్రియులైన మహిళామణులు కూడా పాల్గొన్నారు.

అభ్యుదయ రచయితల సంఘం సేకరించిన ప్రపంచ వ్యాపిత అభ్యుదయ రచయితల ఫోటో ప్రదర్శన ఏర్పాటు చేయబడింది

ఆ రోజు మధ్యాహ్నం సభ సరిగ్గా సమయానికి ఆరంభమైంది అప్పటికే సభ నిండడం కడప సాహిత్యాభిమానుల ఆదరానికి గీటురాయి. సదస్సుకు విఖ్యాత సాహిత్య విమర్శకులు శ్రీ ఆర్వియార్ [ఆర్. వెంకటేశ్వరరావు] అధ్యక్షత వహించారు.

2. కీ॥ శే॥ డాక్టర్ రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ స్మృత్యర్థం - కళాప్రపూర్ణ, పద్మశ్రీ డాక్టర్ పుట్టపర్తి నారాయణాచార్యులు ఒక వ్యాసం సమర్పించారు.

"సాహిత్యాంధకారంలో సూర్యోదయం కీ॥ శే॥ కట్టమంచి రామలింగా రెడ్డితో మొదలైంది. వారి శిక్షణలో రాళ్ళపల్లి గొప్పసాహిత్య కృషి చేసి విమర్శన సాహిత్యానికి చక్కగా దోహదం చేశారన్నారు. వేమనగురించిన వ్యాసాలు, తెనాలి వారి పాండురంగ మహాత్మ్యం సంస్కరణం రాళ్ళపల్లి వారి కలంనుండి వెలువడటం తెలుగు వారి అదృష్టమన్నారు.

ఆయన ఆ పత్రంలో ఇంకా ఇలా వివరించారు. మానవుడు నాగరికుడవుతున్నకొద్దీకళల్లోనాజూకుతనం పెరిగింది. వాటిని విమర్శించే దృష్టిలోకూడా లాలిత్యం, గాంభీర్యం, తీక్షణం వృద్ధిచెంది హృదయాన్ని-భావాన్ని గుర్తించే స్థితి వచ్చింది. ఒకనాడు కేవలం లక్షణశాస్త్ర ప్రమాణంగా, అలంకారాలు, ఛందస్సుల వరకే చూశారు. పద్యానికి పద్యం-శ్లోకానికి శ్లోకం విశ్లేషించి చెప్పటంవిమర్శగా వుండేది. మొత్తం గ్రంథాన్ని స్థూలంగా విమర్శించే లక్షణం పాశ్చాత్యుల నుండి మనకు వచ్చింది. రాళ్ళపల్లి వారుతనచివరి రోజుల్లో పాత భావాల పట్టునుండి తప్పుకొని వ్యవహారిక భాషవైపు మరలినట్లు కనుపిస్తోందన్నారు.

3. "వస్తువు-రూపం" అనేఅంశాన్ని చర్చిస్తూ తన పత్రాన్ని సమర్పించారు శ్రీ మల్లిక్.

వస్తువునుబట్టి రూపం ఏర్పడుతుంటుందనే, వస్తువు-రూపం విడదీయరానివనీ, ఈరెండు పరస్పరం ప్రభావితం పొందే శక్తిగలవనీ, ఈరెంటి సమష్టితత్వంతో కూడి సమన్వయం పెంపొందిన కొలదీ ఉత్తమ కళారూపంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు.

ఆయన ఇంకా ఇలా అన్నారు. కళ సృజనకు మూలం మానవశ్రమ ఆదిమ కాలంలో కళకు శ్రమతో ప్రత్యక్ష సంబంధం వుండేది. వ్యవస్థ మారిన

కొలదీ ఈసంబంధంలో మార్పువచ్చింది. సమాజంలో జరిగిన ఆర్థిక,న్యాయశాస్త్రం మార్పులు కళపై ప్రసరించాయి. ప్రస్తుత సమాజంలో సైద్ధాంతిక, సౌందర్యాత్మక, వాస్తవిక పతనదశ బాగా కానవస్తున్న దన్నారు.

వాస్తవికతకు విరుద్ధమైన భావాలు కలవారు వుద్దేశ్యంతో కొందరు, వుద్దేశంలేక కొందరు వాస్తవికతకు సంబంధించని రచనలు చేస్తుంటారు. టెక్నిక్‌ను అడ్డంపెట్టుకొని అందంగా చెప్పనేర్చి మృతి-హత్య. ప్రమాదాలవంటివి కథల్లో చేర్చి వక్రమార్గాల్లో ఆత్మను చూపిస్తున్నారు. ఇది నిరసించదగిన పరిస్థితి అని వివరించారు.

4. "సాహిత్య విమర్శ-మార్క్సిస్టు దృక్పథం" అనే పత్రాన్ని శ్రీమతి సంజీవమ్మ సహేతుకంగా సమర్పించారు.

అభ్యుదయ సాహిత్యంపైన, శ్రీశ్రీ సాహిత్యంమీద సరైన విమర్శ రాలేదన్నారు.శ్రీశ్రీ సాహిత్యంపైన వచ్చినవి సమగ్రమైనవికావని – అభ్యుదయ సాహిత్యంపైన, ఇతర సాహిత్యంపైన మార్క్సిస్టు విమర్శ అనేది ప్రమాణంలో కాని పరిమాణంలో కాని ఆశించినంతగా లేదన్నారు. వివిధ సాహితీ ప్రక్రియలు అభివృద్ధి చెందిన రీతిలో ఈ విమర్శనా ప్రక్రియ అభివృద్ధి చెందలేదన్నారు.

ప్రస్తుతం, సాంప్రదాయ, అలంకారిక ఆధునిక, శిల్ప విమర్శనా ధోరణులు కన్పిస్తున్నాయి. పాశ్చాత్య సాహిత్యంలో వస్తువు ప్రాముఖ్యం పెరిగింది. ఇది సోషలిస్టు భావాలతో వచ్చిన మార్పు అన్నారు.

సోషలిస్టు విమర్శనా రీతిని ఇలా వివరించారు : ఒక రచనలో వుండే సామాజిక స్వభావం వుందాలేదా ?వుంటే అది అభివృద్ధికర మార్గంలో వుందా లేదా ? అభివృద్ధితోపాటు కళాత్మక ప్రమాణాలున్నాయా ? వీటితోపాటు ఔచిత్యం అనేది యే స్థాయిలో వున్నది? ప్రగతిభావన ఎలా ప్రతిబింబించింది అని చూపవలసి వుంటుందన్నారు.

మార్క్సిస్టు ఆలోచన గురించి చెప్తూ వాస్తవికతలూ సామాజిక – వ్యవస్థ పరిశీలన ప్రధానమన్నారు. అయితే నేటి యువకవులు వాస్తవ చిత్రణలే వాస్తవిక వాదంగా భావిస్తున్నారని – సామాజిక వ్యవస్థ పరిశీలనలో సృజనాత్మకత ఆవిష్కరిస్తే అది మంచి రచన అవుతుంది వాస్తవికతావాద రచయితలు క్షుద్ర ఘటనలకు దూరంగా రచన సాగిస్తారని సామాజిక వైరుధ్యాలు వైయక్తిక వైరుధ్యాలు సుబోధకంగా చిత్రీకరిస్తారని అన్నారామె.

4. శ్రీ గంగిశెట్టి లక్ష్మీనారాయణ ఇప్పటి విమర్శలు సాగుతున్న ధోరణి సోదాహరణంగా వివరించారు.

5. శ్రీ వ°°ంపాటి వెంకటసుబ్బయ్య సాహిత్య విమర్శనా మార్గాల గురించి వివరిస్తూ పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో విమర్శలు చేస్తున్నవారుఫ్రాయిడ్ సిద్ధాంతాలను ఆశ్రయిస్తున్నారని, అలంకార గ్రంథాలనే ప్రమాణంగా పెట్టుకుని విమర్శలు చేసేవారు ఇప్పటికీ ఉన్నారని

వర్తమాన కాలంలో సాహిత్యాన్ని సమగ్రంగా అంచనా వేయడానికి మార్క్సిస్టు విమర్శనా పద్ధతి సరిపోనున్నదని వక్కాణించారు.

6. రెండవరోజు ఉదయం డాక్టరు బూదరాజు రాధాకృష్ణ అధ్యక్షతన సభ ప్రారంభమయింది. "విమర్శ వ్యాస రచనా పద్ధతిపై తమ ప్రసంగ వ్యాసం ప్రారంభించారు. శ్రీ కేతు విశ్వనాథరెడ్డి విమర్శ పద్ధతులను మూడు భాగాలుగా చెప్పారు. పాత్రికేయ పద్ధతి, అకడమిక్ పద్ధతి, అకడమికేతర పద్ధతి అంటూ వివరించారు. పత్రికలు వ్యాపార నాగరికత కలిగి విమర్శలు కేవలం మొక్కుబడిగా చేస్తాయని, ఎవరినీ నొప్పించకుండా విషయాన్నందించటంగా ఘోరమైన సమీక్షలు వెలువరిస్తాయన్నారు. అకడమిక్ విధానంలో టెక్స్టుబుక్ సూత్రాలకు అంకితమై యూనివర్శిటీ పాఠాలు పరీక్షలు గీటురాయిగా సాగుతాయన్నారు. అకడమికేతర విమర్శ చెప్పుకోదగిందిగాలేదని యూనివర్శిటీలలో సమకాలీన సాహిత్య విమర్శనా పద్ధతులు ఇంకా ప్రవేశించలేదన్నారు.

7. "మార్క్సిస్టు విమర్శనాపద్ధతులు" అనే అంశంపై శ్రీ రాంభట్ల సైద్ధాంతిక ప్రసంగం కొనసాగించారు.

వాస్తవిక, కళాత్మక ప్రతిబింబం అనేదే సాహిత్యం. సౌందర్యం ఇందులో ప్రధాన లక్షణంగా వుంటుంది. సాహిత్యంలో అన్ని అంశాలు ఇమిడి ఉన్నాయి. అయితే ప్రాచీనుల సౌందర్యం గురించి తెలిపినట్లు దీని లక్షణం ఆనందం. ప్రస్తుతం అదనంగా వాస్తవికత, అనువేక్షికి అనేవి వచ్చాయని అన్నారు. ఇంకా ఇలా అన్నారు.

కళలు సాహిత్యం సామాజిక చైతన్య రూపాల్లో భాగాలు. సామాజిక చైతన్యాన్ని సామాజిక అస్తిత్వం, ప్రభావితం చేసుందని అందువల్ల సాహిత్య విమర్శకు మార్క్సిస్టు సంవిధానం అవసరమన్నారు.

సామాజిక అస్తిత్వం సామాజిక చైతన్యాన్ని ప్రాభావితం చేసినప్పటికీ చైతన్యానికి సాపేక్షకస్వాతంత్ర్యం వుంటుందని, అస్తిత్వం మారగానే చైతన్యం వెంటనే మారదని మార్క్సిస్టు విమర్శకులు గుర్తుంచుకోవలసిన విషయమని, మనిషి నూరేళ్ళు జీవించి మరణించినా సమాజం ఉంటుందని వచ్చేపోయే వ్యక్తుల మధ్య సమాజంలో సంబంధాలు ఎప్పుడూ వుంటాయని, మార్క్సిస్టు పదజాలం వాడినంత మాత్రాన అది మార్క్సిస్టు విమర్శ కాబోదని; థిరిటికల్ సైన్సు, అప్లయిడ్ సైన్సు అనే శాస్త్రాధారాలతో సాహిత్యకర్త సమాజాన్ని పరిశీలించాల్సిన, విమర్శించాల్సిన రీతులు వివరించారు.

8. రెండవరోజు మధ్యాహ్నం సభకు శ్రీ రాంభట్ల కృష్ణమూర్తి అధ్యక్షత వహించరు.

డాక్టరు బూదరాజు రాధాకృష్ణ భారతదేశంలో విమర్శ పరిణామాల్ని వివరించారు.

సామాజిక లోపాలను విమర్శించవచ్చునని మొట్టమొదటిగా నిరూపించినవారు కాశ్మీర్‌లని చెప్పారు. కబీరు, వేమన, పురందరదాసు రాసిన రచనలు

విమర్శనా రూపంలో సామాజిక లోపాలను వివరించాయి. అయితే ఇవి విమర్శనా గ్రంథాలు కావు. ఇవి విమర్శ కావ్యాలు. ఇలా చూచినా తెలుగులో విమర్శ కావ్యాలు అతి తక్కువ. భాషాపరంగా చూస్తే మన విమర్శనా గ్రంథాలు చాల మొరటుగా వుంటాయి. ఇది మన అదృష్టం. జరుకాశాస్త్రి విశ్వనాథను "పాషాణపాక ప్రభూ" అని హేళన చేయటం సాహిత్య విమర్శే। కనీసం ఇలాంటివి కూడా రావటంలేదు. విమరిక్కల్లాంటి ప్రక్రియలు కొనసాగక పోవడం కూడాలేదు. వ్యంగ్య శిల్ప దృష్టితో సౌందర్యాం, శిల్పం జోడించి సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను విమర్శించే పద్ధతి రావాలని - వస్తాయని తన ఆశాభావం వ్యక్తంచేశారు.

9. శ్రీమైత్రేయ మాట్లాడుతూ నేటి పత్రికా రంగంలో గ్రంథ విమర్శ- గ్రంథ పరిచయం, గ్రంథ సమీక్ష వగైరాలన్నీ సహేతుకంగా లేవని నేటి దశనుండి ఆరోగ్యకరమైన ఆలోచనలకు నాందిగా మార్క్సిస్టు విమర్శనాధోరణిని అలవరచుకోవాలని విజ్ఞప్తి చేశారు.

10. శ్రీ ఆదోని రామారావు, మార్క్సిస్టు మేధావులు ప్రసిద్ధ వక్తలు వ్యాసరచనకు పూనుకోవాలన్నారు.

11. శ్రీ ఎన్. కిషోర్, మార్క్సిస్టు మేధావులు విమర్శనా ప్రక్రియను ఈనాటి యువతరానికి చక్కగా అందించాలని విజ్ఞప్తి చేశారు.

12. శ్రీ కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి తీర్మానాలను ప్రవేశపెట్టగా సదస్సు ఏకగ్రీవంగా ఆమోదాన్ని ప్రకటించింది. శ్రీ వై. సి. వి. రెడ్డి వందన సమర్పణతో సభలు ముగిశాయి.

★

సామాన్య పాఠకుడూ - సాహిత్య విమర్శ

ఒక కథో, గేయమో, నాటకమో, నవలో బావుందనీ, బావులేదనీ, ఫలానా పాత్రలు అద్భుతంగా ఉన్నాయనీ, మనసును ఆకట్టుకున్నాయని ఇలా పత్రికలకు, రేడియోకు ఉత్తరాలు గుప్పించే పాఠకులూ, శ్రోతలూ కూడా వారి వారి స్థాయిల్లో సాహిత్య విమర్శకులే.

తమ భావం చెప్పాలన్న తపన సాహిత్యాన్ని ఆస్వాదిస్తున్నామన్న సంతృప్తి ఏదో రకంగా సాహిత్య చర్చలో తామూ పాల్గొనాలన్న అభిలాష ఇవీ ఇలాటి లేఖలకు కారణం. సీరియస్ సాహిత్య విమర్శలను చదవాలని, తెలుసుకోవాలని వీరిలో చాలా మందికి ఉంటుందనే అనిపిస్తుంది. కాని ఎక్కడో ఏదో పెద్ద అగాధం లేదా దూరం అలా సాగుతూనే ఉంది.

సృజనాత్మక రచయితలు కూడా ఈ లేఖా విమర్శలకిచ్చే విలువ సీరియస్‌గా జరిగే సాహిత్య విమర్శలకు యివ్వరు.

తమకు పాపులారిటీ ఈ లేఖలవల్ల వస్తుందని ఇదేస్థాయి అనే ఆ రచయితల విశ్వాసం కావడం తెలుగు సాహిత్యం దురదృష్టం.

అత్యధిక పాఠకులను ఆకట్టుకునే 'సచిత్ర' పత్రికలు అటు పాఠకుల్ని ఇటు ఈ రచయితల్ని అలాగే ఉంచి వ్యాపారం చేసుకోవాలని చూస్తాయి. ఆ పత్రికల్ని గుప్పెట్లో పెట్టుకున్న వ్యాపారవర్గాలకి వ్యాపారంతప్ప మరో ప్రయోజనం ఉండే అవకాశం యిప్పుడు లేదు. సీరియస్ సాహిత్య పత్రికలని ఒక నాలుగు అతి పరిమితమైన సర్క్యులేషన్లతో ముక్కుతూ మూల్గుతూ బయటికొచ్చి సీరియస్ సాహిత్యకారులనబడే కొద్దిమందికే సంతృప్తి కలిగిస్తూ కాలం గడుపుతున్నాయి. సాహిత్య వాదోపవాదాలు, కాంట్రొవర్సీలు సాధారణంగా ఆ లోపలే ఉండిపోతూంటాయి.

అది "పాపులర్" స్థాయికి వెళ్ళటం అంటే సెన్సేషన్‌కోసం ఒకర్నొకరు సంస్కారం లేనంత స్థాయిలో తిట్టుకోవడంగా దిగజారడమూ ఈ దశాబ్దిలో జరిగింది.

సాహిత్య సంఘాలు కుప్పలుగా ఉన్న స్పష్టమైన భావాలతో సిద్ధాంతాలు, ఆశయాలలో నిర్వహించే సంస్థలు ఒక

ఎన్. సి. రామసుబ్బారెడ్డి

దానితో ఒకటి విభేదించేవి ముఖ్యంగా మూడు కనిపిస్తున్నాయి.

వారి సభ్యులు లేదా అభిమానులైన రచయితలకు మాత్రం ఆయా సంస్థల మధ్యజరిగే సాహిత్య వివాదాలు పరిమితమైపోతున్నాయి.

ఈ సాహిత్య సంస్థలు బయటి రచయితలను అసలు రచయితలుగా కూడా గుర్తిస్తున్నట్లు లేదు.

లక్షల మందికి పాపులర్ సాహిత్యాన్ని అందిస్తున్నామని తమలోతామే గర్వపడిపోయే వేలసంఖ్యలోఉన్న రచయితలకు చాలామందికి అజ్ఞానమే ఎక్కువగాఉన్నా - తెలుసుకోవాలన్న జిజ్ఞాస అసలే ఉండదు అనుకోవడం అన్యాయం.

ఒక సామాన్య పాఠకుడిగా నా దృష్టిలో దిగ్గంతులైన సాహిత్య విమర్శకులు కూడా ఒక్కొక్కప్పుడు ఎలా విచారకరమైన పద్ధతులను వ్యవహరిస్తారో యిక్కడ పేర్కొన దలిచాను.

అభిమాన దురభిమానాలవల్ల అభిప్రాయ వ్యక్తీకరణలో - లౌల్యం చాపల్యంతో అనౌచిత్యంతో పదాలు వాడడం జరుగుతుంది - ప్రాచీన సాహిత్యాన్ని సృజించిన మహనీయులను గురించి చెప్పేటపుడు "దగుల్బాజి" వంటి పదాలు వాడితే అది సాహిత్యాభిమానులకు ఎంత నొప్పి కలిగిస్తుందో గమనించరు.

ఒకరచనను విమర్శించేటపుడు చారిత్రకత పాటించాలి. ఏ కాలంలో అది రాశారు. ఆనాటి యుగధర్మా లేమిటి అన్నది దృష్టిలో పెట్టుకోకపోతే కేవలం అజ్ఞతని ప్రకటించుకోడమే అవుతుంది. ఇక సంస్కృత పదజాలంతో చట్రంలో బిగించారని ఆనాటి కవిత్వంపైన దుమారంలేపి ప్రజలకు సన్నిహితంగా రాసున్నామని చెప్పి - వచన కవితల్లో ప్రాచీన కావ్యాలని మరపించే విధంగా పదాడంబరత ప్రదర్శించేకవులు పెరిగారు.

అది సామాన్య చదువులున్న మధ్య తరగతికైనా అర్థమయేలా విడమర్చే పనికొంతవిమర్శకులు చేయడం అవసరం.

ఏమైనా సామాన్య పాఠకుడికి కథ - నవల వంటివే ఉన్నంతలో అర్థం అవుతున్నాయి.

పాఠకులమాట ఎలాఉన్నా రచయితలకు ఒక దారిచూపడం మాత్రం విమర్శకులు పనిగా పెట్టుకోవాలి.

ఇందులో కొన్ని తనకు 'అస్పృశ్యం' అని విమర్శకులు అనుకోవడం తగదు. లేకపోతే పాఠకులు ఇవే కోరుతున్నారని పత్రికాధిపతులు, పత్రికాధిపతులు చెప్పేరుగాబట్టి అలాగే రాస్తామన్నే రచయితలు, రచయితలు రాసున్నారు కాబట్టి అవే గొప్పవనుకునే పాఠకులు మరింత మరింత సాహిత్య స్థాయిని నిరంతరం మరీ హీనస్థాయికి కూల్చడం మాత్రం జరుగుతూనే ఉంటుంది.

బైబిలులో ఒక కథఉంది. ఒకడు మురికి టేబిల్ని మరింత మురికి గుడ్డతో తుడవాలని ప్రయత్నిస్తూ ఉంటాడు. దానిమురికి దానికి దానిమురికి దానికి - అలా సాగుతూనే ఉంటుంది.

విమర్శకుడు ఈ కథని మర్చిపోకూడదు లేకపోతే దీపంలేకుండా చీకట్లో దారి చూపడానికి యత్నించడమే అవుతుంది.

మార్క్సిస్టు విమర్శకు ఉండవలసిన లక్షణాలు

నేటి మన సాహిత్యం నిర్దిష్ట చారిత్రక దశల్లోంచి పరిణామం చెందుతూ వచ్చింది.

దేశంలో కొత్త జీవితం సృష్టించబడుతుంది. ఇది సాహిత్యంలో ప్రతిబింబింపబడుతుంది. ఈ విధంగా మారుతున్న సాహిత్యంమీద రాజకీయ. నైతిక ప్రభావాలు వుంటూనే వుంటాయి. వర్గ సమాజం వర్గాలతో కూడి వున్నది. కనుక సాహిత్యం గూడ బూర్జువా సాహిత్యమని, శ్రామికవర్గ సాహిత్యమని వర్గీకరింపబడుతుంది. మారుతున్న ఈ సమాజంలో యింకా పాత సంప్రదాయాలు కొన్ని మిగిలి మౌలికమైన మార్పులకు అనుగుణంగా మారలేక దాని సంప్రదాయపు అస్తిత్వాన్నే నిలుపుకోచూస్తుంది. ఈ పాత, కొత్తల సంఘర్షణ సాగుతూనే వుంటుంది. నూతన ఆర్థిక విధానంలో గూడ బూర్జువా పాలకవర్గంయొక్క చిహ్నాలు కన్పిస్తూనే వుంటాయి. ఈ రకమైన సంఘర్షణ ప్రజల మానసిక ఆలోచనల్లో బహిర్గతమవుతూ వుంటాయి. ప్రమాదకరమైన ఈ బూర్జువా వ్యవస్థే కాక దానితోబాటు నిర్మూలించటానికి కష్టమైన మరో ప్రమాదకరమైన అంశం యింకొకటున్నది. అది పెట్టీ బూర్జువా భావనా ధోరణి – ఇవి శ్రామిక వర్గంలోను, చాలా మంది కమ్యూనిస్టులలో సైతము చోటుచేసుకుంటుంది. సోషలిస్టు భావాలతో శ్రామిక జనులు నిర్మించే నూతన సమాజం కోసం జరిగే పోరాటాలు కూడా ఈ వైఖరిని మార్చలేకపోగా ఈ భావాలే మరింత ధృఢపడే ప్రమాదం కూడా వుంది. ఈ పరిస్థితుల్లో కళాసాధనాలు విశేషంగా సాహిత్యం చాలా ప్రాముఖ్యతను వహించవలసివస్తుంది. ఈ పరిస్థితులే ప్రోలెటేరియన్ సాహిత్యాన్ని దానికి దగ్గరగా వుండే సాహిత్యాన్ని సృజిస్తాయి. దానికి వ్యతిరేకంగా వచ్చే సాహితీధోరణులైన నిరాశావాదం, వ్యక్తివాదం, మొదలైన వక్రీకరణలనుప్రతిఘటించవలసివస్తుంది. ఈ పరిస్థితుల్లో ప్రధాన పాత్ర వహించవలసిన సాహిత్యం మార్క్సిస్టు విమర్శనా పద్ధతిని అవలంబించవలసిన అవసరం వుంది.

సాహిత్యంతోపాటుగ ప్రతి రచయిత ధృఢతరమైన శక్తిసామర్థ్యాలతో నూతన మానవుడ్ని, నూతన జీవన విధానాన్ని సృష్టించే కార్యక్రమంలో విస్తృతమైనకృషి చేయవలసి వుంటుంది.

చేకూరి శ్రీనివాసరావు

మిగతా సాహిత్యానికి, మార్క్సిస్టు విమర్శనా సాహిత్యానికి ఒక ప్రధానమైన భేదం వుంది. అది సామాజిక స్వభావాన్ని కలిగి వుండటమే. మార్క్స్ లెనిన్ చెప్పిన శాస్త్రీయ, సామాజిక స్వభావాన్ని గూడకలిగి వుంటుంది. ఒక్కొక్కప్పుడు సాహితీ విమర్శకుడు, సాహిత్య చరిత్రకారుడు చేయవలసిన పనుల్లో భేదముంటుంది.

సాహిత్య చరిత్రకారుడు చేయవల్సింది భూత, వర్తమాన కాలాల యొక్క విశ్లేషణే కాకుండ అది ఎప్పుడు పుట్టిందీ అనే దానిని గూర్చి నిష్పాక్షిక విశ్లేషణ సామాజిక వ్యవస్థలో దాని స్థానం, సామాజిక జీవితంపై దాని ప్రభావం కూడా చర్చించాలి. అయితే సాహితీ విమర్శకుడు ఆ కళలోనున్న సామాజిక తప్పొప్పులను గురించి చేసే మూల్యాంకనము మీద ఈ రెంటికి తేడా ఆధారపడి వుంటుంది.

మార్క్సిజం దృష్టిలో ఒకదానిపై మరొకటి ఆధారపడివున్న విడివిడి భాగాల యొక్క సమిష్టి స్వరూపమే సామాజిక జీవితం. శ్రమరూపాలు, భౌతిక, ఆర్థిక సంబంధాలు యిక్కడ ప్రధాన పాత్రను వహిస్తాయి. ఒక యుగాన్ని విశ్లేషించేటప్పుడు మార్క్సిస్టు విమర్శకుడు ఆ కాలంలోని సామాజిక పరిణామంయొక్క పూర్తి స్వరూపాన్ని చిత్రించవలసి వుంటుంది. ఆ రచనలు, ఆ సమాజ నిర్మాణానికి ఆయా, వర్గ మనస్తత్వాలకి గల సంబంధంపైన ఆధారపడి వుంటాయి. సాహిత్యము, తెలిసో, తెలియకో ఆ రచయిత ప్రాతినిధ్యం వహించిన వర్గ మనస్తత్వాన్ని ప్రతిబింబిసుంది. ఆ రచయితపై అనేక వర్గాల వల్ల ప్రభావితమైన అనేక అంశాలుకూడ ఆ సాహిత్యంలో ప్రతిబింబిస్తాయి. అట్టి విషయాన్ని మార్క్సిస్టు విమర్శకుడు చాలా నిశితంగా పరిశీలించి విశ్లేషించవలసి వుంటుంది. సాహిత్యంలో ఈ రకమైన వర్గ మనస్తత్వ లక్షణాలు ప్రధానంగా దానిలో చర్చించిన విషయవస్తువు మీద ఆధారపడి వుంటుంది. రూపంతోటి పోల్చుకున్నప్పుడు విషయవస్తువే మిగతా కళా రూపాలనుండి సాహిత్యాన్ని వేరుచేస్తుంది. కళాత్మకమైన విషయవస్తువు ద్వారా వుత్పన్నమయ్యే భావావేశాలు పద చిత్రణల ద్వారా రూపొందుతాయి, విషయానికి తగిన రూపాన్ని, రీతిని భావ వ్యక్తీకరణకు రచయిత ఎన్నుకొంటారు. ఎవరికోసమైతే రచన వుద్దేశించబడిందో వారికి అర్థమయ్యే రీతిలో స్పష్టమైన పద్ధతిలో రచయిత ఆలోచనలకు, అనుభూతులకు ఆకృతి యివ్వవలసి వుంటుంది.

అందువలన మార్క్సిస్టు విమర్శకుడు సామాజిక స్వభావాన్ని వస్తువుగా కలిగిన రచనను మాత్రమే విశ్లేషించడాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకోవాలి. దానికి, సామాజిక వర్గాలకు గల సంబంధాన్ని సమాజంపైగల దాని ప్రభావాన్ని నిర్ణయించాలి. ఆ తరువాత మాత్రమే మార్క్సిస్టు విమర్శకుడు ఆ రచయిత ఎన్నుకున్న రూపం ఎంతవరకు అతను చెప్పదలచుకున్న భావ వ్యక్తీకరణకు తోడ్పడిందీ అన్న విషయాన్ని విశ్లేషించాలి.

ఒక సాహితీ రూపాన్ని కేవలం ఎన్నుకున్న విషయ వస్తువు మాత్రమే కాక అనేక యితర అంశాలుగూడ దానిని నిర్ణయిస్తాయి. ఒక వర్గ మానసిక ఆలోచనా క్రమం, దాని జీవన విధానం ఆ సమాజ భౌతిక సంస్కృతియొక్క ప్రామాణ్యత, గతంలో ఆ సమాజం యొక్క సభ్యత, వర్తమానంలో దానిని మార్చటానికి చేసే ప్రయత్నాలు యివన్నీ ఒక సాహితీ రూపాన్ని నిర్ణయిస్తాయి.

ఇక్కడ మార్క్సిస్టు విమర్శకుడు తన మార్క్సిస్టు విమర్శనా పద్ధతులను సాహిత్యానికి అన్వయిస్తూ శాస్త్రీయ, సామాజికవేత్తగా మనకు కనిపిస్తాడు. మార్క్సిస్టు విమర్శనాపద్ధతికి ఆద్యుడైన ప్లెఖనోవ్ ప్రతి మార్క్సిస్టు విమర్శకుడు ఈ పద్ధతినే అనుసరించాలి అన్నాడు. మార్క్సిస్టు విమర్శకుడు సాహిత్యానికి కొన్ని ప్రత్యేకమైన లక్ష్యాలను వుద్దేశిస్తాడు. సంప్రదాయ పద్ధతిలోవున్న ఆత్మాశ్రయ విమర్శనా పద్ధతులకు వ్యతిరేకంగా నిష్పాక్షిక, శాస్త్రీయ మార్క్సిస్టు విమర్శనా పద్ధతిని ప్రవేశ పెట్టి ప్లెఖనోవ్ భవిష్యత్తు మార్క్సిస్టు విమర్శకు మార్గాన్ని చూపించాడు. మార్క్సిజం అనేది కేవలం ఒక సామాజిక సిద్ధాంతం మాత్రమే కాదు. ఒక చురుకైన నిర్మాణ కార్యక్రమము గూడ వాస్తవ విషయాలను నిష్పాక్షిక దృష్టితో మూల్యాంకనము (Evaluation) చేయనియెడల నిర్మాణాత్మక కార్యక్రమాన్ని వూహించటము కష్టం. మార్క్సిస్టు విమర్శకుడు తన చుట్టూ వున్న అస్తిత్వాన్ని గురించి నిష్పాక్షిక భావన చేయాలి. నిజమైన మార్క్సిస్టునుండి మనం ఇంకా ఎక్కువ ఆశిస్తాం. అది, ఏ విషయం పరిసరాల్ని ప్రభావితం చేస్తుంది అన్నది మార్క్సిస్టు విమర్శకుడు ఏదో సాహితీ ఖగోళ శాస్త్రజ్ఞుడుగా సాహిత్యంలో వచ్చే తప్పనిసరి మార్పుల సూత్రాలను వివరించటము మాత్రమేకాదు. ఆతనొక సాహితీ సైనికుడుగ నిర్మాణ కార్యక్రమములో పాత్రధారుడుగా వుండాలి. అంటే సమకాలీన మార్క్సిస్టు విమర్శనా లక్షణాలలో ప్రధానమైన అంశము మూల్యాంకనము (Evaluation).

ఒక సాహితీరూపము యొక్క ఈ మూల్యాంకన విధాన విషయవస్తువును ప్రమాణముగా తీసికొని నిర్ణయించబడుతుంది. శ్రామిక జన శ్రేయస్సుకు ఏది వుపయోగపడుతుందో అది మంచిది- ఏది హానిచేస్తుందో అది చెడ్డది అని నిర్ణయించవలసి వుంటుంది ఆ రచన సామాజిక ధోరణిని ఏ వైపు పయనింప చేస్తుంది అన్నదానిమీద ఆధారపడి మార్క్సిస్టు విమర్శకుడు ప్రధానంగా మూల్యాంకనము చేయవలసి వుంటుంది. అందుకు మార్క్సిస్టు విమర్శకుడికి ప్రత్యేకమైన మార్క్సిస్టు శిక్షణ, శక్తి సామర్థ్యాలు అవసరం. Social sensitivity అవసరము. సామాజిక జీవితంపైన ప్రభావితం చేసే ప్రతి సమస్యనూ మార్క్సిస్టు విమర్శకుడు దృష్టిలో వుంచుకోవాలి.

సామాజిక విషయ వస్తువుని మూల్యాంకనము చేసేటప్పుడు ఆ రచన ప్రథమంలో మనకు అభ్యుదయ నిరోధక

భావాలను ప్రతిబింబిస్తున్నట్లు కనిపించినా దాని విలువను గురించి రెండవ నిర్ణయాన్ని కూడా చేయవలసి వుంటుంది. అది అప్పుడు మన జీవితాన్ని గూర్చి తెలుసుకోవటానికి దోహదం చేస్తుంది మార్క్సిస్టు విమర్శకుడు ఫలానా రచయిత పెట్టిబూర్జువా రచయిత అనీ ఫలానా రచన పెట్టిబూర్జువా రచన అని త్రోసివేయగూడదు. దానినుంచి కొంత లాభం పొందే అవకాశముంటుంది. మన శత్రువులయొక్క వైఖరిని గురించి తెలుసుకొనే అవకాశముంటుంది. అందువలన మార్క్సిస్టు విమర్శకుడు అట్టి రచనను నిర్మాణాత్మకమైన ప్రయత్నములో అది ఎంతవరకు వుపయోగపడుతుంది అన్న విషయాన్ని గురించి రెండవసారి మూల్యాంకనము చేయవలసి వుంటుంది. ఆ రకమైన వ్యతిరిక్త సాహిత్యంవల్ల అందులో కొంతవరకు ఉపయోగకరమైన అంశములున్నప్పటికిని, ఎక్కువగ హానికరమైన అంశాలే ప్రచారం అవుతాయి గనుక మార్క్సిస్టు విమర్శకుడు రెండవసారి చేసే మూల్యాంకన విధానము అట్టి రచనలపై మార్క్సిస్టు సెన్సార్‌షిప్ విధించినట్టుగా కనిపిస్తుంది. మార్క్సిస్టు విమర్శకుడి పని విషయ మూల్యాంకనముకంటె రూప మూల్యాంకనములో క్లిష్టతరమవుతుంది. రచనారూపం భావ వ్యక్తీకరణను సులభతరం చేసేదిగా వుండాలి, సహజసిద్ధంగా వుండాలి. వస్తువులో వైవిధ్యము, నూతనత్వం లేకపోతే ఆ రచన విలువ తగ్గిపోతుంది. రచనలో పునరుక్తి ఒక కళగాదు. శిల్పం మాత్రమే. అందువల్ల రచయిత యింతకు ముందెన్నడూ ఏ రచయితా తీసుకోనట్టి వస్తువును తీసికోవాలి. వస్తునవ్యత, రూపనవ్యతను కోరుతుంది. భాష, పదసముదాయం, వాక్య నిర్మాణం, కథా సంవిధానం, భావం, లయ మొదలైన విషయాలను మార్క్సిస్టు విమర్శకుడు తన విమర్శలో చూపవలసి వుంటుంది. కొత్తగా రాసే యువ రచయితలకు మార్క్సిస్టు విమర్శకుడు ఒక మార్గదర్శకుడుగా వుండాలి. రచనా రూపంయొక్క అమరిక (Organisation) ఒక్కొక్కసారి విషయం (Content) డొల్లగా వున్నప్పటికిని కొన్ని నగిషీలు (ornamentation) చెక్కటం మూలంగా వస్తువు ఉదాత్తంగా కనిపిస్తుంది. ఆ విధంగా రూప నగిషీలో దాగియున్న వస్తుడొల్లను మార్క్సిస్టు విమర్శకుడు బయట పెట్టాలి. వాస్తవానికి దూరంగావుండి సంప్రదాయ కళాపద్ధతులతో కొదిమంది రసవాదుల కొరకే రచనలు గావించే రచయితల ఆలోచనా ధోరణిని నిర్ద్వంద్వంగా ఖండించాలి. మామూలు కథా వస్తువును తీసికొని కోట్లాది ప్రజల హృదయాల దగ్గరకు పోగలిగిన రచయితను మార్క్సిస్టు విమర్శకుడు గౌరవించాలి. శ్రామిక జన శ్రేయస్సు కోసం వచ్చే సాహిత్యానికి మార్క్సిస్టు విమర్శకుడు విలువ నివ్వాలి.

మార్క్సిస్టు విమర్శకుడు రచయిత పట్ల ఉపాధ్యాయ వైఖరిని కలిగి వుండాలి. దృఢమైన మార్క్సిస్టు అభిప్రాయాలను, పాండిత్యాన్ని, అభిరుచిని కలిగివుండాలి. విమర్శకుడు తాను రచయిత కంటే

గొప్పవాడిననే భావాన్ని రానీయకుండా రచయితకు నూతన విషయాలు తెలియ పరచుతూ తాను కూడా రచయిత నుండి కొంత నేర్చుకొనే ఉద్దేశంతో విమర్శ చేయాలి. మార్క్సిస్టు విమర్శకుడు యువ రచయితలకు వారి రచనల్లోని లోపాలను చూపి రచయితలకు ఒక ఉపాధ్యాయు డుగా వుండాలి. శ్రామిక జన పక్షపాతి గాని రచయితలు కొందరు వారి రచనాకాల యుగ లక్షణాలు తెలియక, సామాజిక జీవన సూత్రాల గురించి అవగాహన లేక, అనేక తప్పులు చేయవచ్చు. ఒక్కొసారి ప్రొలిటేరియన్ సాహిత్య సృష్టికర్తలు గూడ యీ లోపానికి గురి కావచ్చు. అలాంటి సందర్భాలలో ఆ రచయితల లోపాలను మార్క్సిస్టు విమర్శకులు సరి దిద్దాలి. ఈ రకంగా పెద్ద పెద్ద రచయితల, సాహితీ విమర్శకుల అన్యోన్య సహ కారంతోనే నిజమైన గొప్ప సాహిత్యం పుట్టింది_ముందు కూడా పుడుతుంది.

మార్క్సిస్టు విమర్శకుడు రచయితకు మాత్రమే ఉపాధ్యాయుడు గాదు. పాఠకు లకు గూడ తెలియని విషయాలను గురించి తెలియజేయాల్సి వుంటుంది. ఎలా చదవాలి అనేది పాఠకుడికి కూడ చెప్పవలసి వుంటుంది. విమర్శకుడు ఒక భాష్యకారుడుగా పాఠకునికి ఏ సాహిత్యం చదవాలి, ఏ సాహిత్యం చదవగూడదు అనే విషయాన్ని తెలియచేయాలి కోపంతో గాని, దుర్భావంతో గాని, వర్గ సంబంధమైన ఈర్ష్యలతో గాని విమర్శ చేయగూడదు. రచనలో వున్న మంచిని పాఠకునికి చూపాలి అనే ధ్యేయంతోనే విమర్శ చేయాలి.

మార్క్సిస్టు విమర్శకుడు కళ యీ రకంగా వుండాలి అని మాత్రం ఎప్పుడూ చెప్పగూడదు. కళ యీ రకంగా వున్నది, అది ఎందుకలా వున్నది అని మాత్రమే అతను ఎప్పుడూ చెప్పవలసి వుంటుంది అని సుప్రసిద్ధ కళా విమర్శకుడు ప్లెఖనోవ్ అన్నారు.

(A Marxist must never say: Art must be such and such, but must always say : Art is such and such, and this is why —Plekhanov).

విమర్శ- మార్క్సిస్టు దృక్పథం : మార్క్సిస్టు దృక్పథంలో అంతర్లీనంగా వున్న ప్రధాన లక్షణం అంతర్జాతీయ దృక్పథం. మార్క్సిజమ్ ఏ ఒక్క దేశానికో, ఏ ఒక్క సంఘానికో పరిమిత మైన సిద్ధాంతం కాదు. ఆదిమానవుడి నాగరికత ప్రారంభమైన నాటినుండి నేటి వరకు గల చరిత్రను, దానిలోని సంఘటనలను శాస్త్రీయ దృక్పథంతో వివరించి చెప్పిన ఒక సమగ్రమైన సిద్ధాంతం. సాహిత్య లక్షణాలైన సౌందర్యం, వాస్తవికత, తాత్వికత అనే అంశాలను విమర్శనాదృష్టితో పరిశీలించే ముందు సాహిత్యానికి, సమాజానికి వున్న సంబంధం ఎలాంటిది అని తెలుసు కోవాలి. సాహిత్యంలో వచ్చే మార్పు లన్నీ సమాజములోని ఉత్పత్తి, ఆర్థిక సంబంధాలపై ఆధారపడి వుంటాయి. సమాజము దాని దైనందిన కార్యకలా పాలు, సంబంధాలు, పరిసర ప్రకృతి అంతటినీ కలిపి సామాజిక అస్తిత్వం

అంటారు. ఈ అస్తిత్వం పునాదిగా వున్న సాహిత్యం సామాజిక చైతన్య రూపాలలో ఒకటి. చైతన్యం అనేది పదార్థమూలకం. చేతనలో ఈ అస్తిత్వం ప్రతిబింబానికి సామాజిక చైతన్యం అని పేరు. సృష్టిలో ప్రతిదీ గతిశీలం. ఇది సాహిత్యానికి కూడ వర్తిస్తుంది. మార్క్సిస్టు విమర్శకుడు ఈ గతిని అవగాహన చేసుకోవాలి. ఏరచననైనా పరిశీలించేటప్పుడు అప్పటి చారిత్రకతను విస్మరించకూడదు. ఏ కళ అయినా అది పుట్టిన చారిత్రక దశస్థాయిని మించిపోలేదు. అందుకని విమర్శకుడు ఆ చారిత్రక దశలను గమనించాలి.

సాహిత్యం స్వతంత్ర ప్రతిపత్తి గల రంగంగా భ్రమ కలిగించవచ్చును. కాని ఒక నిర్దిష్ట దశలోనే సమాజంలో భాగంగావుండి ఒక దశలోని వ్యక్తుల తోటి సంబంధము వుండుటవలననే రచయిత రచన చేయగలుగు చున్నాడు వాస్తవ ప్రపంచాన్ని విడిచి సాహిత్యం వుండజాలదు. మార్క్సిస్టు దృక్పథంతో సాహిత్యాన్ని పరిశీలించటమంటే, ప్రకృతిని, చరిత్రను, సాహిత్యాన్ని గతితార్కిక భౌతికవాద పరంగా పరిశీలించటమని అర్థం. చైతన్యం పదార్థ మూలకమని చెప్పేది భౌతికవాదం. చైతన్యానికి పునాదిభావం అని చెప్పేది భావవాదం. సాహిత్యాన్ని భావవాద పరంగాకాక భౌతికవాద పరంగా పరిశీలించటమే చారిత్రక దృక్పథం అనబడుతుంది. గతితర్కం అంటే పరస్పర వాదం. ప్రకృతిలో సమాజంలో ప్రతి వస్తువు మరొక వస్తువుమీద ఆధారపడివుంటుంది. ప్రతిదీ చలనంలో వుండి నిరంతరం మారుతూ ఉంటుంది. మనిషి ప్రకృతిలోని శక్తులను తన అవసరాలకు ఉపయోగపడే రీతిలో దానిని మార్చటానికి చేసే ప్రయత్నంతోపాటు తాను గూడ మార్పు చెందుతూ వుంటాడు. ఈ మార్పే సామాజిక భౌతిక జీవితంనుంచి ఉద్భవించిన సామాజిక చైతన్యం. అంటే సామాజిక చైతన్యాన్ని భౌతిక జీవితమే నిర్ణయిస్తుందన్నమాట. దీనికి సమాజ ఆర్థిక విధానం పునాది. మతం,నీతి,తత్వశాస్త్రం, రాజకీయాలు, న్యాయశాస్త్రం, సాహిత్య కళారంగాలు సామాజిక చైతన్య రూపాలుగావున్న ఉపరితల అంశాలు. పునాదికి, ఉపరితలానికిమధ్య అన్యోన్య ప్రభావం ఉంటుంది. ఉపరితల అంశాల మధ్య అన్యోన్యక్రియ వుంటుంది. పునాదిలో మార్పులు సామాజిక చైతన్య రూపాలనించే వ్యక్తులకు అనుభవంలోకి వస్తాయి. సాహిత్యాన్ని చారిత్రక దృక్పథంతో పరిశీలించటం అంటే సాహిత్య చరిత్రని ఆర్థిక దృక్పథంనించి సామాజిక దృక్పథంనించి వివరించటం కాక పునాది, సామాజిక చైతన్య రూపాలైన ఉపరితల అంశాల్ని కలిపిసమిష్టిగా పరిశీలించటం అని అర్థం. సాహిత్యం సామాజిక చైతన్య రూపంగాబట్టి దాని పుట్టుక, మార్పులు, ప్రయోజనం మొదలైన అంశాలను సామాజిక అస్తిత్వం నుంచే పరిశీలించాలి. ఉత్పత్తి సంబంధాల మార్పునుంచి సాహిత్యాన్ని పరిశీలించాలి. పునాదియైన ఆర్థిక రూపాలలో

వచ్చిన మార్పులు అవి ఉపరితల అంశా లలో ప్రతిబింబించిన తీరు అట్టి మార్పు లకి, సాహిత్యానికి వున్న అన్యోన్య క్రియల్ని పరిశీలించాలి. సాహిత్యాన్ని కేవలం ఆర్థికవిధానం మాత్రమే పునాదిగా తీసుకొని పరిశీలించటం అర్థరహితం. సామాజిక చైతన్య రూపాలైన తత్వ శాస్త్రం, మతం, నీతి, న్యాయశాస్త్రం, రాజకీయాలు గూడ సాహిత్యంలో మార్పుల్ని నిర్ణయిస్తాయి. అందుకని సాహిత్యాన్ని మార్క్సిస్టు దృక్పథంలో పరిశీలించేటప్పుడు పునాది, ఉపరితల అంశాల పరస్పర సంబంధం, ప్రభావం, ఉపరితల అంశాలలోనే ఒకదానిపై వేరొకదానికున్న ప్రభావాన్ని దృష్టిలో వుంచుకొని మాత్రమే సాహిత్య విమర్శకుడు అధ్యయనం చేయవలసి ఉంటుంది.

[వర్గ సమాజంలోవుండే సాహిత్యం భౌతిక సంపదమీద అధికారంవున్న వర్గానికే సంబంధించి ఆ వర్గాన్నే కాపాడుకో చూస్తుంది].

మతం, రాజ్యాంగం, తత్వశాస్త్రం, సాహిత్య కళారంగాలైన చైతన్య రూపాలకు స్వతంత్ర ప్రతిపత్తి వుండదు. సామాజిక చైతన్య రూపాల్ని పునాదినుంచి విభజించి వాటికి స్వతంత్ర చరిత్రల్ని కల్పించటానికి చేసే ప్రయత్నం కేవలం భావవాద ప్రయత్నం మాత్రమే. ఆ రకంగా పరిగణించటం మార్క్సిస్టు అవగాహనకు విరుద్ధమైనది. సాహిత్య చరిత్ర మీద తప్పుడు చైతన్యంతో కూడిన భావవాద దృక్పథం వర్గసమాజ క్రమఫలితమే. వర్గ సమాజాన్ని నిర్మూలించినప్పుడే ఈ వర్గ సమాజంలోని తప్పుడు చైతన్యాన్ని, భావవాద ధోరణిని నిర్మూలించగలం. కాని విమర్శద్వారా నిర్మూలించలేక పోయినా విమర్శకుడు తన విమర్శద్వారా మార్క్సిస్టు సెన్సార్‌షిప్పుని విధించ గలగాలి.

ఇప్పటివరకు చరిత్రని, సాహితీ చరిత్రని రాసినవాళ్ళు భౌతికవాద దృక్ప థంతో కాక కేవలం భావవాద దృక్పథం తోనే రాశారు. పునాది, ఉపరితల అంశాలకి వున్న అన్యోన్య సంబంధం ప్రభావాన్ని భౌతికవాద దృక్పథంతో అవగాహన చేసుకొనక వాటికి స్వతంత్ర ప్రతిపత్తిని ఆపాదించి చరిత్రనీ, సాహితీ చరిత్రనీ సృష్టించారు.

"నా విష్ణుః పృథివీపతిః" అనే సిద్ధాంత ప్రాతిపదికపై పరిపాలించిన రాజులే చరిత్ర నిర్మాతలని, కొంతమంది మహా పురుషులే చరిత్ర నిర్మాతలని చరిత్ర కారులు చరిత్ర సృష్టిగావించారు. కారణ జన్ములైన మహాపురుషులు చరిత్ర నిర్మాత లైన ప్రజలతో కలిసే చరిత్రను నిర్మిం చారన్న విషయాన్ని విస్మరించి చరిత్రను రాశారు. కేవలం వ్యక్తుల చైతన్యమే కాక ఆనాటి చారిత్రక దశలోని వస్తు విషయ సంబంధమైన పరిస్థితులుగూడ చరిత్ర సృష్టికి కారణభూతమౌతాయని చారిత్రక దృక్పథం వాళ్ళలో లేదు. అలాగే కవుల జీవిత చరిత్ర, సాహిత్య చరిత్రలను రాసిన వాళ్ళుగూడ తప్పుడు చైతన్యంతో కూడిన భావవాద దృక్పథంతోనే నేడు మనకున్న సాహిత్య చరిత్రని మన సాహిత్య చరిత్రకారులు

సృష్టించారు. కవి జీవితచరిత్రలను రాసే టప్పుడు అతని కులగోత్రాలు, నివాస స్థలాలు, అతను జీవించినకాలం చేసిన రచనల్ని గురించి మాత్రమే రాశారు కాని ఆ కవి ఒక సామాజిక జీవి అని ఒకా నొక చారిత్రక దశలో జీవించిన మనిషనీ అతని ఆలోచనలపై ఆనాటి పరిస్థితుల ప్రభావం వుంటుందనిగాని వారికిలేదు. ఆ కవులు రాసిన రచనల్ని వారు కేవలం ఆధ్యాత్మికవాద కోణం నుంచీ, భావ వాద దృక్పథంనుంచీ, పరిశీలించి రాసిన గ్రంథాలే.

మహా పురుషులే చరిత్ర నిర్మాతలనే భావవాద దృక్పథం సాహిత్య చరిత్ర రాసినవాళ్ళకూ వుంది. సాహిత్యాన్ని అర్థంచేసుకోవటానికి ఆ సాహిత్యం పుట్టిన సామాజిక, ఆర్థిక పరిస్థితులను గూడ అధ్యయనం చేయాలి. సాహిత్య చరిత్రను పరిశీలించేటప్పుడు వస్తుగత, బాహ్య విషయాలనుగూడ పరిశీలించాలి. అలాకాక "వాఙ్మయమున తీర్థభూతులైన కొందరు మహాత్ములుందురు. వారే యుగ కర్తలనియు, శక కర్తలనియు వ్యవహ రింపబడు మహాకవులు". (ఆంధ్ర సాహిత్య చరిత్ర-పింగళి లక్ష్మికాంతం) అని సాహిత్య చరిత్ర రాయటం కేవలం భావవాద దృక్పథ ఫలితమే. "కావ్య జన్మస్థలము కవిహృదయ క్షేత్రము ఇది నాది అని అతడు చెప్పుకోతగిన సొంత ధనము" (ఆంధ్ర సాహిత్య చరిత్ర - పింగళి లక్ష్మికాంతం) అని సాహిత్య చరిత్ర రాయటం గూడ సాహిత్యాన్ని సమాజంనుండి పరాయీకరణ (Alienate) చేసి దానికి స్వయం ప్రతిపత్తిని ఆపాదించటమే అవుతుంది.

"సంప్రదాయం జాతి జీవిత సౌధానికి పునాది వంటిది. సంప్రదాయాలకు దేశ కాలాలు నిరోధకాలు కావు. సంస్కృతీ పుష్టమైన ఏ జాతికూడ సంప్రదాయాలకు దూరంగా వుండలేదు." (తెలుగువాణి-ప్రపంచ తెలుగు మహాసభల ప్రత్యేక సంచిక-పేజీ 274. డా॥ సి.నారాయణ రెడ్డి)

సంప్రదాయం శాశ్వతం. దానికి విచ్ఛిన్నతలేదు. అది అవిచ్ఛిన్నం. రీతి మారినా, రూపుమారినా సంప్రదాయం మారదు. మానవునిలో వికాస మున్నన్ని నాళ్ళు సంప్రదాయము సజీవముగా నుండును. ప్రయోగములెన్ని జరిగినను తుదకు సంప్రదాయము పూర్వగతిలో ప్రవహించును". (ఆధునికాంధ్ర కవి త్వము, సంప్రదాయము-ప్రయోగములు సి. నారాయణరెడ్డి) ఈ రకంగా సాహిత్య చరిత్రని రాయటంగూడ భావ వాద దృక్పథ ఫలితమే. బూర్జువా భావ జాల క్రమఫలితమే. "రీతిమారినా, రూపుమారినా" అని అనటంలో బహిరా కారాన్ని మాత్రమే పరిశీలించి అసలు సారాంశాన్ని [Essence] పరిశీలించక పోవటమే ఈ అవిచ్ఛిన్నతా వాదం పుట్టింది. "సత్యం శివం, సుందరం" అన్నప్పుడు శివం శాశ్వతత్వానికి ప్రతీక కాని సృష్టిలో పతనావస్థలేనిదేదీ లేదు. భౌతికవాద దృక్పథంతో పరిశీలించినట్ల యితే, మార్పు లేకుండ ఎన్ని ప్రయో గాలు చేసినా ఒక చారిత్రక దశలోని సంప్రదాయం మరొక చారిత్రక దశలో గూడ నిలదొక్కుకున్నదంటే ఆ సంప్ర

దాయాన్ని సృష్టించిన వర్గ లక్షణాలు మార్పులేకుండ మరో చారిత్రకదశలో ఉన్నట్లుగానే భావించాలి. అంటే పాత పాలక వ్యవస్థ తాలూకు చిహ్నాలే మారిన నూతన వ్యవస్థలో కూడా ఉన్న పుడు ఆ వ్యవస్థలోని వర్గ లక్షణాలు పూర్తిగ నిర్మూలింపబడలేదని అర్థం. కనుక పైన పేర్కొన్న భావాలు వ్యక్త పరచడం బూర్జువా వర్గ భావజాలంనుండి బయటపడలేక పోవటమే. ఆధునిక సాహిత్యం పేరుతో చలామణీ అవు తున్న ఈ ప్రమాదకరమైన బూర్జువా భావజాల ధోరణులను మార్క్సిస్టు విమ ర్శకుడు నిరసించాలి.

"కవితా విప్లవాలు కేవలం కవులవల్ల రావు. కవులు కవితా విప్లవానికి వైయక్తిక కారణంగా ఉపకరిస్తారు. వస్తు కారణంగా సందర్భంలోను, శ్రోత ల్లోనూ వుంది. కవితా విప్లవాలు ఈ రెండు కారణాల పరస్పర చర్యవల్ల వస్తాయి. సాహిత్య చరిత్ర సాహిత్య రంగంలోనే ఒక ఆంతర గతితర్కంవల్ల నడుస్తుంది." (పేజీ 220 తెలుగులో కవితా విప్లవాల స్వరూపం-వేల్చేరు నారా యణరావు) సాహిత్య రంగంలో వచ్చే విప్లవాలకు భౌతిక సంబంధమైన ఆర్థిక పునాదికి మిగిలిన సామాజిక చైతన్య రూపాలకివున్న అన్యోన్య సంబంధం ప్రభావాలవల్ల కాక కవి-సందర్భం శ్రోత అనే ఒక సూత్రాన్ని వేల్చేరు నారాయణ రావుఆయనపరిశోధన గ్రంథంలోప్రతిపా దించారు. ఈ ప్రతిపాదనలో సందర్భం అనేది సామాజికమైనదని వివరణ యిచ్చారు. సామాజిక మార్పు రావటం అని అభిభాషణ కావచ్చు" యిక్కడ సందర్భం అనే మాటకు అసలు ఏది పునాది అనే వివరణ యివ్వలేదు. పైగా "సాహిత్య చరిత్ర సాహిత్య రంగంలోని ఒక ఆంతర గతితర్కంవల్ల నడుస్తుంది" అని అనటంలో సాహిత్యంలో మార్పు భౌతిక సంబంధమైన కారణాలవలన కాకుండ దానంతట అదే మార్పు చెందుతుంది అనే భావం స్ఫురిస్తుంది. సాహిత్య రంగంలోని ఆంతర గతి తర్కం అనడం రచయిత మానసిక స్థితిలోని ఆంతర గతితర్కమా అనే అనుమానంగూడ వస్తుంది. కేవలం రచయిత మానసిక స్థితిలోను సాహిత్య రంగంలోని ఆంతర గతితర్కంవల్లనో సాహిత్యంలో విప్లవాలు వస్తాయనుకోవ డం చారిత్రక భౌతికవాద దృక్పథాన్ని కాదని భావవాద దృక్పథాన్ని అంగీక రించడమే అవుతుంది. ఇటీవల డాక్టరేట్ డిగ్రీల కోసం రాసే పరిశోధన వ్యాసాల్లో ఈ రకమైన భావవాద దృక్పథాలు కని పిస్తూవున్నాయి. మార్క్సిస్టు విమర్శ కులు యిలాంటి పరిశోధనా వ్యాసాలను గూడ విమర్శనా పరిధిలోనికి తీసికొని సమాజ మార్పుకి దోహదపడే సాహి త్యాన్ని సృష్టించటానికి తోడ్పడాలి.

"సాధారణంగా ఏ సాహిత్య ఉద్యమ మైనా పాతది తెరమరుగవుతుండగా కొత్త వుద్యమం దాని అంతస్సీమలనుండే పుట్టుకరావడం తరచు చూస్తుంటాము" [పేజీ 100 - సాహిత్య పరిచయం - ఇంద్రగంటి శ్రీకాంతశర్మ]. అని అనడం లో గూడ శ్రీ ఇంద్రగంటి శ్రీకాంత శర్మ గారు తెరమరుగవుతున్న పాత ఉద్యమం

నుండే కొత్త ఉద్యమం పుడుతుందన డంలో కూడ మారుతున్న సామాజిక భౌతిక పరిస్థితుల వల్లకాక ఒక సాహిత్య ఉద్యమంనుండి మరో సాహిత్యఉద్యమం పుడుతుందనడంగూడ భావవాద దృక్పథం ఫలితమే.

"భూగర్భ జలసంపదలాగ కవిత్వ మనేది సహజ స్వచ్ఛత, ధారాశుద్ధి కలిగి, స్పష్టంగా కవి మనస్సునుండి రాగలిగి నప్పుడే అది ఉత్తమ కవిత్వ మవు తుంది" [పేజీ 134-సాహిత్య పరిచయం ఇంద్రగంటి శ్రీకాంతశర్మ]. ఇక్కడ శ్రీకాంతశర్మగారు వుత్తమ కవిత్వమంటే యిది అని లాక్షణీకరించారు. ఆ రకంగా కవి మనస్సునుండి వచ్చినా దానికి సామా జిక ప్రయోజకత్వం, లక్ష్యం లేకపోయిన ట్లయితేమార్క్సిస్టువిమర్శనాదృష్టిలోఅది వుత్తమ కవిత్వ మనిపించుకోదు. కేవలం అనుభూతి కవిత్వం అనిమాత్రమే అనిపించు కుంటుంది. సాహితీ విమర్శ పేరుతో శ్రీ శ్రీకాంతశర్మగారు వారు రాసిన "సాహిత్య పరిచయం" అనే గ్రంథంలో కేవలం రచయిత జన్మస్థలం, జన్మించిన తేదీ, వారి రచనలు గురించి మాత్రమే ఒకకాలక్రమపట్టికలోరాయడం జరిగిందిగాని భౌతికవాద దృక్పథంలో సాహిత్య విమర్శను చేయలేదనిపిస్తుంది.

ఇటీవలనే వచ్చిన మరో విమర్శనా గ్రంథం కోడూరి శ్రీరామమూర్తిగారు రాసిన "తెలుగు నవల-మనో విశ్లేషణ" దీనిలో శ్రీ శ్రీరామమూర్తిగారు కొన్ని నవలలను తీసుకొని వాటిలోని పాత్రల మనో విశ్లేషణ చేశారు. వారు చేసిన మనో విశ్లేషణలో మనో విశ్లేషణ సామాజిక భౌతిక వాస్తవి కతాపరంగా కాకుండ సుప్త చైతన్యాన్ని (unconscious) ఆధారంగా తీసికొని చేయడం జరిగింది. మనస్సులో అణచ బడివుండేవి, కేవలం కామ సంబంధమైన విషయాలేకాదు. ఆర్థిక సంబంధమైనటు వంటి అన్యాయాలు, దోపిడీలు, బాధలు కూడ సుప్త చైతన్యంలో వుంటాయి. గోపీచంద్ 'మెరుపులమరకలు' లోని ఉషారాణి, వడ్డెర చండీదాసు "హిమ జ్వాల"లోని గీతాదేవి పాత్రల యొక్క మానసిక సంఘర్షణ కేవలం అస్తిత్వ వాద సిద్ధాంతానికి లోబడినవేకాక ఆర్థిక సంబంధమైనటువంటి అసంతృప్తికూడ కారణమని గ్రహించాల్సి ఉంటుంది. గోపీచంద్ "అసమర్థుని జీవయాత్ర" లోని సీతారామారావు పాత్ర లోని న్యూనతాభావం కేవలం మానసిక సంబంధంకాదు. వంశ గౌరవం నిలబెట్టా లని తండ్రికి యిచ్చిన మాటకోసం అతను పడిన ఆర్థిక సంబంధమైన ఆవేదనమాత్రమే. ఈ రకమైన మానసిక సంఘర్షణలకి సమాజంలోనిఆర్థికసంబంధ మైనవ్యత్యాసాలే కారణమని శ్రీ శ్రీరామ మూర్తిగారు గ్రహించకపోవడం గూడ బూర్జువా ఆలోచనా క్రమఫలితమే.

మార్క్సిస్టు విమర్శకులు నేడు వస్తున్న సాహిత్యం, సమాజాన్ని కమ్యూనిస్టు వ్యవస్థవైపు పయనించ టానికి కావలసిన చైతన్యాన్ని అంద చేసేలా చెయ్యాలి. బూర్జువా భావజాలం లోని వికృతరూపాలైన స్త్రీయలిజం ఫ్యూచరిజం, డెడాయిజం, ఎగ్జెస్టెన్షియ లిజం మొదలైన ప్రమాదకరమైన సాహితీ ధోరణులను నేటి సాహితీ విమ ర్శకులు పోషలిస్తు వాస్తవికతా దృక్ప థంతో పరిశీలించి ఉత్తమ సాహిత్య సృజనకు తోడ్పడాలి.

పుస్తక సమీక్ష

ఒక పుస్తకం అచ్చయిన తర్వాత ఆ పుస్తక రచయిత-తన రచన సహృదయుల మన్నన పొందాలనీ, పాఠకుడు మంచి పుస్తకం చదివానన్న తృప్తి కలగాలనీ, భావపరిధి విశాలం కావాలనీ, ప్రచురణకర్త పదిమందీ కొనాలనీ ఆశిస్తాడు. రచయిత, పాఠకుడు, ప్రచురణకర్త — ఈ ముగ్గురి ఆశ-ఆకాంక్షలు కొంతవరకైనా తీర్చేందుకు, తీరేందుకు పరోక్షంగా దోహదమొనర్చే ముసుగువీరుడు పత్రికా సంపాదకుడు. ఐతే పుస్తకాన్ని సహృదయతతో చదివి దాని గుణదోషాలు బేరీజువేసి ప్రత్యక్షంగా పై ముగ్గురికీ దోహదకారి అయ్యే మహానుభావుడే సమీక్షకుడు.

సాహిత్య ప్రపంచంలో ఒక పుస్తకానికి గల స్థానం ఏమిటో విమర్శకులు నిదానంగా నిర్ణయించగలరేమో కాని ప్రారంభంలోనే దాని 'పస' పసిగట్టే పని పుస్తక సమీక్షకుడే చెయ్యటం జరుగుతుంది. ఒక పుస్తకం సాహిత్య విలువలను తెలియచేయటం కాని, అణచిపెట్టడం కాని, ఆ పుస్తకంలో లేని గొప్పతనాన్ని చాటటం కాని, లేని దోషాల్ని అంటగట్టడం కాని.... ఇత్యాది ఘనకార్యాలను చేయగల అఘటన ఘటనా సమర్థుడు పుస్తక సమీక్షకుడు.

ఈనాడు పుస్తక సమీక్ష గురించి ఆలోచించేవారు కాని, బాధపడేవారు కాని ఉన్నారంటే వారు సాహిత్య విలువల ప్రతిపాదనకై, సంరక్షణకై, సంవర్ధనకై కృతసంకల్పులైన రచయితలు, ప్రచురణకర్తలు, పాఠకులు అన్నమాట. పుస్తకసమీక్ష గురించి ఏమాత్రమూ ఆలోచించని, పట్టించుకోని మహానుభావులు కూడ ఉన్నారు. వారెవ్వరంటే కాలక్షేప సాహిత్యాన్ని బండ్లకొద్దీ తయారుచేసి పాఠక బకాసురులకు అందించే సాహితీ భీములు. పార్థీనియంలా పుట్టుకొస్తున్న ఈ మరమరాల సాహిత్యాన్ని వివిధోపాయాల ద్వారా అమ్ముకోగల ప్రచురణకర్తలు. ఈ ముగ్గురి ఆశయాలు సులభంగా నెరవేరుతాయి కాబట్టి 'మంది సాహిత్యం' పుస్తకసమీక్షను అపేక్షించే అవసరాలు తక్కువ. కాలక్షేప సాహిత్యానికి భిన్నమైన సాహిత్య రచనలు చేసే రచయితలు, ప్రచురించే ప్రకాశకులు, చదివే పాఠకులకే పుస్తకసమీక్ష అవసరమయ్యేది. 'మంచి సాహిత్యం' వెలువడేదీ తక్కువే. ఆ కొద్ది సాహిత్యమూ సహృదయులకు పరిచయం అయ్యే అవకాశాలు తక్కువే. ఈ 'మంచి సాహిత్యాన్ని' నలుగురి పాఠకులకు పరిచయం చేసి, ఆ పాఠక సముదాయం అభిరుచిని పెంపొందించి, రచయితకు

ఘట్టమరాజు అశ్వత్థనారాయణ

అభినందనలు, ప్రచురణకర్తలకు ప్రోత్సాహం కలిగించటమే పుస్తక సమీక్ష నిర్వహించే గురుతర కర్తవ్యం.

సమీక్ష అంటే సమ్యక్ దృష్టి అని అర్థం. ఒక పుస్తకాన్ని భావం, వస్తువు, రచనా విధానం—ఈ మూడింటి దృష్ట్యా పరిశీలించి, రచయిత సాహిత్య విలువలు ప్రతిపాదించటంలో ఎంతవరకు కృతకృత్యుడయ్యాడో పరిశీలించడమే సమీక్ష. పుస్తకం 'జీవనాడి'ని పట్టుకొనే నేర్పరితనం సమీక్షకుడు పొందివుండాలి. తాను ఏ పుస్తకాన్ని సమీక్షిస్తున్నాడో, ఆ పుస్తకం లోతుపాతులు తెలిసినవాడై వుండాలి సమీక్షకుడు. ఆ రచయిత ఇతర రచనలు, అదే విషయం మీద ఇతరులు రాసిన పుస్తకాల వైశిష్ట్యం సమీక్షకునికి కరగతం అయివుండటం అవసరం. అంటే సమీక్షారంగంలో కాలు మోపే సమీక్షకుడు ఆయా సాహిత్య ప్రక్రియలను చక్కగా అభ్యాసం చేసిన సహృదయుడు అయి వుండాలి. సమీక్షకునికి-విమర్శకునికీ అట్టే తేడా వుండదు. సమీక్షకుడు తాను సమీక్షించే పుస్తకం యొక్క వైశిష్ట్య వ్యక్తీకరణ మీదే తన దృష్టిని కేంద్రీకరిస్తే, విమర్శకుడు ఆ పుస్తకం సమీక్షించడంతోపాటు తత్సంబంధమైన ఇతర గ్రంథాలను విస్తారంగా చర్చించగవచ్చును. సమీక్షకునికి గల విహారభూమి పరిమితం. విమర్శకుని విహారక్షేత్రం విశాలం. అయితే ఇద్దరికీ అవగాహనా సామర్థ్యం, వ్యక్తీకరణశక్తి సమానంగానే వుంటుంది. సమీక్షకుడు పుస్తక సమీక్షలు చేసి విమర్శనా క్షేత్రంలోకి ప్రవేశించవచ్చు. విమర్శకుడుగా రాణించటానికి సమీక్షావేదిక పూర్వరంగం అన్నమాట. విమర్శకులుగా లబ్ధప్రతిష్ఠులైనవారు కూడ సమీక్షకులుగా ఉండడం సహజమే.

భారతి, అభ్యుదయ, అరుణతార, సృజన వంటి సాహిత్య సాంస్కృతిక పత్రికలు, ఆంధ్రప్రభ [వార], ఆంధ్రజ్యోతి [దిన, వార], ఆంధ్రభూమి [దిన, వార], ఆంధ్రపత్రిక [దిన] మొదలైన వ్యాపార పత్రికలు సమీక్షావేదికను నిర్వహిస్తున్న తెలుగు పత్రికలు. మాస, త్రైమాసిక పత్రికల్లో పుస్తక సమీక్షకుగల స్థలావకాశాలు దిన, వార పత్రికల్లో లభించటంలేదు. అయినా ఆంధ్రజ్యోతి [దిన, వార], విశాలాంధ్ర [ఆదివారం] లాంటి పత్రికల్లో పుస్తకసమీక్షకు గల ప్రాధాన్యం ప్రశంసనీయమైనది. పాఠకులే గాక, రచయితలు కూడ గౌరవించగలిగినంతటి గుణం ఆంధ్రజ్యోతి [దిన, వార] పుస్తకసమీక్షల కుండటం గమనార్హం.

'పుస్తక సమీక్ష'ను నిర్వహించే పత్రికలకు కొంతమంది సమీక్షకులుంటారు. వీరిలో కొంతమంది తమకర్తవ్యాన్ని శ్రద్ధతో నిర్వహిస్తే, మరికొంతమంది ఉబుసుపోకకు నిర్వహిస్తారు. రెండోరకానికి చెందినవారు సంపాదకులకుమిత్రులో, బంధువులో, సన్నిహితులో అయివుండటం వలన తరచు సమీక్షలు రాసిపారేస్తూ విమర్శకులుగా చెలామణి అవుతుంటారు. ఏ ప్రక్రియలో ఎవరు సిద్ధహస్తులో వారికి తగిన పుస్తకాలు పంపే సంప్రదాయాన్ని చాలా పత్రికలు పాటించటం

లేదు. పత్రికల్లో 'పుస్తకసమీక్ష' అంటూ ఒక శీర్షిక వుండేగాని దానికి ప్రత్యేక మైన సాధన సంపత్తులు లేక పోవటం విచారకరం. అందువల్ల చాలా పత్రికల్లో పుస్తకసమీక్షలు 'రొటీన్'గా వెలువడు తుంటాయేకాని అవసరమైన శ్రద్ధాదీక్షలు తగినంతగా కనబడవు.

పరిణత బుద్ధులు, సారస్వత వివేచనా సమర్థులు సమీక్షిస్తే మంచి సమీక్షలు వస్తాయి. 'అమృతం కురిసిన రాత్రి' మీద రాచమల్లు రామచంద్రారెడ్డి గారి సమీక్ష ('సారస్వత వివేచన') ఇందుకు చక్కని ఉదాహరణ. సామాజిక అవగాహన, ఆధునిక సాహిత్య విశ్లేషణ కరువైన సమీక్షకులు ఆధునిక రచనలను సమీక్షిస్తే ఎంత అన్యాయం జరుగుతుందో చూడాలంటే "తెలుగులో కవితా విప్లవాల స్వరూపం" మీద 'భారతి' జూలై, 1979 లో వెలువడిన సమీక్ష చూడొచ్చు. ఈ సమీక్షలోని వివేచనారాహిత్యం ఎంత టిదో, ఇదే పుస్తకంమీద 'అరుణతార'లో త్రిపురనేని మధుసూదనరావు గారి సమీక్ష చదివితే తెలుస్తుంది. [మార్క్సిజం అవగాహన ఉన్నం దున మధుసూదనరావుగారు రచయిత లోపాలు పేర్కొన్నా, గుణాలను విస్మ రించలేదు) ఆధునిక తెలుగు కవిత్వాన్ని క్రొత్త దృష్టితో పరిశీలించిన సిద్ధాంత గ్రంథకర్త సేవకు న్యాయం జరిగింది. రెండో సమీక్షలో, ఇదే సిద్ధాంత వ్యాసం మీద 'ఆంధ్రజ్యోతి' వారపత్రికలో 'ఫిడేలు రాగాలు'లో కొన్ని వారాలపాటు సమీక్ష వెలువడినా అది గ్రంథకర్తకు గొప్ప ప్రచారం తెచ్చిందేకాని గ్రంథ విశ్లేషణ జరగలేదు. అభ్యుదయ, దిగంబ రోద్యమాల మీద 'ఫిడేలు రాగాలు'లో వ్రాయబడ్డ సమీక్షపై 'అరుణతార' లోని సమీక్షా ప్రభావం కనబడుతుంది. అంటే ఆయా ప్రక్రియలను అవగాహన చేసుకొన్నవారు సమీక్షిస్తే రచయితకు, పాఠకునికి తప్పక న్యాయం చేకూరు తుందని చెప్పటమే. లేకపోతే 'మరీ పూరు' సమీక్షలు వెలువడి పత్రికల స్థాయిని దిగజార్చి, సాహిత్యానికి అన్యాయం జరగటం తథ్యం.

సమీక్షకులు అసలు పుస్తకాన్ని సమీ క్షించకుండా శాఖాచంక్రమణం చేయటం కూడా కద్దు. పుస్తకంలో వున్న విషయం గురించి స్వల్పంగా ప్రస్తావించి, లేని విష యాలను పుటలకొద్దీ వ్రాస్తూ తమ పరి శోధనా పరమేశ్వరత్వాన్ని పాఠకుల పై రుద్దటం ఘోరం. అట్లని సమీక్షకుల పాండిత్యాన్ని కించపరచటంలేదు. అసలు పుస్తకంలో ఉన్న విషయాల గురించి ప్రస్తావించాలి కదా. లేని విషయాలను ముక్తసరిగా ముచ్చటిస్తే సరిపాయె. గ్రంథకర్త కృషిని గౌణం చేసి, సమీక్ష కుడే ప్రాజాపత్యం వహించటం క్షమింప రాని నేరం.

సమీక్షకుడు ప్రతిభావంతుడైతే సమీ క్షింపబడే కృతుల వెలుగు జిలుగులు సంపూర్ణంగా విరజిమ్మబడతాయి. శేషేంద్ర 'ఋతుఘోష' ద్వారా తెలుగు వారికి పరిచితమయినా, ఆర్. ఎస్. సుదర్శనంగారు 'భారతి'లో "నా దేశం నా ప్రజలు" పైన వ్రాసిన సమీక్షాత్మక వ్యాసం కవికి గొప్పపేరు సంపాదించి పెట్టింది. ఎన్ని హంగులతో వెలువడినా

ఆ కృతికి అంతపేరు రావటం 'భారతి'లో ప్రచురింపబడిన సమీక్షవల్లనే.

అయితే కృతిలో వైశిష్ట్యం లేకపోతే సమీక్ష దానికి ఆ గౌరవం కలిగిసుందా అంటే కొంతవరకు 'ఔను' అనే చెప్పాల్సి వసుంది. అదే సమీక్షకుడు అదే పత్రికలో అదే కవి వ్రాసిన "నీరై పారిపోయింది" మీద వ్రాసిన సమీక్షావ్యాసం ఎన్నో ఔపనిషదిక రహస్యాలను 'డీకోడ్' చేసినా కవికి కీర్తి తేలేకపోయింది. ఎందుకంటే శేషేంద్ర "నా దేశం - నా ప్రజలు" సమీక్ష ఉన్నంతగా గొప్పగా ఆ 'ఇతిహాసం' లేకపోవటమే. సమీక్షకుడి వైదగ్ధ్యం, పాండితీ గరిమ మూలకృతి గురించి కల్పించిన గాలిమేడల్ని చాలా కాలం నిలపలేక పోయాయి.

సాహిత్య ప్రపంచంలో సమీక్షకుల్ని, విమర్శకుల్ని కూడగట్టుకొని కీర్తి సౌధాల్ని నిర్మించుకోదల్చుకుంటే చివరికి అవి భగ్నం అవక తప్పదనే సత్యాన్ని ఆధునిక తెలుగు సాహిత్య ప్రపంచంలో చాటిచెప్పిన కృతి "కవి సేన మేనిఫెస్టో". తెలుగు సమీక్షకులు జ్ఞాననేత్రాల్ని మూసికొనలేదని ఈ రచన మీద వచ్చిన చాలా సమీక్షలు తెలియ చేస్తాయి. ఆంధ్రప్రభ (దిన), ఆంధ్ర జ్యోతి [వార] అభ్యుదయ పత్రికలు ఈ 'మేనిఫెస్టో' లోని భావవైరుధ్యాల్ని, ఇతర కవుల నిందను, స్వకుచ మర్దనాన్ని, పులుముడును, అశాస్త్రీయతను బాగా బహిర్గతం చేశాయి. కాని తమకు అనుకూలంగా ఉన్న అభిప్రాయాలను, సమీక్షాంశాలను మాత్రమే పది పేజీల 'బుక్ లెట్'గా ప్రచురించి దేశంమీద వెదజల్లినా ఆంధ్రప్రదేశ్ కవిసేన అధ్యక్షుడు ఈ 'మేనిఫెస్టో'ను మహారచనగా భాసిల్ల చేయలేకపోవడం తెలుగు పాఠకుల, సహృదయుల అకలుషిత చైతన్యాన్ని తెలియచేసుంది. "కవిసేన మేనిఫెస్టో" మీద వచ్చిన సమీక్షలు శేషేందిరజాలం నుంచి చాలా మందిని తప్పించగలిగాయి.

తెలుగులో అప్రమత్తతతో సమీక్షా కార్యం నిర్వహిస్తున్న వ్యక్తులు లేక పోలేదు. రా.రా, ఆర్.ఎస్., క.వి. శ్రీనాథ భారవి, పాలడుగు, టి. ఎల్. కాంతారావు మొదలగు వారు ప్రముఖులు, ఇంకా జాబితాను విస్తరించ వచ్చును. తెలుగులోని పత్రికలు ఇంకా పుస్తక సమీక్షను సుసంపన్నం చేయవచ్చును. ఆ పని జరగాలంటే పత్రికా సంపాదకులు మనసు చేయాలి. దిన, వార, మాస పత్రికల్లో తప్పనిసరిగా పుస్తకసమీక్ష ఉండాలి. ఏయే పుస్తకాలకు ప్రాధాన్యమివ్వాలో, వేటికి ఇవ్వకూడదో శ్రద్ధగా గమనించాలి. ఐదారు మంది సమీక్షకులకే పుస్తకాలు కేటాయించటానికి బదులు మరికొంతమందికి కూడ ఆ పని అప్పగించాలి. దినపత్రికలు కానివ్వండి, వారపత్రికలు కానివ్వండి - పుస్తక సమీక్షకు కేటాయించే స్థలం స్వల్పం. కాబట్టి అషామాషీ పుస్తకాలను ప్రక్కకు నెట్టి విలువైన గ్రంథాలనే సమీక్షింప చేయాలి. కొన్నింటి పేరు రచయిత పేరు, లభించేచోటు వగైరా పేర్కొని స్వస్తివాక్యం పలకాలి. మరికొన్నింటిని క్లుప్తంగా పేర్కొనాలి. మిగతా

(మిగతా 88 వ పేజీలో)

రూపం - వస్తువు

కళ ఏదైనా అది ఒక విశిష్టమైన సామాజిక చైతన్య రూపం. కళాత్మక రూప చిత్రాల ద్వారా వాస్తవాన్ని ప్రతిబింబించే మానవ కార్యాచరణ.

కళాసృజనకు మూలం శ్రమే. అలాగే మనిషికి సౌందర్యానుభూతి రూపుదిద్దడంలో కళాతృష్ణ పెంపొందించడంలో కూడా తొలిదశలో శ్రమే మూల కారణం.

ఆదిమకాలంలో కళకు శ్రమతో ప్రత్యక్ష సంబంధం ఉండేది. ఆ తరువాత కాలంలో ఈ సంబంధం సంక్లిష్టమై పరోక్షరూపం సంతరించుకుంది.

సమాజంలో జరిగే సామాజిక, ఆర్థిక మార్పులు కళల్లో కూడా తప్పనిసరిగా మార్పులు తెస్తాయి.

కళ అభివృద్ధిలో ప్రజలు ఎప్పుడూ మహత్తరపాత్ర నిర్వహిస్తారు. ఈ బహుముఖ సంబంధాలు కళలకు జాతీయత రూపంలో విశేష గుణంగా సమీకృతమౌతాయి. కళ సామాజిక అస్తిత్వ ప్రతిబింబ రూపాలలో ఒకటి. అందువల్ల సమాజ జీవితంలో సైన్సు, రాజకీయ భావజాలం, నీతివంటి ఇతర వ్యక్తీకరణలతో కళకి కూడా సామాన్య గుణాలు ఉంటాయి. అయితే అదే సమయంలో ఇతర సామాజిక చైతన్య రూపాలకు భిన్నమైన విశిష్టమైన గుణాలు అనేకం కళకి ఉంటాయి.

వాస్తవ జగత్తుతో మనిషికి గల సౌందర్యాత్మక సంబంధాలు కళకి ప్రధాన విషయం [Subject Matter]

కళ సబ్జక్టు మనిషి జీవితం దాని అనంత వైవిధ్యత. అందువల్ల కళకి కేంద్ర బిందువు మనిషే. అతనిద్వారా వ్యక్తమయే సౌందర్య ప్రతిస్పందనలే.

కళాకారుడు జీవితాన్ని గురించి తనకున్న విజ్ఞానం, తన కళాకౌశలం ఆధారంగా, కళాత్మక రూపచిత్రాలు సృజిస్తాడు.

కళలో ప్రతిబింబించే వాస్తవికత object [విషయ రూపాలే] ఆ కళ విధిని (Functionని) నిర్ణయిస్తాయి.

మనిషికి ఆనందాన్ని, సంతోషాన్ని ఇవ్వగల కళాఖండాల్ని సృష్టించడం ద్వారా మానవుల సౌందర్యాత్మక అవసరాలను సంతృప్తి పరచడం, మనిషిని ఆధ్యాత్మికంగా (Spiritual) సుసంపన్నుణ్ణి చేస్తూనే అతడిని అభివృద్ధి పరచడం, మనిషిలోని కళాకారుడ్ని జాగరితం చేయడం, జీవితానికి మరింత సౌందర్యాన్ని పరిచయం చేయడం; ఇవీ కళ విధులు.

ఈ కళాత్మక విధి ద్వారా సైద్ధాంతిక, వైజ్ఞానిక తదితర ప్రభావాల్ని కళ శక్తి

మల్లిక్

వంతంగా కలిగించగలుతుంది. సమాజంతో బాటు కళాభివృద్ధిలో సాహిత్యం, చిత్రకళ, శిల్పకళ, సంగీతం, రంగస్థలం, సినిమావంటి ముఖ్యమైన Types రూపుదిద్దుకున్నాయి. భవిష్యత్తులో అనేకం యింకా కొత్త Types వస్తాయి.

కళాచరిత్ర అంటే మనిషి, వాస్తవికతను మరింత ప్రగాఢమైన కళాత్మక పద్ధతులలో చిత్రీకరించేందుకు జరిగిన కృషి చరిత్ర.

వాస్తవజగతును అర్థం చేసుకుంటూనే దాన్ని మరింత సుందరతరంగా మార్చేందుకు మనిషి శ్రమ విస్తరణ చరిత్ర కళా చరిత్ర.

సమాజంలో వర్గరీత్యా మార్పులతో సహా సమాజాభివృద్ధితో కళ అభివృద్ధి విడదీయ వీలులేనంతగా పెనవేసుకుపోయింది.

కళ సాధారణ పంథా,(జనరల్ లైన్) వాస్తవాన్ని మరింత శక్తివంతంగా సౌందర్యాత్మకంగా చిత్రించే పద్ధతుల్ని మరింత మెరుగు పర్చడమే అయినా- ఈ అభివృద్ధి అంతటా సమానంగా ఉండదు. ఒక్కొక్క సమాజంలో, కళ అత్యున్నత స్థితికి చేరుతుంది.

ఉదాహరణకి : బానిస సమాజం- ఇతర సమాజ వ్యవస్థలతో పోలిస్తే బాగా వెనకబడిందే అయినా కళ అత్యున్నత స్థితికి చేరాయి. పెట్టుబడిదారీ సమాజం బానిస సమాజంతో పోలిస్తే గొప్ప అభివృద్ధి చెందిందే. అయినా ఈ సమాజం మార్క్స్ మాటల్లో చెప్పాలంటే-

"మహత్తర సామాజిక స్పిరిట్యువల్ ఆదర్శాలకు బద్ధ వ్యతిరేకి. కళలకు, కవిత్వానికి, సౌందర్యానికి శత్రువు"- అందువల్ల కళలస్థితి కూడా తదనుగుణంగానే ఉంటుంది.

పెట్టుబడిదారీ సమాజంలో- అభ్యుదయ కళ అనేది- ఈ సమాజ ప్రారంభ దశలో బూర్జువావర్గం ఇంకా ప్రగతిశీలంగా ఉన్నకాలంలో మాత్రమే- లేదా- కళాకారుడు సవిమర్శక భావాలతో చైతన్యవంతుడైన సందర్భాలలో మాత్రమే ఉంటుంది.

మిగతాఅంతటా సైద్ధాంతిక కళాత్మక సౌందర్యాత్మక పతనం మాత్రమే ఈ సమాజంలోని అభివృద్ధి నిరోధక కళ లక్షణాలు.

ప్రపంచాన్ని అత్యున్నత ఉదాత్త సమాజంగా నిర్మించే ఆదర్శాలతో పునీతమైన కళే అత్యంత సౌందర్యాత్మకమైన కళ.

ఇతివృత్తం లేదా వస్తువు, దాని రూపం ఈ రెండూ కళ లేదా కళాఖండానికిగల రెండు పార్శ్వాలు. అవి ఒక దాన్నొకటి నిర్ణయించుకునేవి- అయితే వస్తువు లీడింగ్‌పాత్ర నిర్వహిస్తుంది.

కళ వస్తువు నిర్దిష్ట సౌందర్యంలో ఉన్న బహుముఖ వాస్తవికత - ముఖ్యముగా మనిషి- మానవ సంబంధాలు సామాజిక జీవితం-

రూపం ఆ వస్తువుని చిత్రించే ప్రయోజనంతో నిర్ధారిత కళాఖండంగా సృజించిన ఆంతరంగిక నిర్మాణం.

వస్తువులోని ప్రధాన అంశాలు దాని

విషయం (సబ్జెక్ట్) భావం (Idea).

మానవ జీవితానుభూతులు అనుభవాల క్రమంలోంచి విషయం వస్తుంది. వాటినే ప్రతిబింబిస్తుంది.

భావం, అందులో చిత్రించిన అనుభవాల సారాన్ని వ్యక్తీకరిస్తుంది. వాస్తవంలోని వైరుధ్యాలని ప్రతిబింబిస్తుంది.

మనిషిని నిశ్చితమైన, సౌందర్యాత్మక, నైతిక, రాజకీయ నిర్ణయాలకు వచ్చేటట్టు చేస్తుంది.

1) Subject is broughtout by range of lifes phenomena which are reflected in the work.

2) Idea Expresses the essence of the Portrayed phenomena and the contradictions of reality, Their artistic and emotional appraisal from the positions of an aesthetic Ideal, Leading man to definite aesthetical, Moral and Political conclusions.)

ఒక కళాఖండం— రీతి లేదా form బహుముఖమైంది— అందులో ప్రధాన అంశాలలో పాటు, అందమైన భాష, చక్కని నిర్మాణం, కళాత్మక వ్యక్తీకరణ, శిల్పం ఇవన్నీ ఉంటాయి.

రీతివాదం. formulism – ఈ రీతే ప్రధాన మంటుంది వస్తువుని తిరస్కరిస్తుంది.

సహజవాదం (నేచురలిజం) రెండూ వేరు వేరంటుంది. అభ్యుదయవాదం. ఈ రెండూ విడదీయరాని ఐక్యత కలవని భావిస్తుంది. వస్తువులో ప్రగతిశీలత, రీతిలో పరిపూర్ణత ఉండాలి. వర్గాలున్న సమాజంలో కళలో పాక్షికత ఉంటుంది.

కళకి ప్రయోజనం కేవల సౌందర్యమే. కళ కళకోసమే అన్నవాదం కాంట్ కాలం నుండి వచ్చింది. 19– 20 శతాబ్దాలలో వాస్తవికతకు వ్యతిరేకంగా ధ్వజమెత్తారు

సమాజంనుండికళాకారుడు 'స్వేచ్ఛ'గా ఉండాలని కోరేవారు. ప్రజలపట్ల, సమాజంపట్ల ఎలాటి బాధ్యత కళాకారుడికి లేదనేవారు, వ్యక్తిగత ఆత్మాశ్రయ అహంభావవాదులు, అరాచకవాదులు.

కళాత్మక పద్ధతి

(Artistic Method)

ఒకానొక చారిత్రక పరిస్థితినిబట్టి వాస్తవ జగతుపట్ల మనిషికిగల కళాత్మక వైఖరిని ప్రకటించే నిర్ణీత పద్ధతిని కళాత్మక పద్ధతి లేదా Artistic Method. అంటారు. ఇది వాస్తవిక అస్తిత్వాన్ని ప్రతిబింబించే విధానం.

ప్రతి కళాత్మక పద్ధతిలోను విషయాన్ని ఎంపిక చేసుకోవడం. generalisation జీవిత వాస్తవాలు, పరిణామాలను అర్థం చేసుకొనే వైఖరి ఉంటాయి.

ప్రపంచ దృక్పథంతో ప్రతి కళాత్మక పద్ధతికి సన్నిహిత సంబంధం ఉంటుంది.

ఆ ప్రపంచ దృక్పథం అభివృద్ధికరమైందైతే Positive గాను, వెనుకబాటుదైతే Adverse గాను, కళాకారుడి రచన మీద ప్రభావాలు కలిగిస్తుంది.

అయితే ఈ సంబంధం చాలా Intricate గా ఉండే గతితర్క-

సంబంధం.

The nature and Trend of one artistic Method or another, The degree of capability to understand and mirror in artistic images. The life of the people, The relationship between The individual and Society etc, depend on the Sociopolitical and spiritual Conditions of man-kinds development at each given historical moment, on the objective role of the class or another, in the life of Society and the attitude of Societ to art..

ప్రాబంధికం, భావవాదం, సవిమర్శక వాస్తవికత, సోషలిస్టు వాస్తవికత ఇవన్నీ వివిధ కళాత్మక పద్ధతులు.

విశ్వనాథ సత్యనారాయణ భావాలు గాని, ఆయన వెయ్యిపడగలు నవలలో చెప్పదల్చుకున్న భావాలుగాని ప్రగతి నిరోధకమైనవి, వెనక్కి నడిపించేవి అయినా ఆయన వాస్తవికతను చేపట్టినందువల్ల ఆయన ఉద్దేశించిన భావాలకు భిన్నమైన పద్ధతిలో అది తయారైంది. సోషలిజంకోసం పోరాటంలో భాగంగా సోషలిస్టు వాస్తవికత వచ్చింది. ఇది గుణాత్మకంగా కొత్తపద్ధతి.

ఇతివృత్తం లేదా విషయం దానికి కావల్సిన రూపాన్ని సాధించుకుంటుంది.

ఈ వివిధ కళాత్మక పద్ధతులలో రూపాలుగాని Types గాని వాటి అవసరాలున్నంత వరకు కొనసాగుతాయి. వాటి పాత్రను అవి నిర్వహిస్తాయి.

ఈ విషయంలో స్పష్టత లేకపోతే పొరపాటు నిర్ణయాలకు వెళ్ళే ప్రమాదం ఉంటుంది.

రీతివాదాలు : లేదా ఫార్మలిజం

ఇతివృత్తాన్ని నిరాకరించే రీతివాదాలు సోషలిస్టు కళకి శత్రువు.

సోషలిస్టు వాస్తవికత దాన్ని తిరస్కరిస్తుంది. సామ్రాజ్యవాదం వెర్రితలలు వేస్తున్న ఈ కాలంలో వివిధ రీతివాదాలకు ప్రాచుర్యం లభించడానికి కారణం యిది వాస్తవికతా వ్యతిరేకి కావడమే ఏబ్‌స్ట్రాక్ట్ ఆర్ట్. క్యూబిజం, సర్రియలిజం, డాడాయిజం, ఫ్యూరిజం, ప్రిమిటివిజం, ఫావిజం, టాఛిజం వంటివి రీతివాదాలు. వీటిలో సాధారణ విశేషణాలు కొన్ని ఉన్నాయి.

1. కళని వాస్తవికతని ఒకదానికొకటి పోటీ పెడతారు.

2. వస్తువునుండి రూపాన్ని విడదీసి రూపం నేయాత్మకమైన దంటారు.

3 ఇది భావవాదం. ఎందువల్లంటే సామాజిక భావాలలో సౌందర్యానికి సంబంధం లేదంటారు. రూపాన్ని వస్తువుండి విడాకులు యిప్పించడంవల్ల జరిగేది రూపవినాశమే.

సర్రియలిజం ఫ్రాన్స్ 1920 లో పుట్టింది. కళ యితివృత్తం కామప్రకోపాల జనితం, మరణభయం అన్న ఫ్రాయిడ్ భావాలలో పుట్టింది,

పెట్టుబడిదారీ ప్రపంచ వాస్తవాలను

తట్టుకోలేని పిరికితనం, భయం, విహ్వలత్వం, నిర్వీర్యత, చేతకానితనం - వాటితో జీవితం అన్నా, జీవిత వాస్తవాలన్నా అసహ్యం పుట్టించేవి - నిరాశావాదంలోకి దారితీసేవి. జేమ్స్ జాయిస్, ఎజ్రాపౌండ్ వంటి ప్రసిద్ధులు కూడా ఈ ప్రభావంలో పడ్డారు.

ఫ్యూచరిజం ఇటలీలో, ఆ తరువాత ప్యూరిజం ఫ్రాన్స్‌లో పుట్టాయి. మనిషిని యంత్రంకన్నా తక్కువగా చూస్తారు. అంతా యాంత్రిక భాగాలు

ప్రిమిటివిజం : ఆటవిక, ఆదిమ సమాజాల స్థాయికి కళని దించడం. - కళాభివృద్ధిని తిరస్కరించడం.

ఫావిజం-ఇది ఫ్రాన్స్‌లో పుట్టింది. ఫావ్ (Fawv) అంటే (క్రూరమైన)అని అర్థం. Child ఎక్స్‌ప్రెష నిజంకూడా యిందులో కొస్తుంది.

టాచిజం-రెండవ ప్రపంచ యుద్ధానంతరం ఆ భయం వినాశనంలోంచి పుట్టించి అమానుష ఇతివృత్తం.

కుళ్ళురంగు చాలా మంచిది చాలా అందమైంది అని సిద్ధాంతం. తారు బొగ్గు-వీటిలో వేస్తారు మచ్చలు అందమైన వంటారు.

మృత్యువుని, విరూపాన్ని అందంగా చూడడానికి ప్రయత్నం ఈ దుర్మార్గపు వ్యవస్థలోంచి పుట్టేవి.

★

(83 వ పేజీ తరువాయి)

కొన్నింటిని సమీక్షింప చేయాలి. దిన, వార పత్రికల్లో 'పుస్తకసమీక్ష' చదివే వారు సాహిత్యాన్ని సీరియస్‌గా తీసుకొనేవారు కాబట్టి, సమీక్షా వేదికను పేరు కోసమో, పణంకోసమో ఉపయోగించుకొనేవారిని మర్యాదగా తప్పించాలి. ఇవన్నీ జరగాలి. మరి జరుగుతాయా? గొంతెమ్మ కోరికలుగా మిగిలిపోతాయేమో! అలా కానక్కరలేదు. 'పుస్తక సమీక్ష' కొరకే ఒక ద్వైమాస పత్రికనో, త్రైమాస పత్రికనో స్థాపించాలి. ఈ సమీక్షాయజ్ఞానికి నేను ఒక సమిధ వేస్తాను. మరి మీరూ వేస్తే? తెలుగు సాహిత్య సమీక్ష, విమర్శ గాంభీర్యాన్ని, వైశాల్యాన్ని సంతరించుకొంటుంది.

★

ఆధునిక సాహిత్య విమర్శలో భావ, పలాయనవాద ధోరణులు

సాహిత్యంలో భావవాద, కాల్పనికవాద పలాయనవాదధోరణులునిర్గమించి సుమారు నాలుగు దశాబ్దాలు దాటిపోయినా విమర్శ రంగంలో మాత్రం ఈ ధోరణులు భిన్న రూపాల్లో కొనసాగుతూనే ఉన్నాయి. ప్రగతి భావాలు గల విమర్శకులు, సంప్రదాయ విమర్శకులు అనే భేదం లేకుండా సుమారు అందరిలోనూ సమానంగా ఈ ధోరణులు కనిపిస్తాయి. విశ్లేషణం శాస్త్రీయత ప్రధాన లక్షణంగా ఉండవలసిన విమర్శలో వస్తుగత దృష్టి కంటే, వ్యక్తిగత దృష్టి ప్రధాన స్థానాన్ని ఆక్రమించడమే దీనికి కారణం. "..... ఇట్టి కవితజ్ఞుల కవితామృతాన్ని గ్రోలి గుర్రన త్రేన్చిన వారినే కావాలి. 'అమృతస్యపుత్రాః' అన్నారు. కళ, అందులోనూ సాహిత్యం అసుందరమైనదాన్ని సుందరంగానూ, సుందరమైనదాన్ని అంతకంటే సుందరంగానూ చేసుందంటారు. అలాగే కరుణశ్రీగారి కవిశాస్త్రి అయిన 'ఉదయశ్రీ' కూడా నీరస హృదయుని సహృదయునిగానూ, సరస హృదయుని అంతకంటే సరసునిగానూ చేయడంలో అద్వితీయమైనది అంటే అతిశయోక్తి కాదు, కానేరదు." (సూర్యనారాయణ బయ్యా వేంకట లాంటి పైపై విమర్శలు సర్వసాధారణమే అయినా ప్రసిద్ధ విమర్శకులుగా చెప్పుకోబడుతున్న వారిలో కూడా ఇలాంటి ధోరణులు కనిపించడం విశేషం. విమర్శ వ్యాసాలతోపాటు సమీక్షలు, పీఠికలు, సిద్ధాంత వ్యాసాలు కూడా విమర్శలో భాగమే కనుక వాటన్నింటిలోనూ కనిపించే భావవాదధోరణులను అందులో భాగంగా పలాయనవాద ధోరణులను స్థూలంగా పరిశీలించడం ఈ వ్యాస లక్ష్యం.

ఆధునిక విమర్శ రంగంలో కట్టమంచి రామలింగారెడ్డిని ఆధునిక కవితారంగంలో గురజాడతో స్థూలంగా పోల్చవచ్చు. (చూ. రామారావు చేకూరి, 79:178). కవిత్వంలో సమాజం, మాలలు మొదలైన సామాన్యుల గురించిన ఆలోచన గురజాడతో మొదలైనట్టుగానే, సాహిత్యానికి కారణమైన సామాజిక పరిస్థితులను వివరించడాన్ని విమర్శలో ప్రధాన భాగంగా గుర్తించడం కట్టమంచితో ప్రారంభమైంది. (చూ. పై. : 140). అయితే గురజాడకు సమకాలంలో ప్రారం

డా॥ కె. కె. రంగనాథాచార్యులు

భమైన భావ కవిత్వంలో నవ్య కవితా ధోరణులతోపాటు సంప్రదాయ ధోరణులు, గతం పైన అభిమానం, పునరుద్ధరణ ధోరణులు కనిపిస్తాయి. [రంగనాథాచార్యులు, కె.కె. :ii-iii] అట్లాగే కట్టమంచి సమకాలంలోనూ, ఆ తరువాత వచ్చిన విమర్శకులలో పాత్ర చిత్రణ, సంభాషణా కౌశలం, కథనాత్మకత మొదలైన ఆధునిక గుణాలు కన్పించినా వారిలో సంప్రదాయ విమర్శనా పద్ధతుల పైన అనురక్తి, గతంపైన ప్రేమ, విమర్శలో భాగంగా వచ్చిన ఆధునిక ఆలోచనా ధోరణుల తిరస్కారణ, కాల్పనిక, భావవాద ధోరణులు ప్రధానంగా కనిపిస్తాయి. రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ విశ్వనాథ సత్యనారాయణ మొదలైన వాళ్ళు దీనికి నిదర్శనాలు. అంతేకాదు కట్టమంచివారి విమర్శనా ధోరణులు సంప్రదాయ వాదులనుంచి వ్యతిరేకతను కూడా ఎదుర్కొనవలసి వచ్చింది. [రామారావు, 79 : 141]. తెలుగులో ఆధునిక విమర్శ మొదలైన నాటినుంచి ఈనాటివరకు స్థూలంగా పరిశీలిస్తే అస్పష్టత, సంప్రదాయ పద్ధతులపైన విశ్వాసం చారిత్రక పరిణామ ఫలితంగా వచ్చిన ఆధునిక ధోరణుల తిరస్కారణ, అలంకార శాస్త్ర పునరుద్ధరణవాదం, ఒక కవి పైనగల ఆత్మాభిమానం ఫలితంగా కనిపించే కాల్పనిక ధోరణులు, గతంమీద ప్రేమతో గతాన్ని గురించి ఊహలను సృష్టించుకోవడం, పరిణామక్రమాన్ని తలకిందులుగాచూడడం, వ్యక్తి ప్రాధాన్య వాదం లేక పలాయనవాదం, ఆత్మాశ్రయ విమర్శ లేక 'నేను' వాదం, అనాలోచితంగా వ్యతిరేకాభిప్రాయాన్ని ఏర్పరచుకొని ఉన్న గుణాలను చూడలేకపోవడం, కవికి లేని దృష్టిని తనకున్న వాటిని కవికి ఆపాదించడం మొదలైన భావవాద ధోరణులు దర్శనమిస్తాయి.

ఉమాకాంతం పంతులుగారు భావ కవిత్వంలో ఉన్నాయని పేర్కొన్న అస్పష్టత, అయోమయం, పులుమూడు [రామారావు 79 :153 పేర్కొన్నట్లుగా] ఆధునిక సాహిత్య విమర్శలో ఇటీవలి కాలంలో కూడా కనిపిస్తాయి. తాను చెప్ప దల చిం దే మి టో తనకే స్పష్టంగా తెలియకపోవడం, తనకు తెలియని విషయాల జోలికి పోవడం, అస్పష్టతను పద చమత్కారాలతో కప్పిపుచ్చే ప్రయత్నం ఇలాంటి విమర్శలలో కనిపిస్తాయి. ఉదాహరణకు ఇటీవల ఆధునిక సాహిత్య 'సమాలోచనం'గా వచ్చిన విమర్శ వ్యాస సంకలనానికి పెట్టిన 'సులోచనం'లోని వాక్యాలు చాలు. "జీవిత మథనంలో నుంచి పుట్టిన ఆత్మవేదనామృతమే కళ. అది ఏ రూపంలోనైనా వెలువడవచ్చు. ఆకృతికి ఆత్మవేదన. వేదనకు జన్మస్థానం మథనం. దానికి మూలం జీవితం. జీవితం సహజంగా విషవలయం. దానిలోని విషమత్వమే సుఖదుఃఖాల సంపుటి; ఎతుపల్లాల ఎగుడు దిగుడు; వర్గభేదాల వైపరీత్యం; జ్ఞానాజ్ఞానాల సాంకర్యం; సమత్వాసమత్వాల సందిగ్ధ; అస్తినాస్తివిచికత్సల అయోమయం; న్యాయాన్యాయాల కల్లోలం; జీవన మరణ సమస్యల చీకాకు; నిత్యానిత్య మాయాజాలం. విషమత్వం నుంచి సమత్వాన్ని

సాధించడానికి చేసే మానవ ప్రయత్నమే మథనం. ఇందులో ఏ విషమత్వాన్ని పృథక్కరించి మథించాలి. జీవితం సంక్లిష్ట విషమ సముద్రం; నిర్భేద్యమైన పద్మవ్యూహం-అట్లని మథనం మానటం మానవ నైజంకాదు. ఈ మథనం మూడు ప్రస్థానాలలో చిరంతనంగా సాగుతోంది. ఒకటి భౌతికం; మరొకటి మానసికం; మూడవది ఆధ్యాత్మికం. భౌతికంగా సమానత్వాన్ని సాధించటం మొదటి ప్రస్థానం; దీనికి మార్గ సూత్రంగా ఈ శతాబ్దంలో గతి భౌతిక తార్కిక వాదాన్ని ప్రపంచం అనుస రిస్తోంది. వర్గ విధ్వంసక విధానం ద్వారా; సమసమాజ నిర్మాణాన్ని సాధించి ఆర్థిక మైన అసమానతలను తొలగించవచ్చు, అయితే వర్గ విధ్వంసం భౌతిక సమస్యయా లేక మానసిక సమస్యయా అన్నదాంట్లో భేదాభిప్రాయాలున్నాయి." [సుబ్రహ్మణ్యం, జి. వి, 1980:vii]

అలంకారశాస్త్ర పరమైన సంప్రదాయ విమర్శనా పద్ధతులు త్రికాలాబాధితాలని ఏ కాలంలోనైనా ఎలాంటి సాహిత్యానికైనా అవే కొలతబద్దలుగా పనికొస్తాయనే విశ్వాసం కొంతమందిలో కనిపిస్తుంది. ఆ మార్గంలో వచ్చిందే అద్దేపల్లి రామమోహనరావు "శ్రీశ్రీ కవితా ప్రస్థానం." "ఎంత కొత్త వస్తువు తీసుకున్నా ఎన్ని కొత్త పోకడలు పోయినా, ఆలంకారికులు సిద్ధాంతీకరించిన మహా విషయాలు ఎవరి కవితలో పరి పక్వస్థితిలో పోషింపబడతయ్యో వారే మహాకవులు కాగలరు" అని ఆలంకారిక సిద్ధాంతాలపైన దృఢవిశ్వాసం ప్రకటిస్తూ "శ్రీశ్రీ తన కవితలో ఎన్ని కొత్త బాటలు తీసినా అతని రచనలోని ప్రాణభూతమైన విషయాలు ఆలంకారిక మార్గనిష్ఠమై కనబడుతున్నవి" అని ఆ పద్ధతిలో శ్రీశ్రీ కవిత్వాన్ని వింగడించే ప్రయత్నం చేశాడు రామమోహనరావు. ఫలితం దుర్వ్యాఖ్యానాలు, దుస్సమన్వయాలు; శ్రీ శ్రీ ఏ సామాజిక సిద్ధాంతాలతో కవిత్వం రాసి ప్రజాకవి, మహాకవి అయ్యాడో దానికి పూర్తిగా విరుద్ధమైన భావాలున్నట్టుగా చెప్పటం [ఇంకా వివరాలకు చూ. రామచంద్రారెడ్డి, రాచమల్లు, 1976:86-96] రామమోహన రావుని ఈ విషయంలో సమర్థిస్తూ "శ్రీశ్రీ మహాకవి అని, అక్షరాక్షరశిల్పి అని నిరూపించారు. ఏ విషయాన్ని ఎలా చెప్పినా, ఎందుకు చెప్పినా మహా కవి లక్షణాలు, మహాకవిత్వ లక్షణాలు ఎప్పుడూ ఒక విధంగానే ఉంటవని రామమోహనరావు గారి విమర్శ రుజువు చేస్తున్నది" అని యోగ్యతా పత్రం ఇచ్చారు పాటిబండ మాధవశర్మ [1975: 41].

ఇతర సామాజిక విషయాలలోలాగే సాహిత్య విమర్శలో కూడా చరిత్ర పరిణామ ఫలితంగా ఏర్పడిన ఆధునిక భావాల, ధోరణుల తిరస్కరణ నాడూ, నేడూ కనిపిస్తూనే ఉంది. ఆధునిక ధోరణులన్నీ దేశీయాలు కావనీ, విదేశీయాలనే వీరి నమ్మకమే ఈ తిర స్కరణ ధోరణులకు కారణం. ఆధునిక పరిశోధనలను గురించి తన అభి ప్రాయాన్ని విశ్వనాథ సత్యనారాయణ గారు [1970 : vi] ఇలా తిరస్క-

రిసున్నారు "...తత్పూర్వ మింగ్లీషు వాఁడు రాజ్యము చేయలేదు. ఎవని యుపజ్ఞచేత మన మనస్సులు మారిపోయి సంప్రదాయమునందు విశ్వాసము పోగొట్టుకొని పరిశోధన బుద్ధితో యథేచ్ఛా వాదములు చేయుచున్నామో ఆ యింగ్లీషువాడు"॥ కట్టమంచి విమర్శ లోని ఆధునిక లక్షణాలను నోరి నరసింహశాస్త్రి, అక్కిరాజు ఉమాకాంతం పంతులు, కురుగంటి సీతారామయ్య, కాళూరి వ్యాసమూర్తి మొదలైనవారు తిరస్కరించారు. (రామారావు, 1979:141). ఇటీవలి కాలంలో కూడా పాటిబండ మాధవశర్మగారు కట్టమంచిని వ్యతిరేకిస్తూ, ఆధునికతను తిరస్కరించడం మనం చూడవచ్చు. "కవిత్వ తత్త్వ విచారంలో సాహిత్యానికి సంబంధించని అనేక విషయాలు కూడా ఉన్నవి. భారతీయుల ఆచార వ్యవహారాల నిరసనం, అలంకార శాస్త్రాల దూషణ, తెలుగు కవుల అంగ ప్రత్యంగ వర్ణనల తిరస్కరణ స్వేచ్ఛగా చేయబడినవి. హిందువుల ధర్మాలు, నీతులు, వేదాంతాలు నిందించబడినవి. పాశ్చాత్య సంస్కృతీ సాహిత్యాలు అభినివేశంతో కొనియాడబడినవి. మొత్తం మీద కవిత్వ తత్త్వ విచారంలో రెడ్డిగారు అవలంబించిన దృష్టి పూర్తిగా విజాతీయము" (మాధవశర్మ, పాటిబండ, 1975:25). ఆధునిక కవితా ప్రక్రియ 'వచన కవిత'ను తమ సంప్రదాయ భావాలకు వాహికగా గ్రహిస్తూనే సారస్వతాన్ని జాతీయం చేయటం, ప్రాచీన సాహిత్యశాస్త్ర సంపదను ఉద్ధరించటం అనే అభిప్రాయాలను ప్రకటించిన, 'చేతనావర్త కవులు' కూడా (చూ. స్వాతంత్ర్యోత్తర కాలాన తెలుగు కవిత) ఆధునిక విమర్శనా పద్ధతులను విజాతీయాలని భావిస్తున్నట్టు కనిపిస్తుంది.

విమర్శకుడికి ఒక కవిపైన గాఢమైన అభిమానం ఉన్నప్పుడు కవితా రూపమైన కాల్పనికతకది దారితీస్తుంది. హేతుబద్ధమైన విశ్లేషణను అది సహించదు. దీనివల్ల పరస్పర విరుద్ధమైన అభిప్రాయాలు రూపొందుతాయి. అది కేవలం విశ్వాస ప్రధానంగా భక్తిగా మారుతుంది. నన్నయను గురించి విశ్వనాథ సత్యనారాయణగారు భిన్న సందర్భాలలో వెలిబుచ్చిన అభిప్రాయాలు ఎంత పరస్పర విరుద్ధాలుగా ఉన్నాయో కింది భాగాలు స్పష్టం చేస్తాయి. "....నన్నయగారు తానితిహాసమును వ్రాయుచుండెను. కావ్యము వ్రాయుటలేదు. భారత విషయమున నన్నయగారిది ఇతిహాసదృష్టి. కావ్యదృష్టి కాదు. భారతముప్రధానముగా నితిహాసము. ఈ యితిహాసకథ భాసింపజేయుట నన్నయగారి ప్రథమ దృష్టి-" (విజ్ఞాన సర్వస్వము III 1961:464). మరోచోట "అదియట్లుంచి నన్నయగారు తెలుగులో పురాణమును వ్రాసినను వ్రాయుచున్నను కావ్యపద్ధతిగా వ్రాసినాడు; నాటక పద్ధతిగా వ్రాసినాడు. అనగానొక భాషా సారస్వతము చిన్న చిన్నగా అల్పాల్పముగా కొన్ని వందల యేండ్లు బ్రతికిన తరువాత తానె తవలసిన మహాకావ్య స్వరూపమును తొట్టతొలుతనే సంతరించి పెట్టినాడని యర్థము. ఇది నన్నయగారు చేసిపెట్టినపని"

(1970: xxix) దీని పరాకాష్ఠ కి "…. ఇది యాశ్చర్యము. ఎవ్వరు నూహించుటలేదు. ఇది యెట్లు చేసెను? బ్రహ్మ గనుక చేసెను. అంబురుహగర్భ నిభుడు గ ను క చేసెను" (పై). దీ ని పె దశ భాషా దురభిమానం" ఈ విషయ మును వి స్తరించి చెప్పినచో కావ్యరచనా శిల్ప దృష్టిచేత సర్వభారతము నందు నాంధ్రభాషతో నాంధ్రకావ్య భాషతో పోలెడిది ఇంకొక భాషలేదు. ఉండుటకు వీలులేదు" (పై xxxi). ఇలాంటి ధోర ణులవల్ల ఏ కవిని తాను విమర్శ విష యంగా గ్రహించాడో ఆ కవికి న్యాయం చేకూరే అవకాశాలు చాలా తక్కువ. విమర్శలో భావుకత, కాల్పనికత సుమారుగా విశ్వనాథవారి విమర్శలన్నిం టిలోనూ కనిపిస్తాయి. నాచన సోమ నను గురించిన కిందివాక్యాలు కూడా ఈ ధోరణికి చెందినవే "…. ఈ కథలను వ్రాయుటలో నాచన సోమన్న తన కావ్యమునకొక మహాప్రయోజన మభి లషించెను. ఇట్టిదానికి ప్రబంధ ధ్వనియని పేరు. ఈ ప్రబంధ ధ్వని విషయము మహోత్తాలమైన కొలది ప్రధానముగా కవి మహాకవి యగుచున్నాడు." (విజ్ఞాన సర్వస్వము III: 1222). విషయాన్ని సకారణంగా వివరించటం కంటే ఎక్కు వగా వర్ణనాత్మకత ఇలాంటి విమర్శలలో ప్రధానంగా కనిపిస్తుంది. ఊహారూప విమర్శకు, వర్ణనాత్మక విమర్శకూ పింగళి లక్ష్మీకాంతం తిక్కన గురించి రాసిన కింది వాక్యాలు మరో ఉదాహరణ. "…. ఈ సంకటావస్థలో తిక్కన ఆత్మ ధైర్యమే తోడుగా రచనకుపక్రమించి కావ్యతాభంజకములైన యాథార్థ్మిక ఘట్టములను కొన్నిటిని సంక్షేపించి, మరి కొన్నిటిని పరిత్యజించి భారత సరస్వతి భుజమునుండి మోయరాని యా బరువు నెంతవరకు తగ్గింపవలెనో యంతవరకు తగ్గించి యామె క్రీడను సుకరము చేసెను." (పై. 812).

గతం మీద ప్రేమతో కావ్యాలలో, ప్రబంధాలలో దొరికిన అస్పష్టమైన ఆధారాలపైన ఊహలతో ఆనాటి వైభ వాన్ని, గొప్పతనాన్ని పునర్నిర్మించు కొని వాటిని గురించి గర్వపడటం భావ వాద ధోరణులలో భాగంగా కనిపిస్తుంది. పాతకాలపు వైభవాన్ని పైకెత్తటానికి నేటి పరిస్థితులను కించపరచటం కూడా ఈ ధోరణిలో ప్రధానంగా కనిపిస్తుంది. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి 'రాయల నాటి రసికత' దీనికో . మచ్చుతునక. రామారావు [1979 : 146] సందేహించి నట్టు వినోదం కోసం ఆ వ్యాసం రచించా రనటానికి అవకాశం కన్పించదు. రాళ్ళ పల్లికి ఆనాటి జీవిత విధానంలో అంతటి రసికత ఉండదని దృఢమైన నమ్మకమే ఉన్నట్టు కనిపిస్తుంది వ్యాసం చదివితే. "రాయల కాలపు వారి రసికత గమ నించితిమేని మన మెంత యరసిక శిఖా మణులమైవున్నా మోపోల్చుకొనిగ్రహింప గలము"(సారస్వతాలోకము: 3–4)అంటూ "రసికత్వమెంతయుండునో యంతగొప్ప తనము మనుష్య జాతియందుండును." (పై. 3) అని రసికత్వాన్ని జాతి ఔన్న త్యానికి ప్రతీకగా రాళ్ళపల్లి చెప్తున్నారు. కల్పనలకు, ఊహలకు స్థానం ఉండే ప్రబంధాలలో చెప్పిన కోపగృహాలు,

నిత్య అభ్యంగ స్నానాలు ఆ రోజులతో సర్వసాధారణమని చెప్పటం కూడా మరో ప్రబంధం రాయటం అవుతుం దేమోగాని విమర్శ మాత్రం కాదు. తాను ఊహించిన ఆనాటి రసికతా స్వభా వాన్ని అలంకారాలు, సుగంధద్రవ్యాలు, భోజనం, వస్త్రధారణ మొదలైనవాటిని పొగుడుతూ ఈ కాలంవాటితో పోల్చి తక్కువచేసి చూసే రాళ్ళపల్లి దృష్టికి తార్కాణంగా కింది వాక్యాలు పరిశీలిస్తే చాలు...." అట్టి సౌకుమార్యము నపే క్షించు రసికులుండిరి. కావుననే యా కాలమున నట్టి నూలును, అట్టి నేతయు సాధ్యములైనవి. ఇప్పటి ఖద్దరుధారులనే కులు తాము కట్టుకొను వస్త్రము లెంత ముతకగా నున్న నంత దేశాభిమాన మెక్కువ చూపినట్లు, స్వరాజ్యమున కంతదగ్గరఁ బోయినట్లు భావించెదరు." (పై.8).

మొదట సాహిత్యం ఆలోచనా శక్తి, వివేచనా శక్తి మనిషికి ఏర్పడిన తర్వాత విమర్శ పరిణామ క్రమంలో వచ్చిందని చాలామందికి తెలిసిన విషయమే. లక్ష్యం మొదటా, దానినిబట్టి లక్షణాలు, చెప్పటం జరుగుతుంది. కాని విమర్శ ముందు, ఆ తరువాతే సాహిత్యం వచ్చిం దనే వాదం ఇటీవలి కాలంలో కొందరు వెలిబుచ్చుతున్నారు. పరిణామక్రమాన్ని ఈ విధంగా తలకిందులుగా చూడటం వల్ల సాహిత్య విమర్శ సిద్ధాంతాలే తల కిందులౌతాయి. ఈ అభిప్రాయం ఈశ్వరుడు 'లోకాలను సృష్టిస్తాను' అని మొదట సంకల్పించుకొని తరువాత సృష్టి చేశాడని చెప్పే శ్రుతివాక్యం మీద విశ్వాసం ఏర్పరచుకొని, అది ఆధారంగా సాహిత్య పరిణామాన్ని నిర్వచించే ప్రయత్నం చేయటంవల్ల ఏర్పడింది. దీని ఫలితమే "కావ్య నిర్మాణము కావ్య కర్మవేతృతా పూర్వకం కావడం వల్ల కావ్యం పుట్టకముందే కావ్య విమర్శ పుట్టినట్లవుతున్నది" అన్న పాటి బండ మాధవశర్మ (1975 : 4) గారి అభిప్రాయం." కనుక సృష్టిలో వ్యక్తము కాఁజాలని భగవత్సంకల్పము కావ్యమున వ్యక్తమైనది. కాగా ప్లాటో చెప్పినట్లు కవిత్వము ప్రకృతికంటె ఒక మెట్టు దిగ జారక ఎగబ్రాకినది. అందుచే తత్త్వము నకు మూడడుగులు దూరమగుటకు బదులు తత్త్వ సాయుజ్యమును పొంది నది. ఇప్పుడు దీనినొక విధముగా చెప్ప వచ్చును. భగవంతునకొక సంకల్పము కలిగినది. దానిని సృష్టియను కావ్య రూపమున వ్యక్తం చేసినాఁడు. రసికులు దీనినిగాంచి ముగ్ధులైరి, అలసులు ఉదా సీనత వహించిరి. తాత్వికులు ఇది మిథ్య యనిరి. కవిలో ఈ రసికత్వము, తాత్వి కత్వము గలవు. కవి సృష్టినిగాంచి దాని తత్వము గ్రహించి ముగ్ధుడైనాఁడు. అలసులగు లోకులకు దీనిని వ్యాఖ్యానము చేసి వివరించుచున్నాఁడు." (మాధవ శర్మ : 1934) అన్న మాటలూ కేవలం విశ్వాసంతో చెప్పినవే. విశ్వాసానికి, వివేచన, విశ్లేషణా ప్రధానమైన విమ ర్శకు చుక్కెదురు. అన్నీ పూర్వ సంకల్పితాలే అయినప్పుడు ఆధునిక సాహిత్య విమర్శ ఆవశ్యకతే లేదు.

వ్యక్తి ప్రాధాన్యవాదం అత్యాధునిక విమర్శకులలో ప్రధానంగా కనిపిస్తుంది.

సామాజిక స్పృహ అంటే ఏమిటో వివరిస్తూ ఆర్. ఎస్. సుదర్శనం [1980 : 5] "....కాలంలో కరుడు కట్టిపోయే చారిత్రక బంధాలనుంచి మనిషికి విముక్తి కలిగించే చైతన్య స్ఫురణ, ప్రేరణ, స్పృహ సృజనాత్మక రచనలో వ్యంగ్యంగా అభివ్యక్తం అయితే, దాన్ని 'సాహిత్యంలో సామాజిక స్పృహ'గా గుర్తించడమౌతుంది. ఇది రాజకీయవాది ఊహకన్న, అభిప్రాయంకన్న విస్తృతమైనదీ ; సున్నితమైనదీ ; బహూరూప సమన్వితమైనదీ." అంటూ వ్యక్తికీ, వ్యక్తి విముక్తికీ ప్రాధాన్యం ఇస్తున్నారు. సుదర్శనం గారికి రాజకీయాలన్నా, ఇజాలన్నా వ్యక్తిస్వేచ్ఛకు భంగకారులనే భయం. ఇదే అభిప్రాయాన్ని ఆయన మరోచోట ఇలా ప్రకటించారు : "కాని దృక్పథాలు, సిద్ధాంతాలు, వాదాలు [isms] అనేవి సమాజంలో ఉధృత ప్రచారంలో ఉన్నప్పుడు అవి వ్యక్తికి జీవితాన్ని దిద్దుకోవడానికి సహాయకారులుగాకాక వ్యక్తిని ఆశరించే, పట్టి పీడించే మోహినీ పిశాచాలుగా తయారైన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ సిద్ధాంతాలూ, వాదాలూ ఇటు సంప్రదాయంనుంచి వచ్చినవైనా, అటు సంస్కారంనుంచి వచ్చినవైనా వ్యక్తికీ, వ్యక్తి సుఖానికీ, ధర్మానికీ వీటితో సమన్వయం కుదరకపోవడం జరుగుతున్నది" [సుదర్శనం 1972:115-16]. వ్యక్తులూ, వాళ్ల భావాలూ సమకాలీన సమాజానికి అతీతమైనవని సుదర్శనం గారి అభిప్రాయం. సృజనాత్మక రచన వ్యక్తి అనుభూతినుంచి పుట్టుకొని వస్తుందని, అది వస్త్వాశ్రయంకాక ఆత్మాశ్రయమనీ ఆయన విశ్వాసం. రాజకీయ సిద్ధాంతాలన్నా, సామాజిక బంధనాలన్నా ఆయనకు ఎనలేని భయం. ఇది ఒక రకమైన పలాయనవాదం. చారిత్రక బంధాలనుంచి మనిషికి విముక్తిని కలిగించడం అంటే ఈ ప్రపంచాన్ని వదలి శాశ్వత విముక్తిని పొందడమే. సమాజానికి అతీతంగా వ్యక్తినీ, సాహిత్యాన్నీ దర్శించి సుదర్శనంగారివంటి విమర్శకులూ, రచయితలు సాహిత్యాన్ని సరిగ్గా నిర్వచించలేకపోవడం, అందమైన మాటల గారడీల వెనుక తమ శూన్య భావాలను కప్పిపుచ్చే ప్రయత్నం చేయడం చూడవచ్చు. చెప్పే పద్ధతులు ఎంత అందంగా ఉంటాయో భావస్వేచ్ఛ పేరిట భావదాస్యం అంత ఎక్కువగా కనిపిస్తుంది. ఇలాంటి విమర్శలలో గుంటూరి శేషేంద్రశర్మలాంటి వాళ్ళ కవిత్వం వీరి దృష్టిలో అచ్చమైన స్వేచ్ఛాకవిత్వం. ఆధునిక చైతన్యం పేరిట ఇలాంటి భావాలతో ఊహాలోకాలు సృష్టించుకుంటున్న విమర్శకవర్గం ఒకటి ఈ రోజు బలంగానే ఉంది.

'నేను' తో ప్రారంభం అయ్యే విమర్శ ధోరణులు కూడా నేటి కాలంలో విరివిగా కనిపిస్తాయి. పీఠికలలో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. కుందుర్తి ఇతర వ్యాసాలలో కూడా ఇది కనిపిస్తుంది. ఒక ప్రత్యేక విషయంపైన తనకున్న అభినివేశాన్ని వ్యక్తంచేయదలచుకున్నప్పుడు, వ్యక్తిగత దృక్కోణంతో ఒక విషయాన్ని పరిశీలించ దలచుకొన్నప్పుడు,

ఒక రచనను గురించి అభిమానంతో కూడిన అభిప్రాయాలను చెప్పదలచుకున్నప్పుడు, సాహిత్యంలో తాను కొత్త భావాలను, ప్రతిపాదనలను ప్రవేశపెట్ట దలచుకున్నప్పుడూ, సాహిత్యరంగంలో తన స్థానాన్ని పెంచుకోవాలనే తాపత్రయం పెరిగినప్పుడు ఈ 'నేను' విమర్శలో ప్రవేశిస్తుంది.

వస్తుగత [Objective] దృష్టితో సాహిత్యాన్ని పరిశీలించగలిగిన విమర్శకులలో కూడా ఈ 'నేను' ప్రవేశించి నప్పుడు వారి దృష్టి వ్యక్తిగతం [Subjective] గా మారుతుంది. కుందుర్తి ఆంజనేయులుగారికి వచన కవిత అవసరాన్ని గురించి, దాని ప్రయోజనాన్ని గురించి వ్యక్తిగతంగా దృఢమైన అభిప్రాయాలున్నాయి. ఆయన వ్యాసాలు, పీఠికలు చాలావరకు ఈ అభిప్రాయాలను వ్యక్తీకరించేవే. అందుకే "పాతికేళ్ళక్రితం, 1950 ల లోనే, అలంకారాల భారమొల్లని అతి సహజ సౌందర్యవాది అని నన్ను నేను సంబోధించుకున్నాను", "ఉద్గీథ" అనే కావ్యానికి పీఠిక వ్రాస్తూ ఏ ఊహా బలం, కల్పనా సామర్థ్యం కవి ప్రతిభకు గీటురాళ్ళుగా అనేక శతాబ్దాలుగా భావించ బడుతూ వచ్చాయో అవే కవికీ ప్రజలకూ మధ్య ఇనుపతెరలుగా నిలవడం నాకు నచ్చదని వ్రాశాను"; "కవిత్వంలో ప్రతి పంక్తినీ ఊహల ఉయ్యాలలో ఊపడం నేర్పరితనమే కాదనను. కాని ఊహా రాహువు వచ్చి వాస్తవికతా చంద్రుణ్ణి మింగటం నాకు సరిపడని సంగతి" (కుందుర్తి, 1980) వంటి వాక్యాలలో 'నేను' ఈ తరగతికి చెందిందే.

ఒకరికి పీఠికరూపంలో సర్టిఫికెట్టు ఇవ్వవలసి వచ్చినప్పుడు తదితర ధోరణులను తిరస్కరించటం మొదలుకొని, ఆత్మానుభూతి ప్రదర్శనతోపాటు సంప్రదాయ విమర్శలో భాగమైన సంస్కారం వంటి దాన్నొకదాన్ని ప్రవేశపెట్టేంత వరకూవిమర్శను దిగజారుస్తుందీ 'నేను'. రారావంటి విమర్శకులుకూడా ఈ ధోరణికి బలికాక తప్పలేదు. అమ్మంగి వేణు గోపాల్ 'మిణుగురు' కవితా సంకలనానికి రారా చెప్పిన 'మంచిమాట' (1980: i-iv) ఇందుకు నిదర్శనం. "తెలుగు కవిత్వానికి చెడ్డకాలం దాపురించింది. అభ్యుదయం పేరుతో కవిత్వంలో ప్రవేశించిన రాజకీయాలు - యేకుమేకై నట్లు - కవిత్వాన్ని హతమార్చి, తామే కవిత్వంగా వూరేగుతున్నాయి";.... "యింతకూ కవిత్వమంటే ఏమిటి? చదివినప్పుడు నీకు హృదయం ద్రవిస్తే, లేదా కండ్లు చెమరిస్తే, లేదా కడుపు మండితే, లేదా ఒళ్ళు పులకరిస్తే, లేదా వెన్ను జలదరిస్తే అది కవిత్వమని చాలా మందికి తెలుసు. కానీ, చాలామందికి తెలియనిదేమిటంటే, ఉత్తమ కవిత్వానికి గీటురాయి ఆవేశ బలం కాదు, అనుభూతి సౌకుమార్యం. ఈ విషయం తెలియడమే ఒక సంస్కార విశేషం. ఈ సంస్కారం ఉన్నవాళ్ళే మంచి కవిత్వం రాస్తారు. లేదా రాయాలనే తపనకు లోనౌతారు. ఈ సంస్కారం కలవాళ్ళు ఎప్పుడూ, విప్లవ కవిత్వం రాయరు, చచ్చినా పొడుపుకతల కవిత్వం రాయ లేరు". ఈ 'నేను' కొంతమంది విమర్శ

కులకు 'ప్రవక్తృత్వా'న్ని ప్రసాదిస్తుంది; వారి అభిప్రాయాల అంతిమత్వాన్ని నిరూపించే ప్రయత్నం చేస్తుంది దీనికి ఉదాహరణ నగ్నముని. 'కొయ్యగుర్రా' నికి చేకూరి రామారావు పీఠిక –

"ఇతని అసామాన్యత్వం అతని ప్రయోగాలన్నిటిలో కొట్టవచ్చినట్టు కనిపిస్తుంది ఈ అసామాన్యత్వానికి పరిణతరూపంగా 'కొయ్యగుర్రా' న్ని గుర్తిస్తున్నాను.' "(పే. IX) 'కొయ్య గుర్రం' రచయితను గుర్తించి ఈ 'నేను' తనముందు ఎదిగిన కవిగా ఎలా వర్ణిస్తు న్నదో చూడండి. "సౌందర్యపు స్వగతం'నుంచి 'కొయ్యగుర్రం' వరకు ఎదిగిన కవి సామాన్యుడు కాడని అప్పుడు అనుకున్నాను, ఇప్పుడూ అనుకుంటు న్నాను .. ఇరయ్యేళ్ళకిందటనే కొందరం గుర్తించి ఊహించినట్టుగానే కేశవరావు దశలవారీగా గొప్ప కవిగా ఎదిగాడు " (పై.) తరువాతి దశ మెచ్చుకోలు" "వచనకవిత్వం ఇంతటి అధోగతిలో ఉన్న సమయంలో ఉదాత్తమైన వస్తు వుతో, సీరియస్‌నెస్ ఎక్కడా చెడకుండా 'ఫ్రీవర్సు'నే కవితా వాహకంగా గ్రహించి ఆధునిక మహాకావ్యాన్ని సృష్టించి ఒకే సారి – తెలుగు కవిత్వాన్ని – వచన కవిత్వాన్ని – ఆధునిక కవిత్వాన్ని మళ్ళీ పైకెత్తిన నగ్నమునిని, మెచ్చుకోకుండా ఉండలేను– "(పే. XV–XVI) ఇంతకు ముందు చెప్పినట్లుగా విశ్వనాథ నన్నయ తెలుగు సాహిత్యానికి నూరేళ్ళు కలసి వచ్చునట్లు చేసెను" అన్న మాటలకు ఆధునిక రూపమే ఇది దీనితో 'నేను' పని పూర్తికాలేదు. ఆధునిక మహాకావ్య గండపెండేరాన్ని 'కొయ్యగుర్రా'నికి తగిలించటంతో 'నేను' చరమావస్థకు చేరుకుంది. ఈ గండపెండేరం 'కొయ్య గుర్రా'నికి మాత్రమే సరిపోయేటట్టు తయారు చేయబడింది. ఏమైనా ఆధునిక సాహిత్యంలో, ముఖ్యంగా విమర్శలో ఈ 'నేను' పాత్ర చాలా సున్నితమైంది. అది కళ్ళకు గంతలు కడుతుంది. ఉన్న దాన్ని ఉన్నట్టుగా చూడనివ్వదు. దాని ఫలితం అతిశయోక్తులు, ఊహలు.

ఈ 'నేను' నిర్వహించే పాత్రలో మరొక ప్రమాదకరమైన ధోరణి ఉంది. అది అనాలోచితంగా, తొందరగా ఒక రచనను చదివిన వెంటనే ఏర్పడిన 'రియాక్షన్'తో అభిప్రాయాలు ఏర్పడే ట్టు చేయటం, ఆ రచనలను గురించి వ్యతిరేకాభిప్రాయాలు మాత్రమే ఏర్పడటం, 'పాజిటివ్ ఏస్పెక్ట్'ని చూడ లేకపోవటం దీని ఫలితాలు. "వీళ్ళ రచనలు చదివితే అసహ్యం వేస్తుంది. ఆ తిట్లూ, ఆ బూతులూ, ఆ ఆటవిక ఆవేశమూ ఆ ఒళ్ళెరుగని కుసంస్కా రమూ' ఆ నోటి తీటా, ఆమాటల కంపూ మనకు జుగుప్స కలిగిస్తాయి" [రామచంద్రా రెడ్డి, రాచమల్లు, 1976 : 121]; సమాజం కుళ్ళిపోయినమాట నిజమే. సమాజం పతనమైనమాట నిజమే. విప్ల వాగ్ని జ్వాలలతో తప్ప సంస్కరించ డానికి సాధ్యంకానంతగా పతనమైన మాట నిజమే. కానీ, యెంత పతన మయినా, ఈ దిగంబరుల పైత్యాన్ని కవిత్వమనుకునేటంతగా పతనమయిందా?" [పై. 123] అని దిగంబర కవులను గురించిన అభిప్రాయాలకు ఈ 'నేను'

కారణం. విమర్శలో ఈ 'నేను' వాదం భావకవిత్వంలో ఆత్మాశ్రయ ధోరణి లాంటిదే. ఈ 'నేను' నిర్వహించే పాత్రలలో మరొకటి కవికి లేక రచనకు లేని దృష్టిని, గుణాన్ని ఆపాదించటం, తనకు తెలిసినవిషయాలనన్నింటినిఅంటగట్టటం. ఆర్ ఎస్. సుదర్శనం, పెద్దన, విశ్వనాథ, గోపీచంద్, చలం మొదలైనవారి రచనలను గురించి చేసిన స్వకపోల కల్పనలు ఇందుకు నిదర్శనాలు [వివరాలకు చూ. రామచంద్రారెడ్డి, 1976 : 38-49]

పైన చెప్పినవన్నీ తెలుగువిమర్శలో సర్వసామాన్యంగా కనిపించే లోపాలు. తెలుగులో ఇతర సృజనాత్మక రచనల స్థాయికి తగినట్టుగా విమర్శ ఎదగలేదు. దానికి కారణం పై ధోరణులే. సామాజిక ప్రయోజనం, దృక్పథం కలిగినవైనా సృజనాత్మక రచనలలో, ముఖ్యంగా కవితలో కాస్త వైయక్తికత తప్పకపోవచ్చు. కాని విమర్శకు, వైయక్తికతకు పొత్తు కుదరదు. వస్తుగత విశ్లేషణ ఉన్నప్పుడే విమర్శ సమగ్రం ఔతుంది. పాఠకులను పఠనోన్ముఖుల్ని చేస్తుంది. రచనయొక్క స్థానాన్ని సరిగ్గా అంచనా వేస్తుంది. ఆత్మాశ్రయ పరమైన విమర్శ ప్రశంసలకో, తెగనాడటాలకో దారితీస్తుంది. వర్ణనాత్మకమైన భావధోరణులకు చెందిన మరో సృజనాత్మక రచనగా అది పరిణమిస్తుంది.

ఉపయుక్త గ్రంథాలు

1. అనంతకృష్ణశర్మ, రాళ్ళపల్లి, 1978 [మొదటి ప్రచురణ 1954]. సారస్వతాలోకము, మచిలీపట్టణము : త్రివేణీ పబ్లిషర్స్.

2. ఆంజనేయులు, కుందుర్తి, 1980. పీఠిక: రవీంద్ర. కసిగా కదలివస్తే. నిజామాబాద్: ప్రజాసాహితి.

3. తెలుగు భాషా సమితి. 1961. విజ్ఞాన సర్వస్వము. భాగం 3. హైదరాబాద్.

4. నగ్నముని, 1980. కొయ్యగుర్రం. హైదరాబాద్. సృష్టి ప్రచురణ.

5. మాధవశర్మ, పాటిబండ. 1934. కవిత్వము. భారతి 11:3,4,6, [పునః ప్రకటన. సుబ్రహ్మణ్యం, జి వి. [సం] 1969. సారస్వత వ్యాసములు. హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, 142-151]

6. మాధవశర్మ, పాటిబండ. 1975. తెలుగులో సాహిత్య విమర్శ. హైదరాబాద్. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ.

7. రంగనాధాచార్యులు, కె. కె. (సం) 1979. తెలుగు సాహిత్యవికాసం. హైదరాబాద్. ఆంధ్ర సారస్వత పరిషత్తు.

8. రామచంద్రారెడ్డి,రాచమల్లు.1976. సారస్వత వివేచన. విజయవాడ. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

9. రామచంద్రారెడ్డి, రాచమల్లు,

1980. మంచిమాట. వేణుగోపాల్, అమ్మంగికి. I-IV.

10. రామమోహనరావు, అద్దేపల్లి. 1968. శ్రీ శ్రీ కవితా ప్రస్థానం. మచిలీపట్టణం : ప్రభాకర్ పబ్లికేషన్స్.

11. రామలింగారెడ్డి, కట్టమంచి. 1947. [ఎనిమిదవ ప్రచురణ] కవిత్వ తత్త్వవిచారము. వాల్తేరు : ఆంధ్ర విశ్వ కళా పరిషత్తు.

12. రామారావు, చేకూరి. 1979. తెలుగులో సాహిత్య విమర్శ. రంగనాథాచార్యులు [సం]. 1979: 133-181.

13. రామారావు, చేకూరి. 1980. కొయ్యగుర్రం ఆధునిక మహాకావ్యం. నగ్నమునికి పీఠిక. VII-xxVIII.

14. వేణుగోపాల్, అమ్మంగి. 1980 మిణుగురు. భాగ్యనగరం: మానస సరోవరం.

15. సత్యనారాయణ, విశ్వనాథ. 1970. పద్య విద్య [పీఠిక]. శ్రీమదాంధ్ర మహాభారతము. ఆదిపర్వము. హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ.

16. సుదర్శనం, ఆర్. ఎస్. 1972. సమాజము - సాహిత్యము. చిత్తూరు: చిత్తూరు జిల్లా రచయితల సహకార ప్రచురణ సంఘం.

17. సుదర్శనం, ఆర్. ఎస్. 1980. నేటి సాహిత్యం- సామాజిక స్పృహ. సుబ్రహ్మణ్యం (సం). 1980 : 1-27.

18. సుప్రసన్న [సం] 1969. స్వాతంత్ర్యోత్తర కాలాన తెలుగు కవిత. వరంగల్: జనధర్మ.

19. సుబ్రహ్మణ్యం, జి. వి. [సం]. 1980. సమాలోచనం. హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ.

21. సూర్యనారాయణ, బయ్యా వేంకట. 1980. కరుణశ్రీ గారి 'ఉదయశ్రీ' పై సమీక్ష. ఆంధ్రజ్యోతి, 10-1980:56.

మార్క్సిస్టు సాహిత్య విమర్శ

సాహిత్యం కళ. విమర్శ శాస్త్రం. కళ సామాన్యం నుంచి విశిష్టతను తయారు చేస్తుంది. శాస్త్రం విశేషాన్ని సామాన్యీకరించి సూత్రాలను, న్యాయాలను రూపొందిస్తుంది. జగత్తు కళా ద్వారాన మనిషిలో ప్రవేశిస్తుంది. మనిషి శాస్త్ర ద్వారాన జగత్తులోకి వెళతాడు. మనిషిలో ప్రవేశించిన కళాజగత్తు వ్యక్తినిష్టం అవుతుంది. శాస్త్ర జగత్తు వస్తునిష్టం. వ్యక్తినిష్ఠ వస్తునిష్ఠాలైన కళలకు, శాస్త్రాలకు పరస్పర సంఘర్షణ ఎప్పుడూ ఉంటుంది. ఈ సంఘర్షణల వల్లనే కళలూ కళలకు సంబంధించిన శాస్త్రాలూ నిరంతరాయంగా పెంపొందుతూ వస్తున్నాయి. కళలతోపాటే కళల లక్ష్య లక్షణ నిరూపణ కూడా పుట్టింది. కళ సౌందర్య కర్మ అని మార్క్సిస్టు మతం. కర్మకుశలత పెరగడం కోసం కార్మికులందరి లాగానే సౌందర్య కార్మికులకు కూడా సౌందర్య శాస్త్ర విజ్ఞానం అవసరం. కొందరు పూర్వులు ఆత్మానుభవంతో ఈ తత్వాన్ని గ్రహించారు. "నవేత్తి శాస్త్రవిత్ కర్మ నశాస్త్రమపి కర్మవిత్ యోవేత్తి ద్వయమప్యేతత్ సహిచిత్రకరో వరః" అని భోజుడు చిత్రకారుల గురించి చెప్పాడు. అది సాహిత్యకారులకు కూడా అక్షరాలా వర్తిస్తుంది.

పూర్వ విమర్శకులకు లక్షణ శాస్త్రాల్లో చెప్పిన పంచ సిద్ధాంతాలు, వ్యాకరణ సూత్రాలతో ఒక నిర్దిష్ట ప్రణాళిక ఉంది. సాహిత్యం వ్యక్తినిష్టం కనుక, ఆధునికులు మనస్తత్వంతో సహా అనేకరకాల వ్యక్తివాదాలతో విమర్శ ప్రణాళికలను నిర్మించుకున్నారు. అలాగే మార్క్సిస్టు విమర్శకు కూడా ఒక ఆరు సూత్రాల ప్రణాళిక ఉంది. ఆ సూత్రాలివి: గతితార్కిక సూత్రం లేదా అభివృద్ధి సూత్రం; విశ్వతోముఖ సంబంధ సూత్రం; ప్రధాన సంబంధ సూత్రం; ఐతిహాసిక సూత్రం; పక్షపాత (పార్టిజాన్‌షిప్) సూత్రం; సిద్ధాంతాచరణ సమైక్య సూత్రం. గతితార్కిక సూత్రంలో మూడు న్యాయాలు. రూపం విషయం, సామాజిక అస్తిత్వం, చైతన్యం, వృశ్యం సారం, యదృచ్ఛ ప్రయోజనం లాంటి ద్వంద్వ అభివర్గాలు అన్నీ ఉంటాయి. ఈ సూత్రాలన్నీ ప్రకృతికి, సమాజానికి, చైతన్యానికి సమానంగానే వర్తిస్తాయి. మార్క్సిస్టు మతం ప్రకారం సాహిత్యం సామాజిక చైతన్య రూపాలలో ఒకటి. కనక ఈ సూత్రాలను ఆ చైతన్యరూప విశ్లేషణకు అన్వయించుకోవలసి ఉంటుంది. ఈ ప్రణాళికను పూర్తిగా వివరించడానికి ఇది తావు కాదు. కనక సాహిత్య

రాంభట్ల

అంశాలను, ప్రయోజనాలను మాత్రమే స్థూలంగా వివరిస్తాను.

జగదవగాహనకు జ్ఞానసిద్ధాంతం అని పేరు. ఇంగ్లీషులో దీనికి థియరీ ఆఫ్ నాలెడ్జ్, థియరీ ఆఫ్ కాగ్నిషన్, ఎపిస్టమోలజి అన్న పేర్లు ఉన్నాయి. లెనిన్‌కి ఈ పేర్లేవీ నచ్చలేదు. ఆయన దీనికి "థియరీ ఆఫ్ రిఫ్లెక్షన్" అని పేరు పెట్టాడు. దాన్ని నేను "ప్రతిఫల సిద్ధాంతం" అని అనువదించుకుంటున్నాను. సామాజిక అస్తిత్వం మన చేతనలో ప్రతిఫలించగా అది మన భావాలతో కలిసి వైఖరీ రూపంలో వ్యక్తమవుతుంది. అలా వ్యక్తమయినదానికి "ప్రతి రుచి" అని పేరు. సౌందర్యాన్ని ఒక విశిష్ట ప్రతిఫల సిద్ధాంతం అన్నాడు లెనిన్. అందువల్ల అన్ని జ్ఞానసిద్ధాంతాల్లాగే దీనిక్కూడా మూడు దశలున్నాయి. ఆ దశలకు తక్షణ, తార్కిక, ఆచరణ ప్రతిరుచులని పేరు. ఇందులో ఆచరణ అంటే స్వీయాచరణ, స్వానుభవం అని అర్థం కాదు. లెనిన్ మతం ప్రకారం ఆచరణలు మూడు రకాలు. ఒకటి : సామాజిక చారిత్రక ఆచరణ. రెండు : శాస్త్రీయాచరణ. మూడు : స్వీయ ఆచరణ. ఇందులో పూర్వపూర్వాలు ఉత్తమోత్తమాలు. దీన్నిబట్టి కవికి స్వానుభవం కన్నా శాస్త్రీయానుభవం, అంతకన్నా సామాజిక చారిత్రకానుభవం ఎక్కువగా ఉండాలని తెలుస్తుంది. మానవ జాతి సంచయించిన సకల సౌందర్యాన్ని ఆకళించుకుని తార్కికంగా విశ్లేషించుకుని సమకాల స్వానుభవంతో బేరీజు వేసుకున్నప్పుడే మనకు సాహిత్య, స్వరూప స్వభావాలు అర్థమవుతాయి.

సాహిత్యం విశిష్ట సౌందర్య ప్రతిఫల సిద్ధాంతం కనుక దానికి సౌందర్యం జీవగర్ర. ఏ సాహిత్య కళాప్రక్రియ కయినా అదే నేయం. అగ్రిమం. ఇలా ప్రతిఫలించేది జగద్వాస్తవికత అయినందున సాహిత్యానికి రెండో అంగం వాస్తవికత. సాహిత్యం జగన్నిష్ట వాస్తవానికి ఆత్మనిష్ట ప్రతిరుచి కనుక అందులో సాహిత్యకారుని అన్వీక్షకి ఉండి తీరుతుంది. ఇది మూడో అంగం. సాహిత్యం సౌందర్య వాస్తవిక తాత్వికాల త్రివేణీ సంగమం అయితే అందులో సౌందర్యం గంగ అవుతుంది. వాస్తవికత యమున. తాత్వికత సరస్వతి. అదెప్పుడూ అంతర్వాహినిగానే ఉంటుంది. అలా ఉండాలి కూడా. తాత్వికత పైకి కనిపిస్తే అది పద్యగద్యాత్మకమైన తత్వశాస్త్రం అవుతుందేమో గాని, సుందర కావ్యం మాత్రం కాజాలదు. వస్తుబింబం మన కంటిలో తలకిందులుగా పడినట్లుగానే జగద్వాస్తవికత కూడా తలకిందులుగా ప్రతిఫలించే అవకాశం ఉంది. అపసవ్యంగా పడిన బింబాల్ని సవ్యంగా తిప్పుకోగల తార్కికశక్తి మనిషికి పుట్టుకతోనే అబ్బింది. కాని, ఘటనలని, సంఘటనలని చిక్కురొక్కురుగా ఉన్న అనంత సంబంధాల్ని అంతర్లీనంగా ఉన్న సారాంశాల్ని సవ్యంగా తిప్పుకోగల శక్తి క్రమంగా మాత్రమే అబ్బింది. అది అబ్బేవరకూ అపసవ్య ప్రతిరుచికి అనువైన తర్కాన్ని ధర్మాన్ని తత్వాన్ని మొత్తం అన్వీక్షకినే

తలకిందులుగా తయారు చేసుకుంటాడు. మనిషి అలా తయారు చేసుకున్న తల కిందుల ప్రపంచ చైతన్యమే మతం అని వ్యాఖ్యానించాడు మార్క్స్. ఈ సమాజ వాస్తవికత తలకిందులుగా ఉన్నంత వరకూ ఆ తలకిందులు ప్రపంచ చైతన్యం ఉండి తీరుతుందని కూడా అన్నాడు. మన సాహిత్య రంగంలో కూడా ఈ తలకిందులు ప్రతిరుచి గోచరిస్తూనే ఉంటుంది.

సాహిత్యంలో సుందరత, వాస్తవికత అన్వీక్షకి అనే మూడు అంగాలు ఆది నుంచీ ఉన్నాయి. కాని, అవి మూడూ ఉన్నాయన్న ఎరుక మాత్రం మన కిటీవలనే కలిగింది. పూర్వులకు సౌందర్యం సంగతి ఒక్కటే తెలుసు. దాన్నే వాళ్లు బాగా పెంపొందించారు. సౌందర్య ప్రయోజనం రసానందం. సౌందర్యాంశం తప్ప మరో అంశం ఎరగని పూర్వులు కావ్యప్రయోజనం ఆనందం అన్నారు. అది బ్రహ్మానంద సహోదర మన్నారు. వారలా అన్నందుకు తప్పు పట్టవలసిన అవసరం లేదు. రాజ్య కాంక్షతోనైతే నేమి, ధనదాహంతో అయితేనేమి మధ్య యుగాల్లో సాహసికులు ప్రపంచ పర్యటన చేశారు. అలా తిరిగేటప్పుడు వారికి కొత్త మనుషులు కనిపించారు. కొత్త భాషలు వినిపించాయి. అనేక గణదశలలో ఉన్న మానవుల ఆచారాలు, వ్యవహారాలు వేషభాషలు చూశారు. దీంతో చరిత్రకు ఒక కొత్త అర్థం వచ్చింది. కళ్ళముందు ఓ కొత్త జగత్తు వచ్చింది. ఈ గణాల ఆచార వ్యవహారాలు మన పూర్వ కావ్య వర్ణనలో కనిపించాయి. దీంతో కావ్యంలో సౌందర్యం ఒక్కటేకాదు. ఆనాటి వాస్తవికత కూడా ప్రతిఫలించింది అన్న ఎరుక కలిగింది. అప్పటినుంచి వాస్తవికత కూడా కావ్యానికి కావాలనుకున్నారు. ఆ అనుకోవడంతో కావ్య ప్రయోజనం మారింది. కావ్యంవల్ల ఆనందం ఒక్కటే కాదు. జ్ఞానంకూడా కలుగుతుందని గుర్తించారు. వాస్తవికత ప్రయోజనం జ్ఞానం. దీన్ని జ్ఞానానందం అన్నప్పటికీ అభ్యంతరం లేదు. తలకిందులుగా ఉన్న ఈ సమాజాన్ని తిరిగి కాళ్ళమీద నిలబెట్టడంకోసం వర్గ సమాజాన్ని వర్గరహిత సమాజంగా మార్చడంకోసం ఎన్నో తాత్విక చర్చలు జరిగాయి. ఆ చర్చల సమర్థనకు చరిత్రలో నుంచి తార్కాణాలు చూపించారు. పరిశోధనలు చేశారు. ఫలితంగా శ్రామికులే ఇతిహాసానికి సారథ్యశక్తులు అన్న నిర్ధారణకు వచ్చారు. శ్రామికులు తల్చుకుంటేతప్ప, తలుచుకుని కార్యరంగంలో దిగితేతప్ప ఉత్పత్తి సంబంధాలు మారబోవని, అవి మారుతే తప్ప సామాజిక వాస్తవికత మారదని నిర్ధరించారు. ఆ నిర్ధారణకు క్రియారూపం కల్పించాడు లెనిన్. అదే అక్టోబర్ విప్లవం. సోషలిస్టు సమాజ అవతరణ. అప్పుడు తెలిసింది కావ్యంలో సౌందర్య వాస్తవాలు మాత్రమేకాదు. కవి అన్వీక్షకి కూడా ఆదినుంచీ అంతర్లీనంగా అంతర్వాహినిగా ఉంటూ వచ్చిందని. అన్వీక్షకి ప్రయోజనం వివేకం. ఇప్పుడు మనకు కావ్య త్రివేణీ సంగమ స్వరూపం తెలిసింది కనుక, కవికి సాక్షి

కత అనుల్లంఘనీయమని తటస్థత అసంభవమని నిర్ధారణ చేయగలుగుతున్నాం.

సౌందర్యం

ఆదిమానవుడు తనకు సుఖాన్ని, హితాన్ని, ఆనందాన్ని, శాంతిని కలిగించే ప్రతి వస్తువులోనూ సౌందర్యాన్ని చూశాడు. దీనికి అడ్డుపడిన ప్రతిదాన్ని అసుందరమని, వికారమని భావించాడు. ఆది కావ్యాల్లో సౌందర్యానికి, వికారానికి జరిగిన సంఘర్షణ మనకి స్పష్టంగా కనిపిస్తుంది. సౌందర్య దృష్టి ఆదికాలం లోనే బాగా పెంపొందింది. డబ్బు విలువ తెలియని రోజుల్లోనే ఆదిమానవుడు అందంకోసం వెండి, బంగారాలను తవ్వి తీశారంటాడు మార్క్సు. పుడమితల్లి చీకటి కడుపులో చిక్కుకున్న కాంతి కిరణాలు వెండి బంగారాలని ఆయన వర్ణించాడు. బంగారం వర్ణ పటలిలో ఆఖరిదైన అరుణిమను ప్రతిబింబిస్తుంది. వెండి మొత్తం వర్ణ పటలినంతటిని ప్రతి బింబిస్తుంది. కనక ఆదిమానవుడు అరుణిమలో అందాన్ని చూడగలిగాడు. ఈ అరుణిమను ఇచ్చింది బంగారం. కనక వేదాలలో ఒకే మాట అందం, ఎరుపు, బంగారం అనే అర్థాల్నిస్తుంది. అదే హిరణ్యం. సూర్యునికి హిరణ్యశ్మశ్రుడు అని పేరు. అంటే అందమైన మీసాలని గాని, ఎర్రని మీసాలనిగాని అర్థం చెప్పు కోవచ్చు. అగ్నికి హిరణ్య రేతస్కుడు అని పేరు. నిప్పు చేయడంకోసం వాళ్ళు వాడే కొయ్యముక్కను అరణి అంటారు. దాన్ని "హిరణ్య యీ ఆరణి" అని ప్రస్తుతించారు. అంటే అక్కడ బంగారంతో చేసిన అరణి అని అర్థం చెప్పుకుంటే ఎంత అపహాస్యంగా ఉంటుందో ఊహించుకోవచ్చు. తెలుగులో కూడా "చెన్ను" అంటే ఎరుపని, అందమని రెండర్థాలు ఉన్నాయి. రష్యన్ భాషలో కూడా 'క్రాస్నా' అన్న మాటకు ఈ రెండర్థాలూ ఉన్నాయి.

సౌందర్యాంశము మాత్రమే ఎరిగిన పూర్వులకు ఆనందం ఒక్కటే తెలుసు. ఆనందాన్ని వ్యక్తం చేసే పద్ధతిహాసం. ఈ హాసానికి ఒక అంచున శృంగారం. మరొక అంచున కరుణ ఉన్నాయి. కనుకనే మన కావ్యాల్లో భ్రష్ట శృంగారాన్ని హాస్యంగా పరిగణించారు. క్షేమేంద్రుని ఉపహాస కావ్యాలు, లంబోదర ప్రహసనం, భగవదజ్జుకం, మత్త విలాసం లాంటి ప్రహసనాలు బూతుల బుంగలా వుంటాయి. కరుణ విపాకమైన హాస్యం చాలా అందమైనది. దాన్ని ఇటీవల కాలంలో చార్లీ చాప్లిన్ మాత్రమే సృష్టించగలిగారు. ఆదిలో శృంగార, హాస్య, కరుణ రసాలుండేవి. తరువాత అవి భరతుని కాలంనాటికి ఎనిమిద య్యాయి. భోజుని కాలం నాటికి పన్నెండయ్యాయి. ఇప్పుడు బహుశా పాతిక వరకూ ఉండవచ్చు. మన దేశంలో సుమారు అయిదు వందల అలంకార శాస్త్రాలు పుట్టాయి. అన్నిటిలో కూడా సౌందర్యమే ప్రధానాంగంగా ఉంటూ వచ్చింది. ఈ సౌందర్యాన్ని కొందరు ప్రాచ్యులు, పాశ్చాత్యులు కూడా దివ్య సౌందర్యంగా వర్ణించారు. లౌకిక సౌందర్యం తుచ్ఛమని, హేయమని కూడా చెప్పారు.

వాస్తవికత

పూర్వాలంకారికులు వాస్తవికతను ఊహించగలిగారు. కాని, నిరూపించలేకపోయారు. క్షేమేంద్రుడు తన ఔచిత్య విచార చర్చలో వాస్తవికతనే ఔచిత్యంగా పేర్కొన్నాడు. వాస్తవికత అను మాట వాడలేదుగాని సాదృశ్యం అన్న మాటను ఆయన ప్రయోగించాడు. అదంతటితోనే ఆగిపోయింది. ఇప్పుడు మనకున్న విజ్ఞానాన్నిబట్టి వాస్తవికతను ఏడు రకాలుగా విభజించుకోవచ్చు. ఒకటి : ఆదిమ వాస్తవికత. ఆదిమానవులు కనిపించిన ప్రతిదానిలోనూ తమనే చూసుకో గలిగారు. తమ గుణగణాలను వాటికి ఆరోపించారు. దీన్నే ఇంగ్లీషులో "యాంత్రోపోమార్ఫిజం" అంటారు. దీన్ని ఆదిమానవుడు కనిపెట్టాడు. ఆదిమానవుని వాస్తవికతను తెలుసుకోవాలంటే ఈ "పురుషభావారోపణ"ను అర్థం చేసుకోవలసి ఉంటుంది. ఆదిమానవుడు కనిపెట్టిన పురుషభావారోపణ పద్ధతి నేటికి కూడా కవులకు ఆలంబనగానే ఉంటోంది. పురుషభావారోపణను అర్థం చేసుకున్నప్పుడే వేదాలు వర్ణించిన విరాడ్రూపమ్ మన కవగతమవుతుంది. ఆనాటి గణ సమాజాన్ని అంతటినీ వారు ఒకే పురుషునిగా ఊహించి గణలక్షణాలన్నిటినీ ఆ పురుషునికి ఆరోపించారు. దీంతో పాటు వారు మరొకరమైన వాస్తవికతను కూడా సృష్టించుకోవలసి వచ్చింది. అది "భ్రాంతి వాస్తవికత" భయంకరమైన ప్రకృతి శక్తుల ముందునిస్సహాయుడైన ఆదిమానవుడు కవితతోను, గానంతోనో, నాట్యంతోనో ఆ శక్తులను తాను లొంగదీసుకున్నాననే భ్రాంతిని కల్పించుకునేవాడు. అలాంటి భ్రాంతే అతడిని ఆశాజీవిని చేసింది. లేకపోతే ప్రకృతి శక్తులతో అతడు పోరాడగలిగి ఉండేవాడు కాడు. ఈ ఆదిమ భ్రాంతి వాస్తవికత కూడా నేటికీ మనకు కనిపిస్తూనే ఉంటుంది.

రెండోది : పురాణ వాస్తవికత. పురాణాలు వర్గ సమాజంలో పుట్టాయి. వాటి సమాజ అవసరాల కనుగుణంగా సాహిత్య పాత్రల నిర్మాణం మొదలయింది. ఆదిమానవుడు పురుషభావాభావారోపణాన్ని కని పెడితే పౌరాణిక కవులు "అచ్చులు" అంటే టైప్స్ తయారుచేయడం నేర్చుకున్నారు. కాని, ఈ పాత్రకు రెండే తలాలు ఉన్నాయి. అయితే అమావాశ్య, లేకపోతేపున్నమి. అంతేకాని ఈ మధ్య వెలుగుచీకట్లలో భేదాలుంటాయన్న సంగతి వారికి తెలియదు. నాయకుల్ని, ప్రతినాయకుల్ని సృష్టించి స్థిర సమాజానికి, సంచారగణాలకీ వచ్చే పోరాటాన్ని గణదేవతల యుద్ధంగా ప్రతిఫలించాయి పురాణాలు. ఈ వాస్తవికత కాస్త పెంపొంది ప్రాబంధిక వాస్తవికతగా మారింది. ప్రబంధ వాస్తవికతలో పురాణపురుషులు కూడా నాటి సమాజ నాయకులుగా మారిపోయారు. ఛోటా రాజుల దగ్గర నుంచి చక్రవర్తుల వరకూ ప్రబంధ నాయకుల్లో మనకి కనిపిస్తారు. ఆ నాయకుడు రాముడే కావచ్చు, కృష్ణుడే కావచ్చు మరెవరైనా కావచ్చు. వాళ్ళల్లో కనిపించేది ఆనాటి

పాలకులు మాత్రమే. అయితే ఈ వాస్తవికతలో మూడో తలం కూడా చేరింది. వీళ్ళు నిర్మించిన అచ్చులకు కొత్త కండపుట్టింది.

ఆ తర్వాత వచ్చిన వాస్తవికతలు మన దేశంలో సహజంగా పుట్టినవికావు. యూరప్ దేశాల సంపర్కంవల్ల మనం వాటిని దిగుమతి చేసుకున్నాం. ఫ్యూడల్ సమాజానికి భరత వాక్యంగా పారిపణ్య సమాజానికి నాందీవాచకంగా సంధ్యా సమయంలో పుట్టింది కాల్పనికత. ఈ కాల్పనికతలో రెండు శాఖలున్నాయి. ఒకటి ఉదాసీనం, రెండు క్రియాశీలం. అంతరిస్తున్న ఫ్యూడల్ సమాజాన్ని చూసి కాకిశోకం పెట్టేవారు తలెత్తుతున్న పారిపణ్య సమాజాన్ని చూసి గగ్గోలుపడేవారు ఉదాసీన కాల్పనిక వాదులయ్యారు. వారి గ్రంథాల్లో ఈ వాస్తవికత స్పష్టంగా కనిపిస్తుంది. మన సాహిత్యంలో విశ్వనాథ వారి రచనలు ఇందుకు ఉదాహరణలు. వ్యక్తి స్వేచ్ఛ పేరనయితేనేమి, మరొక పేరనైతేనేమి పారిపణ్య సమాజానికి హారతులు పట్టేవారు క్రియాశీలక కాల్పనిక వాదులు. ఈ రకం కాల్పనికత మనకు భావ కవితోద్యమంలో కనిపిస్తుంది. కాల్పనిక వాస్తవికతలో జగద్వాస్తవికత కన్నా ఊహాకల్పన ఎక్కువగా వుంటుంది. అది పారిపణ్య సమాజానికే కాక ఆతర్వాత రానున్న సమాజానిక్కూడా హారతి పట్టినప్పటికి అందులో ఊహాకల్పనే ఎక్కువగా కనిపిస్తుంది. శ్రీశ్రీ కవిత అందుకు ఉదాహరణ. కాల్పనిక వాస్తవికత లాగానే సవిమర్శక వాస్తవికత కూడా మనకు విదేశీ సంపర్కం వల్లనే కలిగింది. పారిపణ్య సమాజం వికసించిన దశలో ఈ వాస్తవికత పుట్టింది. స్వాతంత్ర్యం, సౌభ్రాత్రం, సమానత్వం అన్న నినాదాలతో ఏర్పడిన ఈ సమాజం అధికారంలోకి రాగానే ఆ మూడింటిని అణిచి పారేసింది. ఈ సంగతి గ్రహించగలిగిన ద్రష్టలు కొత్త సమాజాన్ని విమర్శనా దృష్టితో చూసి రచనలు చేశారు. మన సాహిత్యంలో సవిమర్శక వాస్తవికతకు ఏకైక ఉదాహరణ గురజాడ అప్పారావు రచనలు మాత్రమే. ఆయన కన్యాశుల్కం రాసి ఎనభై అయిదేళ్ళయినా అందులో ప్రతి ముక్క ఈనాటికీ నిజంగా కనిపిస్తుంది. "పల్లెటూరి పీపిల్ లెక్చర్లకి అన్‌ఫిట్. మొన్న మనం వచ్చిన బండి వానికి నాషనల్ కాంగ్రెస్ విషయమై రెండుగంటలు లెక్చరు యిచ్చేసరికి ఆ గాడిదకొడుకు వాళ్ళ వూరు హెడ్ కానిస్టేబిల్ని కాంగ్రెసువారు యెప్పుడు బదిలీచేస్తారని అడిగాడు. విలేజస్‌లో లెక్చర్లు యంతమాత్రం కార్యంలేదు" అన్న గిరీశం మాట ఎంత నిజం! అలాగే "నేషనల్ కాంగ్రెస్ అనగా దివాన్‌గిరీ చలాయించడం" అని బుచ్చెమ్మకు వెంకటేశం చేత చెప్పించిన మాట ఎంత సత్యం! గురజాడ తర్వాత నా దృష్టిలో ఇంతవరకూ సవిమర్శక వాస్తవికత మన సాహిత్యంలో వెలువడలేదు.

పురుష భావారోపణ నుంచి అన్యాపదేశం నుంచి ఇంతవరకూ పుట్టిన వాస్తవిక రూపాలన్నీ జానపద వాస్తవికతలా

కనిపిస్తాయి. పురాణాలు ఒక జాతి కలలైతే జానపద కథలు బడుగు మనుషుల కలలు - అని ఒక ప్రముఖ విమర్శకుడు అన్నాడు. జానపద కథల్లో అన్యాపదేశ వాస్తవికత అంటే "ఎలిగారీ" మనకు కనిపిస్తుంది. హింసకులీన్ని, పీడకులీన్ని ఎదిరించలేని అశక్తుడు ఆదిమానవుడిలాగే భ్రాంతి వాస్తవికతని సృష్టించుకుంటాడు. ఆ భ్రాంతి వాస్తవికతకు మరో రూపమే అన్యాపదేశ వాస్తవికత. ఇంతవరకూ పుట్టిన అందాలన్నిటినీ ఆకళించుకుని అన్నిరకాల వాస్తవికతల సారాన్ని సంగ్రహించి అందులో అవసరము, స్థిరము, సారవంతము, పునరావృతము అయ్యే లక్షణాలను సంతరించుకుని సాగించే రచన సోషలిస్టు వాస్తవికత. ఈ వాస్తవికతకు ఇంతవరకూ గోర్కీ రాసిన "అమ్మ" నవలనే ఉదాహరణగా చూపుతున్నారు. నాదృష్టిలో తెలుగువారు ఇంతవరకూ సవిమర్శక వాస్తవికతనే అందుకోలేకపోతున్నారు. గురజాడ మోకాలుని తాకగల రచయితలు కూడా కనిపించడంలేదు. అలాంటప్పుడు సోషలిస్టు వాస్తవికతా నిర్మాణం ఎంతదూరముందో ఊహించవచ్చు.

అన్వీక్షకి :

సాహిత్యానికి మూడో అంగం అన్వీక్షకి. ఈ అన్వీక్షకికి ఒక్కొక్క దశలో ఒక్కొక్క సామాజిక చైతన్య రూపం నేయంగా, అగ్రిమంగా వుంటూ వస్తుంది. ఆదిమానవుడికి నేయమైన రూపం "ఋతం" అంటే ఎథిక్స్. అతడు ఎలాంటి సాహిత్యాన్ని రచించినా దానికి లోబడే వుంటుంది. పౌరాణిక యుగంలో నేయరూపం మతం. అందువల్ల సాహిత్యమంతా మతానికి లోబడే వుంటుంది, ఈ మతం ప్రబంధ వాస్తవికతా కాలం వరకూ రాజ్యం చేస్తూనే వచ్చింది. భారతదేశంలో మతానికి గుండెకాయ కులం. ప్రబంధ యుగంలో వర్ణాశ్రమ ధర్మాల పేరుతో కొన్ని కావ్యాలు కులాన్ని సమర్థిస్తే భక్తకవులు మతం పేరుతోనే కులాన్ని నిరసిస్తూ వచ్చారు. ఈనాటి సాహిత్యంలో మనకి ఈ తాత్విక సంఘర్షణ స్పష్టంగా కనిపిస్తుంది. కాల్పనిక వాస్తవికత సంధియుగం నాటిది కనుక కొంత మత ప్రాబల్యం దానిమీద వుంటుంది. పారిశ్రామిక సమాజానికి నేయమైన సామాజిక చైతన్య రూపం రాజకీయాలు. ఈ రాజకీయాలు కూడా కొద్దికొద్దిగా కాల్పనిక సాహిత్యంలో కనిపిస్తాయి. సవిమర్శక సాహిత్యం మాత్రం ఆ రాజకీయాల్ని అన్ని ముఖాల నుంచి విమర్శక దృష్టితో చూస్తుంది. సోషలిస్టు సమాజంలో నేయాత్మకమైన సామాజిక చైతన్య రూపం అన్వీక్షకి అంటే అయిడియాలజీ.

సోషలిస్టు అన్వీక్షకిని ఆమూలాగ్రంగా ఆకళించుకోలేనివారు సోషలిస్టు వాస్తవికతనే కాదు ఈ నాటి దశలో సవిమర్శక వాస్తవికతని కూడా సృష్టించలేరు. గురజాడ అప్పారావుగారి నాటికి సోషలిస్టు సమాజం అవతరించలేదు. కాని ఇప్పుడు సోషలిజానికి షష్ఠిపూర్తి అయింది. అనేక దేశాలు సోషలిజాన్ని నెలకొల్పుకుంటున్నాయి. ఈ దశలో సవిమర్శక వాస్తవికతను రచించాలన్న అభ్యుదయ కవికి సోషలిస్టు అన్వీక్షకి తప్పదు. సుందరత, వాస్తవికత, అన్వీక్షకత అనే త్రివేణి సంగమం సాహిత్యం. ఇందులో అన్వీక్షకి అంతర్లీనంగా వున్నప్పుడే ఏ సాహిత్య ప్రక్రియ అయినా రాణిస్తుంది. సౌందర్యం ముందు జన హృదయాన్ని ఆకర్షిస్తుంది. ఆనందాన్నిస్తుంది. వాస్తవికత వారికి విజ్ఞానాన్ని ఇస్తుంది. అన్వీక్షకి పాఠకులను నిర్దిష్ట, సౌందర్య, నైతిక, రాజకీయ నిర్ధారణలు చేయగలగడానికి తోడ్పడుతుంది. వివేకాన్ని కలిగిస్తుంది.

★

ఆధునిక సాహిత్య విమర్శా పద్ధతులు

జీవితము, సాహిత్యము, సాహిత్య విమర్శ సమబాహు త్రిభుజంలోని భుజాల వంటివి. ఈ మూడూ ఒకదాన్ని విడచి మరొకటి నిలువలేవు. ప్రతిపత్తి దృష్టితో చూచినప్పుడు వీటి మధ్య ఎక్కువ తక్కువలు లేవు.

ఒక వస్తువును చూడటానికి అనేక దృష్టి కోణాలున్నట్లు, సాహిత్యాన్ని పరిశీలించటానికి కూడా అనేక దృష్టి కోణాలు ఉండగల అవకాశం ఉన్నది. కావ్యాన్ని కవి దృష్టి కోణం నుంచి పరిశీలించాలా, లేక విమర్శకునికి నచ్చిన సిద్ధాంతం యొక్క దృష్టి కోణం నుంచి పరిశీలించాలా అన్నది చాలా కాలంగా సాగుతున్న వివాదం. భారతీయ అలంకార శాస్త్రం యిందులో మొదటి వాదాన్నే సమర్థిస్తుంది. కవిలోను, విమర్శకుని లోను ఉన్న సాహిత్య సంవేదన ఒకే విధమైనదని, సహృదయుడు కావ్యాను శీలన సమయంలో శుభ్రమైన అద్దం లాంటి అంతరంగాన్ని కలిగి ఉండాలని, కావ్యంతో హృదయ సంవాదాన్ని, తన్మయీ భావాన్ని సాధించాలని అలంకార శాస్త్రం చెబుతున్నది. కానీ, సాహిత్య విమర్శకుని కర్తవ్యం అంతటితో తీరిపోదు. కావ్యోద్దేశాన్ని అర్థం చేసుకోవటానికి సహృదయత అవసరమే. అర్థం చేసుకున్న తరువాత కావ్యోద్దేశాన్ని, కావ్యం యిచ్చే అనుభూతిని విలువ కట్టడం [evaluation] విమర్శకుని కర్తవ్యం. విమర్శకుడు తన దృష్టి కోణాన్ని పూర్తిగా మరచిపోయి కావ్యం విలువను నిర్ణయించటం అసాధ్యం. కాబట్టి కావ్యాన్ని అర్థం చేసుకోవటానికి కవి దృష్టికోణము, విలువ కట్టడం కోసం విమర్శకుని దృష్టికోణము అనివార్యాలని చెప్పవచ్చు.

సాహిత్య విమర్శా సూత్రాలు వేరు వేరు దేశాలలో, ఆయా దేశాల సాహిత్య సంప్రదాయాలకు, దార్శనిక సిద్ధాంతాలకు వ్యాఖ్యాన ప్రాయాలంగా ఉండేవి. గ్రీక్, రోమన్, భారతీయ సాహిత్యాలను, సాహిత్య శాస్త్రాలను పరిశీలించితే యీ విషయం తేటతెల్లమౌతుంది. కానీ ఈనాడు దేశాల మధ్య, సంస్కృతుల మధ్య సరిహద్దులు కుంచించుకు పోతున్నాయి. పందొమ్మిదవ శతాబ్దంలో ఆంగ్ల సాహిత్యంతో సంపర్కం కలిగి నందుచేత మనం అనేక సాహిత్య ప్రక్రియల్ని దిగుమతి చేసుకున్నాం. ప్రక్రియలు కొత్తవైనందువల్ల వాటికి సంబంధించిన విమర్శా సూత్రాలు మనకు లేవు. దీనికితోడు మారుతున్న నేటి సామాజిక పరిస్థితులలో సాహిత్య ప్రయోజనాన్ని గురించి కొత్త

వల్లంపాటి వెంకట సుబ్బయ్య

ఆలోచనలు, శిల్పాన్ని పరిశీలించటానికి కొత్త కొలబద్దలు రూపొందాయి. వీటిని స్థూలంగా పరిచయం చేయటమే యీ వ్యాసం ఉద్దేశం. మొదట ప్రాచీన భారతీయ అలంకార శాస్త్రానికి నేడున్న స్థానాన్ని పరిశీలించి, ఈనాడు ప్రచలితంగా ఉన్న కొన్ని ప్రముఖ విమర్శా పద్ధతులను పరిచయం చేస్తాను.

భారతీయ అలంకార శాస్త్రానికి భారతీయ వేదాంతం పునాది. అలంకార శాస్త్రం 'భావ' నికి అభినవ గుప్తుడిచ్చిన వేదాంత నిర్వచనం మీద నిర్మించబడింది. అతని అభిప్రాయం ప్రకారం 'భావం' జన్మజన్మల నుండి సహృదయుని మనస్సులో దాగిఉన్న 'వాసన' అందుచేతనే ఈ అలంకార శాస్త్రాన్ని శిరసావహించిన ప్రాచీన భారతీయ సాహిత్యాలలో మోక్షప్రాప్తికి అత్యధిక ప్రాముఖ్యత యివ్వబడింది. రచన దృష్టితో చూచినప్పుడు అలంకార శాస్త్రంలో రసం, ధ్వని సిద్ధాంతాలకు చాలా ప్రాముఖ్యత ఉంది. రసం వస్తువుకు, ధ్వని రచనాపద్ధతికి సంబంధించిన ప్రధానమైన సూత్రాలని కె. ఎస్. కుప్పుస్వామి శాస్త్రి భావించారు. ఈ సిద్ధాంతాలలోని అనవసరమైన వర్గీకరణలను విస్మరించి, జాగ్రత్తగా ఉపయోగిస్తే ప్రాచీన సాహిత్యాధ్యయనానికి యివి పరిమితంగా పనికిరావచ్చు. కానీ అలంకార శాస్త్రాన్ని ఆలోచనా రహితంగా సృజనాత్మక సాహిత్యంమీద రుద్దటంచేత మన సాహిత్యానికి జరిగిన అపకారాన్ని యిక్కడ సమీక్షించవలసిన అవసరం ఉన్నది.

సాహిత్యాన్ని అర్థం చేసుకోవటానికి, విలువ కట్టటానికి సహకరించ వలసిన అలంకారశాస్త్రం క్రమక్రమంగా రచయిత సృజన శక్తికి సంకెలగా తయారైంది. కథావస్తువును వేద పురాణాలనుంచే స్వీకరించాలని భరతుడు (నాట్యశాస్త్రం-1భాగం-శ్లోకం2-17) శాసించాడు. ఈనిబంధన వల్ల సంస్కృత సాహిత్యము, కొన్ని శతాబ్దాలపాటు యితర భాషాసాహిత్యాలు సమకాలీన జీవితం నుండి వేరు చేయబడ్డాయి. వస్తువు విషయంలోనేకాక, రూపం (form) విషయంలోకూడ అలంకార శాస్త్రం ఉల్లంఘించడానికి వీలుకాని సిద్ధాంతాలను (Prescriptive rules) రూపొందించింది. నాయకులను, నాయికలను, చివరకు దూతికలను అలంకార శాస్త్రం వర్గీకరించడంచేత, సహజము, సృజనాత్మకము అయిన పాత్రచిత్రణ వెనుకబడి పోయింది. ప్రతి సాహిత్య విషయాన్ని వర్గీకరించాలన్న కోరిక మన అలంకారికులలో వెర్రితలలు వేసింది. వీరి వర్గీకరణ సామర్థ్యాన్ని (ఉ॥ 7420 రకాల ధ్వనులు) మెచ్చుకోవటంలో కూడా మనం చాలా శతాబ్దాలు వృధా చేశాము.

సంస్కృత అలంకారశాస్త్రం వివిధ వేదాంత మార్గాలతో ముడిపడి ఉందని యింతకు ముందే చెప్పబడింది. భారతీయ వేదాంతులు వేదోపనిషత్తులో మాత్రమే సత్యం ఉన్నదని నమ్మి, వాటిని వ్యాఖ్యానించటానికి మాత్రమే ప్రయత్నించారు. యూరోపియన్ దార్శనికులలాగా సత్యాన్ని తమకు తాముగా అన్వేషించాలని, తెలుసుకోవాలని ప్రయత్నించలేదు.

ఇలా వేదాంతాన్ని అలంకారశాస్త్రం, అలంకారశాస్త్రాన్ని సాహిత్యం తమకు మార్గదర్శకాలుగా అంగీకరించాయి. అందుచేత రచయితకు తనకు నచ్చిన కావ్య వస్తువును తీసుకొని, దాన్ని తనకు నచ్చిన వ్యక్తిగత దృష్టికోణం నుంచీ పరిశీలించే స్వాతంత్ర్యం దాదాపు లేక పోయింది. రచయిత సృజనశక్తి యీ విధంగా మేకు బందీ అయిపోవటంచేత, తన వ్యుత్పత్తిని చాటుకోవటం తప్ప, అతనికి కీర్తికి మరొక దారి లేకపోయింది. అందుచేతనే చిత్ర, అవధాన కవితలు; ద్వ్యర్థి, త్ర్యర్థి కావ్యాలు ఉదయించాయి. తెలుగులో భావ విప్లవానికి మూలపురుషుడైన వీరేశలింగం కూడా ఒక నిరోష్ఠ్య కావ్యాన్ని రాశారంటే యీ సంప్రదాయం యొక్క బలం ఎంతటిదో అర్థమౌతుంది. అందుచేతనే భారతీయ భాషలలో (కొంతవరకూ తమిళం మినహా)—ముఖ్యంగా తెలుగులో సృజన కంటే అనుకరణే అధికంగా కనిపిస్తుంది. అంతేకాక ఆలంకారికులు చరిత్ర సృష్టిస్తున్న నూతన సామాజిక, సాహిత్య సమస్యలను నిరాదరించటంచేత, యీ పరిమితమైన సృజన కూడా అతిలోకము, అసహజము అయిన కల్పనలు చేయటానికే ఉపయోగపడింది.

అలంకారశాస్త్ర సంప్రదాయంలో తెలుగులో వచ్చిన సాహిత్య విమర్శకు కొదువలేదు. కానీ అలంకార శాస్త్ర సంప్రదాయాన్ని అనుసరిస్తున్నామని భావించిన విమర్శకులు కూడా తమకు తెలియకుండానే ఆ పరిధిలోంచి బయటికి వచ్చి, యితర కొలబద్దలను అనేక సందర్భాలలో స్వీకరించారు. మరి కొందరు ఆధునిక సాహిత్యాన్ని గూడా అలంకార శాస్త్రసూత్రాలతో సంపూర్ణంగా విలువ కట్టవచ్చునన్న భ్రమలోపడి గురజాడ, పింగళి, కాటూరి, జాషువా, శ్రీశ్రీ మొదలైన కవులను తప్పుగానో, తక్కువగానో అంచనా వేశారు. ఈ పొరపాటును విశ్వనాథ, పొట్లపల్లి సీతారామారావు, జవ్వాడి గౌతమరావు, కేతవరపు రామకోటిశాస్త్రి, అద్దేపల్లి రామమోహనరావులు చేశారు.

విమర్శకుడు రచనలోని వివిధ అంశాలలో దేనికెంత ప్రాధాన్యత నివ్వాలో తెలుసుకోవాలి (Right emphasis). అంతే కానీ తనకు నచ్చిన అంశమే కావ్యంలోని ప్రధానాంశం అన్న భ్రమకు లోను కాగూడదు. అలంకార శాస్త్రం ఊహించని సామాజిక దృక్పథాలను, ప్రక్రియలను, శిల్ప పద్ధతులను అలంకార శాస్త్ర సూత్రాలతో అంచనా వేయాలని ప్రయత్నించినప్పుడు యిలాంటి తప్పుడు ఫలితాలు రాక తప్పదు. అలంకార శాస్త్రం ప్రముఖంగా కళాశాస్త్రమే కానీ, సామాజిక, చారిత్రిక, ఆర్థిక, దార్శనిక రంగాలను గురించి శాస్త్రీయ దృష్టి కలిగిన సమగ్ర విమర్శా పద్ధతి కాదు. ఈ బలహీనతను గుర్తించకుండా, అది సర్వకాలా బాధ్యమైన సమగ్ర దృక్పథమని (అందులోని సర్వవర్గీకరణలతోబాటు) భావించటం తగదు. కలుపు గూడా పైరేనని వాదించటం, లేదా కలుపుతోబాటు పైరును పెరికి వేయటం మాని, అలంకార శాస్త్ర సంప్రదాయంలో స్వీకరించవలసింది ఏమిటో, విసర్జించవలసింది ఏమిటో నిక్కచ్చిగా

తెల్సుకోవటం ఎంతైనా అవసరం.

ప్రపంచ సాహిత్యంలో యీనాడు లెక్కకు మించినన్ని విమర్శా పద్ధతు లున్నాయి. వాటినన్నింటినీ దిగ్దర్శనంగా పరిచయం చేయటానికి గూడా యీ వ్యాస పరిధి చాలదు. అందుచేత రూప విమర్శ (Formalistic criticism), మానసిక శాస్త్ర విమర్శ (Psychological Criticism), మార్క్సిస్టు విమర్శ (Marxist criticism) అన్న మూడు ప్రధాన పద్ధతులను మాత్రమే పరిచయం చేయదలుచుకున్నాను.

రూపవిమర్శకుల అభిప్రాయం ప్రకారం సాహిత్యంలో వస్తువుకంటే రూపానికే (Form) ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. వీరు, రచయిత తన రచనలో ఏమి చెప్పటానికి ప్రయత్నిస్తున్నాడు అని ఆలోచించరు. రచన తనకు తానుగా ఏమిచెబుతోంది. అని మాత్రమే విచారిస్తారు. రచయిత దృష్టి కోణంనుంచి రచనను పరిశీలించటాన్ని వీరు తిరస్కరిస్తారు. కాబట్టి రచయిత జీవితం, అతని దేశకాలాలు, విశ్వాసాలు, ఆదర్శాలు మొదలైన అంశాలు సాహిత్యాను శీలనకు అవసరం లేదు.ఇవి రచన రూపంలో, శిల్పంలో ఐక్యం కానంతవరకూ వీటికి విలువలేదు. రచయిత ఆదర్శాల దృష్టి కోణంనుంచి రచనను పరిశీలిస్తే, లోపభూయిష్టమైన రూపము, శిల్పము ఉన్న రచన కూడా గొప్ప రచనగా పరిగణనపొందే ప్రమాదం ఉందని వీరి అనుమానం. ప్రతి మంచిరచనా తనదే అయిన రూపాన్ని కలిగి ఉంటుందని వీరు నమ్ముతారు. నిర్మాణాన్ని పరిశీలించటానికి శైలిని, శిల్పాన్ని సూక్ష్మాతి సూక్ష్మంగా పరిశీలించాలన్నారు. అందుకోసం వీరు టెన్షన్, పారడాక్స్, పద చిత్రాలు, అస్పష్టత, అల్లిక మొదలైన సూత్రాలను కవిత్వ విమర్శకోసం రూపొందించారు. ఈ పద్ధతిని నవలా సాహిత్యానికి కూడా అన్వయించాలని మార్క్ షోరర్, జోసఫ్ ఫ్రాంక్ మొదలైన విమర్శకులు Technique as Discovery, Spatial Form అన్న సూత్రాలను రూపొందించారు. రచయిత అనుభవానికి, రచనకు మధ్యఉన్న భేదం షోరర్ దృష్టిలో శిల్పం. శిల్పం ద్వారానే రచయిత కథావస్తువును ఎన్నుకుంటాడని, పరిశీలిస్తాడని, రచనగా రూపొందిస్తాడని భావించిన షోరర్ అదే క్రమంలోనే రచనను పరిశీలించాలని సూత్రీకరించాడు. సాహిత్యాన్ని సంగీతం లాగా కాలం (time) లో కాకుండా, శిల్పం, శైలి, పాత్ర చిత్రణ, కథావస్తువు మొదలైన అంశాలను ఏక కాలంలో చిత్రకళలో లాగా స్పేస్ (దేశం?)లో గ్రహించాలన్నది ఫ్రాంక్ రూపొందించిన సిద్ధాంతం. రూపవాదులు వారి పద్ధతిని రచనను సూక్ష్మంగా పరిశీలించటం (Close reading of the text) అన్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే యీ విమర్శా పద్ధతిలో రూపానికున్న ప్రాధాన్యత వస్తువుకు; రచనకున్న ప్రాధాన్యత రచయితకు లేదు.

ఈ పద్ధతి పందొమ్మిదవ శతాబ్ది ప్రారంభంలో కాల్పనికవాద మహాకవి కోలిరిజ్‌తో ప్రారంభమైందని చెప్ప

వచ్చు. మరి కొందరి అభిప్రాయం ప్రకారం రష్యన్ ఫార్మలిస్టులు యీఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ శతాబ్దంలో ఎలియట్, ఐ.ఎ. రిఛర్డ్సులు దీనికి ప్రాణం పోశారు. రిఛర్డ్స్ దీన్ని ఒక బోధనా పద్ధతిగా రూపొందించి, ప్రాయోగిక విమర్శ (Practical Criticism) అన్న పేరుతో యీ పద్ధతికి గొప్ప ప్రాచుర్యం కలిగించాడు. 1930 ప్రాంతాలలో నైతిక, సామాజిక విమర్శాపద్ధతుల మీద తిరుగు బాటుగా అమెరికాలో యీ పద్ధతి నవ విమర్శ (New Criticism) అన్న పేరుతో అపూర్వమైన గౌరవాన్ని సంపాదించింది. ఈ శతాబ్దంలో యీపద్ధతికున్న ప్రాచుర్యం మరొక దానికి లేదని చెప్పవచ్చు. ప్రథమశ్రేణి విమర్శకులైన ఎమ్సన్, బ్లాక్మర్, ఆలన్ టేట్, రాన్సమ్, క్లెన్త్ బ్రూక్స్ మొదలైనఎందరెందరో యీ మార్గాన్ని అనుసరించటం యీ అభిప్రాయాన్ని నిరూపిస్తుంది.

రూపవిమర్శ కళకు స్వయం ప్రతిపత్తి ఉందని (art as art) నమ్ముతుంది. కళను సామాజిక సత్యానికి ప్రతిబింబంగానో, రచయిత భావాలకు రూపకల్పనగానో అంగీకరించదు. ఇలా రూపవిమర్శ రచనను రచయిత నుండి, సమాజంనుండి వేరు చేస్తుంది. రచయితల భావాలు, శిల్ప మార్గాలు అభివృద్ధి చెందటంలో గూడా చారిత్రక క్రమత ఉంటుందన్న సత్యాన్ని తిరస్కరిస్తుంది. రూపాన్ని మాత్రం పరిశీలించి వస్తువును నిరాదరించటంచేత, పేలవమైన వస్తువును శిల్పవైవిధ్యంతో మెరిపింపజేసే రచనలు యీ పద్ధతి ప్రకారం సాహిత్య గౌరవాన్ని పొందే అవకాశం ఉంది. చాలా తక్కువరకం రచయితకు కూడా గొప్ప శిల్ప చాతుర్యం ఉండవచ్చునన్న విషయాన్ని యీ పద్ధతి విస్మరిస్తుంది. ఈ పద్ధతి విమర్శ చిన్న చిన్న ఖండ కావ్యాలను పరిశీలించటానికి బాగా పనికి వస్తుందని, పెద్ద కావ్యాలను, నవలా సాహిత్యాన్ని పరిశీలించటానికి అంతగా పనికిరాదని యీనాడు చాలామంది భావిస్తున్నారు.

రూప విమర్శకు గౌరవం పెరగటంతో ఆధునిక కవితలో చాలా మార్పులు వచ్చాయి. చాలా మంది కవులు యీ పద్ధతి విమర్శను తెలుసుకొని కవిత రాయటం లేదా తమ కవితా పద్ధతిని యీ విమర్శా పద్ధతికి అనుకూలంగా మార్చుకోవటం చేశారు. భాషా చమత్కారాలకు, అస్పష్టతకు, దుర్గమమైన శిల్పానికి గౌరవం ఉందని తెలుసుకున్న వీరు తమ కవితను వీటితో నింపసాగారు. ఆధునిక సాహిత్యం, ముఖ్యంగా కవిత, పైన పేర్కొన్న అంశాలకు మారుపేరుగా కొంతకాలం రూపొందింది.

తెలుగులో రూపవిమర్శకు చెప్పుకోదగ్గ ప్రతిష్ఠలేదని చెప్పవచ్చు కానీ శేషేంద్రశర్మ, సంజీవదేవ్, ఇస్మాయిల్ మొదలైన వారిలో అప్పుడప్పుడిది తొంగి చూస్తుంది. ఆలంకారిక విమర్శకులైన విశ్వనాథ "నన్నయ్యగారి ప్రసన్న కథా కవితార్థ యుక్తి", "ఒకడు నాచన సోమన్న" మొదలైన గ్రంథాలలో, పద్య శిల్పాన్ని చర్చించే చోట్లలో రూప విమర్శకులను మించిపోవటం

ఆస క్తికరమైన విషయమే. కవిగా వారు గొప్ప శిల్పికావటం యిందుకు కారణం కావచ్చునేమో.

మానసిక శాస్త్ర వేత్తలైన ఫ్రాయిడ్, ఆడ్లర్, యూంగ్‌లు గూడా యిటు కల్పనా సాహిత్యాన్ని, అటు సాహిత్య విమర్శను ఎంతగానో ప్రభావితం చేశారు. ఈ శతాబ్దంలో వీరి ప్రభావాన్ని పూర్తిగా తప్పించుకున్న రచయితలు, విమర్శకులు అరుదు.

ఫ్రాయిడ్ సాహిత్యాన్ని గురించి ప్రత్యేకంగా గ్రంథాలు రాయకపోయినా అతని మానసిక శాస్త్ర సిద్ధాంతాలు సాహిత్యరంగంలో తీవ్ర పరిణామాలను సృష్టించాయి. ఫ్రాయిడ్ అభిప్రాయం ప్రకారం రచయిత తన "లిబిడో"లోని ఒత్తిడులను విడుదల చేసుకోవటానికి, తన తీరని కోరికలను తీర్చుకోవటానికీ రచన చేస్తాడు. అంటే మానసిక రోగికి, రచయితకు ఫ్రాయిడ్ దృష్టిలో చాలా పోలికలున్నాయి. ఈ అభిప్రాయం ఎంత వివాదాస్పదమైనదైనా, ఫ్రాయిడ్ ప్రభావం విమర్శలో రెండు విధాలుగా ప్రాచుర్యంలో ఉన్నది.

1. ఫ్రాయిడ్ స్వప్న, లైంగిక కాంప్లెక్స్ సిద్ధాంతాలను ఆధారం చేసుకొని, రచయితకు రచనకు ఉన్న సంబంధాన్ని నిర్ణయించటం.

2. పై సిద్ధాంతాలనే ఆధారం చేసుకొని కల్పనా సాహిత్యంలోని పాత్రలను పరిశీలించటం.

ఈ రెండు శాఖలలోనూ ఆంగ్ల సాహిత్యంలో గణనీయమైన కృషి జరిగింది. ఈ మార్గాలను అనుసరిస్తున్న విమర్శకుల దృష్టిలో మానసిక రోగికి, అతని కలలకు ఉన్న సంబంధానికి; రచయితకు అతని రచనకు ఉన్న సంబంధానికి పెద్ద తేడాలేదు. ఈ సంబంధాన్ని పరిశీలించే విమర్శకుడు రచనలను రోగ లక్షణాలుగా భావించి, తాను మానసిక వైద్యుని పాత్రను నిర్వహిస్తాడు. ఎడ్మండ్ విల్సన్ మొదలైన విమర్శకులు యీ మార్గంలో గొప్ప విమర్శలు చేశారు. కల్పనా సాహిత్యంలోని పాత్రలను యీ పద్ధతిలో పరిశీలించిన విమర్శకులు కూడా పై సూత్రాలనే కొలబద్దలుగా తీసుకున్నారు. పాత్ర పరిశీలన చేస్తున్న విమర్శకులు—వారు ఏ పద్ధతికి చెందిన వారైనా—యీ సూత్రాలను ఎంతో కొంతగా వాడుకుంటూనే ఉన్నారు. ఫ్రాయిడ్ సిద్ధాంతాలతో సమానంగా ఆడ్లర్ life style సిద్ధాంతాలు, ఇన్‌ఫీరియారిటీ, సుపీరియారిటీ కాంప్లెక్స్‌లు సాహిత్య విమర్శలో శాశ్వత స్థానాన్ని సంపాదించుకున్నాయని చెప్పవచ్చు.

ఒకనాడు ఫ్రాయిడ్ అనుయాయి అయినా, అతనితో విభేదించి కొత్త సిద్ధాంతాలను రూపొందించిన మనస్తత్వవేత్త యూంగ్, అతడు అచేతన (unconscious) ను రెండు భాగాలుగా విభజించి, అందులోని బయటి పొరను వ్యక్తిగత అచేతన అని, లోపలిభాగాన్ని సామూహిక అచేతన (collective-unconscions) అని పిలిచాడు. వ్యక్తిగత అచేతనలో ఉద్రేకాలకు సంబంధించిన కాంప్లెక్స్‌లు, సామూహిక అంతశ్చేతనలో జాతికి (race) సంబంధించిన

సామూహిక విశ్వాసాలు, పురాణగాథలు ఉంటాయని యూంగ్ సూత్రీకరించాడు. అంతశ్చేతనలోని అట్టడుగు పొరలలో జాతులకు, మతాలకు అతీతమై, సర్వ మానవజాతికి సంబంధించిన అచేతన భావాలుంటాయని యూంగ్ భావించాడు. వివిధ జాతుల పురాణ గాథలలో ఉన్న అసాధారణమైన సామ్యమూ, వారి విశ్వాసాలు సంకేతాలుగా పునరావృతం కావడంలో ఉన్న క్రమత యూంగ్ దృష్టినాకర్షించాయి. వీటికన్నింటికీ కలిపి సామూహికంగా యూంగ్ "ఆర్కిటైప్" అని పేరు పెట్టాడు.

నార్త్‌రాప్ ఫ్రై అన్న విమర్శకుడు సూర్యోదయం, మధ్యాహ్నం, సూర్యాస్తమయం, చీకటి; వసంతం, వేసవి, ఆకురాలు కాలం, శీతకాలం; పుట్టుక, పెళ్ళి, చావు, శిథిలావస్థ అన్న నాలుగు దశలుగా ఆర్కిటైప్‌లను విభజించి, వాటికి సంబంధించిన ఆర్కిటైప్ సాహిత్య శాఖలను(వరుసగా-రొమాన్స్ కామెడీ, ట్రాజడీ, సెటైర్) గూడా సూచించాడు. ఉదాహరణకు ప్రేమ, జాలి, మోసం, ద్వేషం ఆర్కిటైప్ వస్తువులు; స్త్రీ పురుషులమధ్య అనుమానాలు, తరాలమధ్య అంతరాలు మొదలైనవి ఆర్కిటైప్ సంఘటనలు; మంచివాడు, తిరుగుబోతు, విప్లవకారుడు, పతివ్రత మొదలైనవారు ఆర్కిటైప్ పాత్రలు. ఇలాంటి ఆర్కిటైప్‌లు ప్రతి జాతికి-విశాల పరిధిలో అన్నిజాతులకు ఉంటాయని, రచయిత సృజన శక్తి స్థూలంగా యీ చట్రం (pattern) లో పనిచేస్తుందని యూంగ్ భావించాడు. ఆర్కిటైప్ విమర్శకుని కర్తవ్యం సాహిత్యంలో యీ patterns ని గుర్తించి, అవి ఏ ఆర్కిటైప్‌కు చెందుతాయో, వాటి సంకేతార్థాలు ఏమిటో వివరించటం.

ఫ్రాయిడ్ సాహిత్యానికి, సాహిత్య సృష్టికి గొప్ప స్థానాన్నిచ్చినట్టు కనిపించదు. రచయిత తన "లిబిడో"లోని ఒత్తిడులను విడుదల చేసుకోవటానికే రచన చేస్తాడని భావించాడేకానీ, అతని (రచయిత) ఆలోచనను సమాజం,దాని స్వరూపం ప్రభావితం చేస్తాయని,అతడు సమాజంకోసం రచన చేస్తాడని భావించలేదు. యూంగ్ సాహిత్యానికి, సమాజానికి ఉన్న సంబంధాన్ని అంగీకరించాడు. కానీ అతని ఆర్కిటైప్ సిద్ధాంతం రచయిత కల్పనాశక్తికొన్నిpatternsకు లోబడి మాత్రమే పనిచేస్తుందని చెబుతుంది. యూంగ్ ఆర్కిటైప్‌లకు గత కాలంతో ఉన్న సంబంధం వర్తమాన కాలంతో లేదు.

ఫ్రాయిడ్, ఆడ్లర్, ముఖ్యంగా యూంగ్‌ల అభిప్రాయాలను సాహిత్య విమర్శకు అన్వయించటంలో యీమార్గాలను అనుసరిస్తున్న విమర్శకులలోనే చాలా అభిప్రాయభేదాలున్నాయి. ఏది ఏమైనా సాహిత్య విమర్శ యీ మానసిక శాస్త్రవేత్తల నుండి మానవ ప్రవర్తనను వ్యాఖ్యానించటానికి నాజూకైన పద జాలాన్ని స్వీకరించి సుసంపన్నమైంది.

తెలుగులో యీ మార్గంలో చెప్పకోతగ్గ కృషి చేసిన విమర్శకుడు ఆర్. ఎస్. సుదర్శనం. వీరు 'అల్పజీవి', 'చివరకు మిగిలేది' నవలల్ని గురించి, చలం,

గోపిచంద్ ("అసమర్థుని జీవయాత్ర") లను గురించి రాసిన వ్యాసాలు యీ పద్ధతి విమర్శకు మచ్చుతునకలు. కోడూరి శ్రీరామమూర్తి కూడా యీ మార్గంలో కృషి చేస్తున్న విమర్శకుడే. పై యిద్దరిలోనూ సుదర్శనం యూంగ్ సిద్ధాంతాలను —ముఖ్యంగా అనిమస్, అనిమా (మానవ చేతనలోని పురుష స్త్రీ అంశలు) సిద్ధాంతాలను—విమర్శలో ఉపయోగించారు. మొత్తంమీద యీ పద్ధతిలో జరగవలసినంత కృషి జరగలేదనే అనిపిస్తున్నది.

సమాజానికి, సాహిత్యానికి ఉన్న సంబంధాన్ని వివరించాలన్న కోరిక యూరోపియన్ దేశాలలో 19వ శతాబ్దం ఆదిలోనే ప్రారంభమైంది. మొదటి రోజులలో యీ పద్ధతి ప్రాచీన సాహిత్యాన్ని అధ్యయనం చేయటానికి మాత్రమే ఉపయోగించబడింది. రచనను ఒక చారిత్రిక అవశేషంగా భావించి, దాన్ని ఆధారం చేసుకొని, ఆ రచన చిత్రించే కాలంలో ప్రజల జీవితానికి సంబంధించిన అన్ని అంశాలనూ తెలుసుకునే ప్రయత్నం చేయటం యీ పద్ధతికి ధ్యేయంగా చెప్పబడింది. రచయిత వ్యక్తిగత జీవితము, అతని సామాజిక, రాజకీయ విశ్వాసాలు, రచన చేయబడ్డ కాలము, రచన చిత్రిస్తున్న కాలము, ఆనాటి సామాజిక పరిస్థితులు మొదలైన అంశాలను దృష్టిలో ఉంచుకొని రచనను అధ్యయనం చేయటానికి చారిత్రిక విమర్శకులు ప్రయత్నించారు. రూప విమర్శకులు అనిబద్ధమైన కవితా సంవేదన (**uninhibited poetic sensibility**)ను విమర్శలో ఉపయోగిస్తున్నట్టు చెప్పుకున్నారు. చారిత్రకవిమర్శకులు దాన్ని తిరస్కరించి, పైన పేర్కొన్న అంశాలను పరిశీలించినప్పుడు మాత్రమే రచన యొక్క సంపూర్ణమైన అర్థం తెలుస్తుందని భావించారు.

మార్క్సిస్టు సాహిత్య విమర్శను చారిత్రిక విమర్శలో ఒక భాగంగా మాత్రమే కొందరు భావిస్తారు. నిశ్చితమైన తాత్విక ప్రాతిపదిక, దృష్టి కోణము సామాజిక విమర్శకు లేవు. ఇవి రెండూ కలిగిన మార్క్సిస్టు సాహిత్య విమర్శ స్వతంత్ర ప్రతిపత్తి తప్పకుండా ఉన్నది.

ఇంతకు ముందు చర్చించినవి ఒక రకంగా భావవాద సాహిత్య విమర్శా మార్గాలు. మార్క్సిస్టు విమర్శకులు సాహిత్యాన్ని గతి తార్కిక భౌతిక దృష్టిలో పరిశీలిస్తారు. వస్తువు, రూపాలలో వస్తువు రూపం కంటే ప్రధానమైనదని భావించినా, గొప్ప రచనలో యివి రెండూ కలిసి ఉంటాయని నమ్ముతారు. వీరి అభిప్రాయం ప్రకారం సాహిత్యం వ్యక్తిగత వ్యాపారం కాదు. సాహిత్యం సంఘజీవి అయిన మానవునికి, సామాజిక చైతన్యానికి ఉన్న సంబంధాలను వివరిస్తుంది. సమకాలీన రాజకీయ భావాలు, నైతిక సూత్రాలు, దార్శనిక, మతభావాలు, యితరకళలు మొదలైన అన్ని సామాజిక చైతన్య రూపాలలోని గతి తర్కాన్ని విమర్శకు సాధనాలుగా వీరు వాడుకుంటారు. మార్క్సిస్టు సాహిత్య విమర్శకులు కళ కళకోసమని కాక, కళ సమాజం కోసమని గట్టిగా నమ్మటం చేత, సాహిత్యాన్ని పరిశీలించటానికి సాహిత్యానికి

మాత్రమే పరిమితమైన సూత్రాలుండా లన్న వాదాన్ని తిరస్కరిస్తారు.

మార్క్సిస్టు తత్త్వశాస్త్రం ప్రకారం ఆర్థికశక్తులు సమాజానికి ప్రాతిపదిక (base]. తత్త్వశాస్త్రము, కళలు మొదలైనవి ఉపరితలం (super structure). ఉపరితలంలోని వివిధ అంశాలు ఒకదాన్ని మరొకటి ప్రభావితం చేసుకున్నా, ఉపరితలం యొక్క మూల తత్త్వాన్ని ప్రధానంగా ప్రాతిపదిక నిర్ణయిస్తుంది. ఉపరితలంలో భాగమైన సాహిత్యం ప్రాతిపదిక నిర్ణయించే ఉత్పత్తి శక్తుల మీద ఆధారపడిన మానవ సంబంధాలను వర్ణిస్తుంది. వివిధ సాహిత్య ప్రక్రియల ప్రాదుర్భావము, పరిణామము స్థూలంగా ఉత్పత్తి సంబంధాల మీదనే ఆధారపడి వుంటాయని మార్క్సిస్టు విమర్శకులు భావిస్తారు. వారి దృష్టిలో వస్తువు, రూపము శాశ్వతాలుకావు. సామాజిక సత్యం నుండి ఉద్భవించిన సాహిత్యం, మళ్ళీ సామాజిక సత్యాన్ని ప్రభావితం చేస్తుందని వీరు నమ్ముతారు. వీరి దృష్టిలో వాస్తవికత (realism) ఉత్తమమైన రచనా పద్ధతి. వాస్తవికత అంటే వున్నదాన్ని వున్నట్టుగా, చూచిన దాన్ని చూచినట్టుగా, విచక్షణలేకుండా వర్ణించటంకాదు. రచయిత తాను ఏ కాలాన్ని గురించి రాస్తున్నాడో, ఆ కాలానికున్న ప్రత్యేక లక్షణాలను తెలుసుకొని, ఆ లక్షణాలు కలిగిన పాత్రలను సృష్టించటం (typical characters in typical circumstances) వాస్తవిక రచనా పద్ధతులలో శ్రమజీవుల చైతన్యాన్ని చిత్రించే సామాజిక వాస్తవికత (socialist realism) సర్వశ్రేష్ఠమైన రచనా పద్ధతి.

కొందరు మార్క్సిస్టు విమర్శకులు భావిస్తున్నట్టు మార్క్స్ ఏంగిల్స్‌లు సాహిత్యం సర్వేసర్వత్ర ఆర్థిక ప్రాతిపదిక మీద మాత్రమే ఆధారపడి వుంటుందని చెప్పలేదు. సాంఘిక సంబంధాలలోని ప్రత్యేకత, వర్గ వైరుధ్యాలలోని తీవ్రత మొదలైన అనేక అంశాలు సాహిత్యాన్ని ప్రభావితం చేస్తాయని వారు సూచించారు. బూర్జువా నాగరికతలలోంచి షేక్స్పియర్, గెథే, బాల్జాక్ లాంటి మహారచయితలు ఉద్భవించటానికి కలగతి తర్కాన్ని వారు చూపించారు.

మార్క్స్, ఏంగిల్స్‌లు కళా విలువలకు, హృదయ స్పందనకు ఎంతో ప్రాముఖ్యత నిచ్చారు. స్పందన ఏమాత్రములేని, శుష్కరాజకీయోపన్యాసాల లాంటి రచనలను వారు తిరస్కరించారు. రచయిత వాస్తవిక పద్ధతిలో, సహజ సుందరమైన శిల్పంతో, ఉచితమైన పాత్రలతో, ఉక్తి వైచిత్రితో, స్పష్టమైన పద చిత్రాలతో తన అభిప్రాయాలు చెప్పాలేకానీ నైతికోపన్యాసాల ద్వారా కాదని చెప్పారు. ఈ విధంగా మార్క్సిస్టు సాహిత్య విమర్శ రూప విమర్శలోని లోపాలను తేటతెల్లంచేస్తూ, వాస్తవిక మార్గాన్ని అనుసరించే రచయితకు దారి చూపటానికి ప్రయత్నిస్తుంది.

కానీ కొందరు మార్క్సిస్టు విమర్శకుల చేతిలో యీ పద్ధతి ఒక పిడివాదంగా మారిపోవటం విచారకరం. వీరు వస్తువుకే కానీ రూపానికి విలువే లేదనే

వరకూ పోతున్నారు. శిల్పము. ప్రయోగశీలత, aesthetic value-మొదలైన అంశాలను దాదాపు తిరస్కరిస్తున్నారు. ఇవి మితంగా కనిపించినా వాటిని బూర్జువా లక్షణాలుగా వర్ణించి అవహేళన చేస్తున్నారు. తాను కేంద్ర బిందువుగా వుంటూ, యితర విమర్శనా పద్ధతులలోని మంచి లక్షణాలను అవసరం వచ్చినప్పుడు స్వీకరించగల విశాలతత్త్వం మార్క్సిస్టు విమర్శకు వుందన్న విషయాన్ని వీరు విస్మరిస్తున్నారు. ఇది ఏ సాహిత్యంలోకానీ, ఏ యుగంలోకానీ హర్షించదగ్గ పరిణామం కాదని మనవి చేస్తున్నాను.

మార్క్సిస్టు సాహిత్య విమర్శలో తెలుగు సాహిత్యంలో గణనీయమైన కృషి జరిగింది. మద్దుకూరి చంద్రశేఖరరావు, రమణారెడ్డి, రా. రా; రాంభట్ల, త్రిపురనేని మధుసూదనరావు మొదలైన విమర్శకులు యీ పద్ధతిలో మంచి కృషి చేశారు. కానీ యీ పద్ధతిని అనుసరిస్తున్న - చాలామంది విమర్శకులలో తాను అనుసరిస్తున్నదే సరైన మార్క్సిస్టు మార్గమని, యితరులది కానేకాదనే తత్త్వం వుంది. కాబట్టి వీరు సమిష్టి ప్రయోజనంకంటే తమ గుంపు ప్రయోజనానికే ప్రాధాన్యత నిస్తున్నారు. మరికొందరు మార్క్సిస్టు తత్త్వ శాస్త్రానికి, మార్క్సిస్టు సాహిత్య శాస్త్రానికి (marxist aesthetics); రాజకీయాలకు సాహిత్యానికి మధ్య వున్న సరిహద్దులను చెరిపేస్తున్నారు. ఈ విషయంలో తన మార్క్సిస్టు తత్త్వ శాస్త్ర పాండిత్యానికి నాజూకైన సాహిత్య సంవేదనను మేళవించి విమర్శ గ్రంథాలు రాసిన జార్జి లూకాచ్ పద్ధతి ఉత్తమమైందిగా కనిపిస్తోంది.

పైన పేర్కొన్న మూడు కాక నైతిక విమర్శ (moral criticism), ప్రక్రియా విమర్శ (genre criiicism) భాషా శాస్త్ర విమర్శ (linguistic criticism) మొదలైన పద్ధతులు ఎన్నో వున్నాయి. వీటిలో నైతిక విమర్శ అత్యంత ప్రాచీనమైనదైతే, భాషా శాస్త్ర విమర్శ చాలా అధునాతనమైంది. దీనిలోంచి పుట్టిన శైలీ శాస్త్రం (stylistics) యీనాడు చాలా ప్రచారణ పొందుతూవుంది. కానీ వీటిని సమగ్రమైన సాహిత్య విమర్శా పద్ధతులుగా చెప్పటానికి వీలులేదేమో! ఏది ఏమైనా సాహిత్య విమర్శ వ్యక్తిగత అభిప్రాయం (impression) మీదనే ఆధారపడిలేదని, అందుకు శాస్త్రీయ దృక్పథము, శిల్పం, వివేచన కలిగిన చాలా పద్ధతులు వచ్చాయని గుర్తెరగటం అవసరమని భావిస్తున్నాను.

విమర్శ విశేష సంచిక

సాహిత్యం పుట్టిన తరువాతే లక్షణ రూపంలో విమర్శ పుట్టినప్పటికీ- ఉత్తమ సాహిత్య సృష్టికి నిజమైన దోహదకారి ఉదాత్త విమర్శే.

దురదృష్టవశాత్తు తెలుగులో విమర్శ శాఖ పెరుగుదల-అవసరాలతో పోలిస్తే- అతి తక్కువ స్థాయిలో ఆగిపోయింది. అందుకే అరసం - సాహిత్య విమర్శ ప్రక్రియపై కడపలో సదస్సు తల పెట్టింది. సాహిత్య ఆధునిక విమర్శకు జీవం పోసిన విఖ్యాత విద్యావేత్త కట్టమంచి రామలింగారెడ్డి శతజయంతి సందర్భంగా ఈ సదస్సును ఆయన గౌరవార్థం అంకితం చేయడం-సభాస్థలికి రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మగారి పేరు పెట్టడం సదస్సుకే గౌరవం. ఈ సంవత్సరంలో 7 నెలల కాలంలో ఇది అరసం నిర్వహించిన మూడవ సదస్సు.

పత్రాలు సమర్పించాల్సిన విమర్శకులు కొందరు తప్పనిసరి పరిస్థితులలో సదస్సుకు హాజరు కాలేక పోవడం, పత్రాలు అచ్చుకాక పోవడం కడప సాహిత్యాభిమానులకు రాష్ట్ర వ్యాపితంగా వచ్చిన ప్రతినిధులకు మొదట కొంత ఆశాభంగం కల్గించినప్పటికీ - రెండు రోజులూ సదస్సు కార్యక్రమాలు గమనించాక అందరికీ సంతృప్తి లభించింది. ఇంత సాహిత్య సదస్సు నిర్వహించిన ఆహ్వాన సంఘం, శ్రీ వై.స.వి. రెడ్డి (ప్రధాన కార్యదర్శి). డా. రాజశేఖరరెడ్డి [అధ్యక్షులు], ఇతర మిత్రులు ఎంతైనా అభినందనీయులు. సదస్సు వేదికపై జీవం ఉట్టిపడేలా కట్టమంచి, రాళ్ళపల్లిల చిత్రాలు వేసి అలంకరించి ప్రారంభోత్సవ సభలో సన్మానంపొందిన శ్రీ పి.డి. బాలసుందరం గారికి అరసం అభినందనలు.

విశేష సంచిక ఆలస్యంగా వస్తున్నప్పటికి సాహిత్య విమర్శ ప్రక్రియపై కొత్త వెలుతురులు ప్రసరింపజేసేందుకు జరిగిన ఈ చిన్న ప్రయత్నాన్ని సాహిత్యాభిమానులు ఆదరంతో స్వీకరిస్తారని అరసం నమ్మకం. పత్రాలలో అభిప్రాయాలు తప్పనిసరిగా అరసంవి కానక్కరలేదు. ఇది సదస్సు గాబట్టి, ఇందులో భిన్నాభిప్రాయాలు వ్యక్తం గావడం సహజం. సదస్సుకు రాలేక పోయినప్పటికి మిత్రులంతా తమ పత్రాలు పంపి సహకరించినందుకు వారికి కృతజ్ఞతలు

తెలుగు సాహిత్యం - ఆధునిక ధోరణులు

"ఆధునిక"- పదనిర్వచనం; ''సమకాలిక'' పదనిర్వచనం. రెండింటికీ తేడా.

'ఆధునిక' కాలవాచిగా చెప్పుకునే అర్థం. ''ఒకానొక ఆధునిక గ్రంథమని'' చిన్నయసూరి 'ఆముక్తమాల్యద' ని చెప్పాడు। ఆధునికత అనేది ఒక దృక్పథం. కొన్ని విలువల సముదాయం. ఆ దృక్పథమూ, విలువలు ఒక చారిత్రక దశలో ఉద్భూతమవుతాయి అప్పటిదాకా మనగలుతూవున్న సాంఘిక విలువలు కాలదోషంపట్టిపోయి కొత్త విలువలు ఆవిర్భవిస్తాయి. నూతన విలువలని సంతరించుకున్నప్పుడు ఆధునికులవడంగా గుర్తిస్తాం. కాని ఆ దశలో కూడా పాతవాటిని పట్టుకువేలాడే వాళ్ళుండ వచ్చు. వాళ్ళని 'సమకాలిక' అని చెప్పకుంటాం. సమకాలీన రచయితల్లో విశ్వనాథ, చలం, శ్రీశ్రీ వున్నారు. కాని విశ్వనాథ దృక్పథం దృష్ట్యా ఆధునికుడు కాదు.

ఆధునిక దృష్టి అంటే యేమిటి ? మధ్యయుగాల భావదాస్యం నుంచి విడిపోయి, హేతుబద్ధమైన, తార్కికమైన, శాస్త్రీయ దృష్టి సంతరించుకోవడం, మతం గతం.' "జన్మం చర్మం, వెనకటి సంప్రదాయమూ నెరపే అసమానత" పనికి రాదు. హేతువాద దృష్టిని సమకూర్చుకోవడం, అన్నీ వేదాల్లో వున్నాయనే దృష్టినుంచి బయటపడటం, భౌతికంగా వాస్తవమైన దాన్ని అంగీకరించడం. నూతన మానవత్వ దృష్టి. మతాన్ని బట్టి, కులాన్ని బట్టి పరిగణించడం. కాకుండా మానవుణ్ణి మానవుడిగా గుర్తించడం ఈ ప్రపంచాన్ని గురించీ, చుట్టూ,తావున్న భౌగోళిక తత్వాన్ని గురించీ పురాణప్రమాణం కాకుండా శాస్త్రీయ ప్రమాణాన్ని అంగీకరించడం. ప్రశ్నించకుండా యే అధికారాన్నీ అంగీకరించకపోవడం.

ఆధునిక యుగంలోని ధన, ఋణాపక్షాలు: పాతవిలువలు పోయాయి; కొత్త జీవితం యెలాతయారైంది? ఆధునిక యుగంలోని మంచి మార్పు భావదాస్యం పోవడం. కాని విపరీతమైంది కూడా వచ్చింది. వ్యక్తివాదం వెర్రితలలు వేసి అనేక సిద్ధాంత రాద్ధాంతాల కూడలి అయింది. అనేక "యిజాలు" పుట్టుకొచ్చాయి. జీవితాన్నివిశ్లేషించి సాంఘిక వ్యవస్థకీ వ్యక్తికీ వున్నసంబంధం విశ్లేషించి చిక్కు విడదీసేతత్వం ఒక్క

ఆర్వీయార్

దానికి లేదు. దాంతోటి "ఆధునికత్వం" అల్లరిగా తయారైంది.

కారణం మేమిటి? కారణం మేమిటంటే యీ వైరుధ్యాల పుట్టుకని తరచి చూసి, అవి యెలా పరిష్కారం అవుతాయో గమనించే దృష్టి లేకపోవడమే.

ఈ పరిస్థితిని వివరించే సూత్రం యేది? గతితార్కిక భౌతిక వాద సిద్ధాంతం అభ్యుదయ సాహిత్యానికి పునాది.

ఈనాటి ఆంధ్రసాహిత్యంలో వచ్చిన ధోరణులూ, వాటి పునాదీ కూడా చర్చలోకి వస్తాయి. సాహిత్య మత విభేదాలు పరిశీలనలోకి వస్తాయి.

ఈ గందరగోళ పరిస్థితిని పరిష్కరించుకోవడం యీ సూత్రంతోటే సాధ్యమవుతుంది.

యిది ఉపక్రమణిక.

1

ఈ శతాబ్దం ఆరంభం నుంచీ తెలుగు సాహిత్యంలో నవ్యధోరణులు అవతరించాయి. భావనలో, వ్యక్తీకరణలో రూపంలో యివి మార్పు తీసుకు వచ్చాయి. ఆలోచనా విధానంలో ఆధునికతని సంతరించుకోకపోయిన చాలమంది కూడా యేదో మేరకి వీటి ప్రభావానికి గురిఅయినవాళ్ళే. కట్టమంచి, విశ్వనాథ లాంటి వాళ్ళు కూడా యీ నవ్యధోరణుల ఛాయపడిన వాళ్ళే. ఆలోచనలో, ఆచరణలో అన్నివిధాలా ఆధునికతని జీర్ణించుకున్నవాడు గురజాడ.ఆ తర్వాతికాలంలో భావ కవుల ప్రభావం గాఢమైంది. కవిత్వం రాయడం నేర్చిన వాళ్ళంతా ఆ "ప్రభావానికి లోబడిన వారే"ఆ కాలంలో. భావకవిత్వం క్షీణదశకి తిరిగే సమయంలో దాని మీద తిరుగుబాటు చేసిన యెన్నో ప్రయోగాలు వెలువడ్డాయి.

ఆ రకంగా ఆంధ్ర సాహిత్యంలో యూరప్‌లో వచ్చినలాంటి సిద్ధాంత ధోరణులు అనేకం వచ్చాయి. భావకవిత్వానికి గాని, దాని మీద తిరుగుబాటుగా వచ్చిన ధోరణులకిగాని సాంఘికపు॰ది విభేదించక పోయినా ఆ ధోరణులన్నీ ఆ సమాజానికి ప్రతిబింబాలే. యూరప్‌లో వచ్చిన సిద్ధాంత ధోరణులకి అక్కడి సాంఘిక పరిస్థితులు మూలం. కాగా మనదేశంలో, అందునా ఆంధ్రదేశంలో, ఆ సిద్ధాంత ధోరణులు ఒక మేరకి దిగుమతి అయినవే. భావకవుల నాటినుంచి కూడా దీనికి వేళ్ళు అలానే వున్నాయి. విద్యాభ్యాసం చేసేరోజుల్లో పాఠ్యభాగాలుగా వున్న "రొమాంటిక్" కవుల ప్రేరణ వాళ్ళకి వుంది.

ముందుగా యీ సిద్ధాంత ధోరణులని పరిశీలించి, సాహిత్యం మీద వాటి ప్రభావం చూసి అప్పుడఅవి అలా యెందుకు వున్నాయో, యెలా వుంటే సాహిత్యం ప్రయోజన పుష్టంగా వుంటుందో చూద్దాం.

కళ కళకోసమే (Art for Art's sake)

కళకి పరమ ప్రయోజనం వేరే ఏమీ లేదు. కళ కళ కోసమే. కళ తన కోసమేనని కళాకారుడు భ్రాంతి పడే స్థితికి చిహ్నమైన ఉద్యమం. ఇంగ్లండ్‌లో రోసెట్టి, మారిస్ (సోషలిస్టు కాక ముందు), ఆస్కార్ వైల్డ్, కొంతమేరకి హాప్‌కిన్స్ ప్రతినిధులు. యీ ఉద్యమం

స్వచ్ఛంగా ఫ్రాన్స్‌లో దర్శనమిచ్చింది. బాడ్‌లేర్ నుంచి వెర్‌లేన్, రింబాగ్‌లలో సాగింది.

కళా స్వాతంత్ర్యం లేక సౌందర్య దర్శనా స్వయంప్రతిపత్తి అనే బీజంతో మొదలైంది Art for arts sake may be seen as a kind of aesthetico-Scientific detachment, an intellectual Reaction aganist the Romantic Letting down of the hair and Flood of personal emotion.

ఆస్కార్‌వైల్డ్ పీటర్‌కి అనుయాయుడు. కాని సామాన్యులకి వైల్డ్ నూతన సౌందర్య సిద్ధాంతానికి నాయకుడని పిస్తుంది. వైల్డ్ అన్నాడు: "Form is everything. it is the Secret oflife Starting withthe worship of form and there is no Secret in art that will not be Revealed to You."

Art for art's sake అనేది కళాకారుడు తనకీ, సమాజానికీ పరిష్కరించలేని వైరుధ్యం ఏర్పడిందని అనుకున్నప్పుడు వచ్చేదశ.

Plekhanov అన్నాడు : "then the artists feel a hopeless contradiction between their aims and the aims of the Society to which they belong. Artists must be very hostile to their society and they must see no hope of changing it." (Art and Society)

Naturalism : (సహజవాదం) 19 వ శతాబ్దితరవాత భాగంలో బాల్జాక్‌తో ఉద్భవించి జోలాలాంటి వాళ్ళ చేత అభివృద్ధి అయినధోరణి. దీని సూత్రాలూ లక్ష్యాలు జోలా నిర్మించాడు. మూఢ నమ్మకాన్ని, ఆదర్శవంతం చేయడాన్ని తొలగించడమే దీని లక్ష్యం. శాస్త్రపక్షపాతమతత్వాన్ని (Scientific objectinits) సాహిత్య వస్తువుకి అన్వయింప చెయ్యడం దీని పద్ధతి. వాస్తవికవాదులు (Realists) కంటే నిశితంగా పరిశీలించడం, ఎన్నుకునే వస్తువుమీద ఆంక్షలేవీ లేకుండా తొలగించడం. సూక్ష్మమైన వివరణలని కూడా కలుపుకుని వుండటం, దీనిఉద్దేశ్యం. ఈ ధోరణి ప్రతి దాన్ని చెప్పాలనీ, వాతావరణాన్ని యథాతథంగా చిత్రించాలనీ, ఒక జీవిత పార్శ్వాన్ని చూపెట్టాలని, పాత్రలని యేదో ఒక ప్రయోగశాలలో లాగా చూసి ప్రయోగం చెయ్యాలనీ, వాటి అభివృద్ధి ఆ వాతావరణానికి, వంశపారంపర్య జనితంగా వుండే లక్షణాల అనుగుణంగానూ పరిశీలించాలనీ ప్రయత్నం చేసిన ధోరణి ముఖ్యమైంది. యేమిటంటే యిష్టాపత్తి అనేదిలేని విధికృతంగా వున్నట్లు భావించడమే దీని పునాది.

ఈ ధోరణి వాళ్ళు విశ్వంలోని విధికృత, యాంత్రిక లక్షణాలని ఒత్తి చెప్పారు. మానవ ఉద్దేశాలలోని భౌతిక తత్వాన్ని, వాళ్ళ జీవితాల్లోని సామాన్యమైన, ముతక లక్షణాలనే యీ ధోరణి వాళ్ళు యెక్కువ చూసారు. చాలామంది నవలా ప్రక్రియని సాంఘికశాస్త్ర, లేక

సాంఘిక సమస్యల, అధ్యయనంగానే చూసారు.

Realism : (వాస్తవిక వాదం) జీవితాన్ని వున్నదున్నట్లుగా, వైయక్తిక ప్రలోభరహితంగా, వస్తు శ్రమ నిజాయితీతో చిత్రించడమే కళాలక్ష్యం అని చెప్పే ధోరణి – వున్న దాన్ని వున్నట్లు చూపించాలి. యీ లెక్కన యేదో సాధారణ పక్కీలో కాకుండా రుజువుకు దొరికే, కచ్చితమైన లక్షణాలు వుండాలి. కళాకారుడి అనుభవం వివరించడం కాకుండా, అంటే అంత కంటే కూడా, ఫొటోగ్రాఫ్ మాదిరీ వాస్తవాన్ని చిత్రించాలి. డెఫో, ఫీల్డింగ్‌లాంటి వాళ్ల నవలల్లో 18 వ శతాబ్దంలో మొదలైన ధోరణి, 19 వ శతాబ్దంలోనూ, 20 వ శతాబ్ది ఆరంభంలోనూ యీ ధోరణి ముందుకుపోయింది. దానికి కారణం శాస్త్రసంపద పెరగడం, తాత్త్విక హేతుబద్ధత, రొమాంటిక్ ఉద్యమంలోని అనుభూతి, శైలీ వైపరీత్యాలకి వ్యతిరేకంగా తిరుగుబాటు రావడం, రొమాంటిక్ ఉద్యమంలోని ఆదర్శవాదం, వస్తువుని భౌతిక పరిస్థితికి పైన వుంచడం, తొలగించుకుని శుద్ధ వాస్తవికతతో వుండేటట్లు ప్రయత్నించారు. దాంతోటి జీవితంలోని మరీ చవకబారు సంగతులని అతిగా చెప్పుకోవడమో, లేకపోతే భయంకరంగా వుండే వాటిని చెప్పుకోవడమో జరిగేది.

కాల్పనిక వాద (రొమాంటిక్) ధోరణికి వ్యతిరేకంగా కొంత మేలు జరిగిన మాట వాస్తవమే.

వచన రచనావిష్కారం జరిగిన యుగంలో కవిత్వం మాదిరీ కల్పనలకీ, వ్యోమ వ్యవహారానికి, అవకాశం సన్నగిల్లుతుంది. వాస్తవ ప్రపంచ ప్రతిఫలనం అవసరమవుతుంది.

చాలమంది "రియలిజం" అతి వ్యాప్తి దశే "నాచురలిజం" అంటారు యింతకీ యే ఉద్యమమైనా ఆరంభమైన దశలో వున్నట్లుగా తరవాతి దశలో వుండదు. పరిణామంలో మార్పులకి గురిఅవుతుంది అంచేత దాని అసలు సిసలు తత్త్వం అనేది నిక్కచ్చిగా నిర్ణయించడం కష్టం. కాని ఆరంభం నాటి ప్రభావం కొంత, కొత్తదనాన్ని తీసుకువస్తుంది.

Futurism (భవిష్యద్వాదం) : ఇటలీలో మారినెటీ (Marinetti) నాయకత్వంలో ఆరంభమైన యీ ధోరణికి వివరణగా 1909లో 'Futurist manifesto' ప్రకటించబడింది. "పాత బొమ్మలను చూచి ఆనందమును ప్రకటించుట శవములో జీవము పోయుట వంటిదని, గత చరిత్ర జ్ఞానము కేవలము విష పానమని, గ్రంథాలయములలోని పుస్తములకు నిప్పంటించి, ఏటి కాలవలను మ్యూజియములలోనికి మళ్లించి వానిని ముంచివేయవలయునని, సమస్త కళా రూపములను, సాహిత్య సృష్టిని ధ్వంసము చేయవలెనని, ఆ శిథిలముల నుండియే నూతన సృష్టి వెలువడునని యీ ఫ్యూచరిస్టు ప్రణాళిక ప్రకటించినది. ప్రపంచమునకు యుద్ధ మొక్కటే ఆరోగ్యమును ప్రసాదించు వరమని ఈ ప్రణాళిక ఉద్ఘాటించినది." (డా.సి.నా.రె.)

ఈ ఉద్యమంలోని వాళ్ళకి యితివృత్తం జీవితంనుండి ఉద్భవించదిలేదు. పత్రికలు, సినిమాలు, యంత్రాలు, వీటి

నుంచి వస్తువును గ్రహించాలని వీళ్ళ యత్నం. ధ్వనులే సంగీతం, రంగులే శిల్ప చిత్రాలు, అలాగే మాటలే ధ్వన్యనుకరణంగా కవిత్వం.

ఈ వుద్యమం రష్యాకు పాకింది. 1912 లో అక్కడ దీని మానిఫెస్టో ప్రకటించబడినది మయకోవస్కీ కూడా యీ ఉద్యమంలో సంబంధం పెట్టుకుని ఆ మానిఫెస్టో మీద సంతకం చేశాడు. గతంలోదంతా పనికిరానిది ప్రణయము, సాహసము పనికిరావు. పుష్కిన్, డాస్టావీస్కీ, టాల్‌స్టాయ్ లాంటివాళ్ళని తీసి పారేయాలి లాంటివన్నీ యిందులోని అంశాలు. కాని మయకోవస్కీ యీ ప్రభావంలో ఎక్కువ కాలం లేడు. వాస్తవికతకీ, ప్రజాసాహిత్యానికీ అంకితమైన రచనలే తరువాతి కాలంలో చేసాడు.

ఈ ధోరణికి ఆచరణ యోగ్యత కలిగించింది హిట్లర్.

Symbolism: (ప్రతీకవాదం) "తల్లి సంస్కృత యేయెల్ల భాషలకును" అని అలా విశ్వసించే వాళ్ళు ఘనంగా చెప్పుకున్నట్టుగా, యే ఉద్యమానికైనా నారుమడిలాంటిదని ఫ్రాన్స్‌ని చెప్పుకోవచ్చు గత శతాబ్దం యీ శతాబ్దం తలుపులు తీసి బయటకు నెట్టిన ఉద్యమాలెన్నో ఫ్రాన్స్ నుంచి వచ్చినవే

ఈ ఉద్యమం కూడా ఆ దేశాన్నే మాతృదేశంగా భావించింది. 19 వ శతాబ్దపు ద్వితీయార్థంలో ఫ్రెంచి కవులు మల్లార్మే, వెర్‌లైన్, రింబాద్ లాంటివాళ్ళు ప్రతీకలని (**Symbols**) ఉద్దేశ్య పూర్వకంగా, ప్రవేశపెట్టిన టెక్నిక్‌తో రూపం తీసుకుంది.

సింబాలిస్టుల ధోరణి యేమిటంటే యీ భౌతిక ప్రపంచం, నిరంతర పరిణామశీలమైన యీ ప్రపంచం, అసలు సత్యం కాదు. ఏదో ఒక అదృశ్య అపరిమితం యొక్క నీడ, యింద్రియాతీతమైన సత్యమది. అంచేత ఆ భావజగత్తు తోటి అనుభూతి సంబంధం కలగచేసుకోవాలి మామూలుగా మనకి ప్రపంచాన్ని గురించిన జ్ఞానం యింద్రియాల ద్వారా వస్తుంది కదా. యిది శాస్త్రీయమైన ధోరణి అలా లేకుండా, యెన్నో అనుభూతులు ప్రేరణలో వుంటాయి అవి యింద్రియాతీతమైనవని భావించడం యీ ధోరణి. శిల్పంలో నాచురలిస్టుల, రియలిస్టుల విధానం పనిలేసి ప్రతీకవాదం కొత్త పద్ధతికి దారి వేసింది అంతర్గత శాశ్వత వాస్తవాన్ని సూచించవచ్చునే గాని ప్రకటించడంలేదని వీళ్ళ మతం. **"To name is to distroy, to suggest is to create"** అన్నాడు మల్లార్మే, విషయ వివరణము, గాక వాతావరణము ప్రధానమనెను

వ్యక్తీకరణలో ఒక ముఖ్య రూపకం చుట్టూతా దట్టంగా పోగుచేసిన చిత్రాలు తోటీ, కుదించిన వాక్య నిర్మాణం తోటీ అనుభూతి తీవ్రతనీ, సంక్లిష్టతనీ సూచించడం వీళ్ళ పద్ధతి. ఆ విధానంలో ఒక అనుభూతి మరోదానికి దారితీసి అప్పుడు ఆ రెండూ మొదటి భావన ప్రతీకలవుతాయి. యీ పద్ధతిలో ప్రతీకలు అస్పష్టం అయి, చాలా సందర్భాల్లో సామాన్యం అయిపోతాయి. అయిన వాళ్ళ వాళ్ళ పద్యాలు సామాన్యులకి అర్థంకాని చిక్కుగానే వుండటంలో ఆనందం

పొందేరు. వాళ్ళకి కవిత్వమంటే నయానిత సౌందర్య సృష్టి అయి కవిత్వంలో శబ్దము ప్రధానమైంది. మాటల ద్వారా లయని నిర్మించడంలో అతి నేర్పు చూపించారు.

ప్రతీక వాదులు సాంఘిక, ధార్మిక వస్తువుని నిరసించారు యెందుకంటే వాళ్ల ప్రకారం కళ సౌందర్యఅనుభూతులనే" అనుసరిస్తుంది కాని సాంఘిక, నైతిక బాధ్యతలని మోసుకోదు. కవిగారి సూక్ష్మ అంతరంగాన్ని ఆకట్టుకుని మొత్తం కావ్య నిర్మాణానికి తోడ్పడేదేదైనా సరే, ఏయేవైయక్తిక అనుభూతైనా సరే, నప్పుతుంది. ఆ రకంగా వాళ్లు "art for art's sake" కోవకి చేరిపోతారు.

"Contemptuousoftheir environment and of middle-Class Morality, some of them flaun-ted their perversions and despair, a "new shudder" (Bandelaise) deliberately induced through drugs, alcohol, and sadism."

రచయితలని పారంపర్యంగా వస్తూవున్న విషయాన్నుంచి విముక్తి చేసిందీ ఉద్యమం. దీనికి తోడుగా శిల్పంలో మార్పు తీసుకువచ్చింది-అందని ప్రతీకలూ, సంగీతం సాయంతోటి. కాని వాస్తవ జీవితం నుంచి యెగిరిపోయి యేదో అవ్యక్త ఆనందం అనే ధోరణిలో వుండే యిలాంటి ఉద్యమం ప్రజాజీవితానికి దూరంగానే వుండిపోతుంది. అంతే జరిగింది.

ఇంగ్లండ్‌లో ఏట్స్, జర్మనీలో రిల్కే, రష్యాలో ఆంద్రీబెలీ లాంటి వాళ్లు యీ ధోరణి అనుసరించినవాళ్లు. ఇలియట్‌లో ప్రతీకవాద ధోరణులు న్నాయి. యీ ప్రతీకవాదంలోని ఆధ్యాత్మిక వాసనలు వదలేసి ప్రతికల ద్వారా జరిపే చమత్కృతులని ఆరుద్ర గ్రహించాడు.

(సినీవాలి, త్వమేవాహమ్)

Imagists : (భావచిత్రవాదులు) 1909-1917 మధ్యకాలంలో రచనలు చేసిన కొంతమంది ఇంగ్లీషు, అమెరికన్ కవులు యీ పేరుతో ప్రఖ్యాతమయారు. తమ మీద 'సింబాలిజం' ప్రభావం వున్నా, వీళ్లు "భావచిత్రీకరణ" చెయ్యాలని యిష్టపడ్డారు. Imaging అంటే వాళ్ల దృష్టిలో "Presenting things exactly, making them concrete, Sharply delineated, hard and clear, not blurred or diffuse." అంతేకాకుండా వాళ్లు కచ్చితమైన మామూలు భాషని కొత్త లయని సృష్టించడానికీ వాడడానికీ యిష్టపడ్డారు. వస్తువు విషయంలో అపరిచితమైన స్వేచ్ఛని కోరుకున్నారు. వాళ దృష్టిలో "concentration isof the very essence of Poetry" "కొత్త లయని సృష్టించడం వాళ్ల లక్ష్యం, పౌండ్ చెప్పినట్లు "in the Sequence of the musical phrase, not in the Sequence of metronome."

ఇమేజిస్టు కవులు తమ అభిప్రాయాలని "Some Imagist poets(1915)" లో చెప్పుకున్నారు. ప్రతీకవాదకవుల

కంటే కూడా వీళ్ళఆలంకారికత నిర్దిష్టంగా వున్నా, వీళ్ళ కవిత్వం అనుభూతి ప్రేరకంగా వుండింది. తక్కువ. ఎందుకంటే తరచుగా వాళ్ళ భావచిత్రణ అర్థంతోటో, అనుభూతితోటో స్పష్టంగా కలిసివుండక పోవడమే; కుదించిన భావచిత్రం భావాన్ని సూచించడానికే గాని, ప్రకటించడానికి ఉద్దేశించి వుండకపోవడమే. దాంతోటి ఇమేజిజానికి అర్థ రాహిత్యాన్ని ఆరాధించడంగా ముద్ర వెయ్యడం జరిగింది.

హైదరాబాదులో జరిగిన ఒక సాహిత్య పాఠశాలకు సమర్పించిన పత్రం

పరిమిత కాలములో హృదయమునకు, బుద్ధికి సంప్రీతి కలిగించు భావచిత్రముల నందించుట ఇమేజిజము

లక్ష్యము. ఈ కవుల లక్షణములివి : 1. విషయమును సూటిగా అందు కొనుట, 2. వ్యక్తీకరణములో సంక్షిప్తత. 3. భావచిత్రములను ప్రయోగించుట. 4. Organic Rhythm (అంతర్లయ)ను వాడుట."

ఇమేజిస్టు కవులకి తమ పరిధీ, ఉత్సాహమూ మరీ పరిమితమైనవనిపించి వాళ్ళ సిద్ధాంతానికి సరిపడే కవిత్వం రాయడం వదులుకున్నారు. కాని 20 వ శతాబ్దంలో వాళ్ళ కృషి గణనీయమైందనే చెప్పాలి.

ఆంధ్ర కవిత్వంలో ఇమేజిస్టు ప్రభావం బాగా వున్నవాడు శ్రీరంగం నారాయణబాబు.

"'కాలం కాలిన గుడ్డపీలికై ధూళి రేగినది.'

'పేదవాని కడుపుమంటకాలి పేలిపోవు కోర్కె

గగనమ్మున చుక్క'

వంటి భావ చిత్రములు ఇమేజిస్టు కవితా శిల్పమునకు చెందినవే" (సినారె) నారాయణబాబు కవిత్వాన్ని గురించి రాస్తూ రోణంకి అప్పలస్వామిగారుఅన్న మాటలు యివి :

"ప్రకృతిలో స్థూల చక్షువులకు కనిపించే రమణీయ దృశ్యాలు ఈ కవికి సౌందర్యాన్నందీయవు. అందరకుమల్లే సౌందర్యగానం చేయడు. అతని దృష్టి వేరొక విధమైనది. ఉదయ సంధ్యతో కూడిన ఆకాశం, నోరు తెరిచిన కాకిపిల్ల ఏ మూలనుంచో అరిచే కాకిపిల్ల ఆకలి అరుపులు, ఆకాశం ఘోషిస్తున్నట్టే కవి భావిస్తాడు. ఈ పద్ధతి రచనను పాశ్చాత్యులు ఇమేజిస్టు పొయిట్రీగా పేర్కొంటారు." (ఊరవతల అన్న నారాయణబాబు గేయం ఉదాహృతం అయింది) యీ గేయం రోణంకి వారి మాటల్లో, "ఇమేజిస్టు కవితకొక అలంకరణ. ఆధునికాంధ్ర సాహిత్యానికొక శిఖరం."

"శబ్దాలతో కుదించి సొగసైన విగ్రహాలను నిర్మించే" శిల్పమే ఇమేజిస్టు శిల్పమని ఆ సిద్ధాంతవేత్తలభావన.

ఇంప్రెషనిజం

(Impressionism)

కళా సంగీత సాహిత్య రంగాల్లో వచ్చిన ఉద్యమం చూసేవాడు వినేవాడు చదివేవాడు కళాకారుడి అనుభవంతో భాగం పంచుకుని దాన్ని పునర్నిర్మించే యత్నమేయిది. అంటే ఒక Impression కళాకారుడిమీద కలిగించిన ప్రభావాన్ని సూచించడమే కాని, ఆ Impression కి ఆలబనమైన వస్తువుగాని, సంఘటనగాని కలిగివుండే లక్షణాలని సూటిగా చెప్పడంకాదు. (ఒకడికి బల్లిని చూస్తే భయం. బల్లిని గురించి పాఠకుడికి ప్రమేయం లేదు. భయం గురించే సంబంధం)

ఇది 19 వ శతాబ్దంలో ఫ్రాన్స్‌లో ప్రచారం అయింది. ఈ కళాకారులు తమ లక్ష్యాన్ని రంగులతోటీ, గీతలతోటీ సాధించారు. "in a sort of pictorial stenography, disdainful of details which a rapid vision cannot seize."

సాహిత్యంలో యీ పదం సింబాలిస్టులకీ, ఇమేజిస్టులకీ సామాన్యంగా

వాడేస్తున్నారు. 'Stream of conscious' (చైతన్య స్రవంతి) పద్ధతి అనుసరించే వాళ్ళు కూడా యీ కోవకే చెందుతారంటారు. ఇంద్రియ జనిత అనుభూతి అనుభవాన్ని తక్షణం. వివరణగాని, విమర్శగాని లేకుండా, ఆ impression స్వీయానుభవంలో వున్నట్టు, తాత్కాలికమైనప్పటికీ, స్థూలంగా వర్ణించడమే లక్ష్యం. ప్రధానమైన భావాన్ని చెప్పడం వుండదు. పోనీ యీ వివరణ అన్నిటినీ ఒక క్రమ పద్ధతిలో ప్రధానమైన భావానికి సంధించడమూ వుండదు.

రింబాడ్, వెర్‌లైన్, జాయిస్, వర్జీనియా వుల్ఫ్‌లాంటి వాళ్ళని విమర్శకులు యీకోవలో వాళ్ళని వర్ణించారు.

మనకి సంబంధించి 'చైతన్యస్రవంతి' పద్ధతి చూద్దాం.

చైతన్యస్రవంతి
(Stream of consciousness)

నవలా విధానంలోనే యీ పద్ధతి దర్శనమిస్తుంది. చైతన్యస్రవంతి నవల అంటే ప్రతీదాన్నీ పరంపరగావున్న భావచిత్రాలలో, భావాలతో సంబంధించి వున్నదానితో, చెప్పడమేగాని తర్కబద్ధంగా, కథనాత్మక క్రమంతోచెప్పడం కాదన్నమాట. ఉదాహరణకి ఒక సంఘటన జరుగుతుంది. ఆ సంఘటనమీద కథ ప్రధానపాత్ర ఆలోచనల్లో పెరుగుతుంది. ఆ పాత్ర 'చైతన్యస్రవంతి'లో అన్నీ, ఎరుకలో వున్నవన్నీ, ఆయా క్షణాల్లో యెలాయెలా ప్రభావం కలిగించేదీ చెప్పుకుపోవడమే వుంటుంది. ఈ తరహా నవల ఆధునిక యుగంలో పుట్టింది. మనోవిశ్లేషణ, మన స్తత్వ శాస్త్రజ్ఞులు వాడే "free association" ప్రభావం అన్నమాట యిది. మొట్టమొదటగా యీ పద్ధతిని డూజార్డిన్ 1887 లో వాడాడట. జేమ్స్‌జాయిస్, వర్జీనియా వుల్ఫ్ యిందులో ప్రసిద్ధులు.

ఒక తాత్త్వికసిద్ధాంతంగాకంటే. రచనా విధానంగానే యిది ప్రసిద్ధం. మానసిక సంఘర్షణని చిత్రించే పద్ధతికి అనువుగావుండే విధానం యిది.

మన తెలుగు సాహిత్యంలో బుచ్చిబాబుగారి "చైతన్యస్రవంతి" కథలు "అంతరంగమథనాన్ని చైతన్యస్రవంతిగా ఆవిష్కరించేకథన ధోరణి"వని అంటారు. "క్షణికమైన అనుభవాన్ని మొత్తం జీవితానుభవంతో ముడిపెట్టి ఉన్నది వున్నట్లు ప్రదర్శించే" ప్రయోగములు, కాని వాస్తవానికి చైతన్యస్రవంతి అంత స్తత్వాన్ని ప్రతిబింబించేవి కావు. తర్వాత కాలంలో చాలా ప్రయోగాలు యీ పద్ధతిలో వచ్చాయి, ఈ 'free association' స్వచ్ఛందానుబోధవల్ల ప్రేరణ పొందిన James Joyse రచనలే శ్రీశ్రీని ప్రభావితం చేసింది. శ్రీశ్రీ "కోనేటిదినం" అన్నది యీ కోవకే చెందుతుందని "సంపత్" అంటారు.

దీనిననుసరించి వచ్చేదే 'సర్రియలిజమ్.'

అధివాస్తవికత : Surrealism'

Surrealism ని 'Superrealism యొక్క కుదింపు మాటగా చెబుతారు.

రెండు ప్రపంచ యుద్ధాల మధ్య

కాలంలోనూ ఫ్రాన్స్‌లో వచ్చిన కళా, సాహిత్య ఉద్యమం – మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో నిరసనగా డాడాయిజం వచ్చింది. (డాడాయిజం వివరణ తర్వాత వస్తుంది) అందులోనుంచి విడిపోయి ఆంద్రీ బ్రెటన్ 1924 లో సర్రియలిస్ట్ సిద్ధాంతాన్ని తన మానిఫెస్టో ద్వారా ప్రారంభించాడు.

ఫ్రాయిడ్ సిద్ధాంత, డాడాయిజాల కలయిక ప్రధాన భావంగాగల దానిమీద ఆధారపడింది ఈ సిద్ధాంతం. ఆంద్రీ బ్రెటన్ మనస్సును విడుదల చేయడమే అధివాస్తవికుల ప్రధాన లక్ష్యమన్నాడు. ఏ రకమైన పరిమితత్వాన్నీ వీళ్ళు అంగీకరించరు. అన్నిటినీ దాటిపోయే స్వేచ్ఛ అవసరం. అనుభూతి క్షేత్రం విశాలమై, అదే కావ్యవస్తువు కావాలి. "సుప్త చైతన్యం (Sub Conscious) లోతులలో అనుభూతి క్షేత్రాన్ని విస్తరించుకోవాలి." జాగ్రత్ చైతన్యం తాలుకు అధికారం వుండకూడదు. సుప్త చైతన్యానికి శబ్దరూపం యివ్వడమే అధివాస్తవిక రచన అవుతుందని వారి వాదం. సుప్త చైతన్యం ఎన్నో స్మృతి శేషాలకు పాతర.

"అసంఖ్యాకములైన పూర్వ సంవేదనలు సుప్త చైతన్యంలో దాగివుంటాయి. సరిఅయిన అనుబోధ (correct association) యాదృచ్ఛికంగా స్ఫురించినప్పుడు దాని వెంట సహచారి సంవేదనలు పైకి జ్ఞానభూమిలోకి చొచ్చుకుని వస్తాయి. కాబట్టి జీవితంలో ముఖ్యంగా మానసిక జీవితంలో రెండు అంతస్తులు గుర్తింపవచ్చును. ప్రతీదీ స్ఫుటంగా సరిహద్దులు తోచేలా కనిపించేలా తోచే దొకటీ – ఎంతవరకూ వుందో తెలియక మరుగునపడిపోయి అస్పష్టమైన దింకొకటి – ఇదే జీవితంలో పెద్దభాగమేమో! మానవుడు సముద్రంలో కొంచెమే పైకి తేలిన పెద్ద మంచుగుట్టలా మానవుడు జాగ్రత్ చైతన్యంలో కొంచెమే పైకి కనబడుతూ కాలప్రవాహంలో కొట్టుకుపోతున్నాడు. మునిగివున్న ఆ జీవితపు కొలతలు తీసి దాని స్వరూపాన్ని పరిశీలించే ప్రయత్నం మధివాస్తవికులుచేస్తామంటారు.(సంపత్)

"Essentially, the surrealist strives to present a dream-world leaving the interpretation of the dream to his audience. He cultivates free association and automatic writing, decries any concept of art or talent (since those terms imply a deliberate control on the part of the artist) and delights in the illogical and inexplicable."

సర్రియలిజంలో సుప్త చైతన్యం, వ్యక్తావ్యక్త స్థితి ప్రధానం అవడం తోటి భావనా క్రియ మీద sub-consciuos ఆధిపత్యం వహిస్తుంది. (హేతుబద్ధంగా వున్నప్పుడు యదార్థంపట్ల యేర్పడే సామాజికానుభూతి భావనా ప్రక్రియలను పరిపాలిస్తుంది) సుప్త చైతన్యంలో స్వచ్ఛందానుబోధ (free association) పేరుకే స్వచ్ఛందం. అధివాస్తవికత రచయితకి సామాజిక సంబంధం మీద పట్టుతప్పడంతోటి, ఆ సాంప్రదాయాల మీద, ఆచారాలమీద తిరుగు

బాటు చెయ్యడంలోనే విముక్తి వుందని భావిస్తాడు.

"In the social Production of their life, men enter into definite relations, that are indispensable and independent of thier will, relations of production which correspond to a definite stage of development of their material productive forces. The sum total of these relations of production constitutes the economic structure of society, the real foundation, on which rises a legal and political structure and to which correspondent definite forms of social consciousness. The mode of production of material life conditions the social, political intellectual life process in general. **It is not the consciousness of men that determines their being but, on the contrary, their social being that determines their consciousness.**" (E m p h a s i s added).

సర్రియలిస్టు ఆఖరికి అనార్కిస్టుగా తేలతాడు, బూర్జువా విప్లవవాదిగా.

సర్రియలిజంలో కనిపించే లక్షణాలని బట్టి వ్యక్తి తను అపారమైన స్వేచ్ఛని కోరుకోవడం కనిపిస్తుంది. దానికోసం సమాజాన్ని తోసిరాజనడమూ జరుగుతుంది. కాడ్వెల్ చెప్పినట్టు సర్రియలిస్టు బూర్జువా విప్లవవాది. దాని పర్యవసానం అరాచకత్వం. ఎందుకంటే సకల సాంఘిక సంబంధాలనీ ధ్వంసంచేసి, వైయక్తిక స్వేచ్ఛని కోరుకుంటాడు కాబట్టి. విప్లవవాది యెందుకంటే బూర్జువా సంబంధాలని కూలదొయ్యాలంటాడు కాబట్టి. కాని బూర్జువా సంబంధాలలో చిక్కుపడిపోయి గమ్యం తెలియని గావుకేకలువేసే విప్లవవాది.

సిద్ధాంత దృష్ట్యా యీ శతాబ్దంలో యిది చాలమందిని ప్రభావితం చేసింది. డాడాయిజంలోమాదిరి మరీ అశ్లీలాన్ని అవలంబించలేదు. టెక్నిక్ దృష్ట్యాచాలా ప్రయోగాలు చేసారు. కొంత హాస్యం, వికట కవిత్వం ప్రయోగించారు.

తెలుగు సాహిత్యంలో మిగతా ఉద్యమాలకంటే ఎక్కువగా యిది ప్రాచుర్యమైంది. దీనికి కారణం శ్రీశ్రీ యీ సంవిధానంలో ప్రయోగాలు చెయ్యడమే. శ్రీరంగం నారాయణబాబు కూడా యీ పక్కీ అనుసరించాడు.

నారాయణబాబు 'ప్రవర'లో అన్నాడు ; "వ్యక్తావ్యక్తంలో ఈత కొడతాము, ఏదోవిధమైన శక్తి మమ్మల్ని పూనుతుంది. అదేదో రాయిస్తుంది. అర్థమనర్థం. అదేది రాయిస్తే అదే కవిత్వం. ఇది అధివాస్తవికుల మతం."

శ్రీశ్రీ 'అభిసారిక కడసారి', రుబాయత్, కొంటెకోణాలు, విదూషకుని ఆత్మహత్య గేయాల్లో యీ ప్రయోగం వుంది. "రెండు ఖడ్గాలు, రెండు ఖంజరీటాలు" అన్న గేయ భాగం కూడా ఈ ప్రభావంలోనిదే. (ఇక్కడొక విషయం గురుకుతెచ్చుకోవాలి. ఈ ఆఖరి గేయాన్ని ఆధ్యాత్మిక సంకేతంగా గుర్తించినవాళ్ళున్నారు! వ్యక్తావ్యక్తం అయినప్పుడు యెవడికేది వ్యక్తమైతే అదిచెప్పుకుంటారేమో, మానసికస్వేచ్ఛ అనగానే యేమైనా అనవచ్చునుకదా.)

డాడాయిజం

దీనిని విధ్వంసన వాదమని కొందరన్నారు. మొదటి ప్రపంచయుద్ధ విషప్రభావ ఫలితంగా ఆవిర్భవించింది. అశాంతి, నిరాశ, నిస్పృహల విపరీతపు బిడ్డ యిది. యుద్ధంవల్ల యెటు చూసినా నిర్మూలనమే తప్ప నిర్మాణం లేదు. భవిష్యత్తు అంధకార బంధురం అయింది. ఆ దశలో పుట్టింది యిది. ట్రిస్టన్‌జో కళ్ళు మూసుకుని డిక్షనరీతీసి చూసి కనిపించిన పదం 'డాడా' కాబట్టి 'డాడాయిజం' అని అర్థరహితమైన పేరే అర్థరహిత సిద్ధాంతానికి నప్పుతుందని పెట్టాడట. ఫ్రాయిడ్ సిద్ధాంతం, అరాచకత్వం అన్నీ కలగా పులగం అయిన ధోరణి తర్వాత యిందులోనుంచి విడిపోయి ఆండ్రిబ్రెటన్ సర్రియలిజం స్థాపించాడు.

2

ఈ రకంగా రకరకాల ఉద్యమాలు బయల్దేరాయి. యూరప్‌లో బయల్దేరిన అన్ని ఉద్యమాలకీ యిక్కడ ఉనికి యేర్పడలేదుకాని కొన్నిటికి గట్టి ఆదరణే లభించింది. **Art for art's sake, Imagism, Surrealism** లాంటివి బాగానే ప్రచారం పొందాయి.

భావకవులయుగం అంతం కావడమూ ఉద్యమాల పెనుగాలులు వీచడమూ జరిగింది. దీనికి సాంఘిక పరిస్థితులు కూడా కారణమయ్యాయి. మొదటి ప్రపంచ యుద్ధం ముగిసాక ప్రపంచాన్ని నైరాశ్యం ముంచెత్తింది. యూరప్‌లో హిట్లర్ అధికారంలోకి రావడం, ఆర్థిక సంక్షోభం, జీవితం దుర్భరమవడం లాంటివన్నీ ఆశని హరించివేశాయి. వీటిని వివరించుకోలేని, వివరించుకోగల సమన్వయ అవగాహన, జ్ఞానమూలేని మేధోవ్యాపార ఫలితాలే యీ ఉద్యమాలన్నీనూ. వీటి సాంఘిక పునాది వీటి ఆవిర్భావానికి కారణం అయింది.

ఈ సాంఘిక పునాది యేమిటి? ఈ ధోరణులు ఉత్పన్నమవడానికి కారణమేమిటి? ఈ ప్రశ్నలకి సమాధానం చెప్పుకోవాలన్నా, వున్న పరిస్థితిని అర్థం చేసుకోవాలన్నా సాయపడేది మార్క్సిస్టు సిద్ధాంతం. మనసులో వూహించుకుని స్వేచ్ఛని పొందగలమా లేమా? మనిషికీ సమాజానికీ సంబంధం యేమిటి? తలచుకుంటే మనిషి సమాజాన్ని కాదని మనలేడా? లాంటి చిక్కు సమస్యలన్నిటికీ మార్క్సిజం ఒక్కటే సమాధానం చెప్పగలిగే సమగ్రమైన సిద్ధాంతం. మార్క్స్ **"Contribution to the eritique of Political Economy" Preface** లో రాశాడు:

The German Ideology "It is not consciousness that determines life, but life that determines consciousness."

ఉనికి చైతన్యాన్ని నిర్దేశిస్తుందిగాని చైతన్యాన్నిబట్టి ఉనికి వుండదన్నది ప్రధానం. ఆధునిక యుగంలో పరిఢవిల్లిన అద్భుత భావనలకి ఆధారం వీటిని తయారుచేసిన సాంఘిక పునాదిలోవుంది. ఆధునికం యే భావాలని తీసుకువచ్చిందీ మొదట్లో చూశాం. దానికి కారణం పాత ఉత్పత్తి వ్యవస్థా, ఆ సంబంధాలూ తుప్పుపట్టిపోయి, వాటి స్థానంలో యంత్రాల సాయంతో ఉత్పత్తీ, కొత్త

సాంఘిక సంబంధాలు ఏర్పడ్డాయి. ఆర్థికంగా పెనుమార్పు వచ్చింది. ఆర్థిక పునాది "ఫ్యూడల్" నుంచి పారిశ్రామిక పద్ధతికి మారింది. సాంఘికంగా పెట్టుబడిదారీ సంబంధాలు చోటు చేసుకున్నాయి. ఈ బూర్జువా నాగరికత పాతదాన్ని తుడిచేసింది, కొత్తదాన్ని విస్తారం చేసింది. పాతదాన్ని తుడిచేసే యత్నంలో విప్లవాత్మకపాత్ర వహించింది. కాని తన ఆర్థిక చట్రం తను తెచ్చిన మార్పులకే యిరుకై పోతున్నప్పుడు తిరోగమనదశకీ, క్షీణదశకీపోయి విపరీత ధోరణులకి సాంస్కృతికంగా దారి తీసింది.

బూర్జువా వర్గం తను చారిత్రకంగా "అత్యంత విప్లవకర పాత్ర నిర్వహిం" చిన దశలో ఆధునిక భావాలు ప్రచారం అయాయి. కాని "ఉత్పత్తి సాధనాలలో నిరంతరం విప్లవం లేకుండా బూర్జువా వర్గం జీవించలేదు; ఆ విప్లవ ఫలితంగా ఉత్పత్తి సంబంధాలలోనూ, తన్మూలంగా యావత్తు సామాజిక సంబంధాలలోనూ నిరంతరం విప్లవం లేకుండా" ఆ వర్గం జీవించలేదు. "ఉత్పత్తిలో నిత్యవిప్లవమూ, సాంఘిక పరిస్థితులలో నిరంతర కల్లోలమూ, అనంతమైన అనిశ్చితత్వము, ఆందోళనా— యీ గుణాలవల్ల బూర్జువాయుగం యితర యుగాలకంటె విలక్షణంగా వుంది."

పాత సంబంధాలన్నీ తుడిచి పెట్టుకుపోయి నూతన సంబంధాలకి ఆలంబన అయిన యుగం ఈ యుగం. "వ్యాపార స్వాతంత్ర్యం" అనేదొక్కటే ముకుటంగ నిలుస్తుంది. మనిషికీ మనిషికీ మధ్య నగ్నమైన స్వలాభం తప్ప కిరాతకమైన డబ్బు లావాదేవీ తప్ప యే సంబంధాన్నీ మిగల నివ్వదు, దాని పర్యవసానమే ఆ సంస్కృతి. ఆ వర్గ సంస్కృతికి స్వాతంత్ర్యం అంటే, మానవుడు తన సహజాతమైన శక్తులని అందుకోవడమే, వ్యక్తివాదమే. ఫ్యూడల్ నాగరికతలోని సామాజిక నియమాల్నికాలదన్ని వ్యక్తిత్వవాదాన్ని ఆశ్రయించిన తొలి దశలో ఉత్పత్తికి అనువుగానే వుంటుంది. కాని క్రమేణా వ్యక్తివాదం దారి తీసేది పైన చెప్పిన ధోరణులకే సే. ఎందుకంటే సమాజానికీ, వ్యక్తికీ వుండే బంధం తెగిపోయింది కాబట్టి.

బూర్జువా వ్యక్తి సహజమైన స్వేచ్ఛా బలంతో పుట్టానని భ్రమిస్తాడు. స్వాతంత్ర్యాన్ని గురించిన అవగాహన సరిగా వుండక సామాజిక నియమాలూ, కట్టుబాటూ, చైతన్య వికాసానికి ఆటంకంగా భావిస్తాడు. అవన్నీ తన యిష్టానికి వ్యతిరేకమని అనుకుంటాడు. అంతులేని వ్యక్తిత్వవాదమే ఈ సంస్కృతికి భూమిక, సమాజంతో స్పర్థించి వ్యక్తి పోయే పోకడలన్నీ ఈ సాంస్కృతిక ధోరణుల్లో వెల్లడవుతాయి.

"కళ కళ కోసమే" నుంచి క్రమేపీ స్యర్రియలిజందాకా అలాంటి పరిమాణాలకి కారణం ఆ సాంఘిక పునాదేనని వేరే చెప్పనక్కర్లేదు కదా.

స్యర్రియలిస్టులగురించికాడ్వెల్ రాసింది. సామాన్యంగా ఈ "ఆధునిక ధోరణుల" వాళ్ళందరికీ సరిపోతుంది. వాళ్ళ స్వేచ్ఛా భావన గురించి చెబుతూ

Man becomes free not by realising himself in opposition to society but by realising himself through society, and the character of the association in itself imposes certain common forms and conventions which are the badge of his freedom.''

కాని ఈ ధోరణులవాళ్ళంతా, సర్రియలిస్టులేమి మరొకరేమి బూర్జువా దృక్పథంలో వాళ్ళే. అంచేత వాళ్ళ దృష్టిలో Fredom అంటే ఈ నియమాలమీద తిరుగుబాటు చెయ్యడమే.

(తెలుగులో శిష్లా, పఠాభి, లాంటి వాళ్ళని ఈ సందర్భంలో ముఖ్యంగా ఉదహరించుకోవచ్చు)

మొత్తంమీద వ్యాపార నాగరికతలో పరిఢవిల్లిన వ్యాపార సాంస్కృతిక ధోరణులు యిలా పరిణమించి మానవత్వాన్ని హరించేస్తాయి. పెట్టుబడిదారీ సమాజంలో కళాకారుడి కృషి గురించి చెబుతూ మార్క్సు అన్నమాటలు ఈ స్థితిని వివరిస్తాయి.

"A Writer is a Productive labour not in so for as he Produces ideas, but in so far as he enriches the Publisher who Publishes his works or if he is a wage-Labour for a Capitalist.''

3

యీ ధోరణులన్నిటినీ సామాన్యంగా "Modernism" కిందకే వర్గీకరిస్తారు. యీనాటి బూర్జువా 'Modernism' యీ ధోరణులలాగే మానవత్వ వ్యతిరేకంగా వుంది. యీనాటి బూర్జువా "ఆధునికత్వాన్ని" గురించి Problems of Modern Aesthetis లో యిలా రాసారు :

"Present day bourgeois modernism also has its "pedigree.'' Its family tree bears the names of Symbolism, Acmism, futurism, Imagism and other schools such as expressionism, cubism, supermatism, dadaism and surrealism. It is the offspring of all theese "isms,'' which socially a - social and anti-realism and which have their roots in subjective idealism, individualism, aesthaticism and formalism.

కాని ఈ modernismకీ వాస్తవికతకీ యెప్పుడు వైరుధ్యం వుంది. ప్రపంచ దృక్పధానికీ, కళాత్మక పద్ధతులకీ సాంఘిక సౌందర్య దృక్పథంలో జీవితానికీ, కళకీ సంబంధించీ చాలా విభేదం వుంది. ప్రజోపయోగం కోసం కృషి చెయ్యడం, ప్రజలకీ, సమాజానికీ ఒక బాధ్యత వుందని గుర్తించడం, లాంటి భావాలు వ్యక్తిత్వ వాదంతోటీ, అరాచక స్వీయాత్మక దృక్పథతోటీ యెప్పుడు పోటీ పడతాయి.

ఈ ధోరణులన్నీ సిద్ధాంత పరంగా సమాజ వ్యతిరేకమైనవే. అయినా వాటి వల్ల జరిగిన మేలు కూడా వుందన్న విషయం మరువకూడదు. తిరుగుబాటు చెయ్యడం వాటిలో వుంది. శిల్పంలో, కొత్త పద్ధతులు ప్రవేశపెట్టటంలో వుంది.

Who would deny that Joyce found the most minute psychological details, that he was a master of the inner monologue,

That Proust is known for his techniques of depicting the most subtle 'sub-conscious' experiences of man, for his techniques of analysing these experiences? It is difficult to object to the statement that Kafka in his own way revealed a world of horror and the fear that possesses the man driven into solitude, a world that we had not seen before his extraordinary presentation. All the same, even accepting such statements, one can't but remark: we are far from denying merits to the work of Joyce, Proust or KafKa. but we would like to talk about whatismostimportant' (Ovacharenko: Socialist Realism and the modern literary process) "Gorky never denied that symbolists, futurists and expressionists to some extent enriched the treasure house of art with their s election of motifs and inparticuiar, which original and often quite successful litersry devices." (అదే పుస్తకం)

అంచేత వాళ్ళ Contribution లేదనలేం. కాని గుర్తుంచుకోవాల్సింది యేమిటంటే

"The heart of the problem of "realism and modernism" however, can hardly be reduced to the modernists as a rule ignore ruling."

బూర్జువా వ్యక్తిత్వవాద ఫలితంగా వచ్చిన ఈ ధోరణులు సోషలిస్టు వాస్తవికతా విలసనంలో తగ్గిన మాట నిజం. తెలుగు సాహిత్యంలో కూడా ఈ ధోరణులు అభ్యుదయ సాహిత్య ఉద్యమంలో ఐనక బడ్డాయి. "సోషలిస్టు రియాలిజం నా కవితా పారమ్యం" అని శ్రీశ్రీ గుర్తించి ప్రకటించుకున్న దానివల్లనే యెన్ని విచిత్రమైన పోకడలు పోయినా నిలబడ్డాడు. అభ్యుదయ రచయితల సంఘం యేర్పడి సాహిత్యానికి వున్న సామాజిక లక్ష్యాన్ని చాటడంతో సిద్ధాంత పరంగా బూరువావాదాల ప్రభావం తగ్గింది. కాని బూర్జువా సమాజం వున్నంత కాలమూ, ఆ సంబంధాలు వున్నంత కాలమూ, బూర్జువా కళారంగంలో తన వాదాలని ముందుకి తోస్తూనే వుంటాడు.

దాని ఫలితమే గతంలో "వికసించిన" కళ కళ కోసమేనన్న దాని నీరస ప్రతిధ్వనులు ఈనాడు వినిపించడం. "డాడాయిస్టుల" లాంటి విధ్వంసక ధోరణులకనిపించడం, ఇంప్రెషనిస్టుల ధోరణి లాంటి అనుభూతివాదులు ఎగిసి పడడం. ఈ ధోరణులన్నీ స్వాతంత్ర్యం వచ్చిం తర్వాత, అభ్యుదయ ఉద్యమం చురుకుగాలేని కాలంలో తల యెత్తినవి. ఈ నాటి ధోరణులకి, అన్నింటికీ కాక పోయినా కొన్నింటికి. సిద్ధాంత దృష్టి వుంది. అదికూడా సిసలైన బూర్జువా తత్వం జీర్ణించుకున్నదే.

సాహిత్యంలో, కళారంగంలో, కనిపించే పలాయన వాద దృష్టికీ, దిగంబర ఉద్యమాల్లాంటి వాటికీ, అస్తిత్వవాద ధోరణులకీ పునాది యీనాటి సమాజమేనని వేరేచెప్పక్కర్లేదు. ఈ సమాజ లక్షణాలు వివరించడం కూడా అవసరం వుండదు. యెందుకంటే వ్యాపార నాగరికత పరిమళం యెంత వద్దనుకున్నా

ఆఘ్రాణించకుండా వుండటం అసంభవం అయింది కనుక.

"To lead the masses astray from the revolutionary movement, to infect them with sadistic impulses and turn them into dumb cannon fodder is the deliberate objective in the imperlalist states, and this objective is served by a tremendous propaganda machinery, by a profusion of sex and gangster literature and the writings of professional moralising socialogists," (The Rsvolution and its Roral Rission).

అమెరికాలో నేరం ప్రధానంగాగలయితి వృత్తంతోటి సాలుకి 4,500 కార్యక్రమాలు ప్రసారం అవుతున్నాయట! 6 కోట్ల కాపీల "కామిక్స్" వెలుగు చూస్తున్నాయట! మన దేశంలో ప్రస్తుతం విడుదల అవుతున్న సినిమాలూ, పునర్ పునర్ ముద్రణలు చేస్తున్న పుస్తకాలు యితోధికంగా యీ "సేవ"ని చూపిస్తు న్నాయి.

ఈ నాడున్న ధోరణులేమిటో పరిశీలించడం అవసరం. పలాయన వాదం, (లేకపోతే యింకో పేరుతో విస్మృత సాహిత్యం అంటున్నది) ఏమి హైందీ పెద్దగా కష్టపడకుండానే గ్రహించవచ్చు. ఈనాడు మార్కెట్‌ని శాసించే రచయితా సైన్యం అదేమార్క్స్ చెప్పిన సిసలైన Productive labourers వీళ్ళు.

ఇక చెప్పుకోవాల్సింది [యెంత సిద్ధాంత దృష్ట్యా అనవసరమనుకున్నా] దిగంబర ఉద్యమం. ఓ రకంగా డాడా యిస్టులాంటి వాళ్ళు. ఆ ఫక్కీదే యీ ఉద్యమమూనూ, ఆరంభదశలో దిగంబరులకు యే లక్ష్యమూ లేదు, యే సాంఘిక ప్రయోజనమూ లేదు. 'జాగృతికై ధ్వంసరచన చేయాలనుంది' అనీ, పాతదాన్ని దేన్నీ లక్ష్యపెట్టమనీ, కనీసం వాళ్ళకవితా ప్రక్రియకి పాతపేర్లు కూడా అంగీకరించ మనంటారు. దిగంబరులు అప్పటిదాకా వున్న అన్ని సాహిత్య ఉద్యమాలకీ వీడ్కోలు కొడతామన్నారు. గతవారసత్వాన్ని నిరాకరించారు. ఎన్ని రకాల అభిప్రాయాలు, సిద్ధాంత ధోరణులు గాలిలో కొట్టుకు వస్తున్నాయో అన్నీ యే ప్రమేయము లేదని చెప్పమన్న వీళ్ళల్లో సన్నసన్నగానేనా కనిపించాయి. అస్తిత్వవాదం కూడా వాటిలో ఒకటి. ఆఖరికి వీళ్ళ ఉద్యమం చీలిపోక తప్పలేదు. ఆపునాదే అలాంటిది, వీళ్ళవిరసం పుట్టుకకీ సాహిత్యంలో రాజకీయాల దురాక్రమణకీ దారితీశారు. మార్క్సిస్టు అవగాహన వున్నవాడు సాహిత్యాన్ని చూసే తీరు కాదు యిది. 'విప్లవ నిమగ్నత','నిబద్ధత' చర్చల్లో విరసం యెలా తయారైందీ యీనాటి స్థితి చూపిస్తోంది.

ఇక సాహిత్యంలో వచ్చిన, లేదా విస్తరించుకుంటూవున్న సిద్ధాంతధోరణి వుంది. అది "అస్తిత్వవాదం" అనే పేరుతో ప్రాచుర్యం అయింది. మిగతా ఉద్యమాల్లాగా యిది ప్రత్యేకం సాహిత్య కళారంగంలో వచ్చిన తాత్త్విక ధోరణికాదు. తాత్త్విక సిద్ధాంతాలలాగా జీవితానికి వర్తించేది. అంచేత శైలిలో, శిల్పంలో ప్రత్యేక లక్షణాలని సాహిత్యంలో యిది ప్రతిబింబించదు. ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేస్తుంది.అంచేత కవిత్వంలో,

నవలల్లో, ఆ నియమాలకి లోబడే సిద్ధాంత ప్రవచనం వుంటుంది. దీన్ని సిద్ధాంత స్థాయిలోనే యెదుర్కోవాలి. ఈ అస్తిత్వవాదం యేమిటీ అన్నది ముందు తెలుసుకోవాలి.

అస్తిత్వవాదం (Existentialism)

కేర్కెగార్డ్ అనే తత్వవేత్త బోధనలో ఆధునిక యుగంలో ప్రచారమైన సిద్ధాంతం. జాస్పర్స్, హీడెగ్గర్, యునామన్ లాంటివాళ్ళు అనుసరించారు. సాహిత్యంలో ఉస్టామ్కి-కాఫ్కా ప్రయోగించారు. కాని సాహిత్యంలో అసలు ప్రభావం 1940 దశకంనుంచీ సార్త్రె ప్రభావంతో ప్రచారం పొందింది. ఆంద్రీమాల్రా, ఆల్బర్ట్ కామూలాంటి వాళ్ళు యీ సిద్ధాంత ప్రభావానికి లోనయారు. కాని వాళ్ళు ఆ ఉద్యమంలో భాగంగా వున్నామనుకోలేదు.

ప్రధానాంశమేమిటంటే మనిషికి మనిషిగా మనుగడే ముఖ్యం. సిద్ధాంతాల రాద్ధాంతాల ప్రమేయంలేదు. మనిషి తను యెలా నిర్మించుకుంటే అలా అవుతాడు గాని మరేశక్తివల్లా తయారుకాడు. అంటే సమాజంగాని, శాస్త్రాలుగాని చేసినట్టులేదు. మనిషికి అనియతమైన యిచ్ఛవుంది. మనిషి తన యిచ్ఛకే బాధ్యుడు. కాని అతను ఆ యిచ్ఛని బాహిరశక్తులకి లోబరిచినా, తమ యిష్టం వచ్చినట్టు వుంచుకోకపోయినా అసహ్యంగా తయారవుతాడు. తన యిచ్ఛానువర్తిగా వుండటమే నిర్ణాయకమైంది. దానితోటి యీ సిద్ధాంతం మానవునిలోని ప్రాథమిక అంశాలనే గురిస్తుంది. అవ్యక్త, సుప్తచైతన్యాలు హేతుబద్ధంగా వుండవని మనిషి ప్రవర్తన హేతురహితమని యీ సిద్ధాంత దృష్టి.

ఈ సిద్ధాంతవాదుల్లో ఆస్తిక, నాస్తిక భేదాలున్నాయి. ఆస్తికులు యిచ్ఛ స్వేచ్ఛాయుతమైంది కాబట్టి ఉపయోగకరంగావుండే ఆచరణకి మలచాలంటారు. ఏమైనా మార్సెల్లాంటివాళ్ళ కొద్దిమంది కృషికే యీ ఆస్తిక ధోరణి పరిమితమైంది.

అస్తిత్వవాదంలో వ్యక్తిస్వాతంత్ర్యం పునాది. సమాజంలోని కష్టనిష్ఠూరాలు అంతే. వ్యక్తి తనలోకి తాను మళ్ళితే స్వేచ్ఛ వుంటుందన్నది ముఖ్యం.

మొత్తంమీద రెండు ప్రపంచ యుద్ధాల మధ్యకాలంలో వచ్చిన ఉద్యమాలలోనే వ్యక్తివాదాన్ని అస్తిత్వవాదం చేపడుతుంది. మనిషి హేతుబద్ధంగా వుండడనడమూ, అతని చర్యలు అర్థంలేనివిగా వుంటాయనడమూ తిరోగమన అశాస్త్రీయ దృష్టి.

మన యీనాటి సాహిత్యంలో, ముఖ్యంగా పెద్ద చదువులు చదువుకుని పైమెట్టుమీదవున్న మేధావివర్గం ఆలంబన చేసుకున్న సిద్ధాంతం యిది. (దిగంబర కవులలో మొదట్లో యీ అస్తిత్వవాదఛాయలు కనిపించినా, తగినంత లేకపోయాయని సుదర్శనంగారి బాధ యీ సమయంలో గమనించదగ్గది.)

4

ఈనాటి ప్రపంచంలో వస్తున్న మార్పులు, సోషలిజం సుప్రతిష్ఠితమై పురోగమిస్తూ వుండడమూ, సాంప్రదాయకంగా వస్తూన్న బూర్జువా సిద్ధాంతాలకి పట్టుసడలించాయి. దాంతోటి బూర్జువా మేధాప్రపంచంలో యింకా కొత్తధోరణులు తల యెత్తుతున్నాయి. మార్క్సిజంలోఉన్న "ఆర్థిక"అంశాలని గ్రహించవచ్చునీ, కాని మార్క్సిజం వ్యక్తికంటే అధికంగా సమాజానికి ప్రాముఖ్యం యివ్వడంవల్ల వ్యక్తి స్వేచ్ఛాయుతంగా వుండలేక లుప్తమైపోతాడనీ, అంచేత మార్క్సిజాన్ని మార్చేసుకోవాలనీ కొత్తతరహా బోధనలు వస్తున్నాయి. అంటే అర్థం మార్క్సిజంలోని విప్లవతత్వాన్ని, సమాజ సంబంధాలు మార్చేయాలన్న విప్లవ లక్ష్యాన్ని తూట్లుపొడవడమేతప్ప వేరుకాదు. (మన అకడమిక్ పండితుల దృష్ట్యా అన్ని తాత్త్వికదృక్పథాలు "కేశవం ప్రతిగచ్ఛతి"గానే వుంటాయి. కాబట్టి మార్క్సిజం కూడా సత్యసాధనకి తోడ్పడక పోదని!) పశ్చిమ దేశాల్లో మార్క్సిజం గురించి కొత్త ధోరణులు ప్రచారమవుతున్నాయి. మార్క్సిజం మొదట్లో "మానవత్వం"లో వుండేదట. కాని రాను రాను పోయిందట. (లెనినిస్టు సిద్ధాంతాన్ని విడగొట్టి "శుద్ధ మార్క్సిజాన్ని" ప్రచారంచేసే పద్ధతి యిది) సార్త్రె దృష్ట్యా మార్క్సిజం మొదట్లో "Humanised"గా వుండింది. "Marxism will degenerate in to an in human anthropology unless it reincorporates man as its sum and substance" అన్నాడు సార్త్రె. అంటే సార్త్రె దృష్ట్యా మార్క్సిజాన్ని అస్తిత్వవాదంలో అతికెయ్యాలని! అలాగే ఫ్రాయిడ్ సిద్ధాంతం యూరప్‌లో, అమెరికాలో విస్తృతంగా ప్రచారం అవుతోంది. మానసిక సంక్షోభాలవల్లనే మానవుడికి శాంతిలేకుండా పోతోందన్నది వీళ్ళదృష్టి. కాని సాంఘిక పరిస్థితిని కాదనలేని దశకి మార్క్సిజం ప్రచారమవడంతోటి ఎరిక్ ఫ్రామ్‌లాంటివాళ్ళు కొత్తతరహా "మానసిక విశ్లేషణాత్మక" "మార్క్సిస్టు తత్వా"న్ని బోధిస్తున్నారు.

మొత్తంమీద మార్క్సిస్టు జీవిత దృక్పథాన్ని కాదనలేని స్థితిలో మార్క్సిజం సమాజానికీ, వ్యక్తికీ పోటీ పెడుతుందనీ, వ్యక్తికి మనుగడ వుండదనీ, వ్యక్తి మనగలగాలంటే సమాజం నెరపే పెత్తనం పోవాలనీ నూతన సిద్ధాంతాలు ప్రచారం చేస్తున్నారు. ఇదంతా మార్క్సిస్టు సిద్ధాంతంలోని విప్లవ తత్త్వాన్ని హరింప చెయ్యడమేతప్ప వేరుకాదు. మార్క్సిజంలో వ్యక్తికీ, సమాజానికీ వైరుధ్యం వుందని చూపించడం బూర్జువా వ్యక్తిత్వవాద అవకాశ వాదానికి పరాకాష్ఠ.

ఇవాళ మార్క్సిస్టు సిద్ధాంత నినాదాలు, విప్లవ ఆలంకారికత వాడే రచయితల తెగ యింకోటి వస్తోంది. వీళ్ళ దృష్టిలో "కవిత్వ పదార్థం" యెక్కడున్నా ఆస్వాద యోగ్యమే! మార్క్సిస్టు సిద్ధాంతం. పోరాట ప్రవచనాలు తమకీ

తెలుసు. ఆచరణకీ, సిద్ధాంతానికీవున్న మార్క్సిస్టు నిబంధనని విస్మృతం చెయ్యడమే యీ ధోరణి లక్ష్యం.

ఆంధ్రదేశంలో యీనాడు వెలువడుతూవున్న సాహిత్యాన్ని పలాయనవాద సాహిత్యం, బూర్జువా సిద్ధాంత పునాది ఆధారంగావున్న సాహిత్యం, అతి "వామ"పక్ష సిద్ధాంత ప్రేరిత సాహిత్యంగా స్థూలవిభజన చేసుకోవచ్చు. ఈ మూడు తరహాలవీ కూడా ప్రయోజనపుష్టమైన సాంస్కృతిక రంగాన్ని యేర్పాటు చేయవు. ఎంగెల్స్ చెప్పినట్టు

"Freedom is the recognition of necessity."

యీ పాయింట్ మీద కాడ్వెల్ చెప్పిందాంతో యిది ముగిస్తాను.

Art is the expression of man's freedom in the world of feeling, just as science is the expression of freedom in the world of sensory perception, because a both are conscious of the necessities of their worlds and can change them – art the world of feeling or inner reality, science the world of phenomena or outer reality."

Reference Books

Illusion and Reality	**Can & Well**
On Literature and Art	**Marx and Engels**
Socialist Realism and Modern Literary Process	**Orcharenko**
Problems of Modern Aesthetics	**Collection of Essays**
Nihilism Today	**Sogomonov, Landesman**
The Readers Companion to World Literature	**A Mentor Book**
Philosophical Traditions Today	**Iovechuck**
The Revolution and its Moral Mission	
Theory of Literature	**Renewallek and Austin-waner**
ఆధునికాంధ్ర కవిత్వము	డా॥ సి. నారాయణరెడ్డి
శ్రీశ్రీ సన్మాన సంచిక	ఫిబ్రవరి : 1970.
"విశాలాంధ్ర" పత్రికలోని వ్యాసాలు	"ఆంధ్రజ్యోతి" పత్రికలోని వ్యాసాలు

రు. 7/-

ABHYUDAYA

సంపాదకులు : తుమ్మల వెంకట్రామయ్య
ప్రచురణ : అరసం

డా॥ పుట్టపర్తి నారాయణాచార్య

డి. నాగసిద్ధారెడ్డి, తిరుపతి.

డా॥ వేల్చేరు నారాయణరావు
విస్కాన్సిన్ విశ్వవిద్యాలయం, మాడిసన్

గంగిశెట్టి లక్ష్మీనారాయణ
డిప్యూటీ డైరెక్టర్ - ప్రపంచ తెలుగు సంస్థ

డా॥ ఎస్. వి. రామారావు
(రీడర్, ఉస్మానియా విశ్వవిద్యాలయం)

స ం జీ వ మ్మ

శ్రీ టి. జి. ఆర్. ప్రసాద్
(వెంకటేశ్వర విశ్వ విద్యాలయం)

బూదరాజు రాధాకృష్ణ

డా॥ తుమ్మపూడి కోటేశ్వరరావు
పి. జి. సెంటరు, అనంతపురం.

మై త్రే య

ఎన్. సి. రామసుబ్బారెడ్డి

చేకూరి శ్రీనివాసరావు

ఘట్టమరాజు అశ్వత్థనారాయణ

మ ల్లి క్

డా॥ కె. కె. రంగనాథాచార్యులు

రా ఛ ట్ల

వల్లంపాటి వెంకట సుబ్బయ్య

ఆ ర్వీ యా ర్